వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 17 సంచిక : 5 హైదరాబాద్ 214 మే 2019 పేజీలు : 68 రు. 25

* విఫలమవుతున్న ఎన్నికల కమిషన్
* నిజామాబాద్‌లో రైతాంగ నిరసన
* పల్నాడు ప్రజల కల - వరికపూడి సెల
* భాజపా మళ్లీ అధికారానికొస్తే...
* సర్జికల్ దాడుల రాజకీయాలు
* ఆదివాసుల అస్తిత్వానికి సుప్రీం సవాల్
* న్యూజిలాండ్-శ్రీలంక: ఉన్మాద నరమేధం

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ – సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం – ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే	రైతు సేవా సమితి	100
భారతదేశంలో ఉత్పత్తి విధానం– ఉత్పత్తి సంబంధాలు	విరసం	20
ప్రపంచీకరణ ప్రాభవంలో...	విద్యాభూషణ్	120
మార్క్స్ రాసిన పెట్టుబడి	డేవిడ్ స్మిత్, ఫిల్ ఇవాన్స్	200

తెలంగాణ

తెలంగాణార్థం	ఎన్. వేణుగోపాల్	150
లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
సమగ్ర తెలంగాణ	వీక్షణం ప్రచురణ	295
ఎవరికోసం మల్లన్నసాగర్?	తెలంగాణ ఆత్మగౌరవ వేదిక	20
మానని గాయాలు	తెలంగాణ విద్యావంతుల వేదిక	100

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ – పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	120
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	150
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం–మతం

భారతదేశంలో కుల సమస్య	అనురాధ గాంధీ	120
పంచతంత్రం	బొజ్జా తారకం	200
కులం వర్గం	బొజ్జా తారకం	60
చరిత్ర మార్చిన మనిషి	బొజ్జా తారకం	150
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	150
గులాంగిరి	జోతిబా ఫూలే	60
కుల నిర్మూలన	అంబేద్కర్	60
శూద్రులు – ఆర్యులు	అంబేద్కర్	20
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	30
వెలివాడల వెతలు	కుల నిర్మూలన ప్రచురణ	100

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం–లెనినిజం–మావోయిజం	విరసం ప్రచురణ	125
మార్క్స్ పెట్టుబడి రచనా క్రమం	విరసం ప్రచురణ	50
మార్క్సిస్టు నిఘంటువు–1	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	350
మార్క్సిస్టు పదకోశం	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	50

చరిత్ర–జీవిత చరిత్ర

భారత చరిత్ర అధ్యయానికి ఒక పరిచయం	డి.డి. కోసంబి	250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	70
భగవద్గీత చారిత్రక పరిణామం	డి.డి. కొశాంబి	20
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	100
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	100
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్‌సన్	150
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	120
చేగువేరా	కాత్యాయని	120
మహాత్మా జ్యోతిరావ్ ఫూలే	ధనుంజయ్ కీర్	100
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
తలపుల తోవ	షౌకత్ కైఫీ	100
ఏడవకు బిడ్డా...	గుగి వా థియాంగో	150
కశ్మీర్‌లో నిషిద్ధ రాత్రి	బషారత్ పీర్	170

సాహిత్య విమర్శ – వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
కవిత్వంతో ములాఖాత్	ఎన్. వేణుగోపాల్	120
సాహిత్య వ్యాసాలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ రచనలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం–1	విరసం ప్రచురణ	270
మహోదయం	కె.వి.ఆర్.	200
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–2	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–3	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సామాజిక వ్యాసాలు	కె.వి.ఆర్.	300
కెవిఆర్ డిటెన్యూ డైరీ	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	170
కెవిఆర్ కవిత్వం	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	200
అల్లంరాజయ్య కథలు పరిశీలన	ఎస్. నీళాదేవి	75
కొలిమి రవ్వలు	గౌరి లంకేశ్ రచనలు	150
సహచరులు	వరవరరావు	100

విప్లవోద్యమం

మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్–1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్–2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
మావో రచనలు – 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు – 2	విరసం ప్రచురణ	220
జనతన రాజ్యం	పాణి	300
30 ఇయర్స్ దండకారణ్య కల్చరల్ మూవ్‌మెంట్	ఎన్.ఎం. చేతనా	250
సంకెళ్ల సవ్వడి	అరుణ్ ఫరేరా	150
మలుపు తిప్పిన మహా ఉద్యమం	విరసం ప్రచురణ	60
బోల్షివిక్ పార్టీ చరిత్ర	విరసం ప్రచురణ	250
ఆవాజ్	విరసం ప్రచురణ	65
మెరిసే అక్షరాల వెనుక	సృజన ప్రచురణ	30
నక్సల్బరీ ఒక ఊరు మాత్రమే కాదు	విరసం ప్రచురణ	80
పికెఎం ప్రభాకర్ రచనలు	విరసం ప్రచురణ	70
కార్మికవర్గ విప్లవం–విప్లవ ద్రోహి కౌట్స్కీ	విరసం ప్రచురణ	60
భీమా కోరేగాం 12 – వివి	స్వేచ్ఛా సాహితి ప్రచురణ	50

కథ – నవల

దండకారణ్య కథలు (2005–2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	150
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి – మూడెద్దులు	బొజ్జా తారకం	25
దళితులు – రాజ్యం	బొజ్జాతారకం	25
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	120
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
హింసపాదు	బమ్మిడి జగదీశ్వరరావు	180
అభాగ్యజీవులు	ఫ్రాంజ్ ఫనాన్	170
నిషిధ	నల్లూరి రుక్మిణి	180
మాటిగరి	గుగి వా థియోంగో	120
మట్టికాళ్ల మహారాక్షసి	గుగి వా థియోంగో	200
బంది	గుగి వా థియోంగో	200
నేను చావును నిరాకరిస్తున్నాను	జి.ఎన్. సాయిబాబా	125

డివిడి

వీక్షణం (2003 – 2012)	200
సృజన (1966–1992)	240
అరుణతార (1970–2013)	125
'ఓయు'ద్ధకాండ	100

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

214

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

మే 2019
సంపుటి : 17
సంచిక : 5

❖ పాఠకుల వీక్షణం			4
❖ సంపాదకీయం	◆ ఎవరు గెలిచినా ఏమున్నది ప్రజోపయోగం?		5
❖ సంపాదకీయ వ్యాఖ్యలు	◆ ముక్కుపచ్చలారని పిల్లలను పిడాత చంపిందెవరు? ◆ ఇటు చూస్తే నుయ్యి, అటు చూస్తే గొయ్యి		6
	◆ శ్రీలంకలో జరిగిన దాడికి మూలమేమిటి? – ఎ. నర్సింహారెడ్డి		7
❖ కొత్త పుస్తకాలు			8
❖ దేశీయం	– విఫలమవుతున్న ఎన్నికల కమిషన్	– డా. ఎ. పున్నయ్య	9
❖ "	– ప్రజల్ని మోసగిస్తున్న పార్టీలు – ఎన్నికల కమిషన్	– చిమ్మె జాన్ బర్నబాస్	13
❖ "	– చట్టసభలకు నేర చరితులా?	– షేక్ కరిముల్లా	15
❖ "	– నిజామాబాద్‌లో రైతాంగ నిరసన	– వంగాల సంపత్ రెడ్డి	17
❖ "	– భాజపా మళ్లీ అధికారానికొస్తే...	– మితాలీ అగ్రవాల్	18
❖ "	– సర్జికల్ దాడుల రాజకీయాలు	– బైరెడ్డి సతీష్	20
❖ "	– యుద్ధం అన్నిటికీ తండ్రి!	– మాదిరాజు రాంబాబు	23
ప్రాంతీయం	– ఇంకా నెత్తురోడుతున్న ఇంద్రవెల్లి	– ఎన్. నారాయణరావు	24
❖ "	– పల్నాడు ప్రజల కల – వరికపూడి సెల	– దుడ్డు ప్రభాకర్	27
❖ దేశీయం	– ఆదివాసుల అస్తిత్వానికి సుప్రీం సవాల్	– ఎం. శ్రీనివాస్	29
❖ "	– బాల్యానికి భద్రతెక్కడ...?!	– అన్నపూర్ణ, రుద్ర	35
❖ "	– వేదాల చిక్కుముడి విప్పిన అంబేద్కర్	– డా. కత్తి పద్మారావు	36
❖ ప్రాంతీయం	– కులవర్గ పోరాటాల విప్లవకారుడు మారోజు వీరన్న	– వూకె రామకృష్ణ దొర	40
❖ దేశీయం	– రాచరికాలు పోయినా రాజద్రోహ చట్టాలు	– ఆర్. లక్ష్మి	42
❖ "	– ఆధునిక అప్పుల ఉద్యోగులు	– వి.వెంకట్రావు	44
❖ అంతర్జాతీయం	– న్యూజిలాండ్‌లో ఉన్మాద నరమేధం	– ఎ. నర్సింహారెడ్డి	48
❖ సామాజికాంశం	– భావజాల గతితర్కం – సామాజిక చైతన్య దృగ్విషయం	– వెన్నెలకంటి రామారావు	51
❖ ఆర్థికాంశం	– డేవిడ్ హార్వే: పెట్టుబడి – ప్రాథమిక వైరుధ్యాలు – 2	– రమేష్ పట్నాయక్	57
❖ చర్చ	– బంగ్లాదేశ్ ఎన్నికల్లో విదేశీ జోక్యం సూచన ప్రమాదకరం	– కృష్ణ ఆదిత్య	62
❖ ఈనెల		– వై. రామచంద్రం	63
❖ ఇరుగు-పొరుగు		– వై. రామచంద్రం	64
❖ భూగోళం		– సి. రాజశేఖర్	65
❖ అసహజ మరణాలు		– ఎస్. వెంకటేష్	66

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన జి.ఎస్. వాసు, హైదరాబాద్ - రు. 10,000; ఎల్. లక్ష్మికాంతమ్మ, హైదరాబాద్ - రు. 20,000; వై. రాజేశ్వరి, నెల్లూరు - రు. 3,000; ఎన్. రజని, హైదరాబాద్ - రు. 10,000; కొమ్మన బాబు, వైరా, ఖమ్మం - రు. 5,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం ఎన్నో సంవత్సరాలుగా చదువుతున్న పాఠకులుగా ఇటీవలి రాజకీయార్థిక అంశాలు తగ్గిపోయాయనిపిస్తున్నది. ప్రతి సంచికలో కనీసం ఒకటి రెండు రాజకీయార్థిక శాస్త్ర దృక్పథాన్ని వివరించే వ్యాసాలు, ఆ దృక్పథంతో సమకాలీన పరిణామాలను విశ్లేషించే వ్యాసాలు ఉంటే బాగుంటుంది. మా దృష్టిలో మీరు ఈ కింది అంశాల మీద వ్యాసాలు ప్రచురించడం అవసరమని అనిపిస్తున్నది. ఆలోచించండి.

- రెండో ప్రపంచ యుద్ధానంతర సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులు – ముఖ్యమైన ధోరణులు, ముఖ్యంగా ఉత్పత్తి వ్యవస్థలో ఏయే మార్పులు వచ్చాయి? ఉదాహరణకు రెండో ప్రపంచ యుద్ధానికి ముందు సామ్రాజ్యవాదం వలస, వెనుకబడిన దేశాలలో వ్యవసాయక, ప్రాథమిక రంగంలో పెట్టుబడులు పెడితే ఆ తర్వాత అది చౌక శ్రమశక్తిని కొల్లగొట్టడం కోసం వెనుకబడిన దేశాల్లోకి పారిశ్రామిక యూనిట్లను తరలించడం, ఆయా ఉత్పత్తుల ప్రాడక్ట్‌లను అనేక విభాగాలుగా విడగొట్టి వెనుకబడిన దేశాల్లో ఈ విడి విభాగాల తయారీ పరిశ్రమలను, కొన్ని అసెంబ్లింగ్ యూనిట్లను నెలకొల్పడం, దాన్ని వెన్నంటి కాంట్రాక్ట్, కాజువల్ వ్యవస్థను తీసుకోవడం, ఆ తర్వాత సేవా రంగంలోనే ప్రధానంగా పెట్టుబడులు పెట్టడం, వగైరా ధోరణుల గురించి వివరాలు
- బడ్జెట్ రూపకల్పన ఎలా జరుగుతుంది? అందులో పాలకవర్గాలు వాడే పరిభాషను ఎలా అర్థం చేసుకోవాలి? బడ్జెట్‌ను విశ్లేషించడానికి మార్క్సిస్టు రాజకీయార్థిక శాస్త్ర పద్ధతి ఏమిటి?
- షేర్ మార్కెట్ ఫంక్షనింగ్, అందులో షేర్ల రేట్లు పడిపోవడానికి, పెరగడానికి కారణాలు ఏమిటి?
- అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లు, ఆయా దేశాల కరెన్సీ మారకపు రేట్లు పడిపోవడానికి లేదా పెరగడానికి కారణాలు ఏమిటి?

– వీక్షణం స్టడీ గ్రూప్
విశాఖపట్నం

వీక్షణం ఏప్రిల్ సంచికలోని రచనలు అన్ని సమకాలీన, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల గురించి చాలా లోతుగా విశ్లేషించి రాసిన వ్యాసాలు చాలా బాగున్నాయి. ముఖ్యంగా రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరకోసం చేస్తున్న ఆందోళన, అలాగే పసుపు, ఎర్రజొన్న, చెరకు రైతులు అనేక రూపాలలో ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చలించకపోగా వారిని అడ్డుకొని, అరెస్టులు చేసి అణిచివేయడం వల్ల వారి నిరసనను ప్రజాస్వామ్య పద్ధతిలో దేశ ప్రజల దృష్టికి తీసుకొని రావడానికి నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి 185 మంది రైతులు పోటీ చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పరిష్కారమే వారి ఎజెండాగా వారు ఎన్నికల బరిలోకి దిగినారు. అలానే కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వంను కాషాయ కనుసన్నల్లో నడుపుకొంటూ దేశంలోని అన్ని రంగాలను, వ్యవస్థలను సంక్షోభంలోకి నెట్టడం జరిగింది. మోడీ ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలలో బడా పెట్టుబడిదారులకు, భూస్వాములకు, సామ్రాజ్యవాదులకు, సంపన్న వర్గాలకు అనుకూలంగా పాలన చేస్తూ దేశ సంపదను, ప్రజా ధనాన్ని కొల్లగొట్టబడ్డ విధానాన్ని వ్యాస రచయిత చక్కగా విశ్లేషణ చేశారు.

అదే విధంగా భావ ప్రకటనా స్వేచ్ఛ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తం చేయడానికి రాజ్యాంగం హక్కు కల్పించింది. అందులో భాగంగానే కొందరు రచయితలు, మేధావులు, హక్కుల నేతలు ప్రజా సమస్యలను ప్రశ్నించినందుకు, ప్రభుత్వాన్ని కూల్చడానికి కుట్ర పన్నారని అభియోగం మోపి అక్రమంగా అరెస్టు చేసిన విషయాన్ని వివరించినందుకు 'వీక్షణం'కు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఇక ముందు కూడా దేశంలోని పాలకుల అప్రజాస్వామిక చర్యలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రపంచానికి తెలియచేసే సమాజ మార్పుకు దోహదం చేసే బాధ్యతను 'వీక్షణం' పత్రిక కొనసాగించాలని కోరుకుంటున్నాను.

– బోరెడ్డి మధుసూదన్‌రెడ్డి
సిద్ది పేట

వీక్షణంను ఎన్నో ఏండ్లుగా చదువుతూ, దాని నుంచి ఎంతో నేర్చుకున్న పాఠకుడిగా ఈ మధ్య కాలంలో మీరు వేస్తున్న వ్యాసాలు ఆ స్థాయిలో ఉండటం లేదని చెప్పటానికి విచారిస్తున్నాను. మరీ ముఖ్యంగా ఇంకా చైనాను సోషలిస్టు దేశంగా గుర్తిస్తూ ఇద్దరు ముగ్గురు వ్యక్తులు పదే పదే పాడుతున్న పాచిపళ్ల పాటను మీరు కూడ మళ్లా మళ్లా ఎందుకు వేస్తున్నారో అర్థం కావటం లేదు. చైనా సోషలిస్టు దేశం కాదని, అది ఫక్తు పెట్టుబడిదారీ దేశంగా మారిందని చూపే ఉదాహరణలు లెక్కలేనన్ని ఉన్నాయి. మావో పుట్టినరోజున మావోను గుర్తు చేసుకునే సభ పెట్టటానికి ప్రయత్నిస్తే విద్యార్థిని అరెస్టు చేసారు. చైనా ప్రభుత్వ సహకారంతో నడుస్తున్న అలీబాబా ఆన్ లైన్ కంపెనీ అధినేత ఈ మధ్య ఆరురోజుల పని వారం, రోజుకు పన్నెండు గంటల పని దినం ఉండాలని అంటే, స్వయంగా కమ్యూనిస్టు పార్టీ పత్రిక ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు అవసరాన్ని అర్థం చేసుకోవచ్చునని, కాని కార్మికులను ఒత్తిడి చేయవద్దని సన్నాయి నొక్కులు నొక్కింది. ఇటువంటి ఉదాహరణలతో, అసలు మొత్తంగా చైనా ఆర్థిక వ్యవస్థ, పాలన, రాజకీయాలు, సంస్కృతి ఏ దిశగా సాగుతున్నాయో పుస్తకమే రాయవచ్చు. కాని తెలుగు సమాజంలో ప్రగతిశీల ఆలోచనలు ఉన్నవారి గౌరవం చూరగొన్న పత్రికలో అందుకు పూర్తిగా వ్యతిరేకమైన వ్యాసాలు వస్తున్నాయంటే ఆశ్చర్యంగా ఉంది. ఈ వ్యాసాలు చూస్తుంటే కృశ్చేవ్ నాటికే సోవియట్ యూనియన్ సంగతి తేలిపోయినా కళ్లు మూసుకుని అది సోషలిజమే అని 1990 దాకా రాసిన, మాట్లాడిన సిపిఐ నాయకులు గుర్తుకొస్తున్నారు. అలాగే చైనా గురించి అనుకునేవారు కూడ ఉండవచ్చు కాని వీక్షణం విచక్షణ ఏమయింది? భూమి గుండ్రంగా ఉందనో, సకల చరాచర సృష్టికి భగవంతుడే కారణమనో, కుల వ్యవస్థ మంచిదనో, ఆర్ఎస్ఎస్ మహత్తర ఆదర్శాలు గల సంస్థ అనో ఎవరైనా రాస్తే వీక్షణం చర్చ పేరుతో అచ్చు వేస్తుందా?

– ఎస్. జనార్దన్
వరంగల్

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

ఎవరు గెలిచినా ఏమున్నది ప్రజోపయోగం?

వీక్షణం

ఈ సంపాదకీయం రాస్తున్న సమయానికి లోకసభ ఎన్నికల ఏడు దశల పోలింగ్‌లో మూడు దశలు (ఏప్రిల్ 11, ఏప్రిల్ 18, ఏప్రిల్ 23) ముగిశాయి. ఇది మీరు చదువుతున్న సమయానికి మరొక దశ, ఏప్రిల్ 29 కూడ ముగిసిపోయి ఉంటుంది. మరొక మూడు దశల (మే 6, మే 12, మే 19) ఎన్నికలు కూడ ముగిసి, మే 23 న వెలువడే ఫలితాల కోసం సమాజం ఎదురుచూస్తుంటుంది. ఇప్పటివరకూ జరిగిన మూడు దశల్లో మొత్తం లోకసభ స్థానాల్లో సగం కన్న ఎక్కువగా 302 నియోజక వర్గాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. మిగిలిన నాలుగు దశల్లో ఇంకా 241 స్థానాల్లో ఎన్నికలు జరగవలసి ఉంది. ఇప్పటికే సగంకన్న ఎక్కువ స్థానాల్లో ఎన్నికలు అయిపోయాయి గనుక ఏ కూటమికి సానుకూలత ఉందో, ఏ కూటమి వెనుకపట్టు పట్టబోతుందో ఊహాగానాలు మొదలయ్యాయి. వెలువడుతున్న అంచనాల ప్రకారం గడిచిన 302 స్థానాల్లో అధికార ఎన్‌డిఎ మూడో వంతు స్థానాలను కూడ గెలుచుకునే అవకాశం లేదంటున్నారు. భారతీయ జనతా పార్టీకీ దాని మిత్రపక్షాలకూ ఈ 302లో వంద దాటక పోవచ్చుననీ, కాంగ్రెస్‌కూ దాని మిత్రపక్షాలకూ పది ఇరవై ఎక్కువ రావచ్చుననీ అంచనా వేస్తున్నారు. రెండు కూటముల లోనూ లేని ఇతర, ప్రాంతీయ రాజకీయ పక్షాలు దాదాపు 80 స్థానాలు కైవసం చేసుకోవచ్చునంటున్నారు. ఈ అంచనాలు వాస్తవమే అయితే మే 23న ఏ ఒక్క కూటమీ ప్రభుత్వాన్ని స్థాపించేందుకు అవసరమైన ఆధిక్యత సంపాదించలేవు, రెండు కూటములు కూడ ఇతర రాజకీయ పక్షాల మద్దతు కూడగట్టడానికి ప్రయత్నించవలసి వస్తుంది. అంటే కప్పల తక్కెడ అవకాశవాద, సిద్ధాంత రహిత రాజకీయాలకు అవకాశం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుంది.

అయితే ఇంకా జరగవలసిన నాలుగు దశల ఎన్నికల్లో 241 నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి మారడానికి అవకాశం ఉంది. ఈ నియోజకవర్గాల్లో ఎక్కువ పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, బెంగాల్ వంటి ఉత్తర, తూర్పు భారత రాష్ట్రాల్లో ఉన్నాయి. వీటిలో పంజాబ్, బెంగాల్ మినహాయిస్తే మిగిలినవన్నీ సాంప్రదాయికంగా హిందీ బెల్ట్‌గా, గోమాత బెల్ట్‌గా పేరుపొందిన ప్రాంతాలే. ఆ ప్రాంతంలోని వెనుకబాటుతనం వల్ల, భూస్వామిక, మత, కుల భావజాలాల పట్టు వల్ల అక్కడ సంఘ్ పరివారానికి ప్రాబల్యం ఎక్కువ. పాకిస్తాన్ బూచిని చూపి, ముస్లింల పట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టి వోట్లు సంపాదించడం సులభం.

పుల్వామా దాడి తర్వాత, సర్జికల్ స్ట్రైక్స్ తర్వాత "పాకిస్తాన్ మీద నిర్ణయాత్మకమైన చర్య తీసుకోగల శక్తి కేవలం భాజపాకు, అందులోనూ నరేంద్ర మోడీకి మాత్రమే ఉన్నద"నే ఏకైక రెచ్చగొట్టే నినాదం మీద భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచారం నడుస్తున్నది. అది బహుశా ఫలితాలు ఇవ్వవచ్చు కూడ. అంటే ఈ 241లో సగం కన్న ఎక్కువో, మూడింట రెండు వంతులో భారతీయ జనతా పార్టీ చేజిక్కించుకోవచ్చు. సగం సంపాదించు కుంటే అది ప్రభుత్వం స్థాపించగల ఆధిక్యత కాదు. కనీసం ముప్పై నలభై స్థానాల కోసం ఇతరుల మీద ఆధారపడవలసి వస్తుంది. మూడింట రెండు వంతులు సంపాదించుకుంటే బొటాబొటిగా ప్రభుత్వం స్థాపించగల అవకాశం గాని, లేదా పది పదిహేను తక్కువ పడి, ఇతర పార్టీల మీద ఆధారపడడం గాని జరగవచ్చు.

ప్రస్తుతం భారత సమాజంలో నెలకొని ఉన్న పరిస్థితిలో ప్రభుత్వం ఎంత బలహీనమైనదైతే ప్రజలకు అంత మేలు. అందువల్ల ఎవరికీ ప్రభుత్వం స్థాపించే ఆధిక్యత లేని అనిశ్చిత స్థితినే కోరుకోకతప్పదు. కాని ఈ పరిణామానికి మరొక కోణం, ఇప్పటికే నిరంకుశంగా, అప్రజాస్వామికంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో అధికారం పంచుకోవడం, కేంద్రప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం అనే బలంతో మరింత చెలరేగిపోతాయి. కేంద్ర ప్రభుత్వ స్థాపనకు అటువంటి అనిశ్చిత స్థితే తలెత్తితే, ఇటు చంద్రశేఖర రావు గాని, అటు చంద్రబాబు నాయుడు గాని కొమ్ములు వచ్చినట్టుగా ప్రవర్తిస్తారు. ఆ కొమ్ములతో వారు కేంద్రంలో అధికారం చేపట్టబోయే పార్టీని ఏమీ చేయరు, ఆ కొమ్ములను తమ బేరసారాల కోసం, తమకూ ఆశ్రితులకూ ఎక్కువ ప్రయోజనాల కోసం వాడుకుంటారు గాని, నిజంగా ఆ కొమ్ములను ప్రయోగించేది తమ తమ రాష్ట్రాలలోని ప్రజల మీదనే. కేంద్ర ప్రభుత్వం ఏర్పరచబోయేవారికి, అందులోనూ భాజపా నాయకత్వంలోని ఎన్‌డిఎ కు పదో పరకో తక్కువై, ఆ ఖాళీని చంద్రశేఖరరావు వంటి ప్రాంతీయ పార్టీల నాయకులు పూరించే పరిస్థితి వస్తే ఇక వారికి పట్టపగ్గాలు ఉండవు. తామే ఢిల్లీలో చక్రం తిప్పుతున్నామని ప్రగల్భాలు పలుకుతూ ఆ చక్రంతో తమ రాష్ట్ర ప్రజల కుత్తుకలు మరింతగా కత్తిరిస్తారు.

అంతర్జాతీయ రాజకీయార్థిక పరిణామాలతో పెరుగుతున్న సామ్రాజ్యవాద ఒత్తిడి, ముడిసరుకుల కోసం, తమ సరుకుల మార్కెట్ల కోసం బహుళజాతి సంస్థల, వారి దళారీ కావలికుక్కల దురాశ, అంతర్గతంగా బలపడుతున్న భూస్వామ్య, హిందూ బ్రాహ్మణీయ శక్తుల సాంస్కృతిక దౌర్జన్యం అనే ముప్పేట దాడిలో చిక్కుకున్న భారత సమాజం లో ఇవాళ ఇటు ఎన్‌డిఎ తిరిగి అధికారంలోకి వచ్చినా, అటు యుపిఎ అధికారంలోకి వచ్చినా, ఇతరుల మద్దతుతో వీరిలో ఎవరో ఒకరు వచ్చినా, వీరిద్దరూ కాక మరొక అతుకుల బొంత వచ్చినా ఆ ముప్పేట దాడిని ఆపజాలరు. ఆ దాడికి గురవుతున్న భారత అశేష ప్రజానీకానికి కనీస ఉపశమనం కలిగించలేరు. అటు ముగ్గురు బందిపోట్లు, ఇటు వారికి దాసానదాసులు కాదలచిన మూడు కూటముల దళారులు భారత సమాజాన్ని పీల్చి పిప్పి చేయనున్నారు, భారత ప్రజల సంపదనూ, శ్రమనూ కొల్లగొట్టనున్నారు. ఎవరు గెలిచి ఎవరు ఓడినా ప్రజలకు ఒరగబోయేదేమీ లేదు. పీడనకూ దోపిడీకీ గురవుతున్న విశాల ప్రజారాశుల ఐక్యత, జరుగుతున్న పరిణామాలను సునిశితంగా పరిశీలించే చైతన్యం, నిరంతర జాగరూకత, ఎప్పటికప్పుడు పాలకవర్గ పన్నాగాలను గ్రహించి ప్రతిఘటించే నిత్య పోరాట స్ఫూర్తి మాత్రమే ఇవాళ భారత ప్రజానీకం ముందున్న మార్గాలు. ఈ కర్తవ్యాలను గ్రహించడం, ప్రచారం చేయడం, ఆ కర్తవ్యాల పరిపూర్తికి ప్రజలను ఇతోధికంగా సమీకరించడం, ప్రజా ఆచరణను ప్రోత్సహిస్తూ తాము స్వయంగా ఆచరణలోకి దిగడం బుద్ధిజీవుల బాధ్యత. వీ

ముక్కుపచ్చలారని పిల్లలను పిడాత చంపిందెవరు?

ఇరువై మంది చిన్న పిల్లలు, గలగలలాడే కళకళలాడే పడుచుపిల్లలు, ఇప్పుడిప్పుడే బతుకంటె ఏందో నేర్చుకుంటున్న పిల్లలు, రెండేండ్లు కోళ్ల ఫారాల్ల కోళ్ల తీర్గ చదువుల మునిగిపోయిన పిల్లలు ఉరి పోసుకోని చచ్చిరి, మందు దాగి చచ్చిరి, రైలు కింద పడి చచ్చిరి. రాజ్జమేలె మారాజులకు కంట్లె నీటిచుక్క కనబడకపాయె. వాడోడు వీడోడు అయ్యయ్యో అన్నాక గప్పుడే మేలుకున్నట్టు ఏదో ఒక మాట మాత్రం అనిరి. మన చావుకు ఇంకోడు ఏడ్వకుంటె ఏమాయె గాని, అసలు ఎందుకు జచ్చింండ్రో, ఏమేమయిందో తెలుసుకోవాలెగద. డాక్టరో ఇంజనీరో కాకపోతే బతుకే లేనట్టు, అవి కాక మిగిలినవి చదువులే కావన్నట్టు ఉలేఉలే చేసిన నాయకులుండిరి, ఆంధ్రోళ్ల కాలేజీలుండె. మారె, అక్కడొద్దు, మా సర్కారు కాలేజిలనే చదివిపిస్తమంటె ఆ కాలేజిల చెప్పెటోడు ఒకడుంటె ఒకడుండకపాయె. వచ్చినోడు సక్కగ జెప్పడాయె. కష్టమో నష్టమో మీద పడ్డంక తప్పుతదా అని ఆ ప్రైవేటు కాలేజిల్లనే జేర్పిస్తె జైళ్లల్ల బెట్టినట్టే బెట్టిరి. బిడ్డలను చూద్దామన్న చూడనియ్యకపోయిరి. చచ్చినా పైసలు కట్టకుంటె పీనుగయిన ఇయ్యక పోయిరి. ఇటువంటి కోళ్ల ఫారాల కాలేజీలన్ని ఆంధ్రోళ్లయి, తెలంగాణ రాంగనె వాళ్లను తరిమి కొడ్తమంటె అదే నిజమను కుంటిమి. తెలంగాణొచ్చి ఐదేండ్లయిపాయె, ఆ చైతన్యోనిది, నారాయణోనిదే రాజ్జెమాయె. ఇంటర్మీడియట్ బోర్డని ఒకటుంటె అది ఆ చైతన్య, నారాయణల పెంపుడు కుక్క తీర్గ పని చెయ్యబట్టె. ఇట్ల తల్లిదండ్రులు, సర్కారు కాలేజిలు, ప్రైవేటు కాలేజిలు, ఇంటర్మీడియట్ బోర్డు, సర్కారు అన్ని పాపం పసి పోరగాండ్ల ఉసురు తీసుకుంటాంటె ఇయన్ని చాలయన్నట్టు ఇంకో మెకాన్ని పిల్లల మీదికి తోలింండ్రు పెద్దసార్లు. అదేదో కంపిని, గ్లోబరీనానో ఏదో ఓ అంటె నా రాని కంపిని. పదిలక్షల మంది పిల్లల జాతకాలన్ని దాని చేతుల బెట్టింండ్రు. ఆ కంపినికి చాతకాదురయ్యా అంటె ఆళ్లకే ఇయ్యిమని పైనుంచి ఒత్తిడి అన్నరు. ఆడు జేసిన కథలు తీరొక్కటి. పరీక్ష రాయకపోయినా పాసు జేసిండు. 99 మార్కులు వచ్చెటట్టు అవ్వల్ దర్జగ రాస్తె 00 మార్కులు ఏసిండు. ఫస్టియర్‌ల తొంబై మార్కులు వచ్చిన మషూర్ పిల్లకు సెకండియర్‌ల పది మార్కులేసి ఫెయిల్ చేసిండు. ఐఐటో ఏదో పెద్ద పరీక్షల దేశంలనే పేరెన్నికగన్నోనికి ఇక్కడ ఒక్క మార్కేసి ఫెయిల్ జేసిండు. మార్కుల మెమో ఎట్ల తయారు చెయ్యల్నో గూడ తెల్వదు. ఒక్కొక్క సబ్జెక్టు రెండుసార్లు రాసి రెండుతీర్ల మార్కులేసిండు. ఒకరి హాల్‌టికెట్ నంబరు గొడితె ఇంకోరి మెమో ఇస్తండు. అట్ల పిల్లలను అరిగోస పెట్టిండు. పదిలక్షల మంది పిల్లల్ల మూడు లక్షల మందిని ఫెయిల్ జేసి పారేసిండు. అండ్ల ముప్పై నలబై వేలయినా మంచిగ చదివేటోళ్లు, నూటికి తొంబై ఎనిమిది, తొంబై తొమ్మిది తెచ్చుకునేటోళ్లు ఉన్నరు. తల్లిదండ్రులే కోప్పడ్డరో, తోటి పిల్లగాండ్లల్ల నాదాన్ అయితదనుకున్నరో, ఎంత పెద్ద చదువులు చదవాల్నని ఎన్నెన్ని కలలు గన్నరో, ఆ కలలన్ని కూలిపోయినయని నారాజ్ అయింండ్రో పిల్లలు అఘాయిత్యం జేసింండ్రు. ఎందుకిట్ల అయిందని అడుగుటానికి పోతే సర్కారు పోలీసులను ఉసిగొలిపె. పిల్లలను, తల్లిదండ్రులను, దోస్తులను కొట్టబట్టిరి, పోలీసు స్టేషన్ల పెట్టబట్టిరి. సిగ్గుశరం ఉన్న సర్కారైతె, అయ్యో పాపం అనాలె గద మొదలు. ఎక్కడ అన్యాలం జరిగిందో చూస్త, బరాబర్‌గ సరి చేస్త అని నమ్మకం జెప్పాలె గద. మీ బతుకులతోటి చెలగాటమాడినోడు ఎవడైనా సరే వాడ్ని చింతకు గట్టి చీరుత అనాలె గద. ఏమీ అనకపాయె. ఆ కంపెనీ దొరవారి దగ్గరి దోస్తుదేనని ఊరు కోడై కూస్తాండె. ఎట్ల పాడయితదుల్లా. మన తెలంగాణ, బంగారి తెలంగాణ అంటె నమ్మి నానబోస్తె పుచ్చి బుర్రలైపాయె గద నాయనా... వీ

ఇటు చూస్తే నుయ్యి, అటు చూస్తే గొయ్యి

విభక్త ఆంధ్రప్రదేశ్ రెండో శాసనసభను ఎన్నుకోవడానికి ఏప్రిల్ 11న జరిగిన ఎన్నికలు అనేకచోట్ల హింసకూ, రక్తపాతానికీ దారి తీసి, చివరికి 79.64 శాతం పోలింగ్ తో ముగిశాయి. రాష్ట్రంలోని మూడు కోట్ల పదమూడు లక్షల మంది వోటర్లు ఇటు 175 శాసనసభ స్థానాలకు, అటు 25 మంది లోకసభ స్థానాలకు ప్రతినిధులను ఎన్నుకోవడానికి వోటు వేశారు. లోకసభ స్థానాల ఎన్నికల కన్న శాసనసభ ఎన్నికలే ఎక్కువ ఆసక్తిని రేకెత్తించాయి. తెలుగు దేశం పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, జనసేన – బహుజన సమాజ్ పార్టీ – సిపిఐ – సిపిఎం కూటమి ఒక్కొక్కటీ మొత్తం 175 స్థానాలకూ పోటీ చేయగా, ఈ ఐదుగురు ప్రత్యర్థులలో వాస్తవంగా పోటీ ఇద్దరు ప్రత్యర్థుల మధ్యనే సాగింది. ప్రభుత్వ వ్యతిరేక వోటును చీల్చి, అధికార పార్టీకి ప్రయోజనం చేకూర్చడం కోసమే పుట్టిందని ఆరోపణలు వచ్చినందువల్ల జనసేనకు, 2014 ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయినందువల్ల కాంగ్రెస్‌కు, సాంప్రదాయికంగానే భారతీయ జనతా పార్టీకీ గట్టి పోటీ ఇచ్చే శక్తి లేకుండా పోయింది. ఇక మిగిలిన తెలుగు దేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లను ప్రణాళికలు, రాజకీయ సిద్ధాంతాలు, ప్రజాప్రయోజనకర విధానాలు ఉన్న రాజకీయ పార్టీలుగా గుర్తించడం కన్న చంద్రబాబు నాయుడు, జగన్ మోహన్ రెడ్డి అనే ఇద్దరు పెత్తందార్ల వ్యక్తిగత సైన్యాలుగా భావించడమే ఉచితమని వారి ప్రవర్తన, ప్రజల గుర్తింపు కూడ చూపుతున్నాయి. చంద్రబాబు అధికార దుర్వినియోగం చేశాడని జగన్, ఎన్నికల సంఘం జగన్‌కు అనుకూలంగా పని చేసిందని చంద్రబాబు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఈ ఆరోపణల క్రమంలో హఠాత్తుగా చంద్రబాబు ఫెడరలిస్టు స్ఫూర్తిని గుర్తు తెచ్చుకుని కేంద్ర రాష్ట్ర సంబంధాల మీద, కేంద్రం పెత్తనం మీద పదునైన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడ ఎన్నికల సంఘాన్ని, కేంద్ర సర్వీసు అధికారులను ఉపయోగించుకుని చంద్రబాబు మీద కక్ష తీర్చుకోవడానికి ప్రయత్నించింది. మోడీకి మద్దతిస్తున్న జగన్, మోడీని విమర్శిస్తున్న చంద్రబాబు అనే విచిత్రమైన ద్వంద్వం ఒకవైపు, రాష్ట్ర ప్రభుత్వ అధికార దుర్వినియోగాన్ని ఖండిస్తున్న జగన్, కేంద్ర ప్రభుత్వ అధికార దుర్వినియోగాన్ని ఖండిస్తున్న చంద్రబాబు అనే విచిత్రమైన ద్వంద్వం మరొకవైపు తెరపైకి వచ్చాయి. ఎన్నికల తేదీకి ఫలితాలకూ మధ్య ఉన్న ఐదు వారాల సమయంలో ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉండే వ్యక్తి హక్కులు, అధికారాలు ఏమిటనే చర్చ కూడ మొదలయింది. కేంద్ర–రాష్ట్ర సంబంధాలు, ఫెడరల్ స్ఫూర్తి, అధికార దుర్వినియోగం వంటి చాల అవసరమైన విషయాల మీద చర్చ జరుగుతున్నప్పటికీ ఈ చర్చంతా ప్రజా ప్రయోజనాలు, ప్రజా భాగస్వామ్యం, ప్రజాస్వామ్యం అనే మౌలిక లక్ష్యాల కోసమనే ప్రస్తావన మచ్చుకైనా కనబడడం లేదు. రానున్న ఐదు సంవత్సరాల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బందిపోటుగా, దళారీగా ఉండడానికి ఎవరికి అవకాశం ఉండాలి అనే చర్చే తప్ప ఎవరు ప్రజా ప్రయోజనాలను పరిరక్షిస్తారు అనే చర్చ లేదు. ఇటుచూస్తే నుయ్యి అటు చూస్తే గొయ్యి అనే ఈ స్థితి నుంచి తప్పించుకొని తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చి దిద్దుకునే అవకాశాన్ని తమ చేతుల్లోకి తీసుకోవలసిన ప్రజలకు మాత్రం ఆ నిర్ణయాధికారం రావడం లేదు. వీ


శ్రీలంకలో జరిగిన దాడికి మూలమేమిటి?

- ఎ. నర్సింంహారెడ్డి


శ్రీలంక రాజధాని కొలంబో ఏప్రిల్ 21న ఈస్టర్ వేడుకల వేళ మూడు చర్చీలు, మూడు ప్రముఖ హోటళ్లతో సహా ఎనిమిదిచోట్ల వరుస బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. ఈ ఘటనలో మూడు వందల మందికి పైగా ప్రాణాలు కోల్పోగా వందలాది మంది గాయపడ్డారు. రెండు కోట్ల 20 లక్షల జనాభా కలిగిన శ్రీలంకలో బౌద్ధులు 70.2 శాతం, హిందువులు 12.6 శాతం, ముస్లింలు 7.4 శాతం, క్రైస్తవులు 9.7 శాతం ఉన్నారు. మైనార్టీలపై మెజార్టీల ఆధిపత్యం వివిధ రూపాల్లో కనిపిస్తుంది. ప్రభుత్వం సింహళ భాషకు, బౌద్ధానికి ప్రాధాన్యం ఇవ్వడం అల్ప సంఖ్యాకవర్గాల వేర్పాటువాద పోరాటానికి దారితీసింది. మనదేశం నుంచి శ్రీలంకకు వెళ్లి స్థిరపడ్డ తమిళులపై స్థానిక సింహళీయుల అణచివేతలో నుంచే ఎల్‌టిటిఇ పుట్టుకొచ్చింది. 1983 నుంచి 2009 వరకు శ్రీలంక ప్రభుత్వానికి ఎల్‌టిటిఇకి మధ్య సాగిన సుదీర్ఘ పోరాటంలో దాదాపు లక్ష మంది మరణించారు. 2009 మే 19న ఎల్‌టిటిఇ నాయకుడు ప్రభాకరన్‌ను శ్రీలంక సైన్యం హత్య చేసింది. సింహళ జాతివాదం అక్కడి బౌద్ధ గురువులతో కలిసి తమిళజాతి వాదాన్ని అణచివేసిన తర్వాత ముస్లింలను కూడా అణచివేసే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఫలితంగా నేషనల్ తౌహిత్ జమాత్ (ఎన్‌టిజె) ఆవిర్భవించింది. శ్రీలంకలో బౌద్ధం పేరుతో భోడు బాలసేన అనే ఉన్మాద సంస్థ ఏర్పడ్డది. ముస్లిం మతస్తులు తమ జనాభాను పెంచుకొని శ్రీలంక ద్వీపాన్ని మొత్తం ఆక్రమిస్తారని అబద్ధాలు, రెచ్చగొట్టే ప్రచారాలు సాగిస్తోంది. అయినా ప్రభుత్వం వీరిని కట్టడి చేయలేదు. మైనార్టీలపై సింహళ-బౌద్ధ ఫాసిస్టు విధానాలు అమలుపరుస్తున్నారు.

2014 జూన్‌లో దేశ నైరుతి ప్రాంతంలోని కాలుతర జిల్లాలో ముస్లింల ఇండ్లపై, వ్యాపార సంస్థలపై దాడులు సాగాయి. నలుగురు మరణించగా, ఎనభైమంది గాయపడ్డారు. ఇవి మత కలహాలుగా మారి ఎనిమిది వేల మంది ముస్లింలు, రెండు వేల మంది సింహళులు నిరాశ్రయులయ్యారు. 2018 ఫిబ్రవరి 26 నుంచి మార్చి 10 వరకు ముస్లింలపై, మసీదులపై, వ్యాపార సంస్థలపై దాడులు సాగాయి. అంతరంగికంగానే కాకుండా, అంతర్జాతీయ పరిణామాలు శ్రీలంకలో ఉద్రిక్తతలకు దారితీశాయి. మయన్మార్‌లోని రోహింగ్యాలపై దాడులకు పురికొల్పిన బౌద్ధ తీవ్రవాది ఆషిన్ విరాతుకు శ్రీలంకలోని భోడు బాలసేనతో సంబంధాలు ఉన్నాయి. థాయిలాండ్‌లో కూడా బౌద్ధ-ముస్లిం ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. మలేషియాలో కూడా ఈ రెంటి మధ్య ఉద్రిక్తతలు ఉన్నాయి. తూర్పు ఆసియాలో బౌద్ధ-ముస్లిం వైరుధ్యం పెంచే అంతర్జాతీయ పన్నాగం ప్రభావం శ్రీలంక మీద పడ్డది. శ్రీలంకలో బౌద్ధమే కాదు, ముస్లిం మతంలోనూ తీవ్రవాద ధోరణులు పెంచడం ఈ కుట్రలో భాగమే. సూఫీ ఇస్లాం స్థానంలో తీవ్రవాద భావజాలం చోటు చేసుకుంటున్నది. ముస్లింలపై ఈ అంతర్జాతీయ ప్రభావం మూలంగానే శ్రీలంకలో క్రైస్తవులపై దాడి జరిగింది. ఏది ఏమైనా ప్రభుత్వాలు మతపరమైన విద్వేషాలను నిష్పాక్షికంగా నిరోధించని పక్షంలో ఏదో ఒక రూపంలో తీవ్రవాదం పుట్టుకొస్తుందన్నది ప్రపంచ చరిత్ర చెపుతున్న పాఠం. తీవ్రవాదానికి మూలాలు జాత్యహంకారంతో, సామాజిక, ఆర్థిక, రాజకీయాంశాలతో ముడిపడి ఉన్నందున అణచివేత మీద ఆధారపడి తీవ్రవాదాన్ని కట్టడి చేయడం సాధ్యం కాదు! వీ






❖ **మోడీ ఐదేళ్ల నిరంకుశ పాలన** – తెలంగాణ ప్రజా ఫ్రంట్ ప్రచురణలు – 40 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు: తెలంగాణ ప్రజా ఫ్రంట్, ఎచ్ఐజి – 2, బ్లాక్ నెం. 24, ప్లాట్ నెం. 6, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500020, ఫోన్ : 9849996300




❖ **మనిషి – దేవుడు – నాస్తికత్వ సిద్ధాంతం** – పెరియార్ – అనువాదం డా. మలయశ్రీ – రచన బి. రామకృష్ణ – నవ్య సాహిత్య పరిషత్ ప్రచురణ – 52 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: డా. మలయశ్రీ, ఇ. నెం. 1–113/7, ఆదిత్యభవన్, వేమననగర్, రేకుర్తి, కరీంనగర్ – 505451, ఫోన్ : 9866546220



❖ **కులం – బహుజన ప్రజాస్వామిక విప్లవ దశ** – పట్టా వెంకటేశ్వర్లు – చక్రం పబ్లికేషన్స్ – 78 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: జె. క్రిష్ణా నాగమణి, ఫ్లాట్ నెం. 301, క్రియేటివ్ మధు ప్లాజా, ఇ.నెం. 12–13–481, వీధి నెం. 1, తార్నాక, సికింద్రాబాద్ – 500017, ఫోన్ : 9959649097



❖ **పంచపదులు** – శ్రీశ్రీ – సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణ – 40 పేజీలు, 1/8 డెమీ, రు. 35




❖ **రుక్కుటేశ్వర శతకం** – శ్రీశ్రీ – ఆరుద్ర – శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణ – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 30
పై రెండు ప్రతులకు: శ్రీశ్రీ సాహిత్యనిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతీ నగర్, విజయవాడ – 520004, ఫోన్ : 9246277375




❖ **అద్దంలో ఆభరణం** – (పెద్దనోట్ల రద్దుపై కవితలు – చీకోలు సుందరయ్య – అక్షరం ప్రచురణలు – 296 పేజీలు, 1/8 డెమీ, రు. 180, ప్రతులకు: శ్రీమతి సిఎచ్. లక్ష్మి, ఇ.నెం. 6–3–609/53, ఫ్లాట్ నెం. 201, కృపదేవి రెసిడెన్సీ, ఆనందనగర్, ఖైరతాబాద్, హైదరాబాద్ – 500 004



❖ **అక్కర వారధి** – ప్రజాశక్తి ప్రచురణలు – 96 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: 9490099250 అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **ఒక వర్షం కురిసిన రోజు** – కథల సంపుటి – డా. కాంచనపల్లి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 112 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: ఎ. అంజని దేవి, ఫ్లాట్ నెం. 2, స్నేహదీప్ అపార్ట్‌మెంట్స్, స్ట్రీట్ నెం. 1, గోకుల్ నగర్, తార్నాక, సికిందరాబాద్ – 500017




❖ **నీటిమనసు** – కవిత్వం – నందిని సిధారెడ్డి – మంజీర రచయితల సంఘం ప్రచురణ – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: నందిని సిధారెడ్డి, ఇ.నెం. 8–04–036, వెంచర్ – 2, మల్లారెడ్డినగర్, లోతుకుంట, అల్వాల్, సికిందరాబాద్ – 500015 ఫోన్ : 9440381148




❖ **కథావిష్కారం** – కథా విమర్శ – కె.పి. అశోక్ కుమార్ – సామ్రాట్ పబ్లికేషన్స్ – 168 పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు: కె.పి. అశోక్ కుమార్, 6, మా సంతోషీ కాలనీ, తుర్కపల్లి రోడ్, బొల్లారం, సికిందరాబాద్ – 500010




❖ **నడకబోనం** – కొమురవెల్లి అంజయ్య – జైత్ర పబ్లికేషన్స్ ప్రచురణ – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: కొమురవెల్లి అంజయ్య, ఇ.నెం. 6–2–56, బొర్ర హనుమాన్ దేవాలయం పక్కన, పారుపల్లి వీధి, సిద్దిపేట – 502103, ఫోన్: 9848005676




❖ **వజ్జాలగ్గమ్** – (ప్రజ్యాలగ్నమ్) – జయవల్లభుడు – తెలుగు అనువాదం డా. కె. కమల – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 171 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్ – 500 004, ఫోన్: 040–29703142



❖ **తెలుగు సాహిత్యంలో ఆత్మకథలు** – ఆప్కారి సూర్యప్రకాశ్ – సూర్యవీణ గ్రంథమాల ప్రచురణ – 176 పేజీలు, 1/8 డెమీ, రు. 150



❖ **నిశ్శబ్ద ధ్వని** – (మినీ కవితా సంపుటి) – ఆప్కారి సూర్యప్రకాశ్ – ఇందూరు భారతి తెలుగు రచయితల సమాఖ్య ప్రచురణ – 100 పేజీలు, 1/8 డెమీ, రు. 100, పై రెండు ప్రతులకు: ఆప్కారి సూర్యప్రకాశ్, ఫ్లాట్ నెం. 33, ఇ.నెం. 8–7–195/5, పి.వి. ఎన్‌క్లేవ్, సమతానగర్, పాత బోయిన్‌పల్లి, సికింద్రాబాద్ – 11



❖ **రుద్ర తరంగాలు** – కవితా సంపుటి – బూర భిక్షపతి – ప్రగతి ప్రచురణలు – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 80



❖ **స్కైలాబ్ పతనం** – (బుర్రకథ) – బూర భిక్షపతి – ప్రగతి ప్రచురణలు – 16 పేజీలు, 1/8 డెమీ, రు. 20, పై రెండు ప్రతులకు: బూర భిక్షపతి, ఇ.నెం. 2–12–293/20, విజయనగర్ కాలనీ, గోపాల్‌పూర్ రోడ్, హన్మకొండ, వరంగల్ – 506009 ఫోన్: 9866612717
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

విఫలమవుతున్న ఎన్నికల కమిషన్

రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించడంలో కేంద్ర ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందనీ, ఎన్నికల్లో ధనం, కులం, జాతి, వర్గం అనే అంశాలు ప్రజలను ప్రలోభాలకు గురిచేశాయనీ అంటున్నారు **డా. ఎ. పున్నయ్య**

ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య భారతదేశ ప్రగతి గుణాత్మక మార్పునకు నోచుకోకపోగా ప్రపంచ దేశాల ముందు మన ఘనమైన ప్రజాస్వామ్య వ్యవస్థ సాగిలపడి అపహాస్యం పాలవుతోంది. ఈ దుస్థితికి ప్రధాన కారణం అవినీతిమయమైన రాజకీయ వ్యవస్థ. దశాబ్దాలుగా ఎన్నికలు ప్రజాస్వామికంగా జరగడం లేదు. ఎన్నికల్లో చెప్పలేనంతగా, ఊహించనంతగా ధన ప్రభావం పెరిగింది. ధన ప్రభావాన్ని అడ్డుకోకపోతే ప్రజాస్వామ్యంలోని మధుర ఫలాలను రుచి చూసే అవకాశమే దేశ ప్రజలకు రాకుండా పోతుందని, ప్రజాస్వామ్యం విజయవంతం కాదని అంబేద్కర్ తొలినాళ్లలోనే అనుమానం వ్యక్తపరిచాడు. ఆ అనుమానం అక్షరాలా నిజమైంది. ప్రజాస్వామ్యంలో అధికారం ఓటు ద్వారా వస్తుందనేది వాస్తవ స్థితి మారిపోయి 'నోటు' ద్వారా సిద్ధిస్తుందన్న స్థిర అభిప్రాయాన్ని గత పాలకులు కల్గించారు. నేడది సాధారణాంశంగా మారిపోయింది. పార్లమెంటరీ ఎన్నికలు ప్రజాస్వామికంగా జరగకపోవ డానికి పతనమైన ఎన్నికల కమిషనే (ఇసి) కారణం. సూత్రప్రాయంగా భారత రాజకీయ వ్యవస్థను సక్రమంగా నడిపించడానికి భారత రాజ్యాంగంలో ఎన్నికల కమిషన్‌కు స్వయం ప్రతిపత్తిగల విశాలమైన విచక్షణాధికారాలను 324 అధికరణ ప్రకారం పొందుపరిచింది. ఈ ఎన్నికల కమిషన్ నిర్వర్తించే విధుల ద్వారా రాజకీయాల్లో సేవా దృక్పథం పెరిగి, మానవీయ విలువలు కొనసాగింపుగా ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలన్న స్పృహతో వ్యక్తుల, పార్టీల నియంత్రణకు లోనుకాకుండా ఎన్నికలను నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలి.

ఆర్థిక స్థితిమంతులకే టికెట్లు

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఖ్యాతి గడించిన భారతదేశంలో ఎన్నికల సందర్భంగా ధన ప్రభావం వికృత రూపం దాల్చుతోంది. పంచాయతీ ఎన్నికలు మొదలుకొని పార్లమెంట్ వరకూ మితిమీరిన డబ్బు ప్రభావం పెరగడం ప్రజాస్వామ్యవాదులను కలవరపరుస్తోంది. ధన ప్రభావం, నేరచరితుల రాజకీయ రంగప్రవేశం, కండబలం తదితర అంశాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నాయి. ఎన్నికల కమిషన్ అభ్యర్థి ఉన్నవాడా, లేనివాడా అన్నదానితో నిమిత్తం లేకుండా అందరికి గెలుపు అవకాశాలు సమానంగా ఉండాలని ఎన్నికల వ్యయ పరిమితిని నిర్ధారించింది. కాని ఓటర్లను ప్రలోభ పెట్టడం తొలి సార్వత్రిక ఎన్నికల నుంచే ప్రారంభమైంది. అప్పట్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విందు భోజనాలు ఏర్పాటు చేసేవారు. భోజనాల అనంతరం తమ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించేవారు. తరువాత కాలంలో ధన ప్రభావం పెరిగింది. పార్టీలు ప్రజాసేవ, రాజకీయ అనుభవం లాంటివి చూడకుండా వందల కోట్ల ఆస్తులున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకో, భూస్వాములకో, బడా పారిశ్రామికవేత్తల పాదాల చెంత అభ్యర్థిత్వ ఆహ్వాన పత్రాలు (బి ఫారం) పెట్టి ఆహ్వానిస్తున్నాయి. ప్రజల్లో అభ్యర్థికున్న పరపతి చూసి టికెట్లు ఇచ్చే స్థితి నుండి ఎంత స్థితిమంతుడోనన్న లెక్కలేసి టికెట్లు ఇచ్చే స్థితికి పార్టీలు మారాయి. అభ్యర్థి ఆర్థిక బలాన్ని అంచనా వేసే, అంతకన్నా ఆర్థిక స్థోమత అధికంగా ఉన్న అభ్యర్థిని వెతికి రాజకీయ అనుభవం లేకున్నా బరిలోకి దింపుతున్నారు.

అరుణాచల్ ప్రదేశ్, గోవా, సిక్కిం కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ నియమం ప్రకారం రు. 54 లక్షలు, మిగతా లోక్‌సభ నియోజకవర్గాల్లో రు. 70 లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు చేసుకునే వీలుంది. కాని నోటిఫికేషన్ నుంచి ఓటింగ్ వరకు అభ్యర్థులు కోట్లకు కోట్లు కుమ్మరిస్తున్నారు. ప్రతిరోజు అత్యంత సాధారణంగా బహిరంగం గానే మద్యం పంపిణీ జరుగుతోంది. వస్తు రూపేణా ఓటరుకు కొంత మొత్తాన్ని ముట్టచెప్పుతున్నారు. ఓటరు స్లిప్పుతో పాటు నోట్లు పంపిణీ చేయడం చాలా సాధారణమైపోయింది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం తోడవడంతో దేశవ్యాప్తంగా పలు రాజకీయ పక్షాలు ఆన్‌లైన్, ఈ-వ్యాలెట్స్ ద్వారా ఓటర్లకు నగదు బదిలీ చేస్తున్నాయి.

నామినేషన్లు వేసిన రోజు నుండి అభ్యర్థి ప్రతి ఖర్చును రోజువారీగా వివరించాలి. సెంట్రల్, స్టేట్ ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ టీంలు అభ్యర్థుల ఖర్చులను రహస్యంగా రికార్డు చేయాలి. పోలింగ్, కౌంటింగ్ ఫలితాల తర్వాత ఎలక్షన్ల అబ్జర్వర్ల సమక్షంలో అభ్యర్థులందరు తమ ఖర్చుల అకౌంట్‌లను నిర్ధారించుకోవడం ఎన్నికల ప్రక్రియలో భాగం. కాని, నిఘా లేకపోవడం మూలాన అభ్యర్థులు నిర్ణయించిన పరిధి కూడా దాటలేదంటూ ఎలక్షన్ కమిషన్‌ల ఖర్చులు చూపించేవారు కొందరున్నారు. కొందరు అసలు లెక్కలు చూపించని వారున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలపై ఎలాంటి చర్యలు లేకపోవడం విశేషం.

2016లో తమిళనాడులోని అరవకురుచ్చి తంజావూర్ అసెంబ్లీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికను ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. ఓటర్లకు డబ్బుల పంపిణీతో పాటు భారీ కానుకలను రాజకీయ పక్షాలు అందజేయడంతో ఎన్నికలను వాయిదా వేసి మళ్లీ నిర్వహించింది. పార్లమెంటరీ ఎన్నికల చరిత్రలో ధన ప్రవాహాన్ని నిరోధించేందుకు ఎన్నిక వాయిదా వేయడం అదే మొదటిసారి కావడం ఎన్నికల చరిత్రలో గుర్తుండి పోయింది. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో అక్షరాస్యత,

అభివృద్ధి ఎక్కువ. దీనితో పాటు ధన ప్రభావం మరింత ఎక్కువ కనిపిస్తుంది.

పట్టుబడిన అవినీతి నోట్ల కట్టలు

దేశ వ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికల తేదీలు ఏప్రిల్ 11 నుండి మొదలై మే 19 వరకు 7 విడుతలుగా నిర్ణయించబడ్డాయి. ఓటర్లను బుట్టలో పెట్టే ప్రత్యేక కసరత్తుల్ని పార్టీలు ముమ్మరం చేశాయి. నగదు, మద్యం, ఇతర నిషేధిత పదార్థాల సరఫరా రూపేణ ఇప్పటికే దాదాపుగా 2,600 కోట్లకు పైగా ఈసీ స్వాధీనం చేసుకుంది. 2014 ఎన్నికలతో పోలిస్తే ఇది ఐదింతలు. చాపకింద నీరులా సాగే అవినీతి ప్రవాహాల్లో ఈసీ చేతికి చిక్కింది సముద్రంలో నీటి బొట్టంతనే. 70 ఏళ్లుగా భారత ప్రజాస్వామ్య ఎన్నికలకు నల్లధనమే ఇంధనంగా మారింది.

వేలకొలది చెక్‌పోస్టులు, వందలకొలది మొబైల్ పార్టీలు, వేలాది మంది సిబ్బందితో నిరంతర తనిఖీలు చెప్పుకోవడానికే. నాయకుల వారి అనుచరగణాల కదలికలను పసికట్టే షాడో పార్టీలు ఉన్నా గాని, ఎన్నికల్లో డబ్బు రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాజకీయ నాయకులు రెండు మూడు నెలల ముందుగానే నియోజక వర్గాల స్థాయిలో పెద్ద మొత్తంలో డబ్బు నిల్వ పెడుతున్నారు. అదును చూసి ఆ డబ్బును ఓటర్లకు చేరవేస్తున్నారు. ఎక్కువ మొత్తం డబ్బు అయితే కారుల్లో తరలిస్తున్నారు. ద్విచక్ర వాహనాల ద్వారా, ఆర్‌టిసి బస్సుల్లో, రైళ్లలో పకడ్బందీగా కోట్లకు కోట్లు తరలిస్తున్నారు. ఈ కదలికలు ప్రత్యక్షంగానో పరోక్షంగానో తనిఖీ అధికారుల కనుసన్నలతో జరుగుతున్నాయనేది యథార్థం. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి ఫెమాఖండూ వాహణ శ్రేణి ద్వారానే భారీ ఎత్తున నగదు తరలింపు బాగోతం తాజాగా బట్టబయలైంది. దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఇలాగే జరుగుతున్నప్పటికీ బయట పడ్డది కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే. ప్రతిపక్షాల కదలికలపై పోలీసు నిఘాపెట్టి అధికార పార్టీవారు పోలీసు జీపుల్లోనే నగదును చేరవేస్తున్నారన్నది కాదనలేని కఠోర సత్యమే.

ఎన్నికల్ని స్వేచ్ఛగా, సక్రమంగా నిర్వహించేందుకు 324 అధికరణ ద్వారా సంపూర్ణ రాజ్యాంగ అధికారం గల 'ఈసీ' బుసకొట్టడానికే పరిమితమైంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అనేది ఉన్నా దానిని ఉల్లంఘించిన చర్యలేమి లేవని ధీమాతో పార్టీలు ఎంతకైనా తెగిస్తున్నాయి. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారంగా ఓటర్లకు డబ్బులు పంచడాన్ని తీవ్ర నేరంగా పరిగణిస్తూ చట్ట సవరణ చేయాలని 2016 నుండి ఈసీ నాలుగు సార్లు కేంద్రాన్ని అభ్యర్థించింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 58 (బి) రూపేణ తగు సవరణ చేస్తే ఓటర్లకు విచ్చల విడిగా డబ్బులు పంచే సందర్భాలల్లో ఎన్నికల్ని వాయిదా వేయవచ్చు. లేదా రద్దు చేసేందుకు ఈసీకి అధికారం ఉంటుంది. కాని ఆ సవరణ అన్ని రాజకీయ పక్షాలకు ప్రతికూలంగా ఉంటుంది. కావున నేటికి జరగలేదు, భవిషత్‌లో జరగనివ్వవు.

పార్టీలన్ని అవినీతి అడుసులో ఈదులాడుతుంటూ పై చేయి చాటుకునేందుకు ఇష్టా రాజ్యంగా అడ్డదారులు తొక్కుతుంటే ఈసీ ఉద్ధరిస్తున్నదేంటి. పార్లమెంట్‌లో పార్టీల ఏకాభిప్రాయం లేనిదే ఎన్నికల సంస్కరణలు ముందుకుపోవు. అవినీతే ఆక్సీజన్‌గా బతుకుతున్న పార్టీలు సంస్కరణలను అమలు కానివ్వవు. పార్టీలన్నీ ఒక్కతాను ముక్కలేనన్న విషయాన్ని ఛేదించాల్సింది విజ్ఞులైన ఓటర్లే.

స్వతంత్ర ప్రతిపత్తిని దిగజార్చిన ఎన్నికల కమిషన్

భారతదేశంలో స్వతంత్ర ప్రతిపత్తిగల న్యాయ వ్యవస్థ తర్వాత ప్రజలు అత్యంత విశ్వసించే సంస్థ ఎన్నికల కమిషన్ మాత్రమే. ఈ కమిషన్ ఒత్తిళ్లకు, పెత్తనానికి లొంగని నిష్పాక్షిక స్వతంత్ర సంస్థగా నిలదొక్కుకోవాలని రాజ్యాంగ నిర్మాతలు అభిలషించారు. రాజ్యాంగంలో 324 అధికరణం ప్రకారం స్వేచ్ఛగా, సక్రమంగా, నిష్పక్షపాతంగా, విశ్వసనీయతతో, పారదర్శకంగా పార్లమెంటరీ ప్రజాస్వామిక ఎన్నికలు నిర్వహించడం కమిషన్ బాధ్యత. అసత్యాలు, అర్ధసత్యాలు, అసభ్య ప్రచారాలకు నేతలు తెగబడితే చట్టబద్ధంగా కట్టడి చేయాల్సిన ప్రాథమిక బాధ్యత కమిషన్‌కుంది. లేదంటే అది ముదిరి హింసను, నేరగ్రస్త రాజకీయాలను పెంపుచేసే ప్రమాదముందని భారత సర్వోన్నత న్యాయ స్థానం ఎన్నికల కమిషన్‌కు హెచ్చరికలతో కూడిన మార్గదర్శకాలను జారీ చేసింది.

ఎన్నికల సంఘానికున్న ప్రధాన అధికారాలు 1) ప్రతి ఏడాది పార్టీలు తమ ఆదాయ వ్యయాలను కమిషన్‌కు సమర్పించాలి. 2) ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తులు ఎన్నికలైన 90 రోజుల్లో ఖర్చులను కమిషన్‌కు లెక్క చెప్పాలి. 3) పోస్టర్లు, గోడమీద రాతలను నిషేధించి కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించాలి. 4) భారీ కటౌట్లు కియస్కు వివరాలను కమిషన్ అనుమతితో ప్రచురించాలి. 5) ఎన్నికల ప్రచారం వలన ప్రజల హక్కులకు, స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాలి. ఇందులో ఏ ఒక్క అధికారాన్ని కూడా ఈసీ అమలు చేయడం లేదు. ఇటీవలి కాలంలో అనేక సందర్భాల్లో ఎన్నికల సంఘం తన అస్థిత్వాన్ని కోల్పోయి ప్రధాన మంత్రి అభీష్టానికి అనుగుణంగా పక్షపాతంతో వ్యవహరించిన సంఘటనలు కళ్లముందున్నాయి. 2017లో హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల తేదీలను అక్టోబరర్ 12న ప్రకటించగా అదే సమయంలో జరగాల్సిన గుజరాత్ ఎన్నికలు రెండు వారాలు ఆలస్యంగా అక్టోబర్ 25న ప్రకటించింది. ఈ ఆలస్యానికి ఎలాంటి సాంకేతికమైన అవరోధాలు లేవు. కేవలం అధికార పార్టీకి లాభం చేకూర్చడానికే నన్నది బహిరంగ రహస్యం. ఎన్నికల కోడ్ గుజరాత్‌లో ఆలస్యంగా అమలు కావడానికే వాయిదా వేశారని తీవ్ర ఆరోపణలు వచ్చాయి.

2018లో ఢిల్లీలో 20 మంది ఆమ్ ఆద్మీ పార్టీ శాసన సభ్యులను అనర్హులుగా ప్రకటించడంతో ఎన్నికల సంఘం కనీస పద్ధతులను పాటించలేదు. దాని పర్యావసానంగా ఢిల్లీ హైకోర్టు వారి అనర్హతను రద్దు చేసింది. 2018 అక్టోబర్‌లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎన్నిక తేదీల ప్రకటనను కేవలం ప్రధాన మంత్రి సభలకు ఇబ్బంది కలగకుండా ఉండాలని కొన్ని గంటలు వాయిదా వేయడంతో ఈసీపై విమర్శలకు తావిచ్చాయి.

2019లో తమిళనాడులో తిరుపూరర్ ఉప ఎన్నికను సరైన కారణం చూపకుండా భారతీయ జనతా పార్టీ మిత్ర పక్షం ఎఐడిఎంకెకు ఇబ్బంది లేకుండా చేయడం కోసమేనన్న ఆరోపణలను మూటకట్టుకుంది. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల తేదీల ప్రకటనలో కూడా అధికార పార్టీ ప్రయోజనాలు పరిరక్షించుకోవడమేనన్న ఆరోపణలు బలంగా

వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేది అనంతరం మూడు వారాల వ్యవధిలో కేంద్ర ప్రభుత్వం 80కి పైగా భారీ పథకాలను ప్రకటించింది. వీటికితోడు మార్చ్ 4 నుండి 9 తేదీల మధ్య ప్రధాని ఆయన మంత్రులు 9 మెగా ప్రాజెక్టులకు సహితం శంకుస్థాపన చేశారు. ఈ ఆరోపణలు, అనుమానాల నేపథ్యంలో 66 మంది మాజీ బ్యూరోక్రాట్లు 5 పేజీల వివరణాత్మక లేఖను రాష్ట్రపతికి అందజేశారు. స్థూలంగా ఈ లేఖ సారాంశం ఎన్నికల కమిషన్ మోదీ ప్రభుత్వానికి మోకరిల్లిందని పేర్కొన్నారు. ఈ లేఖ తీవ్రత రాజకీయ విశ్లేషకుల్లో సహితం సంచలనం సృష్టించింది. కేంద్ర ఎన్నికల సంఘం బలహీనమైన, ఉదాసీనమైన వైఖరి వలన స్వతంత్ర ప్రతిపత్తిగల రాజ్యాంగ సంస్థ విశ్వసనీయతను పతనావస్థకు చేరడంపై ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఎన్నికల సంఘం నిజాయితీపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని తీవ్రంగా హెచ్చరించారు. రోజు రోజుకు ఎన్నికల సంఘం స్వతంత్రత, నిజాయితీ, నిష్పాక్షికత సమర్థతలో రాజీపడుతుందని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉండగా మార్చ్ 27న మిషన్ శక్తి (ఏ - శాట్) ప్రయోగంపై మోదీ ఎందుకు ఆర్భాటంగా ప్రకటించారు. నిజానికి అది డిఆర్‌డిఒ అధికారులు ప్రకటించాలి. ప్రధాని విడుదల చేసిన బయోపిక్‌పై ఎన్నికల సంఘం కనీస అభ్యంతరం చెప్పలేదు. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండగా మోదీ ఏ కామన్ మ్యాన్ జర్ని అనే 10 భాగాల వెబ్ సీరిస్ కేంద్రం అనుమతి లేకుండా ప్రారంభమైనా, నమో టీవి ఛానల్ పైనా ఎన్నికల సంఘం నిర్లక్ష్యం కనపరిచింది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో ఉన్నతాధికారులపై తుఫాను వేగంతో చర్యలు చేపట్టింది. కాని గుట్కా కుంభకోణంలో ప్రధాన నిందితుడైన తమిళనాడు డిజిపిని వదిలివేశారు.

గతంలో అనేక సంఘటనలతో నాలుగు దశాబ్దాల పాటు వెన్నెముక లేనిదిగా, అభాసుపాలైన కమిషన్ శేషన్ కాలంలో కమిషన్ స్ఫూర్తి పొందింది. పార్టీల విపరీత ధోరణులకు కమిషన్ ఎత్తిన కత్తిగా మారింది. పార్టీలు అభ్యర్థుల అతి పోకడలు అపభ్రంశ ధోరణులపై వేటు వేసింది. శేషన్ అధికారాలను కత్తిరించడమే ప్రధాన లక్ష్యంగా పాలక పార్టీలు త్రిసభ్య సంఘాన్ని ముందుకు తీసుకొచ్చాయి. దీంతో ఈ కమిషన్ అధికారాలను చతికిల పడేశారు. రాగద్వేష రహిత వ్యవహార సరళే మౌలిక ప్రాతిపదిక కావలసిన కమిషన్ కేంద్ర పెద్దల కనుసన్నలలోకి జారిపోయింది. ఎటు మొగ్గుచూపకుండా అన్ని పార్టీలకు సమదృష్టితో సమాన అవకాశాలను కల్పించడమన్నది ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశమే గతితప్పింది. ఈ క్రమం మరింత తలవంపులు తెచ్చినాయి. అధికార, విపక్ష స్థానాల్లో ఏ పార్టీలున్నప్పటికీ ప్రజల అభిమతం స్వేచ్ఛగా వెల్లడయ్యే వీలుండాలి. అధికారుల బదిలీల వెనుక రాజకీయ జోక్యాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండగా రకరకాల నిర్ణయాల మాటున పరోక్షంగా రాజకీయ ఒత్తిళ్లు రాజ్యాంగ విలువల్ని బలిపెడుతున్నాయి. ఎన్నికల సంఘం బాధ్యతాయుత, స్వతంత్ర, పారదర్శక, వ్యవహార శైలికి దోహదపడే సమగ్ర సంస్కరణలు చురుగ్గా జరిగితేనే ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ విశిష్టమైనదిగా ముందుకు పోతుంది.

విమర్శలు, ఆరోపణల అనంతరం కనీస అధికారాలను గుర్తించిన ఈసీ

రాజ్యాంగం తనకిచ్చిన అధికారాలేమిటో ఈసీకి తెలుసా, తాను రాజ్యాంగ ప్రతిపత్తి కలిగిన స్వతంత్ర సంస్థననే స్పృహ అయినా ఈసీకి ఉందా అని సుప్రీంకోర్టు నిలదీస్తున్న పరిస్థితుల్లో అశక్తురాలుగా ఉన్న ఈసీ అనేక ఆరోపణలు, విమర్శలు ముదిరి పాకానపడిన అనంతరం తనకున్న కనీస అధికారాలను గుర్తించింది. ఎన్నికల ప్రచారంలో అడ్డగోలుగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, బహుజన సమాజ్‌వాది పార్టీ అధినేత మాయవతితో పాటు సమాజ్‌వాది పార్టీ నేత ఆజంఖాన్, బిజెపి అభ్యర్థి మేనకా గాంధీలపై ఈసీ కొరడా ఝుళిపింది అని అనిపించుకుంది. ఎన్నికల ప్రచారం నిర్వహించకుండా తాత్కాలికంగా కొన్ని గంటలు నిషేధించింది. ఈసీ ఒక్కడుగు ముందుకేసి వారి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించి ప్రచారంలో అనుచితంగా ప్రవర్తించినందుకు వారిని అభిశంసించింది. ఎటువంటి బహిరంగ సభలు, ప్రదర్శనలు, రోడ్ షోలు, మీడియా సమావేశాలు నిర్వహించేందుకు వీల్లేకుండా నిషేధించింది. ఈ క్రమంలో ప్రధాని మోదీ పట్ల ఇంతే కఠినంగా ఎందుకు వ్యవహరించలేదని, ఇలాంటి ఉత్తర్వులను ఎందుకు జారీ చేయలేదనేది పలువురు ప్రశ్నిస్తున్నారు. సైనికుల పేరుతో ఓట్లు అడగవద్దని ప్రధానికి స్పష్టం చేసే దమ్ము ఈసీకి ఉన్నదా అని నిలదీస్తున్నారు.

నిఘా వ్యవస్థల తీరు మారాలి

డబ్బు పంపకం అంతర్గతంగా సాగుతుంది. దీన్ని అడ్డుకోవాలంటే ప్రజల్లో చైతన్యం పెరిగేలా కార్యక్రమాలు నిర్వహించాలి. డబ్బులు పంచడం, తీసుకోవడం రెండూ నేరాలుగా సమాజం గుర్తించే విధంగా అవగాహన కల్పించాలి. హత్యాయత్నాలు, భూ కబ్జాలు, వరకట్న వేధింపులు, గృహ హింస, దౌర్జన్యం, దళితులను కులం పేరుతో దూషించడం, మోసం, మారణాయుధాలతో అల్లర్లకు పాల్పడడం, మనీ లాండరింగ్‌తో పాటు అవినీతి కేసులున్న నేతలను ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకోవాలి. ఎంతైనా ఖర్చుపెట్టి ఎన్నికయితే చాలు అధికార పార్టీలోకి ఫిరాయించి మళ్లీ సంపాదించుకోవచ్చుననే ధోరణి ప్రబలుతుంది. అలాంటి వారిని అడ్డుకోవడానికి గెలిచిన అభ్యర్థులు పార్టీ మారిన వెంటనే వారి సభ్యత్వం సభాపతి సహా ఎవరి ప్రమేయం లేకుండా తక్షణం రద్దయిపోయేలా చట్టం రావాలి. పార్టీ మారాలంటే మళ్లీ తప్పనిసరిగా ఎన్నిక కావాల్సిందనే చట్టం తీసుకురావాలి.

ఈవిఎంలతో ఎన్నికల నిర్వహణకే ఈసీకి పట్టింపు ఎందుకు?

అనేక ఆరోపణల మధ్య ఎన్నికల కమిషన్ ఈవిఎంలతో ఎన్నికలు నిర్వహిస్తున్నది. దీనిపై వివిధ రాజకీయ పక్షాలు ఎన్నికల సంఘాన్ని నిలదీస్తూనే ఉన్నాయి. ప్రపంచంలో 25 దేశాల్లో మాత్రమే ఈవిఎంలను వినియోగిస్తున్నారు. మనదేశంలో 1982లో కేరళలో తొలిసారి ఈవిఎంలతో ఎన్నికలు జరిగాయి. 1982, 1983 ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో ఈవిఎంలను వాడారు. ఈ యంత్రాల పనితీరుపై పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించగా 1984 మే 5న ఈవిఎంల వినియోగాన్ని రద్దు చేసింది.

దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి 1988 డిసెంబర్‌లో సెక్షన్ 61-(ఎ) ద్వారా ప్రజా ప్రాతినిధ్య చట్టంలో ఈవిఎంల వాడకాన్ని తప్పనిసరి చేసింది. 1999, 2004లో వివిధ రాష్ట్రాల్లో శాసన సభకు జరిగిన ఎన్నికల్లో 2004, 2009, 2014 లోక్‌సభ ఎన్నికల్లోను ఈ యంత్రాలను వాడారు. ఈ క్రమంలో ఎవరికి ఓటు వేసినా ఒకే పార్టీకి వెళుతున్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో ఎవరికి ఓటు వేశారని తెలుసుకునేందుకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివి ప్యాట్) లను 2013లో సాంకేతికంగా అనుసంధానం చేశారు. దీనివలన తాను వేసిన ఓటు ఎవరికి పడిందనే విషయంలో అపోహలు లేకుండా నిర్ధారించుకునే అవకాశం ఓటర్లకు దొరికింది. ఇందులోనూ కొన్ని లోపాలున్నాయనే వాదన తాజాగా బలంగా వినిపిస్తుంది. వివి ప్యాట్ తెరపై ఏడు సెకన్ల పాటు కనిపించే గుర్తు ఆ తర్వాత చీటిపై ముద్రితమై కిందనున్న డబ్బాలో పడాలి. ఆ చీటీలు డబ్బాలో పడకపోతే ఈవిఎం, వివి ప్యాట్‌లలో నమోదైన ఓట్ల సంఖ్యతో తేడా వస్తుంది. అప్పుడు ఫలితాలపై సందిగ్ధత నెలకొంటుంది. వివి ప్యాట్ చీటి లెక్కింపు పైన రాజకీయ పార్టీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. సగం వివి ప్యాట్ చీటీలను లెక్కించాలని పార్టీలు డిమాండ్ చేస్తే మానవ వనరుల సమస్య వల్ల సాధ్యం కాదంటూ ఈసీ తిరస్కరించింది. ఈ అనుమానాలు కొనసాగింపుగా ఈవిఎంల ట్యాంపరింగ్ సహితం సాధ్యమేనంటూ కొందరు సాంకేతిక నిపుణులు ఆధారాలతో రుజువు చేస్తున్నారు. యంత్రంలోని ఒక చిన్న భాగాన్ని మార్చడం ద్వారా ఎక్కడ నుంచైనా చరవాణిని ఉపయోగించి పార్టీల వారీగా పడిన ఓట్లను తారుమారు చేయవచ్చునని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈవిఎంల నిర్వహణ అనుమానంగా మారి ఓటింగ్ ప్రక్రియపై అనేక అభ్యంతరాలు తలెత్తుతున్నందువల్లే పేపర్ బ్యాలెట్ వాడాలన్న డిమాండ్లు పోటెత్తుతున్నవి. అమెరికాతో పాటు సాంకేతిక రంగం అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలోనూ పేపర్ బ్యాలట్ పత్రాల విధానమే అమలవుతున్నందున భారతదేశంలోనూ అదే పద్ధతిని కొనసాగించాలని రాజకీయ పక్షాలు కోరుతున్న విషయాన్ని ఎన్నికల సంఘం నేటికైనా గమనించాల్సి ఉంది. ఈ క్రమంలో ఈసీ ఆచితూచి స్వతంత్ర నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

64 మంది కంటే ఎక్కువ నామినేషన్లుంటే పేపర్ బ్యాలెట్ ద్వారానే పోలింగ్

దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డుగా నిలిచిన నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నిక కేంద్ర ఎన్నికల సంఘానికి సవాలుగా మారింది. తమ సమస్యలు పాలకుల దృష్టికి తీసుకొచ్చేందుకు పసుపు, ఎర్రజొన్న రైతులు భారీగా నామినేషన్లు వేయడంతో మొత్తం 185 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 64 మంది అభ్యర్థులకు (నోటాతో కలిపి) మించి పోటీలో ఉంటే పేపల్ బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహించాలి. అయినప్పటికీ నిజామాబాద్‌లో మాత్రం దేశ చరిత్రలో తొలిసారిగా ఒక కంట్రోల్ యూనిట్‌కు 12 బ్యాలెట్ యూనిట్లు అనుసంధానం చేసి ఎన్నిక నిర్వహించింది. కమిషన్ ఈవిఎంలతోనే ఎన్నికలు నిర్వహించినామనే పంతం నెగ్గించుకోవడం కోసమే సుమారు 26 వేల యంత్రాలతో కోట్లు ఖర్చుచేసి నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికలు నిర్వహించింది. దీంతో తనకు విధించబడిన నిబంధనలకు, విధానాలకు తానే తూట్లు పొడిచినట్లయింది.

ముగింపు

ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలను దెబ్బతీస్తే దేశం బలహీనపడుతుంది. పార్టీలు, ప్రభుత్వాలు ఎన్నికలలో మారుతుంటాయి. కాని దేశ సార్వభౌమాధికారం కాపాడే సంస్థల స్వయం ప్రతిపత్తి అత్యంత కీలకం. ఎన్నికైన ప్రభుత్వం ఏదైనా ఈ సంస్థల ద్వారానే ప్రజలకు జవాబుదారి కావాల్సి ఉంటుంది. కాకపోతే ప్రభుత్వం ఏమి చేసినా విశ్లేషించేవాళ్లు, ప్రశ్నించేవాళ్లు లేకపోతే కాలక్రమేణా ప్రజాస్వామ్య విలువలు అంతరిస్తాయి. నిజమైన ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ప్రజల ఓటుతో ఎన్నికయ్యే ప్రభుత్వాలు చట్ట సభలు, జనం చెల్లించే పన్నులతో మనుగడ సాగిస్తాయి. ఈ సంస్థలు వారి అభ్యున్నతి కోసం మాత్రమే పనిచేయాలి. ఈ క్రమంలో ప్రజల్లో ఈసీ సంపూర్ణమైన విశ్వాసాన్ని నింపాలి. ఒకవేళ ఈసీపై ప్రజల్లో ఏమాత్రం నమ్మకం సడలినా మన ప్రజాస్వామ్య భవిష్యత్‌కు గొడ్డలిపెట్టు అవుతుంది. కావున ఈసీ పాత్ర అత్యంత కీలక.

లోక్‌సభ, రాజ్యసభలో 80 శాతం మంది కోటీశ్వరులని ఈసీకి సమర్పించిన అఫిడవిట్‌ల ద్వారా వెల్లడవుతుంది. ధన ప్రవాహం నిరోధానికి చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుంది. ఇప్పటి వరకు ధన ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలు ఫలితాలను ఇవ్వడం లేదు. వీటి స్థానంలో కఠినమైన చట్టాలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ ఉంటుంది.

రాజ్యాంగంలోని 324 అధికరణ ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిపే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానిదే. ఎన్నికల పర్యవేక్షణ మొదలు నియంత్రణ మార్గ నిర్దేశం అంతా ఈసీదే. ఈ అధికరణలో పేర్కొన్నట్లు ఎన్నికల విషయంలో సర్వాధికారాలు ఈసీకే ఉన్నాయి. ఒక అభ్యర్థిని అనర్హుడుగా ప్రకటించడం మొదలు పార్టీ గుర్తింపును రద్దు చేసేదాకా విస్తృత అధికారాలు ఈసీ చేతుల్లోనే ఉన్నాయి. ఫలానా ఉల్లంఘనకు ఫలానా చర్యలని నిర్దిష్టంగా చెప్పలేకపోయినా విశేషాధికారాలన్నీ ఈసీకే ఉన్నాయి. కాని నేటివరకు ఒకటి రెండు సందర్భాలు మినహా ఈసీ అసాధారణంగా తీసుకున్న నిర్ణయాలు చాలా తక్కువే. నిష్పాక్షికమైన నిర్ణయాలతో నిర్ద్వందగా వ్యవహరించడమే ఈసీ ముందున్న ప్రధాన కర్తవ్యం. అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తడమో, ప్రతిపక్షంలోని సన్నిహితుల స్వార్థానికో కొమ్ముకాసే విధానాలకు స్వస్తి చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజాస్వామ్య మనుగడకు తిరుగులేని కవచంగా ఈసీ నిలబడాల్సి ఉంది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఈసీ విధానాలను, విధులను గుర్తుచేయాల్సిన అవసరం మరొకసారి ఉత్పన్నమయ్యే పరిస్థితి రాకుండా చూసుకోవాల్సి ఉంది. తన దేగకళ్ల నడుమ నడువాల్సిన ఎన్నికలు గతితప్పే దుస్థితి ఈ దేశంలో రాకుండా ఉండాలంటే ఈసీ పక్షపాత రహిత దృష్టి సారించాల్సి ఉంటుంది.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ యూనివర్సిటీ) వీ

ప్రజల్ని మోసగిస్తున్న పార్టీలు - ఎన్నికల కమిషన్

ఎన్నికలు వచ్చిన ప్రతిసారి పార్టీలు ప్రజలను అబద్ధపు వాగ్దానాలతో మోసం చేస్తున్నాయనీ, రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ కూడా ప్రజల పక్షాన కాకుండా రాజకీయ పార్టీలకే వంత పాడుతోందనీ అంటున్నారు చిమ్మె జాన్ బర్నబాస్

భారత రాజ్యాంగ వ్యవస్థలో ఎన్నికల సంఘం (ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా) రాష్ట్రాల శాసనసభలకు, లోక్‌సభలకు ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహిస్తుంది. ఈ మొత్తం వ్యవహారంలో ఎన్నికల సంఘం పాత్ర చాలా గణనీయమైనది. కానీ ఎన్నికల సంఘం కేవలం నామమాత్రమైన ఎన్నికల నిర్వహణకు మాత్రమే ఉంది తప్ప రాజకీయ పార్టీలు చేస్తున్న డబ్బు పంపిణీ, అక్రమ చర్యలు, అబద్ధపు హామీలు, ఓటర్లను కులం పేరుమీద, మతం పేరుమీద, ప్రాంతం పేరుమీద ప్రలోభ పెట్టడం లాంటి చర్యలను అదుపు చేయలేని దుస్థితిలోనికి ఎన్నికల సంఘం నెట్టబడడం భారత ప్రజాస్వామిక వ్యవస్థకే పెద్ద మాయని మచ్చ. అంతే కాకుండా ప్రజలను అశక్తులనుగా, బిచ్చగాళ్లనుగా చూసే ప్రక్రియకు నాందీ ప్రస్థావనగా ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలను చూసీ చూడనట్లు వ్యవహరించడం, లెక్కకు మించిన ఖర్చును నియంత్రణ చేయులేకపోవడం ఒక పెద్ద లోపంగా భావించాలి. మొత్తం భారతదేశంలోని ఎన్నికలలో పాల్గొనే పార్టీలు ప్రజలలో వాటి పరపతిని, డబ్బు ఖర్చు చేయడం ద్వారానే 'ప్రజల దగ్గరకు చేరవచ్చు' అనే ఏకైక నినాదాన్ని చేపట్టినవి. ఇప్పుడున్న పరిస్థితులలో ఒక సామాన్య పౌరుడు (ఓటరు) ఒక కొత్త రాజకీయ నినాదంతో పార్టీ పెట్టి ఎన్నికలలో పాల్గొనే పరిస్థితి లేదు. లేకపోగా నవ్వులపాలయ్యే పరిస్థితి నెలకొనింది. అలాంటి వారిని పనిలేని వారిగా చూసే పరిస్థితి నెలకొనింది.

ఎన్నికల ప్రలోభాలలో వృద్ధాప్య పెన్షన్లు, రైతు రుణమాఫీ, చంద్రన్న బీమా, ఈ మధ్య కాలంలో తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి చనిపోయేంత వరకూ 'అన్నీ ప్రభుత్వమే చూసుకుంటుంది' అంటూ ప్రచారం. అనగా ప్రజల కష్టార్జితాన్ని, ఉన్న ఆస్తులను మరో రూపంలో మేము దోచుకో బోతున్నామంటూ ప్రత్యక్షంగానే ఎన్నికలలో పోటీ చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలు చెప్పకనే చెబుతున్నాయి. అంతే కాకుండా ప్రజలకు పరోక్షంగా జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే పరిస్థితులలో ప్రజలు లేకుండా వారిని మానసిక దౌర్భాగ్య స్థితికి నెట్టిపడి వేసే చర్యలను అధికారంలోకి రాబోతున్న పార్టీలు చేస్తున్నాయి. ఒక రకంగా ప్రజలను బానిసలుగా చూసే చర్యలు వేగంగా పుంజుకున్నాయి. భారతదేశంలో రాజ్యాంగ వ్యవస్థ కేవలం 'ఏకస్వామ్య వ్యవస్థ'గా మారే పరిస్థితులు వచ్చిపడ్డాయి.

తెలంగాణలో కెసిఆర్, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు లేదా జగన్, కేంద్రంలో నరేంద్రమోడీ లేదా రాహుల్ గాంధీ లాగా వ్యక్తిస్వామ్యం చెలామణి అవుతూ భారత ప్రజాస్వామిక వ్యవస్థ నియంతృత్వ పోకడలను సంతరించుకుంటూ ప్రజలను మరింత అణచివేసే చర్యలకు పూనుకోజూస్తున్నవి. ప్రజలు పెద్ద ప్రమాదంలో పడబోతున్నారు. తమ హక్కులను తాము అడగలేని స్థితికి నెట్టబడుతున్నారు. ప్రజలను తమ స్వశక్తితో జీవించడం నేర్పాల్సిన పాలకులు అధికారుల పైనా, అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల పైనా ఆధారపడి జీవించడాన్ని నేర్పిస్తున్నారు. ప్రజలకు చెందాల్సిన పథకం అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పితే గానీ అందే పరిస్థితి లేదు. చివరకు ప్రమాదంలో ఒక వ్యక్తి చనిపోతే శవానికి 'పోస్ట్‌మార్టమ్' చేయాల్సిన డాక్టర్ కూడా చంద్రన్న బీమాలో మీకు 5 లక్షలు వస్తవి కదా, నాకు 50 వేల రూపాయలు లంచం ఇస్తే గానీ పోస్ట్‌మార్టమ్ నిర్వహించనని పోయిన సంవత్సరం విజయవాడలో బహిరంగంగా డిమాండ్ చేస్తూ, కెమెరాల సాక్షిగా దొరికిపోయాడు. అంటే మానవతా విలువలు పతనమై ధనమే పరమావధిగా జీవించే పరిస్థితికి విద్యావంతులు దిగజారారని అర్థమవుతున్నది.

ఇప్పుడు దాదాపు ప్రతి రంగంలో ఇదే పరిస్థితి నెలకొన్నది. దీనికంతటికీ అధికారంలో ఉన్న రాజకీయ వ్యవస్థనే ప్రధాన కారణం. అవినీతిని కింది స్థాయి నుంచి ప్రోత్సహించే రాజకీయ వ్యవస్థ ఉన్నది కాబట్టి ఈ విధమైన పరిస్థితి నెలకొన్నది. దీనిని నివారించడానికి ప్రజలు పెద్ద ఎత్తున ప్రతిఘటించవలసి ఉన్నది. తమకు జరుగుతున్న అన్యాయాన్ని అడుగడుగునా ఎండగట్టవలసి ఉన్నది. కానీ ఆ విధంగా జరగడం లేదు. ఎక్కడో ఒకచోట అప్పుడప్పుడూ కొన్ని విషయాలు మీడియా ద్వారా బయటకు వస్తున్నాయి.

కేవలం డబ్బే పరమావధిగా బతికే వ్యక్తులు కోకొల్లలుగా ఉన్నారు. కనీసపు మానవతా విలువలు కూడా కొన్ని శాఖలలో పాటించడం లేదు. అందరికీ ఉచిత విద్య, వైద్యం, మంచినీరు ఇవ్వమనే రాజ్యాంగపు మౌలిక సూత్రాలను రాజకీయ పార్టీలు తమతమ ఎజెండాలో ఏనాడో మరిచిపోయాయి. దానికి బదులుగా 'కనీస ఆదాయ పథకం, ప్రధాన మంత్రి కిసాన్ యోజన, రైతుబంధు' వంటి పథకాలు పుట్టుకొచ్చాయి. ప్రజలకు చెందాల్సిన కష్టార్జితాన్ని మరో రూపంలో దోపిడీ చేసి (అనగా మద్యం తాగించడం ద్వారా లేదా పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, మధ్య దళారులను ప్రోత్సహిస్తూ గోడౌన్లలో ధాన్యాన్ని నింపుకుంటూ కొంతమంది వ్యక్తులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చుతూ, ప్రభుత్వమే వ్యాపారాన్ని ప్రోత్సహించడం) ప్రజల చైతన్యాన్ని, పోరాట పటిమను నీరుగార్చడం కూడా ఇప్పుడున్న రాజకీయ పార్టీలలో స్పష్టంగా కనిపిస్తున్నది. ఇదంతా దివాళాకోరు రాజకీయ వ్యవస్థగా చెప్పుకోవచ్చు.

విద్యావంతులు, మేధావులు, చాలా మంది మౌనం వహించడం,

వ్యవస్థను మౌనంతో సహించాలనే ధోరణి కూడా భావితరాలకు ప్రమాదం తలపెట్టే పరిస్థితి నెలకొన్నది. రాజ్యాంగ మౌలిక అంశాలకు జరగబోతున్న ప్రమాదంపై దేశ వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు జరగడం లేదు. జరిగిన వాటిలో కూడా కొన్ని రాజకీయ పార్టీలు తమకు 'ఓటు బ్యాంక్'గా మార్చుకోవాలనే తపన ఎక్కువగా కనబడుతున్నది తప్ప ప్రజా ప్రయోజనం కనబడడం లేదు.

ఇటీవల చంద్రబాబు నాయుడు, రాహుల్ గాంధీ, జగన్‌మోహన్ రెడ్డి, నరేంద్రమోడీ, కెసిఆర్‌లు తమతమ పథకాలను ప్రచారం చేసుకోవడం ద్వారా ఎన్నికలలో ఏదో ఒక విధంగా తిరిగి అధికారంలోకి రావాలనే తపన కనబడుతున్నది. ఇటీవల కాంగ్రెస్ ప్రకటించిన 'న్యాంటమ్ ఆయ్ యోజన' (ఎన్‌వైఎవై) పథకం కనీస ఆదాయ పథకం, ప్రతి పేద కుటుంబానికి ప్రతినెలా రు. 6 వేల నగదు వారి బ్యాంక్ ఖాతాలలో వేయడం, అంతేకాకుండా ప్రతి కుటుంబానికి అదనంగా రు. 6 వేల పని కల్పించడం ద్వారా మొత్తం రు. 12 వేలతో ప్రభుత్వం ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోబోతుందనే ప్రచారం చేస్తున్నారు. ఈ పథకాన్ని ఎలా అమలు చేస్తారు? ఈ పథకానికి లబ్దిదారుల ఎంపిక ఎలా జరుగుతుందనేది కూడా కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ సరైన అవగాహన లేనట్లుగా వారి ప్రకటనలతోనే తెలుస్తున్నది. అంటే కేవలం ఓట్లను రాబట్టాలనే జిజ్ఞాస, తపన తప్ప మరో కోణం కనిపించడం లేదు.

అదే విధంగా చంద్రబాబు నాయుడు నిరుద్యోగ భృతి కింద మూడు వేల రూపాయలు ప్రతి నిరుద్యోగికి ప్రతినెలా ఇస్తామనడం, వృద్ధాప్య ఫించను రు. 3 వేలు చేస్తామనడం, ప్రభుత్వంపై ఎంత భారం పడుతుందనే విషయం కూడా మరచి, తిరిగి ఏదో ఒకవిధమైన పన్నుల రూపంలో దీనిని వసూలు చేసుకోవచ్చనే కోరిక ఈ రాజకీయ పార్టీ నాయకులలో కనబడుతున్నది. ప్రభుత్వ ఆసుపత్రులలో యూజర్ చార్జీలు, ఎపిఎస్ ఆర్‌టిసి బస్సులలో యూజర్ చార్జీలు మునిసిపాలిటీలలో అత్యధిక పన్నులు (అది కూడా 6 నెలలకోసారి వసూలు చేయడం) వేయడం ద్వారా ప్రజల నుంచి బలవంతంగా, ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రజాసామ్య వ్యవస్థలో జీవిస్తున్నా ప్రశ్నించలేని పరిస్థితి నెలకొన్నది. మనకు జరుగుతున్న అన్యాయాన్ని దిగమింగుకుంటూ సహించడం తప్ప ఏమీ చేయలేని దుస్థితికి నేడు ప్రజలు నెట్టబడ్డారు.

ఎన్నికల కమిషన్ కూడా రాజకీయ పార్టీల హామీల పట్ల దృష్టి పెట్టడం లేదు. అది తమకు సంబంధించిన విషయం కాదన్నట్లు వ్యవహరిస్తున్నది. ఎన్నికల కమిషన్ చాలా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నది. ఇప్పుడున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరా పూర్తిగా బిజెపికి అనుకూలమైన మనిషి. అతను గుజరాత్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా పనిచేసే సమయంలో నరేంద్రమోడీ చెప్పినట్లు పనిచేసిన వ్యక్తి, ఆర్‌ఎస్‌ఎస్ వాది. అంతే కాకుండా బిజెపియేతర పక్షాలు ఏ ఫిర్యాదు చేసినప్పటికీ, రాజ్యాంగ ఉల్లంఘన జరిగే అంశాలు ఫిర్యాదు చేసినప్పటికీ 'చూస్తాం', 'చేద్దాం' అనే రెండు పదాలు తప్ప మరొకటి ఆయన నోటి నుంచి వినపడే పరిస్థితి లేదు. ఇది భారత ఎన్నికల సంఘం, ప్రధాన కమిషనర్ వైఖరి.

ఇక రాష్ట్రాల ఎన్నికల కమిషనర్ల గురించి చెప్పనక్కరలేదు. పూర్తిగా కేంద్ర ఎన్నికల సంఘాన్ని సంప్రదించే పరిస్థితి తప్ప, స్వంతగా నిర్ణయాలు తీసుకునే అధికారాలను ప్రదర్శించడం లేదు. రాష్ట్రంలో ఓటర్లను లక్షలలో తొలగించినప్పటికీ వాటి చేర్పులపై సరైన అవకాశం ఓటర్లకు ఇవ్వక పోవడంలోనే వారి వైఖరి కనబడుతున్నది. అధికారులే ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారనే ఫిర్యాదులను కూడా పట్టించుకోవడం లేదు. అధికారులకు జవాబుదారీతనం లేకుండా పోయింది. చాలా చోట్ల అధికారులు కూడా రాజకీయ పార్టీల కార్యకర్తల మాదిరిగా వ్యవహరిస్తున్నారు. ఈ అధికారి టిడిపికి అనుకూలం లేదా వైఎస్‌ఆర్‌సిపికి అనుకూలం అనే ధోరణి కనబడుతున్నది. ఎన్నికల సంఘం కూడా సరియైన విచారణ చేపట్టడం లేదు.

ఇటీవల తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే నెపంతో ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఇంటలిజెన్స్ డిజి అయిన ఎ.బి. వెంకటేశ్వర రావును బదిలీ చేస్తూ డిజిపి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనీల్ చంద్ర పునేశా స్థానంలో ఎల్.వి. సుబ్రహ్మణ్యంను నియమించారు. అనగా ఎన్నికల కమిషన్ ఒకవైపు ఫిర్యాదులకు మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నట్లు కనబడుతున్నది. ఇది కూడా రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుంది.

పోలింగ్ తేది సమీపిస్తున్న కొద్దీ ఓటర్లను మభ్యపెట్టడానికి మద్యం, నగదు, చీరలు, జాకెట్లు, వెండి కంకుమ డబ్బీలు విచ్చలవిడిగా పంపిణీ జరుగుతున్నా ఎన్నికల కమిషన్ అధికారులు ఏ రకమైన చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబర్ 1950 పనిచేయడం లేదు. ఏ రీతిగాను ఓటర్లను ప్రలోభపెట్టరాదని చట్టం స్పష్టంగా చెబుతున్నప్పటికీ అన్ని ఉచితంగా ఇస్తామంటూ రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు ప్రజలను ప్రభావితం చేసి, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించబడాలని రాజ్యాంగం మౌలిక స్వభావానికి విరుద్ధంగా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయంటూ సుప్రీంకోర్టు ఓ కేసులో వ్యాఖ్యానించింది.

వాగ్దానాలను అమలు చేయడానికి ప్రభుత్వాలకుండే ఆదాయ వనరులను ప్రజలకు స్పష్టం చేయలంటూ గతంలో అనేకమార్లు సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది (రాజకీయ పార్టీలను ప్రశ్నించాలని). ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 29 (ఎ) ప్రకారం రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ గుర్తింపు ఇస్తుంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 2 (ఎచ్) ప్రకారం 'పబ్లిక్ అథారిటీ' (ప్రజా అధికారి) కింద గుర్తించాలి. ఆ నిబంధన ప్రకారం రాజకీయ పార్టీలన్నింటికీ 'పౌర సమాచార అధికారి'ని నియమించుకొని ప్రజలకు వారు అడిగే సమాచారాన్ని బాధ్యతతో అందిచవలసి ఉంటుంది.

ఎన్నికల ఖర్చులను, ఆదాయ వనరులను, ఆదాయపు పన్ను చెల్లింపులను కూడా సమాచార హక్కు ద్వారా పొందవచ్చును. ప్రస్తుతం ఈ విషయంపై సుప్రీంకోర్టులో వ్యాజ్యం (పిఐఎల్) నడుస్తున్నది. ప్రజల రాజ్యాంగ ప్రాథమిక హక్కులో భాగమైన ఆర్టికల్ 14, 19, 21 ద్వారా పొందవలసిన హక్కులను కూడా వినియోగించుకోలేని పరిస్థితిలో నేడు భారత ప్రజలు ఉన్నారనేది సుస్పష్టం. ఏదైనా ప్రజల్లో చైతన్యం – పోరాటం ద్వారానే సాధ్యం.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు) వీ

చట్టసభలకు నేర చరితులా?

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎక్కువగా కోటీశ్వరులు, నేర చరిత్ర కలిగినవారే ఉన్నారనీ, వీరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తారే తప్ప ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించలేరనీ అంటున్నారు **షేక్ కరిముల్లా**

ఎన్నికల ముఖచిత్రంలో రానురాను చిత్రమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగానికి తగిన విద్యార్హతలతో పాటు మరిన్ని అర్హతలుండాలని నిర్ణయించి, నానా పరీక్షలు పెట్టిమరి అభ్యర్థులను ఫిల్టర్ చేసి సెలెక్ట్ చేసే ప్రభుత్వాలు చట్ట సభలకు ఎన్నికయ్యే రాజకీయ నాయకులకు తగిన విద్యార్హతలు నిర్ణయించకపోవడం దారుణం. ఎంఎల్ఎలు, ఎంపిలు, మంత్రులు, ప్రధానులు ప్రభుత్వ స్థాయిలో పాలన పరమైన కీలక నిర్ణయాలు చేయడంలో ప్రధాన పాత్ర వహిస్తారు. ఇటువంటి వారికి విద్యార్హతలు నిర్ణయించకపోవడం వలన దేశ ప్రగతి పూర్తిగా కుంటుపడుతుంది. ప్రజలకు చాలా నష్టం జరుగుతుంది. కనీసం ప్రమాణ స్వీకార పత్రం కూడా మాతృ భాషలో చదవలేనివారు కూడా చట్ట సభలకు ఎన్నిక అవుతున్నారు. అలాగే రౌడీలు, గూండాలు లాంటి నేర చరితులు చట్ట సభలకు పెద్ద సంఖ్యలో పోటీపడి ఎన్నికవుతున్నారు. చట్ట సభలల్లో ప్రజా సమస్యలు చర్చకు రావడం లేదు. పైగా సభల్లో వీరి ప్రవృత్తి ప్రదర్శిస్తూ గలాటాలు సృష్టిస్తున్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మణిపూర్‌లోని ఇంఫాల్‌లో విద్యార్థులతో సంభాషిస్తూ 'మోడీ మీ విద్యార్హతలు ఏంటి? ఆయన ఎప్పుడైనా యూనివర్సిటీకి వెళ్లారా?' అని ప్రశ్నిస్తూ 'మోడీ డిగ్రీ ఏమిటో తెలుసుకోవడానికి సమాచార హక్కు చట్టం కింద ధరఖాస్తు చేసినా సరైన జవాబు రాలేదు' అని వ్యాఖ్యానించారు. 130 కోట్ల మంది ప్రజలకు ప్రధానిగా ఉండే అభ్యర్థికి తగిన విద్యార్హతలు లేకుంటే ఇక ఈ దేశ పాలన ఎలా ఉంటుందో ఊహించవచ్చు.

అలాగే 2019 ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల నామినేషన్ ఘట్టం ముగిసిన పిదప ఎన్నికలలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల విద్యార్హతలు చూస్తే కొందరు అసలు చదువుకోని వారైతే... ఎలిమెంటరీ చదువుతో బడి మానేసిన వారున్నారు. మరి కొందరు పదో తరగతి వరకే చదివి ప్రజా క్షేత్రంలో దిగారు. వీరు చట్ట సభలకు ఎన్నికయి ప్రజలకు ఏం చేస్తారు? కాబట్టి ఎంఎల్ఎ, ఎంపిలుగా పోటీ చేసే వ్యక్తులకు తగిన విద్యార్హతలను నిర్ణయించాలి. మంచి విద్యార్హతలున్న వారే చట్ట సభలకు ఎన్నుకోబడే విధంగా చట్టం చేసి అమలు చేయాలి.

ఇక నేరచరితులకు కొదవేలేదు. నేడు దేశ రాజకీయాలు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోయాయి. సంపన్నులు, నేరస్తులు దేశ రాజకీయాలను శాసిస్తున్నారు. గత 16వ లోక్‌సభను విశ్లేషిస్తే 83 శాతం మంది ఎంపిలు కోటీశ్వరులే. 33 శాతం మంది ఎంపిలు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. అందులో బిజెపికి చెందినవారే అత్యధికులుగా ఉన్నారు. 521 మంది లోక్‌సభ సభ్యులను విశ్లేషించిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అనే సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. 2014 ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన 543 మంది సభ్యులకు గాను 521 మంది సభ్యుల అఫిడవిట్లను ఎడిఆర్ విశ్లేషించింది. వారిలో 430 (83 శాతం) మంది కోటీశ్వరులని తెలిపింది. అందులో 227 మంది బిజెపికి చెందినవారు ఉన్నారు. 37 మంది కాంగ్రెస్, 29 మంది అన్నా డిఎంకె సభ్యులున్నారు.

ఈ ఎన్నికల్లో గెలిచిన ఒక్కో సిట్టింగ్ సభ్యుని సగటు ఆస్తుల విలువ రు. 14.72 కోట్లుగా ఉంది. 32 మంది ఎంపిలు తమ ఆస్తులు రు. 50 కోట్లకు పైగా ఉన్నట్లు తెలిపారు. ఇద్దరు సభ్యులు మాత్రమే ఐదు లక్షల కంటే తక్కువ ఆస్తులున్నట్లు పేర్కొన్నారు. 33 శాతం మంది సిట్టింగ్ ఎంపిలు తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అఫిడవిట్లలో పేర్కొన్నారు. 106 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. అందులో హత్యల వంటి తీవ్రాతి తీవ్రమైన కేసులు కూడా ఉన్నాయి. హత్యా యత్నాలు, మతపరమైన హింసకు సంబంధించిన కేసులు, మహిళలపై అత్యాచారాలు, అపహరణల కేసులు కూడా నమోదు అయ్యాయి. 10 మంది సిట్టింగ్ ఎంపిలపై హత్యల కేసులు కూడా ఉన్నాయి. అందులో ప్రధాన పార్టీల సభ్యులు ఉన్నారు. 14 మంది సిట్టింగ్ ఎంపిలపై మతోన్మాద హింసకు సంబంధించిన కేసులు ఉన్నాయి. అందులో 10 మంది బిజెపికి చెందినవారు కాగా, టిఆర్ఎస్, ఎంఐఎం, పిఎంకె, ఎఐయుడిఎఫ్‌కు చెందినవారు ఒక్కొక్కరు ఉన్నారని పై సంస్థ అధ్యయనంలో తేలింది.

ఇక ఆంధ్ర రాష్ట్రం విషయానికి వస్తే చట్ట సభలకు పెద్ద సంఖ్యలో నేరచరితులు పోటీపడుతున్న విషయం స్పష్టమైంది. నామినేషన్ల ఘట్టం ముగిసినాక పరిశీలిస్తే... ఉత్తరాంధ్ర మినహా మిగిలిన 10 జిల్లాల్లోని టిడిపి, వైసిపికి చెందిన దాదాపు 100 మందికి పైగా అభ్యర్థులపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వైసిపి అధినేత జగన్ తనపై 31 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆ తర్వాత దెందులూరు టిడిపి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌పై 26 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల నామినేషన్లలో భాగంగా ఆయన సమర్పించిన 47 పేజీల అఫిడవిట్‌లో 18 పేజీలు ఈ కేసులకు సంబంధించిన వివరాలు ఉన్నాయి. ఈ కేసులపై విచారణ సాగుతుంది. కేసు నెం. సిసి 768-14కు సంబంధించి భీమడోలు కోర్టులో రెండేళ్ల జైలు శిక్ష, రు. 1000 జరిమానా పడింది. దీనిపై హైకోర్టులో అప్పీలు చేసుకోవడంతో విచారణ కొనసాగుతుంది. జగ్గయ్యపేట వైసిపి అభ్యర్థి సామినేని ఉదయభానుపై 18, చంద్రగిరి వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిపై 16, రాయదుర్గం టిడిపి అభ్యర్థి దీపక్‌రెడ్డిపై 7 కేసులు,

ఇటీవలే వైసిపిలోకి వచ్చిన చీరాల వైసిపి అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్‌పై 15 క్రిమినల్ కేసులున్నాయి. ఇంకా 3–5 కేసులు ఉన్నవారు చాలా మందే ఉన్నారు. ఇది ఇలా ఉంటే కొసమెరుపు ఏంటంటే ఇటీవల రాజకీయ నాయకులపై నమోదైన క్రిమినల్ కేసులను ఎత్తివేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, ప్రజా జీవనానికి భంగం కలిగించడం తదితర అనేక సెక్షన్లపై గతంలో తెలుగుదేశం నాయకులపై నమోదైన కేసులను చంద్రబాబు ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ కేసుల ఎత్తివేతపై ఫోరం ఫర్ గుడ్ గవర్నన్స్ అనే సంస్థ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దర్యాప్తుకు ఆదేశించాలని కోరింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులతో సహా ఎన్నికల సమయానికి నమోదైన కేసులు వేటిని ఉపసంహరించకూడదని, చట్ట ప్రకారమే ఆ కేసులకు ముగింపు ఉంటుందని, 2009 లోనే కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని, ఐనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 21 మంది ప్రజా ప్రతినిధులపై ఉన్న అనేక కేసులను ఉపసంహరించడం నిబంధనలకు విరుద్ధమని సంస్థ వివరిస్తూ, ఈ విషయాన్ని తాము ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లామని, సంస్థ అధ్యక్షుడు హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రెడ్డెప్పరెడ్డి పేర్కొన్నారు. అలాగే ఎన్నికల కేసులు కూడా నానాటికి పెరిగిపోతున్నాయి. ఈ కేసులు ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉంటూ అటు పోలీస్ యంత్రాంగానికి, ఇటు కోర్టులకు సవాల్‌గా మారుతున్నాయి.

2014లో జరిగిన 16వ సార్వత్రిక ఎన్నికల సమయంలో నమోదైన కేసులు ఇప్పటికీ అనేకం పెండింగ్‌లోనే ఉన్నాయి. నమోదైన కేసుల్లో శిక్ష పడినవారి శాతం కూడా తక్కువగా ఉండడంతో ఎన్నికల నేరాలకు పాల్పడేవారి సంఖ్య ప్రతి ఎన్నికల్లో పెరిగిపోతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. గత ఎన్నికల సమయంలో ఆంధ్ర రాష్ట్రంలో 3283 కేసులు నమోదయ్యాయి. వీటిలో నగదు రవాణా, మద్యం అక్రమ సరఫరా, డబ్బు పంపిణీ, కొట్లాటలు, బెదిరింపులు వంటివి ఉన్నాయి. 2864 కేసుల్లో పోలీసులు చార్జిషీట్ నమోదు చేయగా, 625 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. 325 కేసులు ఇంకా విచారణ దశలోనే ఉండగా, 1909 కేసుల్లో నిందితులు బయటపడ్డారు. మరో ఐదు కేసులు ఇంకా పోలీసుల దర్యాప్తులోనే ఉండడం విశేషం. ఇది 'ప్రజాస్వామిక' ఎన్నికల తంతూ బాగోతం. అభ్యర్థుల నేర చరిత్రకు సంబంధించిన కేసులో తమ ఆదేశాలను ఉల్లంఘించినందుకు సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నేర చరిత్రను ఎన్నికల కమిషన్‌కు తెలపాలని, పత్రికలు, టివీలు, వెబ్ సైట్లలో ప్రచురించాలని సుప్రీంకోర్టు 2018 సెప్టెంబర్ 25న తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పును అమలు చేయకపోవడంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఉత్తరాది రాష్ట్రాల చరిత్ర కూడా దీనికి భిన్నంగా ఏమీలేదు. యుపి, బీహార్ లాంటి రాష్ట్రాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మత మారణ హోమాలు, (2002 గుజరాత్) మందీర్, మసీదు అంటూ మత కల్లోలాలు సృష్టించిన నేరగాళ్లు నేడు చట్ట సభల్లో కొలువుతీరి రాజ్యాన్ని ఏలుతున్నారు. పైకి పెద్ద మనుషులు కాని వారి స్వభావం ప్రవృత్తి మొత్తం నేరమయం. రాజకీయాలు పూర్తిగా విషమయం. ఈ రాజకీయాలు, ఎన్నికల వలన ప్రజలకు ఎంతనష్టం జరగాలో అంతనష్టం జరిగిపోతుంది. ఈ పరిస్థితులను చూస్తున్న మేధావి వర్గాలు ఈ ఎన్నికల వ్యవస్థకు దూరంగా ఉంటున్నారు. అసలు ఓటు కూడా వేయడం లేదు.

రాజకీయ పార్టీలు ప్రజల్ని ఎన్నో ప్రలోభాలకు గురిచేస్తున్న రాను రాను ఓటింగ్ శాతం పడిపోతూ ఉంది. ఇటీవల 2017 ఏప్రిల్ 9న కశ్మీర్‌లోని శ్రీనగర్ పార్లమెంట్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలలో 7.24 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. కొద్దిగా ఆలోచించగలిగే వారు సైతం ఎన్నికల రాజకీయాలను అసహ్యించుకుంటున్నారు. ఎన్నికలపై ప్రజలకు భ్రమలు తిన్నగా వీడిపోతున్నాయి. ఈ పరిస్థితిని ఎలాగైనా మార్చాలని ఎన్నికల కమిషన్ తిప్పలు పడుతూ ఉంది. 2014 ఎన్నికల సమయంలో నోటాను తెచ్చింది. ఈ ఎన్నికల్లో ఓటింగ్ సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక గంట పెంచింది. ఎలాగైనా ఓటింగ్ శాతం పెంచాలని కమిషన్ ప్రయత్నం. మొత్తంగా ఎన్నికల ప్రక్రియ ఒక తంతులాగా మారిపోయింది తప్ప, నిజంగా ప్రజల ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చేదిగా లేదని చరిత్ర నిరూపించింది. ప్రస్తుత ఎన్నికల పార్టీలు ఏవి కూడా ప్రజల విశ్వసనీయతను, ఆమోదాన్ని పొందలేక పోయాయి.

ఈ 70 ఏళ్లలో ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడంలో పార్టీలు పూర్తిగా విఫలమైనాయి. ఏ పార్టీ ప్రణాళిక కూడా ప్రజల ప్రధాన అవసరాల గురించి మాట్లాడడం లేదు. భూ సంస్కరణలు, వనరుల పునఃపంపిణీ గూర్చి ప్రస్తావించడం లేదు. ప్రజల జీవించే హక్కు గురించి మాట్లాడలేదు. విద్య, ఉపాధి ఆరోగ్యం లాంటి సమస్యలు పరిష్కరించకపోగా ఇవి ఇంకా జటిలమౌతున్నాయి. ఈ దేశంలోని ప్రజలు ఆకలి చావులు చస్తున్నారు. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలు వ్యక్తులను, పార్టీలను మారుస్తాయే గాని, ప్రజల జీవితాలను మార్చవని ప్రజలు తెలుసుకోవాలి. ఇకనైనా వ్యవస్థ స్వరూపాన్ని ప్రజా ఉద్యమాల ద్వారానే మార్చుకోవాలి. తద్వారా నవభారతాన్ని నిర్మించుకోవాలి. ఆ రోజులు త్వరగా రావాలని ఆశిస్తూ...!

(రచయిత సామాజిక విశ్లేషకులు) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.*

నిజామాబాద్‌లో రైతాంగ నిరసన

పాలకుల వైఫల్యాలను వెల్లడిస్తూ దేశంలో అనేక రూపాల్లో రైతాంగ ఉద్యమాలు ముందుకు వచ్చాయనీ, నిజామాబాద్ పార్లమెంట్‌కు రైతాంగం పోటీపడడం కూడా ఆ నిరసన ప్రకటనలో భాగమేననీ అంటున్నారు **వంగాల సంపత్ రెడ్డి**

స్వాతంత్య్రం వచ్చినప్పటి నుండి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం రైతాంగాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. అయినా భారత రైతాంగం నిరంతరం తమ సమస్యలను నెరవేర్చుకునే దిశగా ఉద్యమిస్తూనే ఉంది.

తమ సమస్యల సాధన కోసం తెలంగాణ రైతాంగం సాయుధ పోరాటాన్ని నడిపింది. నాయకత్వ ద్రోహం వల్ల రైతాంగం ఆ పోరాటాన్ని నిలిపివేయవలసివచ్చింది. దున్నేవానిదే భూమి అని నినదించి నక్సల్బరీలో రైతాంగం తిరుగబడితే ఆ రైతాంగ పోరాటాన్ని రక్తపుటేరుల్లో ముంచారు. శ్రీకాకుళంలో రైతాంగం సాయుధ పోరాటాన్ని నిర్మిస్తే అమానుషంగా అణచివేశారు. కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగం నక్సల్బరీ వెలుగులో సాయుధులైతే కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి తీవ్ర నిర్బంధాన్ని పాలక వర్గాలు ప్రయోగించాయి.

ప్రపంచబ్యాంక్ దళారీగా ఉన్న చంద్రబాబు పాలనలో రైతాంగం తీవ్ర అప్పులకు లోనయి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆ సమయంలో తమ సమస్యలను ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సాధించుకోవచ్చని తెలంగాణ రైతాంగం భావించింది. తెలంగాణ ఉద్యమంలో ముందు భాగాన నిలిచి తెలంగాణ రైతాంగం పోరాడింది. ఆశ్చర్యమేమిటంటే తెలంగాణ వచ్చిన తరువాత కూడా తెలంగాణ రైతాంగం పట్ల తెలంగాణ ఉద్యమ నాయకత్వం గత పాలకుల కంటే భిన్నంగా ప్రవర్తించలేదు.

తెలంగాణ వచ్చిన కొత్తలో రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడితే ఆత్మహత్యలను నివారించే దిశగా పాలకవర్గం ఏమాత్రం ప్రయత్నించ లేదు. ఎనుమాముల మార్కెట్‌లో రాత్రికి రాత్రే వ్యాపారులు ధరలను తగ్గిస్తే రైతాంగం ఆందోళన చేసింది. ఆ సందర్భంలో రైతాంగానికి బాసటగా నిలవాల్సిన పాలకర్గం వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరించింది. ఆందోళన చేసిన రైతాంగం వెనుక ఎవరున్నారని ఆరా తీసింది. రైతాంగం మీద కేసులు పెట్టింది. కాని రాత్రికి రాత్రి ధరలు ఎందుకు తగ్గాయో మాత్రం విచారించలేదు.

ఖమ్మం మార్కెట్‌లో పంటకు సరియైన ధర కల్పించాలని రైతాంగం అందోళన చేస్తే ఆ ఆందోళనలో పాల్గొన్న రైతులకు బేడీలు వేసి అరెస్టు చేసింది. రైతాంగానికి సహాయంగా నిలబడడానికి ప్రయత్నించిన బుద్ధిజీవులను బెదిరించింది. తెలంగాణ వచ్చిన తరువాత కూడా రైతాంగం జీవితంలో పెనుమార్పులు సంభవించలేదు.

పంట పండించి, గిట్టుబాటు ధరలేక రైతులు అప్పుల పాలవుతున్నారు. పంట పండక పోయినా రైతులు అప్పుల పాలవుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే పంట పండించినా, పండించకపోయినా రైతు అప్పుల పాలవుతున్న విచిత్ర దృశ్యం తెలంగాణలో ఉంది.

ఇలాంటి సందర్భంలో నిజామాబాద్ రైతులు తమ డిమాండ్లను ముందు పెట్టి గత రెండు నెలలకు పైగా పసుపు, ఎర్రజొన్నల గిట్టుబాటు ధరకోసం ఉద్యమిస్తున్నారు. వారు ఉద్యమిస్తున్న కాలంలోనే పార్లమెంటు ఎన్నికలు వచ్చాయి. అందువల్ల తమ సమస్యను దేశం దృష్టికి తీసుకురావడానికి నిజామాబాద్ జిల్లా రైతులు నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో నామినేషన్లు వేశారు. నలుగురు నామినేషన్లు ఉపసంహరించు కోగా మరికొంతమందివి తిరస్కరణకు గురికాగా లోక్‌సభ ఎన్నికలలో 178 మంది రైతులు ఎన్నికల బరిలో మిగిలారు.

తాము రైతులకు రైతుబంధు పథకం తెచ్చామనీ, రైతు భీమాను అమలుపరుస్తున్నామనీ, అయినా కొందరు ప్రజా వ్యతిరేకులు రైతులను రెచ్చగొట్టి నామినేషన్లు వేయించారనీ పాలకవర్గం ఆరోపించింది. రైతులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుని తెలంగాణ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చింది. పాలక వర్గం పిలుపుకు స్పందించని రైతులు ఎన్నికల బరిలో నిలబడ్డారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిలబడ్డారు. నిజామాబాద్ ఎన్నికను వాయిదా వేయించే ఉద్దేశంతో నామినేషన్లను వేయించారని ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పాలకవర్గం వాదించింది. అంతేకాకుండా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక జరగాలని ప్రతిపక్షం చేసిన కుట్ర ఫలితమే ఈ నామినేషన్లని పాలకవర్గం ప్రచారం చేసింది. చివరకు పాలకవర్గం కోరుకున్నట్టుగానే ఎన్నిక వాయిదా పడలేదు. అంతేకాకుండా ఇవిఎంల ద్వారానే ఎన్నిక జరిగింది.

రైతులు గెలవకపోవచ్చు. కాని తెలంగాణ రైతాంగం ఏ స్థితిలో ఉన్నదో ప్రపంచానికి చాటి చెప్పడానికి ఈ ఎన్నిక ఉపయోగపడింది. బంగారు తెలంగాణ డొల్లతనాన్ని బట్టబయలు చేసింది. మేడిపండు ప్రజాస్వామ్యం ప్రజలకు ఎంత జవాబుదారీగా ఉన్నదో తేటతెల్లం చేసింది. ఇంతకాలం రాజ్యం పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసమేనని అనుకునేవారు. అనుకోవడం కాదు అది నిజమని నిర్ధారించింది ఈ ఎన్నిక.

ప్రజా అకాంక్షలను పాలకులు నెరవేర్చనపుడు, నెరవేర్చడంలో అలసత్వం ప్రదర్శించినపుడు ప్రజలు పోరాటాలను ఆశ్రయిస్తారు. ఆ పోరాటాలు సాయుధ పోరాటాలా, కాదా అనేది వారే నిర్ణయించు కుంటారు. అప్పటి సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతుల మీద ఏ పోరాటమనేది ప్రజలు నిర్ణయించుకుంటారు.

ఇప్పుడు నిజామాబాద్ రైతులు పసుపు, ఎర్ర జొన్నలకు సరియైన గిట్టుబాటు ధరలను సాధించడం కోసం ఎన్నికల పోరాటాన్ని ఎన్నుకున్నారు. సూక్ష్మంగా పరిశీలిస్తే ఎన్నికలు పోరాట రూపం కాకపోవచ్చు. కాని ఇప్పుడున్న పరిస్థితిలో తమ నిరసనను ప్రకటించ డానికి నిజామాబాద్ రైతులు ఈ ఎన్నికను ఉపయోగించు కున్నారని చెప్పడం ఇప్పటికి సబబు.

(రచయిత అధ్యాపకుడు) వీ

భాజపా మళ్లీ అధికారానికొస్తే...

ఈ ఎన్నికల్లో గెలిచి భారతీయ జనతా పార్టీ మళ్లీ అధికారం చేపడితే సమాజంలో, రాజకీయాలలో, ఆర్థిక వ్యవస్థలో రానున్న మార్పుల గురించి హెచ్చరిస్తున్నారు **మితాలీ అగ్రవాల్**

ప్రస్తుత లోకసభ ఎన్నికల తర్వాత భారతీయ జనతా పార్టీ మళ్లీ అధికారానికి రావచ్చునేమో అనే అనుమానమే భారత ప్రజానీకంలో అత్యధికులలో భయోత్పాతాన్ని కలిగిస్తున్నది. గత ఐదు సంవత్సరాల పాలనలో ముస్లింల మీద, దళితుల మీద పెచ్చరిల్లిన హింస, భిన్నాభిప్రాయాల మీద, పౌర హక్కుల మీద ఉక్కుపాదం, పెరిగిపోయిన నిరుద్యోగం, అతి తక్కువ ఆర్థికాభివృద్ధి, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలు వగైరా పరిణామాలే ఈ భయానికి కారణం.

ఈ భయాలకు ఆజ్యం పోస్తున్నట్టుగా భారతీయ జనతా పార్టీ నాయకులు రానున్న పాలనా కాలంలో తమ పార్టీ విధానాలు భారత ప్రజాస్వామ్యాన్ని ఎలా మార్చబోతున్నాయో ఇటీవల కొన్ని సూచనలు వదులుతున్నారు. ఆ సూచనల ఆధారంగా, వారు తిరిగి అధికారంలోకి వస్తే ఏమి జరగనున్నదో ప్రధానమైన ఆరు పరిణామాలను ఇక్కడ పరిశీలిస్తున్నాం.

ఇక ఎన్నికలంటూ ఉండవు

మమ్మల్ని ముందుగా హెచ్చరించలేదు అని మీరు అనకుండా ఉండడానికి ఉన్నావ్ కు చెందిన భాజపా పార్లమెంటు సభ్యుడు సాక్షి మహరాజ్ గత నెలలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ, ప్రధానమంత్రి మోడీ తిరిగి ఎన్నికైతే భారత ప్రజాస్వామ్యంలో 2019 ఎన్నికలే ఆఖరి ఎన్నికలవుతాయని సగర్వంగా ప్రకటించాడు. తనను తాను సన్యాసిగా చెప్పుకునే ఆ కాషాయ దుస్తుల రాజకీయ నాయకుడు దేశంలో హిందువులలో జాగరణ వచ్చిందని అన్నాడు. "హిందూ జాగ్ గయా హై (హిందువులు మేల్కొన్నారు)" అంటూ "ఈ 2019 ఎన్నికల తర్వాత 2024లో ఎన్నికలనేవి ఉండవు" అని జోడించాడు.

ఇవేవో బుర్ర లేని వాగుడుకాయ మాటలు అని కొట్టేస్తారో ఏమో అని స్వయంగా పార్టీ అధ్యక్షుడు అమిత్ షా నే రంగంలోకి దిగి, వచ్చే యాభై ఏళ్ళ వరకూ భారతీయ జనతా పార్టీనే అధికారంలో ఉంటుందని ప్రకటించాడు. "మేం ఐదేళ్ల కొరకో, పదేళ్ల కొరకో అధికారం లోకి రాలేదు. కనీసం యాభై ఏళ్ల కొరకు అధికారం లోకి వచ్చాం. అధికారం అనే సాధనం ద్వారా రానున్న 40-50 ఏళ్లలో దేశంలో ప్రధానమైన మార్పులు తీసుకురావాలనే నిబద్ధతతో మేం ముందుకు పోతున్నాం" అన్నాడు.

రాజ్యాంగానికి వీడ్కోలు

భారతీయ జనతా పార్టీకి చెందిన మహారాష్ట్ర మంత్రి, బీడ్ లోకసభ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఆ పార్టీ అభ్యర్థి పంకజ్ ముండే ఈ వారం ఒక ఎన్నికల సభలో మాట్లాడుతూ, "ఇది జిల్లా పరిషత్ ఎన్నిక కాదు, లోకసభ ఎన్నిక. మహానుభావుడు డా. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారు. మనమిప్పుడు ఆ రాజ్యాంగాన్ని మార్చవలసి ఉంది. కొన్ని కొత్త బిల్లులు తేవలసి ఉంది, కొన్ని మార్పులు తేవలసి ఉంది" అన్నారు.

ఆమె ఆ మాటలంటున్నప్పుడు ఆమె మనసులో ఉన్న మార్పులు ఏమై ఉంటాయా అని మీరు ఆలోచిస్తున్నట్టయితే, భాజపాకు సైద్ధాంతిక గురువు, మాతృమూర్తి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భారతదేశాన్ని 'హిందూ రాష్ట్ర' గా మార్చదలచుకున్నదని గుర్తు ఉంచుకోండి. రాజ్యాంగ విలువల పట్ల వారి లెక్కలేనితనానికీ హిందూ జాతీయవాదం గురించి భాజపా చేసే గంభీర ప్రకటనలకూ పోలిక గుర్తించండి.

కేంద్ర ప్రభుత్వంలో నైపుణ్యాల అభివృద్ధి శాఖ మంత్రి అనంత్ కుమార్ హెగ్డే కూడ రాజ్యాంగం నుంచి 'లౌకిక' పదం తొలగించడం గురించి ఒక సూచన వదిలాడు. "రాజ్యాంగం లౌకిక రాజ్యం అంటున్నదనీ, అందువల్ల దాన్ని అంగీకరించక తప్పదనీ కొందరు అంటున్నారు. మేం రాజ్యాంగాన్ని గౌరవిస్తాం. కాని రాజ్యాంగాన్ని ఇప్పటికే ఎన్నో సార్లు మార్చారు. భవిష్యత్తులో కూడ మారుస్తారు. మేం రాజ్యాంగాన్ని మార్చడానికే ఉన్నాం. మేం తప్పనిసరిగా మారుస్తాం" అని ఆయన అన్నాడు.

మరొకసారి పెద్దనోట్ల రద్దు

ప్రధానమంత్రి మోడీ 2016 నవంబర్ 8న రు. 500, రు. 1000 నోట్లను రద్దు చేశాడు. ఆ చర్య వల్ల జరిగిన భయానక దుష్పరిణామాలలో ఒకానొకటిగా భారత ప్రజానీకం గంటలకొద్దీ బ్యాంకుల ముందరా, ఎటిఎంల ముందరా పడిగాపులు పడవలసి వచ్చింది. ఆ చర్య భారత దేశపు అసంఘటిత రంగ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిందనీ, లక్షలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించిందనీ, దాదాపు 100 మంది మరణాలకు ప్రత్యక్షంగా దారి తీసిందనీ ఎన్నో నివేదికలు చెపుతున్నాయి.

నల్లధనం నిర్మూలించడానికి ఆ చర్య ఉపయోగపడదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టంగా చెప్పినప్పటికీ ఆ చర్య తీసుకోవాలనే నిర్ణయం జరిగింది. నిజంగానే, రిజర్వ్ బ్యాంక్ చెప్పినట్టుగానే రద్దు చేసిన పెద్ద నోట్లలో 99.3 శాతం బ్యాంకులకు తిరిగి వచ్చాయి.

అయినా ఆ విధానం విఫలమయిందని అంగీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. పెద్ద నోట్ల రద్దు తర్వాత భాజపా అధినేత అమిత్ షా పెద్ద ఎత్తున కరెన్సీ నోట్ల మార్పిడి వ్యవహారం సాగించాడని, కమిషన్ మీద నల్లధనాన్ని మార్పిడి చేశారని, అందులో అత్యున్నత ప్రభుత్వాధికారులకు సంబంధం ఉందని ఆరోపణలు ఉన్నాయి.

అసలు పెద్దనోట్ల రద్దు ఉద్దేశం ఏమిటి? ఎవరికీ తెలియదు. దేశంలో నల్లధనాన్ని నిర్మూలించడానికే ఆ చర్య తీసుకున్నామని కేంద్ర మంత్రి సురేష్ ప్రభు గత నెలలో మరొకసారి ప్రకటించాడు. "ఈ పెద్దనోట్ల రద్దు అనేది నల్లధనాన్ని అదుపులో పెట్టడానికి తీసుకున్న చర్యల్లో ఒకటి. అటువంటి చర్య మరొకటి అవసరమా అనేది మీకు చెప్పదలచుకోలేదు" అని ఆయన అన్నాడు.

భారతీయ జనతా పార్టీ గనుక మళ్లీ అధికారానికి వచ్చి ఈ విధానాన్ని మరొకసారి అమలు జరిపితే, అది ఉత్పాతానికి దారి తీస్తుంది తప్ప ఆశ్చర్యమేమీ కాదు.

మళ్లీ బాల్య వివాహాలు

భారత సమాజంలోని దురాచారాలను పునరుద్ధరించాలనే తన కోరికను భారతీయ జనతా పార్టీ ఎన్నోసార్లు వ్యక్తీకరించింది.

మధ్య ప్రదేశ్ లో 2018 ఎన్నికలకు ముందు శాసనసభ్యుడుగా ఉండిన భాజపా నాయకుడు గోపాల్ పర్మార్ బాల్య వివాహాల నిషేధ చట్టం గురించి మాట్లాడుతూ అది "పద్దెనిమిదేళ్ల రోగం" అన్నాడు. అది లవ్ జిహాద్ కు దారి తీస్తుందన్నాడు. మతాచారాల కోసం బాలికల వ్యక్తిత్వాన్నీ ఆరోగ్యాన్నీ పణంగా పెట్టవచ్చునన్నాడు.

"పాతరోజుల్లో, కుటుంబ పెద్దలు తమ పిల్లలకు బాల్యంలోనే పెళ్లిళ్లు కుదిర్చేవారు. ఆ సంబంధాలు చిరకాలం స్థిరంగా ఉండేవి" అంటూ ఆయన, "ఇప్పుడిక ప్రభుత్వం పద్దెనిమిదేళ్లు నిండాలనే రోగం మొదలు పెట్టింది గదా, ఎంతో మంది అమ్మాయిలు లవ్ జిహాద్ ప్రేమ మైకంలో పడి లేచిపోవడం మొదలుపెట్టారు" అని కలిపాడు.

ఆయన ఇప్పుడు శాసన నిర్మాణ అధికారంలో లేడు గాని, మరొక ఎన్నికైన భాజపా శాసన సభ్యురాలు, బాల్య వివాహాల మీద పోలీసులు ఏ చర్యా తీసుకోకుండా చూస్తాననే హామీ మీదనే గెలిచింది.

రాజస్తాన్ లోని పాలి నియోజకవర్గంలో పోటీ చేస్తూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా శోభా చౌహాన్, "మీ ప్రాంతంలో బాలికల వివాహాలు జరుగుతున్నప్పుడు పోలీసులు వస్తారు. పెళ్లిని ఆపడానికి ప్రయత్నిస్తారు. అయితే ఇప్పుడు మన అదృష్టం కొద్దీ రాజకీయ, నిర్మాణ పరమైన అధికారం మన చేతుల్లోనే ఉంది. పోలీసుల అడ్డంకుల సంగతి నేను చూసుకుంటాను. ఒకవేళ అది నా పరిధికి మించిన పని అయితే పై వాళ్లతో కూడ మాట్లాడి ఏమీ జరగకుండా చూస్తాను. ఇక ముందు, బాల్య వివాహాలు జరిగితే మీ ఇంటికి పోలీసులు రారు. నా హామీ," అని అంది.

ఎన్నికల్లో ఆమె గెలిచింది. స్త్రీలూ, చిన్నారి ఆడపిల్లలూ ఓడిపోయారు.

పౌరులను బృందాలుగా విడగొట్టడం

భారత రాజ్యాంగం గురించి అద్భుతమైన విషయాలలో ఒకటేమిటంటే అది లింగ, భాష, కుల, మతాలకు అతీతంగా సమానత్వ హక్కుకు హామీ ఇస్తుంది. ఈ విభేదాల ఆధారంగా మనుషుల మధ్య వివక్ష చూపగూడదని రాజ్యంపై ఆంక్ష విధిస్తుంది. అయితే, ఈ రాజ్యాంగ లక్షణం భారతీయ జనతా పార్టీకి రుచిస్తున్నట్టు లేదు.

పిలిభిత్ లో ఒక సభలో ప్రసంగిస్తూ కేంద్ర మంత్రి మనేకా గాంధీ, ముస్లింలు తనకు వోటు వేసినా వేయకపోయినా తాను గెలవబోతున్నానని ప్రకటించింది. ఒకవేళ వాళ్లు తనకు వోటు వేయకపోతే తాను వాళ్లకు ఉద్యోగాలు ఇవ్వబోనని కూడ ఆమె కలిపింది. మోడీ ప్రభుత్వంలో ఏదో మిగిలినవాళ్లందరికీ ఉద్యోగాలు వచ్చినట్టు!!

మరొక సభలో ఆమె మరింత వివరంగా మాట్లాడుతూ, తాము భాజపాకు ఎంతమంది వోటు వేశారనే ప్రాతిపదికన గ్రామాలను ఎలా విభజించబోతున్నామో కూడ చెప్పింది. ఒక గ్రామంలో భాజపాకు 80 శాతం కన్న ఎక్కువ వోట్లు పడితే అది ఎ గ్రేడ్ గ్రామం. అరవై శాతం పడితే బి గ్రేడ్, యాభై శాతం పడితే సి గ్రేడ్, మిగిలినవన్నీ డి గ్రేడ్ గ్రామాలు.

ఈ లెక్క ప్రకారమే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు మంజూరు చేస్తామని కూడ ఆమె అన్నారు.

జాతిపర ప్రక్షాళన లేదా జాతి హననం

ఇదేదో ఊరికే చూపుతున్న బూచి కాదు. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కేంద్ర స్థాయిలో పౌరసత్వ (సవరణ) బిల్లు 2016 ను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకుంది. అది ప్రాథమికంగా ముస్లింల పట్ల, ఇతర మతాల వారి పట్ల వివక్ష చూపే చట్టం. ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి వలస వచ్చిన "చట్టవ్యతిరేక వలసదారులకు" వారు హిందూ, సిఖ్, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్తులైతే పౌరసత్వం కట్టబెట్టడానికి ఉద్దేశించిన చట్టం అది. అదృష్టవశాత్తూ ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందలేదు. ప్రస్తుతం అమలులో ఉన్న పౌరసత్వ చట్టం 1955 లోని "చట్టవ్యతిరేక వలసదారులు" అనే మాటకు నిర్వచనం, కొత్తగా భాజపా తేదలచుకున్న చట్టం లాగ ముస్లింలను మినహాయించలేదు.

అస్సాంలో అమలులోకి తెచ్చిన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ (ఎన్ ఆర్ సి) రూపొందిన తీరులోనే భాషా పరమైన, మత పరమైన, నరజాతి పరమైన వివక్ష చూపడానికి అవకాశం ఉందని ఇప్పటికే ఎందరో చూపారు. మొట్టమొదటి ఎన్ ఆర్ సి ముసాయిదాలో దాదాపు నలభై లక్షల మంది ప్రజల పేర్లు నమోదు చేయకుండా మినహాయించారు. వీరిలో అత్యధికులు అస్సాంలో తరతరాలుగా జీవిస్తున్నారు. కాని వారు 1971కి ముందు నుంచే అక్కడ నివసిస్తున్నారని రుజువు చేసుకునే అధికారిక పత్రాలు వారిదగ్గర లేవు.

ఇటువంటి నరజాతి పరమైన, మత పరమైన, భాషా పరమైన అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ఈ ప్రజల గురించి అమిత్ షా "చొరబాటుదారులు", "చెదపురుగులు" అని వ్యాఖ్యానించాడు. ఈ మాటలు సరిగ్గా యూదుల గురించి అడాల్ఫ్ హిట్లర్ అన్న "బొద్దింకలు" అన్న మాటతో సమానంగా ఉండడం వల్ల అమిత్ షా హిట్లర్ అడుగుజాడల్లో నడుస్తున్నాడని స్పష్టమవుతున్నది. ఇక హిట్లర్ మరొక అడుగు ముందుకు వేసి కనీసం అరవై లక్షల మంది యూదులను ఊచకోత కోసి, మరెంతో మందిని చంపిన యుద్ధం మొదలుపెట్టాడు.

తాము అధికారంలోకి తిరిగిరాగానే మొత్తం దేశంలో ఎన్ ఆర్ సి ని అమలులోకి తెస్తామని, తద్వారా మొత్తం దేశంలోనే బౌద్ధులు, హిందువులు, సిక్కులు తప్ప మిగిలిన "ప్రతి ఒక్క వలసదారు"నూ తొలగిస్తామని అమిత్ షా ఇటీవల అన్నాడు.

సర్జికల్ దాడుల రాజకీయాలు

***కశ్మీర్ ప్రజల రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, వారిని అడుగడుగునా అణచివేస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం పాకిస్తాన్ బూచి చూపి బిజెపి తిరిగి అధికారంలోకి రావడానికి చూస్తోందని అంటున్నారు* బైరెడ్డి సతీష్**

అవును అంతా అనుకున్నట్టే, అనుమానించినట్టే అయింది. దేశంలో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కడో అమాయకుల నెత్తుటి కుంపట్లతో ఓట్ల చలి కాచుకుంటారేమో అని అనుకున్నట్టే అయింది. ఫిబ్రవరి14 ఆత్మాహుతి దాడిలో దేశంలోని బడుగుజీవుల బిడ్డలు బతుకు దెరువు కోసం బందూకులు పట్టుకొని ఎముకలు కొరికే చలిలో సరిహద్దుల్లో సంచరిస్తున్న వేళ నెత్తుటి ముద్దలై నెలరాలి పోయారు. ఈ సంఘటన దేశంలో ఏదో మూలన జరిగి ఉంటే శత్రు బూచి చూపించ డానికి, మార్కెట్‌లోకి దేశభక్తి సరుకును పారించడానికి వీలయ్యేది కాదు. చీమ చిటుక్కుమన్న తుపాకులు గర్జించే కశ్మీర్‌లో క్వింటాళ్ల కొద్దీ ఆర్‌డిఎక్స్‌ను వాహనంలో తీసుకెళ్లి సైనిక వాహనాలను ఢీకొట్టే దాకా ఓట్ల కలలు కంటూ కళ్లు మూసుకుంది మోడీ ప్రభుత్వం. తునాతునకలైన జవాన్ల దేహాలను పదే పదే ప్రదర్శించి నెత్తుటి మరకలైనా ఆరకముందే ఓట్ల వేటకు ఉపక్రమించింది దేశభక్తుల పరివార్ ప్రభుత్వం. దేశం దేశమంతా వీథుల్లోకి వచ్చి తమ దేశభక్తిని బహిరంగంగా చాటుకోవాల్సి వచ్చింది. పాకిస్తాన్ ముర్దాబాద్ అని పలకని వాళ్ల దేశభక్తి శంకించడం మొదలయ్యింది. దాడి జరిగిన కొన్ని గంటల్లోనే దేశమంతటా ఉన్న సాధారణ కశ్మీరీల పైన ఉగ్రవాద ముద్ర వేసి భౌతిక దాడులకు తెగబడింది సంఘ పరివార్. అనేక విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న కశ్మీరీ విద్యార్థులపై భయానక దాడులతో యూనివర్సిటీ హాస్టళ్ల నుండి గెంటి వేసింది. కశ్మీర్ నుండి ఇతర రాష్ట్రాలకు పర్యటనకు వెళ్లిన వారిపై, వ్యాపారస్తులపై ఈ దాడులు కొనసాగినవి. కశ్మీరీల వస్తూత్పత్తులను బహిష్కరించి ఆర్థిక దిగ్బంధనానికి గురిచేయాలని కూడా పిలుపునిచ్చారు.

మరోవైపు కశ్మీర్ భారత దేశంలో అంతర్భాగం అంటూ అనునిత్యం రొమ్ము విరుచుకొనే జాతీయవాదులకు మరి కశ్మీరీలు 'భారతీయులు'గా ఎందుకు కనిపించలేదో? బహుశా వారు ప్రచారం చేస్తున్నట్టు వారంతా పరాయివాళ్లు కావడం వల్లనేమో! అక్కడి వారంతా ఓ మతం వారని వారందరిని ఉగ్రవాదులంటే తప్ప, వారి నుండి దేశ భద్రతకు ముప్పు పొంచి ఉన్నదని పచ్చిగా ప్రచారం చేస్తే తప్ప మెజార్టీ మత ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టలేం. ఓట్లను కొల్లగొట్టలేం! దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం ద్వారా ప్రజల జీవితాల్లో భద్రతను పెంచడం కంటే పొరుగు, శత్రు దేశం బూచి చూపెట్టి అభద్రతను రగిలించి నేనుంటే తప్ప భద్రత లేదని మోడీ దేశమంతా తిరుగుతున్నాడు.

సిఆర్‌పిఎఫ్ జవాన్ల పై దాడి జరిగిన నేపథ్యంలో అఖిల పక్ష రాజకీయ పార్టీల మీటింగ్‌కి రాకుండానే తన పార్టీ మీటింగ్‌తో ఎన్నికలకు

భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రణాళిక కూడ దేశవ్యాప్త ఎన్ ఆర్ సి అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అమిత్ షా మాటల్లో ముస్లింలు, క్రైస్తవులు, ఇతర మత అల్ప సంఖ్యాక వర్గాలు అనే మాటలు వాడకుండా జాగ్రత్త పడ్డాడు. కాని ఆ మాటల అసలు అర్థం భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం మత ప్రాతిపదిక మీద వివక్ష పాటిస్తుందనే. రాజ్యాంగంలో లౌకిక వాదం ఉంది గనుక ఇటువంటి చర్యను రాజ్యాంగం ఆమోదించదని మీరనుకుంటే పైన చెప్పిన రాజ్యాంగాన్నే రద్దు చేసే ఆలోచన చూడండి. ఒకవేళ ఆ ప్రభుత్వం అలా చేస్తే దాన్ని తర్వాతి ఎన్నికల్లో ఓడించగలమని మీరు భ్రమ పడుతున్నట్టయితే, అసలు ఎన్నికలే ఉండవనే ఆలోచన చూడండి.

మైనారిటీలకు, ముఖ్యంగా ముస్లింలకు, క్రైస్తవులకు వ్యతిరేకంగా విద్వేష పూరిత హింసా ఘటనలు ఈ పాలనలో విపరీతంగా పెరిగిపోయాయి. మత మైనారిటీల వీ ంద హింస అమలు చేసినవారిని, వేధించినవారిని ఈ రాజ్యం సత్కరించింది కూడ. ఈ ప్రభుత్వం హంతకులను ఎలా రక్షించిందో హ్యూమన్ రైట్స్ వాచ్ నివేదిక విస్పష్టంగా తెలియజేసింది.

భారతీయ జనతా పార్టీ తన ఉద్దేశాలను చాల స్పష్టంగానే బయట పెట్టింది. మైనారిటీల హక్కులు రద్దు చేస్తామనీ, వారిని దేశం నుంచి వెళ్లగొడతామనీ బెదిరించడం, వారి మీద హింస ప్రయోగించడం ప్రపంచ చరిత్రలో ఇదే మొదటిసారి కాదు. మయన్మార్ లో రోహింగ్యాలు, జర్మనీలో, యూరప్ లోని ఇతర ప్రాంతాల్లో యూదులు, బోస్నియాలో ముస్లింలు, క్రోట్ లు, క్రోయేషియాలో సెర్బ్ లు, రువాండాలో టుట్సీలు మానవజాతి చరిత్రలోకెల్లా దారుణమైన హింసలు అనుభవించినవారే. ప్రపంచ పటం కూడ చూడనక్కరలేదు, మన దేశంలోనే ముస్లింలకు, క్రైస్తవులకు వ్యతిరేకంగా జరిగిన ఎన్నో మత కల్లోలాలను గుర్తు తెచ్చుకోవచ్చు.

భారత దేశపు మత మైనారిటీలకు ఎటువంటి బీభత్స ప్రమాదం రానున్నదో మీకింకా అర్థం కానట్టయితే, ఒక్క నిమిషం కోసం మీరు వారైనట్టుగా ఊహించుకోండి. మీ మొత్తం జీవితం, మీ భవిష్యత్తు, మీ కుటుంబ భవిష్యత్తు అంతా కూడ కేవలం ఎప్పుడో యాభై అరవై ఏళ్ల కిందటి అధికారిక పత్రాలు చూపడం అనే సన్నని ఆధారం మీద ఆధారపడి ఉంటే, మీ వెన్నులో చలి పాకదా?

(రచయిత వెబ్ పత్రికలలో వార్తాకథనాలు, వ్యాసాలు రాస్తారు)

(https://newscentral24x7.com సౌజన్యంతో) వీ

సమాయత్తమయ్యే పనిలో పడ్డాడు. దేశమంతా ఓ భయానక వాతావరణం సృష్టించి, భావోద్వేగాలను తారా స్థాయికి తీసుకెళ్లి 15 రోజుల తర్వాత పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించామని ప్రకటించారు. 300 మంది 'టెర్రరిస్టు'లను హతమార్చి, శత్రువుకు వణుకు పుట్టించాం అని తనకు వంతపాడే 'దేశభక్తి' మీడియా ద్వారా మొత్తం దేశమంతా ప్రచార హోరెత్తించారు. మన వాయుసేన సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసొచ్చిందని, టెర్రరిస్టు శిక్షణా స్థావరాలన్ని నేలమట్టం అయినాయని జబ్బ చరుచుకొని ప్రకటించారు మోడీ.

అసలే ఓట్ల సీజన్ కదా అన్ని పార్టీలు పోటీపడి మరీ దేశభక్తిని చాటుకోవడానికి అనేక రూపాల్లో దేశమంతా ప్రదర్శనలిచ్చాయి. దీంట్లో మోడీ గొప్పతనం ఏమి లేదని ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించి వాయు సేనలు వీరోచితంగా శత్రుదేశ శక్తులతో పోరాటం చేశారని ప్రశంసల జడి వానను కురిపించారు పాలకులు. దేశ ప్రయోజనాలతో రాజకీయం చేయొద్దంటూనే అన్ని పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రాకులాడినయి. మొత్తంగా ఒక యుద్ధ వాతావరణాన్ని సృష్టించి దేశభక్తి ముసుగులో రాజకీయ లబ్ధి పొందే వికృత క్రీడలో మొదట బిజెపి ఉంటే ఆ వెనకాలే అన్ని పార్టీలు క్యూ కట్టినయి.

ప్రధాని నోటివెంట ప్రతీకార భాష, దేశమంతా ఆయన అనుయాయులది అదే మాట. శాంతి చర్చలు, సయోధ్య, సుహృద్భావ చర్యలు వంటి పదాలు పలకడమే నేరమైంది. ఓ రకంగా అవన్నీ నిషిద్ధ విషయాలు! భారత్ మాతాకి జై అనకుండా, పాకిస్తాన్ ముర్దాబాద్ అనకుండా మౌనంగా కూర్చున్నా దేశభక్తులు సహించని స్థితి. ఘటన గురించి తప్ప దాని చారిత్రక నేపథ్యం, అటువంటి అనివార్య స్థితికి నెట్టబడుతున్న కశ్మీర్ యువతరం గురించి మాట్లాడడం అంటే యుద్ధ నేరం కన్నా ఘోరమైనది.

నిజంగా సర్జికల్ స్ట్రైక్స్ జరిగాయా? వాళ్లు గొప్పగా ప్రకటించుకున్నట్టు 300 మంది టెర్రరిస్టులు బాలాకోట్ పర్వత ప్రాంతాల్లో ఉన్న శిక్షణా శిబిరాలపై జరిగిన దాడిలో హతమయ్యారా అనే ప్రశ్నలు బయటకు చెప్పడం కాదు కదా మన మదిలో అవి మెదులుతున్నాయంటేనే దేశ ద్రోహ ముద్రలు ముఖాన చెక్కబడుతాయి! 'శతృ' దేశం సైనికులు చిక్కినా ఏవో యుద్ధ సూత్రాల ప్రకారం వదిలి వేస్తారేమో కానీ ఇలాంటి ప్రశ్నలు వేస్తే నడి వీధుల్లో 'దేశభక్తులు' శిక్షను అమలు చేస్తారు. ఇక్కడ లాజిక్‌లు, రీజనింగులకు చోటుండదు.

నిజానికి ఆ ప్రాంతాలన్నీ పర్వత ప్రాంతాలని, జన సంచారం పెద్దగా లేదని విమానాలు కురిపించిన బాంబుల చప్పుళ్లు వినిపించాయని అయితే పెద్దమొత్తంలో చనిపోయిన ఆనవాళ్లు కానీ, విధ్వంసపు గుర్తులు ఏవి లేవని అంతర్జాతీయ వార్తా సంస్థలు రాయిటర్, అల్ జజీరా, న్యూయార్క్ టైమ్స్ పరిశోధనాత్మక కథనాలను వెలువరించాయి. వాటిలో విశ్వసనీయత ఎంత ఉన్నప్పటికీ ఆ కథనాలను ఉటంకించే సాహసం కూడా చేయలేని గంభీర వాతావరణాన్ని దేశమంతా సృష్టించారు.

ఇక సంఘ పరివార్ అంతర్జాల శక్తులు సామాజిక మాధ్యమాల్లో చనిపోయిన టెర్రరిస్టుల మృతదేహాల కుప్పలంటూ గల్ఫ్ యుద్ధంలో చనిపోయిన వారి ఫొటోలను గుప్పించారు. సర్జికల్ స్ట్రైక్స్‌లో పాల్గొన్న యుద్ధ విమానాలకు దాడి జరిగి తిరుగు ప్రయాణం చేసే క్రమంలో అక్కడ జరిగిన దాడులకు సంబంధించిన ఫొటోలు కూడా తీయగల్గె సాంకేతిక పారిజ్ఞానం కూడా ఉన్న ప్రభుత్వం మాత్రం అలాంటి ఊసే ఎత్త లేదు, అడిగే సాహసం ఏ పార్టీ చేయలేదనుకోండి.

అడగడం మన సైనిక దళాల యుద్ధ పాటవాన్ని ప్రశ్నించినట్టు, శంకించినట్టు అవుతుంది కదా మరీ! యుద్ధ సమయంలోనే కాదు, యుద్ధ వాతావరణాన్ని సృష్టించే క్రమంలో మొట్ట మొదట సంహరించబడేది సత్యమే. వీథుల్లో రాజకీయ వేదికలపైన దేశభక్తి ప్రదర్శనా పరీక్షలు పెద్ద ఎత్తున జరుతున్నాయి. దిక్కుమొక్కులేని జనానికి ఏనాడు ఏమీ చేయని 'సెలబ్రిటీ'లంతా పోటీపడి చనిపోయిన జవాన్ల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామని, పిల్లల్ని చదివిస్తామని ప్రకటిస్తున్నారు. దేశభక్తి ప్రదర్శన కదా!

మరోవైపు మీడియా సంస్థలన్నీ తమ దేశభక్తి ప్రదర్శన అన్నట్టు స్టూడియోలలో 'ప్రతీకార యుద్ధాని'కి ప్రజల్ని సన్నద్ధం చేసినవి. 'శతృ' దేశాన్ని పదే పదే చూపెడుతూ ప్రజల మెదళ్లలో పాకిస్తాన్ పట్ల ద్వేష భావనని నింపివేసినవి. సత్యానికి, న్యాయానికి సంబంధం లేకుండా దేశభక్తికి, జాతీయ భావనకి మాత్రమే కట్టుబడి వీథుల్లో వీరంగం ఆడుతున్న వీర దేశభక్తులుగా తమకు తాము చెప్పుకునే మతోన్మాదుల వికృత చేష్టలను టిఆర్‌పి కోసం పోటీపడీ మరీ చూపించాయి. ప్రభుత్వంలో ఉన్న పార్టీపెద్దలు చెప్పిన ప్రతిదాన్ని, తీసుకునే ప్రతిచర్య దేశ ప్రయోజనాల కోసమే, భద్రత కోసమే అన్నట్టు అత్యుత్సాహం ప్రదర్శించాయి. రిటైర్డ్ ఆర్మీ అధికారులు, పోటీలు పడే పార్టీల ప్రతినిధులు, మధ్యలో సోకాల్డ్ సెలబ్రిటీలు, భద్రతా విశ్లేషకులు, వేడెక్కించే కామెంట్స్ చేసే మత పీఠాల పెద్దల్ని తప్ప మరెవర్ని ఈ చానెల్స్ చర్చలకు పిలిచిన దాఖలాలు లేవు.

ప్రతీకార భాష మాట్లాడుతున్న పాలకుల నిర్ణయాలు సాహసోపేతమైనవని, వారి చర్యలన్నింటికి సమ్మతి తెచ్చే పనికి పత్రికలు చానెళ్లు పూనుకున్నాయి. అదేకాలంలో దేశంలో అంతర్గతంగా అనేక జీవన్మరణ సమస్యలు ఉన్నా అశేష ప్రజానీకపు గుండె చప్పుళ్లను వినే మూడ్‌లో లేవు మీడియా సంస్థలు. ఘటన చుట్టూ చర్చలను తిప్పుతూ ఇన్‌స్టంట్ న్యాయం కావాలన్నట్టు పాకులాడాయి. పాలక వర్గాలు ప్రతీకారం అన్నప్పుడల్లా అంతకు రెండింతలు గొంతుతో మీడియా మొత్తుకుంటది. సమస్య ఏదో పాలకవర్గాలు వైరుధ్యం కాదన్నట్టుగా మొత్తం రెండు దేశాల మధ్య వైషమ్యంగా చిత్రీకరించే, బయటికి ప్రదర్శించే వైఖరినే తీసుకున్నది మీడియా.

అయితే దేశంలో సృష్టించబడిన యుద్ధ వాతావరణాన్ని తన వ్యాపార ప్రయోజనాలకనుగుణంగా మార్చుకునే ఒక వర్గం మీడియా కూడా ఉన్నది. ఎంతోకొంత నిజాయితీగా ఉండే మరో వర్గం మీడియాను తమ గొంతునే దేశం గొంతుగా వినిపించకపోతే అధికార బలంతో తమ గుప్పిట్లోకి తీసుకునే ప్రయత్నాన్ని బలంగా చేస్తున్నది. ఇటువంటి భావోద్వేగాలు తారాస్థాయికి తీసుకెళ్లిన సందర్భంలో అయితే బ్లాక్ మెయిల్ చేసి మరీ తమ 'దారి'కి తెచ్చుకుంటున్నాయి.

మొత్తంగా మీడియా అర్థవంతమైన, ప్రయోజనకరమైన, వాస్తవమైన ప్రశ్నల్ని పాలకుల్ని అడగడం మామూలుగానే మరిచిపోయింది మరీ ఇటువంటి సమయంలో మరింతగా పక్కన పెడుతుంది. కార్పొరేట్ కనుసన్నల్లో, కార్పొరేట్ గుప్పిట్లో ఉన్నపుడు ఇంతకంటే భిన్నంగా ఎలా ఉండగలదు?

దేశమంతా అభినందన్ 'సాహసా'నికి అభినందనలు తెలుపుతుంది, పాలకులు ప్రతీకారం అన్నారు. సర్జికల్ స్ట్రైక్స్ మోతలో పాకిస్తాన్ వెన్ను విరిచామని గెలుపు నినాదాల హెూరులో కశ్మీర్ లోయలోని గాయపడిన హృదయాల ఘోషను ఆలకించేదెవరు? ప్రపంచంలో పాలస్తీనా తరువాత అత్యంత నిర్బంధాన్ని చవిచూస్తున్నది కశ్మీరీలే! అత్యంత సైనికీకరణకు గురైనది కూడా కశ్మీరే!

సంఘ పరివార్ పాలకులకు ఇజ్రాయిల్ మోసాద్ సంస్థ ఆదర్శం. పచ్చి అరబ్బు విద్వేషి అయిన బెంజిమెన్ నెతన్యాహు మోడీకి అనుసరనీయుడు ఫలితంగానే నిత్యం నెత్తురోడుతున్నది కశ్మీర్. పదిలక్షల మంది సైనికులతో ప్రతి వీధిన తుపాకుల పహారాలో, అడుగడుగునా అనుమానపు కళ్లతో సంచరించే సైనిక బెటాలియన్ నీడలో కశ్మీరీలు కాలం వెళ్లదీస్తున్నారు. కశ్మీర్ భారత మాత నుదుటి తిలకం అని ఛాతి విరుచుకునే సంఘ పరివార్ బిజెపి పాలనలో గతంలో ఎన్నడూ లేని హింసను కశ్మీర్ అనుభవిస్తున్నది. ఏదో ఒక మూలన ఎన్‌కౌంటర్ పేరుతోనో, కస్టోడీయల్ డెత్ పేరుతోనే నిత్య చావుల మధ్య కశ్మీరీలు కాలం గడుపుతున్నారు. పరాయి దేశం నుండీ వచ్చి కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు, దేశ విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడుతున్నారని నిత్యం వాదించే బిజెపికి గడచిన ఐదు సంవత్సరాల కాలంలో స్థానిక కశ్మీర్ యువత అన్ని హక్కులనీ కోల్పోయి, నిత్యం అమలవుతున్న హింస, అణచివేతలను భరించలేక మిలిటెంట్ ఉద్యమాల్లోకి వెళ్లడాన్ని బయటకు రానివ్వడం లేదు. సైనిక దళాలు ప్రత్యేక అధికారాల పేరుతో ఏం చేసినా చెల్లుబాటయ్యేలా, సైన్యం ఎంత వికృత చర్యలకు పాల్పడినా విచ్చలవిడి హింసకు తెగబడ్డా పాలకులు స్వేచ్ఛా హస్తాన్నే అందించారు. ఓటు రాజకీయాలు మాత్రమే నడిపే పాలక పార్టీలకు కశ్మీరీల స్వయం నిర్ణయాధికార ఉద్యమం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, రాజకీయ హక్కులు, జీవించే హక్కులపై చారిత్రక, ప్రజాస్వామిక దృష్టి లేకుండా కశ్మీర్ కేంద్రంగా పాకిస్తాన్‌ని తీవ్రంగా నిందించడం, 'శత్రు' దేశంగా చూడడం ప్రాతిపాదికనే దేశభక్తిని నిర్వచించుకుంటున్నారు.

బిజెపి అయితే రాజ్యాంగం కల్పించిన రక్షణలు అయిన 35ఎ, 370 ఆర్టికల్లని రద్దు చేస్తామని అధికారంలోకి రాకముందు నుండే బెదిరిస్తున్నది. కశ్మీర్ మాదన్నంతగా కశ్మీరీలను అక్కున చేర్చుకోలేక పోవడం హిందూ సాంస్కృతిక జాతీయవాద దక్పథం తప్ప మరొకటి లేదు. కశ్మీర్ ప్రజలకి మెజార్టీ మత ఆధిపత్యాన్ని, అప్రజాస్వామిక ధోరణిని నిరసించే మైనార్టీ వర్గ విశ్వాసాలు ఉన్నాయి కాబట్టి వారి పైన మరింతగా బుల్లెట్లు, పెల్లెట్లు కురుస్తున్నాయి. పాకిస్థాన్ లోనో, బంగ్లాదేశ్ లోనో మైనారిటీలుగా ఉన్న హిందువుల, సంక్షేమం, భద్రతపై గొంతు చించుకునే సంఘ పరివార్ కశ్మీరీల కన్నీటి గాథల గురించి వేలాదిగా చంపబడిన వారి గురించి, పెల్లెట్లతో కళ్లు పోగొట్టుకుని చీకట్లో బతుకులీడుస్తున్న యువత గురించి కూడా మాట్లాడితే బాగుండేది.

కానీ జరుగుతున్నదేమిటి పుల్వామా తరువాత రక్తానికి రక్తం అంటూ పాకిస్థాన్‌పై యుద్ధం ప్రకటించి మరింత మారణహోమానికి తెరలేపింది. 1990ల నుండి కశ్మీరీల తిరుగుబాటును అణచే పేరుతో ఆర్మీ సాగించిన నరమేధం, ప్రత్యేకించి 1991 ఫిబ్రవరి 23న కోనన్ పోషార ప్రాంతంలో 150 మంది కశ్మీర్ స్త్రీలపై జరిగిన గ్యాంగ్ రేప్, 200 మందిని తీవ్రంగా హింసించిన సంఘటనలో ఒక్క సైనికున్ని కూడా శిక్షించలేదు. అసలు సైన్యం చేసే వికృతమైన ఏ పనినైనా ప్రశ్నించినా అది దేశ ద్రోహమే అవుతున్నది. వారి ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని, దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తున్నారని, జాతి ప్రయోజనాలు దెబ్బ తింటాయని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు పాలకులు. ఎవరికీ జవాబుదారీతనం లేని సైనిక రాజ్యం నడుస్తున్నది కశ్మీర్‌లో.

నిజానికి ఫిబ్రవరి14న ఆత్మాహుతి దాడికి పాల్పడిన కశ్మీరీ యువకుడు సైనికుల అకృత్యాల బాధితుడే! ఒక నిరసన కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఆర్మీ అతన్ని పట్టుకుని ముక్కు నేలకు రాయించిందట. కశ్మీరీలతో సైన్యం కబడ్డీ, క్రికెట్, గిల్లి దండ ఆడితే వారి హృదయాలను గెలుచుకుంటున్న సైనికులు అని ప్రచారం చేసే మీడియాకు అమాయకులైన ప్రజలపై కాల్పులు జరిపి చంపేసినా, కస్టడీలో థర్డ్ డిగ్రీ ప్రయోగించినా, స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడినా, యువతను అదృశ్యం చేసినా, పెలెట్స్‌తో కళ్లు పోగొట్టినా ఏమీ మాట్లాడదు. దేశ భక్తి, భద్రత కదా! జాతి ప్రయోజనాలు, దేశ సమైక్యత పేరుతో జవాబుదారీతనం లేని వికృత వ్యవస్థ ఒకటి కశ్మీర్‌లో మాత్రమే కాదు ఈశాన్య రాష్ట్రాల నిండా ఇదే స్థితి కొనసాగుతున్నది.

ఒక చారిత్రక క్రమంలో జరుగుతున్న విషాదాలను పాలక వర్గాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం మార్చుకుని కశ్మీర్ లోయ గుండె చప్పుడును శాంతి భద్రతల సమస్యగా చూస్తూ మరిన్ని విషాదాలను పురిగొల్పే దుర్మార్గానికి ఒడిగడుతున్నారు తప్ప మూలాల్లోకి వెళ్ల నిరాకరిస్తున్నారు. పాలక వర్గాల ప్రయోజనాల కోసం పాక్ ప్రజలందరినీ మొత్తంగా దేశాన్నే శత్రు దేశంగా చిత్రీకరిస్తున్నారు. కశ్మీరీల రాజకీయ పోరాటంలో వారికి మద్దతు ఇచ్చే శక్తుల మద్దతు తీసుకునే హక్కు వారికుంటుంది. టిబెట్ పోరాటానికి, తూర్పు పాకిస్థాన్‌గా పిలవబడిన బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడేందుకు భారత్ మద్దతు ఇచ్చిందనేది ఒక చారిత్రక సత్యం. అయితే కశ్మీర్ ప్రజా పోరాటంలో రాజకీయ హక్కులు, స్వయం నిర్ణయాధికార ఆకాంక్షను వెల్లడించడంలో మతోన్మాదుల పాత్ర ఎక్కువ అవడం ఫలితంగా దేశంలో హిందూ మతోన్మాద శక్తుల అణచివేత చర్యలకు సాధికారత పొందే ప్రయత్నం జరుగుతున్నది. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతి పౌరుని అకౌంట్‌లో 15 లక్షల రూపాయలు, అవినీతిలేని పాలన, ఆత్మహత్యలు లేని వ్యవసాయం అని ప్రగల్భాలు పలికిన మోడీ పాలన పెద్ద నోట్ల రద్దుతో ధ్వంసమైంది ఆర్థిక వ్యవస్థ. ప్రత్యేకించి అసంఘటిత రంగంలో, చిన్న, కుటీర పరిశ్రమల్లో కోటికి పైగా కోల్పోయిన ఉద్యోగాలు, రెండు కోట్లు కాదు కదా రెండు లక్షలు కూడా ఉద్యోగాలు కల్పించలేని ఉత్త వాగాడంబరమే మిగిలింది.

ఆత్మహత్యలను నివారించలేని అసమర్థ పాలనలో, విదేశీ పర్యటనలు, ఆడంబరపు ప్రచార హోరు మాత్రమే మిగిలింది. ఎన్నికల సందర్భంలో 'దేశ భద్రత' బాగా పనికి వస్తుందని అది ఓట్లు కురిపించే మంత్రం అవుతుందని, దేశం అభద్రతలో ఉంటే సర్జికల్ స్ట్రైక్స్‌తో చేయగలిగే మొనగాడొక్క మోడీ మాత్రమే అని జీవన్మరణ సమస్యల కంటే ఉద్యోగం, ఉపాధి లేక కోట్లాది మంది అభద్రతలో ఉంటే అసలు భద్రత అంతా శత్రు దేశం పైన దాడి చేయడం అని ఓట్ల వేటలో పడ్డారు మోడీ–షాలు. ఇంతా చేస్తే గడిచిన మూడు విడతల ఎన్నికల్లో కశ్మీర్‌లో ఓటింగ్ శాతం 10 కూడా దాటలేదు!

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

యుద్ధం అన్నిటికీ తండ్రి!

యుద్ధమైనా, శాంతి అయినా ఏది ప్రజలకు అత్యున్నత ప్రయోజనాన్ని చేకూరుస్తుందో, చారిత్రకంగా సవ్యమైన మార్పులకు దారితీస్తుందో దాన్ని సమర్థించడం ప్రజాస్వామిక వాదుల చారిత్రక కర్తవ్యమని అంటున్నారు **మాదిరాజు రాంబాబు**

బెంజిమన్ ఫ్రాంక్లిన్ అన్నట్టు 'మంచి యుద్ధమూ, చెడ్డ శాంతీ ఉండ'నట్లే 'చెడ్డ యుద్ధమూ, మంచి శాంతీ కూడా ఉండద'నే విషయం ఆయన కొటేషన్‌ను విరివిగా వాడుతున్న మేధోజీవులకు అర్థం కాలేదనుకోం. యుద్ధం, శాంతి, మంచి, చెడ్డ, నిదానమే ప్రధానం, ఆలస్యం అమృతం విషం వంటి 'అమూర్త భావనలు నిర్దిష్ట చారిత్రక సందర్భాల్లో, స్థల కాలాల్లో మాత్రమే స్పష్టమైన అర్థాలను సంతరించు కుంటాయి, అలాకాక సర్వకాల సర్వావస్థలందూ ఒకే అర్థాన్ని కలిగి ఉండవనే విషయాన్ని తెలుసుకునేందుకు పెద్దగా శ్రమ పడనక్కర్లేదు.

సమకాలీన సమాజ అసమానతలను అలాగే సామరస్యంగా కొనసాగించదలచుకున్న పాలకులు, వారి సమర్థకులు ఆ అమూర్త భావనలకు శాశ్వత అర్థాలను కట్టబెట్టి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. 'యుద్ధం అన్నిటికీ తండ్రి. అందరికీ రాజు. కొందర్ని దేవతలుగానూ, ఇతరులను మనుషుల గానూ చేసిందదే. కొందర్ని బానిసలుగానూ, మరికొందర్ని ముక్తులుగానూ చేసిందీ అదే' అని క్రీస్తు పూర్వం నాటి తత్వవేత్త హెరాక్లిటస్ మాటలు ఇప్పటికీ ప్రాసంగికతను కోల్పోలేదనడంలో అతిశయోక్తి లేదు.

స్వాతంత్ర్యానంతర కాలంలో జరిగిన యుద్ధాలన్నీ-1962 భారత్ చైనా యుద్ధం, 1965 కశ్మీర్ కోసం ఇండోపాక్ యుద్ధం, 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం ఇండో-పాక్ యుద్ధం, 1999లో కార్గిల్ యుద్ధం, 2016లో సర్జికల్ స్ట్రైక్స్ తదితర యుద్ధ చర్యలన్నీ హెరాక్లిటస్ మాటలకు అద్దంపడుతున్నాయి. నేడు పుల్వామాలో 43 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్ల మృతి చెందిన ఉగ్రవాదదాడికి ప్రతీకారంగా వందల మందిని హతమార్చిన పాక్ భూభాగంలోని బాలాకోట్ ఉగ్రవాద శిబిరాలపై జరిగిన వైమానిక దాడి కూడా అలాంటి కోవలోనిదేనని పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

'రక్తసిక్త రాజకీయమే యుద్ధం, రక్తరహిత యుద్ధమే రాజకీయం' అని ఒక పాశ్చాత్య మేధావి వ్యాఖ్యానం ఈ సందర్భంగా గుర్తుకొస్తోంది. నిజమే పుల్వామా-బాలాకోట్ హింసాకాండ వెనుక రాజకీయాలే ప్రధాన కారణం. దశాబ్దాలుగా మూల్గుతున్న జమ్మూ-కశ్మీర్ సమస్యకు రక్తసిక్త రాజకీయ పరిష్కారంగా ఈ సంఘటనలు ముందుకు రావడం ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. దేశభక్తి వంటి ఉద్వేగాలు ఏ కాలంలోనూ దానికదే విడిగా, అమలిన అంశాలుగా ఎన్నడూ ఉండవు. స్వాతంత్ర కాలంలో బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా శాంతియుత నిరాహార దీక్షల నుంచి సాయుధ పోరాటాల వరకు వివిధ రూపాల్లో చేసిన అంతర్యుద్ధాల సమయంలో ప్రజల్లో ఉప్పొంగిన దేశభక్తి ఈనాడు వసివాడిపోయి, జమ్మూ కశ్మీర్ సమస్య పునాదిగా ఇండో-పాక్ పాలకుల రాజకీయ చాణక్యంగా మారిందని కొందరు మేధావులు వాపోతున్నారు. అయితే దేశభక్తి భావన సామాజిక సందర్భాలను బట్టి అందుకు తగిన స్వభావాన్ని సంతరించుకుంటుంది. బ్రిటిష్ వలస వాదానికి వ్యతిరేక సందర్భంలో ఒక రీతిగా, కశ్మీర్ విషయంలో పాక్‌పై వ్యతిరేకత రూపంలో, స్థానిక ముస్లింలపై దాష్టీకంతో సమాజాన్ని మత భావోద్వేగాల పరంగా చీల్చి, మెజారిటీ ఓటు బ్యాంకును సృష్టించడం ద్వారా అధికారంలోకి రావడానికి, సుస్థిరపరచుకునే సందర్భంలో మరొక రకంగానూ, ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని బూచిగా చూపి జాతి ఆకాంక్షలను వ్యక్తం చేస్తున్న వారిని దేశద్రోహులుగా నమ్మింపచేసే రూపంలోని జాతి, మత, ప్రాంత తదితర అస్తిత్వాల, అణగారిన ప్రజల, పర్యావరణ విధ్వంసక సమస్యలను పక్కదారి పట్టించేందుకు విదేశీ శక్తుల కుట్రగా ప్రచారం చేసే రూపంలోను దేశభక్తి భావన స్థలకాలాలను బట్టి విభిన్న, విలక్షణ అర్థాలను సంతరించుకుంటుంది.

సైనిక, సాయుధ బలగాలపై కశ్మీర్లో ఉగ్రవాద దాడులు, అడపాదడపా సర్జికల్ స్ట్రైక్స్ జరపడం కొత్త కాకపోయినప్పటికీ రాబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంలో, ప్రపంచ భౌగోళిక రాజకీయ సమీకరణల్లో అది రాజకీయ పక్షాల మధ్య రక్తరహిత/రక్త సహిత ఎన్నికల యుద్ధంగా అవతరించింది. అమెరికా సామ్రాజ్యవాద శక్తికి, చైనా ముఖంతో ఇయు, సోవియట్ రష్యా సామ్రాజ్యవాద దేశాల కూటమికి మధ్య సాగుతున్న ప్రాంతీయ, భౌగోళిక ఆధిపత్య పోరు నేపథ్యంలో నేడు సాగుతున్న ఇండో-పాక్ యుద్ధ విన్యాసాలు భారత రాజకీయ యవనికలో ప్రధాన అంశంగా మారాయి.

యుద్ధమనేది సాంకేతికార్థంలో-ప్రపంచ యుద్ధం, ప్రాంతీయ యుద్ధం, స్థానిక యుద్ధం, అంతర్యుద్ధం (ప్రజలు-పాలకులు, పాలకుల మధ్య) అనే రూపాలలో ఉంటుంది. స్వాభావికార్థంలో ప్రజా యుద్ధమా? పాలకుల ఆధిపత్య యుద్ధమా? అనే లక్షణాలను కలిగి ఉంటుంది. అంతేగానీ యుద్ధం అనేది ప్రతి సందర్భంలోనూ చెడ్డది అనే అర్థంలో పరిగణించడం అహేతుకం. అలా చేయడం వల్ల బ్రిటిష్ వాళ్లపై వివిధ రూపాల్లో చేసిన అంతర్యుద్ధాన్ని అంటే ప్రజాయుద్ధాన్ని కూడా తిరస్కరించినవారమవుతాం. శాంతియుత పోరాటం నుంచి ఏ రూపం లోని యుద్ధమైనా అది చేస్తున్న వారి సామాజిక, చారిత్రక లక్ష్యాలను బట్టి మంచిదా, చెడ్డదా అని పరిగణించాల్సి ఉంటుంది. 'యుద్ధం వ్యక్తిని ఉన్నతుడిని చేస్తుంది. తన దైనందిన, సంకుచిత స్వార్థ ప్రయోజనాలు ఎంత తుచ్ఛమైనవో, రాజ్య ప్రయోజనాలు ఎంత సమున్నతమైనవో పౌరునికి తెలియ చెబుతుంది. రాజ్య ప్రయోజనాలు నిజంగా తన ప్రజయోజనాలే కనుక (తను రాజ్యం వేరుకాదు) రాజ్య ప్రయోజనాల కోసం యుద్ధం చేయడం, నిజంగా తన ప్రయోజనం కోసమే యుద్ధం చేయడమని వ్యక్తి గ్రహిస్తాడు. ఈ విధమైన తాదాత్మ్యం పొందగల పౌరులున్నప్పుడే ఆ రాజ్యం ఆరోగ్యవంతంగా, శక్తిమంతంగా ఉంటుంది. అప్పుడప్పుడు యుద్ధాలలో పాల్గొనని రాజ్యం స్తబ్దమై పోతుంది. కదలికలేని తటాకం ఎలా పోతుందో, అలాగే యుద్ధ సంక్షోభాన్ని చవిచూడని రాజ్యం క్షీణించిపోతుంది. యుద్ధం పౌరులలో క్రమశిక్షణను, దేశభక్తిని

ఇంకా నెత్తురోడుతున్న ఇంద్రవెల్లి

తమ నేల తమకే దక్కాలన్నందుకు ఇంద్రవెల్లిలో ప్రభుత్వం ఆదివాసుల నెత్తురు పారించిందనీ, అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి ఆదివాసులపై నిత్యం దాడులకు పాల్పడుతోందనీ అంటున్నారు **ఎన్. నారాయణరావు**

అణచివేత ఉన్న చోట పోరాటం, అన్యాయం ఉన్న దగ్గర ఆందోళన దోపిడీ, పీడన ఉన్న చోట ఉద్యమం తప్పదు. అటువంటి దోపిడీ వ్యతిరేక పోరాట రూపాన్ని ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న ఆదివాసీ రైతుకూలీ సంఘం నిరూపించింది. సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వాలు పచ్చని అడవిలో ఆదివాసీల నెత్తురును పారించింది. ఆదిలాబాద్‌లో రైతుకూలీ ఉద్యమాలకు దన్నుగా ఒకవైపు కరీంనగర్ రైతాంగ పోరాటాలు, మరొకవైపు సింగరేణిలో బలపడుతున్న కార్మికోద్యమాలు ప్రేరణగా పనిచేశాయి. ఆదిలాబాద్ తూర్పున కార్మికోద్యమం, పశ్చిమలో రైతాంగ ఉద్యమాలతో ఆదిలాబాద్ జిల్లాలో సామ్రాజ్యవాద పెట్టుబడులు రాకుండా ఉండే బలమైన ప్రజా ఉద్యమాల పరిస్థితి కొనసాగింది. మూడు దశాబ్దాల తర్వాత ఇప్పుడిప్పుడే పారిశ్రామికీకరణ, పెట్టుబడుల ప్రవేశం మొదలైంది. సామాజిక స్థితిగతులలో బలవంతంగానైనా మార్పులు తీసుకురాగలిగాయి ప్రభుత్వాలు. నేడు గోండు రైతుకూలీ సంఘం, కార్మిక సంఘాలు పూర్తి స్థాయిలో బలహీనపడ్డ స్థితిని జిల్లా వ్యాప్తంగా చూస్తున్నాం. ఒకవైపు రైతుల ఆత్మహత్యలు, మరొకవైపు సింగరేణి ప్రైవేటీకరణతో హక్కుల్ని కనుమరుగు చేస్తున్న స్థితి మనకళ్ల ముందర ఉంది.

1981 ఏప్రిల్ 20న ఉదయం నాలుగు దిక్కుల నుండి ఆడమగ, చిన్న పెద్ద తేడా లేకుండా గిరిజనులు పెద్ద సంఖ్యలో ఇంద్రవెల్లికి తరలివచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఇంద్రవెల్లి ప్రాంతమంతా, ఆదివాసీల, గోండులతో నిండిపోయింది. సభ ప్రాంగణమంతా వందలాది మంది పోలీసులు మోహరించారు. సభ జరగకుండా పోలీసులు విశ్వ ప్రయత్నం చేశారు. వాహనాలు రాకుండా రహదారులను దిగ్బంధించారు. భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్న ఆదివాసీలు సభా స్థలానికి ఊరేగింపుగా వస్తున్న మహిళలతో పోలీసుల అనుచిత అమర్యాద ప్రవర్తనకు ఒక మహిళ కొడవలితో పోలీసులపై దాడికి సిద్ధపడింది. వేలాది మందితో వస్తున్న ఆదివాసీల ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఫలితంగా ఇరువర్గాల మధ్యన ఘర్షణ ప్రారంభమైంది. పోలీసులు ఎటువంటి హెచ్చరికలు లేకుండా తుపాకి కాల్పులు ప్రారంభించారు. పోలీసు కాల్పుల్లో వందకు పైగా ఆదివాసీలు మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. పోలీసు కాల్పులకు భయపడి ప్రాణాలు దక్కించుకునేందుకు వందలాది మంది చెట్లు, వాగులు, వంకలు దాటుతూ అడవుల్లోకి పరుగులు తీశారు. ఆదివాసీల ఆందోళనలు నియంత్రించడానికి, గాలిలో కాల్పులు జరపాలి. అవసరమైతే నడుం కింది భాగంలో కాల్పులు జరపాలి. కాని వందకు పైగా ఆదివాసీలు హత్యకు గురయ్యారంటే పాలకులు ఈ ఆందోళనను అణచివేయాలని మారణకాండ సృష్టించాలనే పథకాన్ని అమలుచేశారని స్పష్టమవుతోంది. ఆందోళన విరమింపచేయడం కన్నా, ఆందోళన అనే ఆలోచననే రాకుండా చేయాలని వేలాది తుపాకి తూటాలు వాడారు. కాని అదే ఇంద్రవెల్లి మహాసభ నిరాయుధులైన ఆదివాసీలను సాయుధ పోలీసులు కాల్చి చంపడంతో ఆదిలాబాద్ నెత్తురు మరిగిన రోజు. దున్నేవాడికే భూమి నినాదంగా ఇంద్రవెల్లి చుట్టుపక్కల గ్రామాల నుండి యామికుంట, తోషం, ఖానాపూర్, సైద్రూర్, ఖండాలా, ఉట్నూర్, పత్తిగుట్ట, తిర్యాణి గ్రామాల నుండి వేలాదిగా ఆదివాసీలు తరలివచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. 1981 ఏప్రిల్20న ప్రభుత్వం పోలీసులతో దాడి చేపించింది. ఆదివాసీల శవాలతో గూడేలు నిండిపోయాయి.

చాలా ముందుగానే ఇంద్రవెల్లి బహిరంగసభకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆదివాసీలు వేలాదిగా కదలగానే చూసి భయపడి ఆ రోజుకారోజు సభకు అనుమతి నిరాకరించింది. సభకు అనుమతి రద్దయిందనే విషయం ఆదివాసీలకు ఎలా చేరుతుందనే అవగాహన ప్రభుత్వానికి లేకుండా పోయింది. గోండు ప్రజలకు సభ లేదనే విషయం తెలియకుండానే ఇంద్రవెల్లికి చేరుకోవడం జరిగింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు గిరిజన రైతుకూలీ సంఘం ప్రాతినిధ్యంలో ఊరేగింపును ప్రారంభిస్తే ఆ ఊరేగింపుపై ప్రభుత్వం కాల్పులకు తెగబడింది. రక్తాన్ని ఏరులై పారించింది. పౌర ప్రజాస్వామిక హక్కులపై

పెంపొందిస్తుంది' అని ప్రష్యన్ రాజ్యాన్ని సమర్థిస్తూ జర్మన్ తత్వవేత్త హెగెల్ చేసిన వ్యాఖ్యానం ఆ తర్వాత కాలంలో హిట్లర్ నాయకత్వంలోని నాజీ పాలన రూపంలో సాక్షాత్కారమైంది. ఫ్యూడల్ రాజ్యానికైనా, పెట్టుబడిదారీ రాజ్యానికైనా, కార్మిక వర్గ రాజ్యానికైనా ఇది వర్తిస్తుంది. ఆ రాజ్య స్వభావాన్ని బట్టి యుద్ధాలు చారిత్రక స్వభావాలు సంతరించు కుంటాయి. అదే కోవలో పుల్వామా-బాలాకోట్ యుద్ధాన్ని కూడా పరిగణించాల్సి ఉంటుంది. ప్రజా యుద్ధానికైనా, దేశాల మధ్య, దేశం లోపల పాలకుల మధ్య యుద్ధానికైనా ఇది వర్తిస్తుంది. అయితే 'అత్యున్నత ప్రతిభ అనేది యుద్ధాన్నీ గెలవడంలో లేదు.

యుద్ధం చేసే అవసరం లేకుండా శత్రువును ఓడించడంలోనే అతున్నత ప్రతిభ ఉంటుంది' అని చైనా యుద్ధ నిపుణుడు సన్జూ యుద్ధ సూత్రం రక్తసిక్త, రక్తరహిత యుద్ధాలు (రాజకీయాలు) అన్నిటిలోనూ హేతుబద్ధతను కలిగి ఉంది. ఉద్వేగాలు, శుద్ధ శాంతి ప్రవచనాలు రెండూ చారిత్రక గమనాన్ని నిలువరించలేవు. యుద్ధమైనా, శాంతి అయినా ఏది ప్రజలకు అత్యున్నత ప్రయోజాన్ని చేకూరుస్తుందో, చారిత్రకంగా సవ్యమైన మార్పులకు దారితీస్తుందో దాన్ని సమర్థించడం ప్రజాస్వామిక వాదుల చారిత్రక కర్తవ్యం. అది కార్గిల్ అయినా, పుల్వామా-బాల కోట్ ఘర్షణలైనా! యుద్ధం అన్నింటికీ తండ్రే అయినా... మంచి తండ్రిని కోరుకోవడం తప్పుకాదు కదా!

(రచయిత పాత్రికేయులు) వీ

నిర్దాక్షిణ్యంగా ప్రభుత్వం తూటాల దాడిని కొనసాగించింది. ఆ విధంగా వందలాది మంది ఆదివాసీ ఉద్యమకారులు రైతుకూలీ సంఘం పోరాటంలో అమరులైనారు.

రైతుకూలీ సంఘం నాయకుడు గంజి రామారావు ఇంద్రవెల్లిలో స్థలం కొన్న తరువాత 1982లో ఇంద్రవెల్లి అమరుల స్థూపాన్ని ప్రజలు తమ కష్టార్జితంతో నిర్మించుకున్నారు. ఈ స్థూపం వద్ద ఒక్కసారి మాత్రమే సభ జరిగినట్లుగా ఉంది. ఇప్పటివరకు ప్రతి ఏడాది నిషేధాజ్ఞలతో ప్రభుత్వం సభకు అనుమతించడంలేదు. ప్రజలు నిర్మించుకున్న ఈ స్థూపాన్ని ఎన్‌టిఆర్ ప్రభుత్వం 1986లో డైనమెట్స్‌తో కూల్చివేసింది. ఈ కూల్చివేతకు నిరసనగా గిరిజనులు ఆందోళన బాటపట్టారు. ఆ ఆందోళనకు భయపడే తెలుగుదేశం ప్రభుత్వం 1987లో అమరుల స్థూపాన్ని పునర్నిర్మించింది. నిర్మించిన స్థూపానికి తమ పార్టీ రంగు అయినటువంటి పసుపుపచ్చ రంగును స్థూపానికి రుద్దింది. ఈ విధంగా ఆదివాసీల ఆకాంక్షలు, సమస్యలు పట్టని ప్రభుత్వం 1989లో జరిగిన ఎల్లంపెల్లి ఘటనతో ఆదిలాబాద్ జిల్లాను ఆదర్శ జిల్లాగా ప్రకటించి మూడువందల కోట్లు ప్రకటించింది. మరోవైపు రైతుకూలీ ఉద్యమంపై పాశవిక నిర్బంధాన్ని అమలుచేసింది. అది జిల్లాకు తూర్పున ఉన్న సింగరేణి కార్మిక ఉద్యమంపై అమలై సుమారు 40కి పైగా కార్మికోద్య మకారులు ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయబడ్డారు. నిర్బంధం ఒకవైపు కొనసాగిస్తూనే మరొకవైపు సింగరేణిలో యాంత్రీకరణ, ప్రైవేటీకరణ, భూగర్భ ఉపరితల ఉత్పత్తి విధానాల్ని ప్రారంభించడం బలంగా కొనసాగే సరికి కార్మికోద్యమం కూడా బలహీనపడసాగింది.

తుడుం మోతతో, కలామ్స్‌తో ప్రారంభమైన ఇంద్రవెల్లి ఊరేగింపును నిలువరించడానికి నిశబ్దం చేయడానికి జిల్లా ఎస్‌పి ఎం.వి. కృష్ణారావు విఫల ప్రయత్నం చేశారు. మారణకాండ జరిగిన తర్వాత రాష్ట్ర హోం మంత్రి కె. ప్రభాకర్ రెడ్డి ఏప్రిల్ 22న ఇంద్రవెల్లిని సందర్శించాడు. గోండు ఆదివాసీల చేతులలో కర్రలు, గొడ్డల్లు ఉన్నాయి కాబట్టి తప్పని పరిస్థితులలో కాల్పులు జరపవలసి వచ్చిందని ప్రకటన చేశాడు. ఆదివాసీల సంప్రదాయక ఆయుధాలైన కర్ర, గొడ్డలి వారి శరీరంలో భాగంగా చూడాల్సిందే. కానీ వాటిని పూర్తిస్థాయి ఆయుధాలుగా పరిగణించకూడదు. ఇది గిరిజన రైతుకూలీ సంఘం పోరాటాన్ని, ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేయడానికి జరిపిన హత్యాకాండే తప్ప మరొకటి కాదు. గోండు సమస్యల పరిష్కారం కోసం సభ పెట్టబడింది. ప్రభుత్వం నాయకత్వాన్ని చర్చల కోసం పిలవకుండా తూటాలు కురిపిస్తే పోయిన ప్రాణాలు ఎవరు తెస్తారు? ప్రభుత్వం మారణకాండను సృష్టించి ఉద్యకారుల పట్ల, రైతుకూలీ సంఘం పట్ల భయాన్ని కలిగించే కుటిల ప్రయత్నమే ఇది.

ప్రభుత్వాల రాజ్యాంగబద్ధ పాలన ద్వారా ప్రజాస్వామ్యానికి బలం చేకూరుతుంది. అది ప్రజలకు ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసాన్ని పెంచుతుంది. రాజ్యాంగ పాలన చేయాల్సిన ప్రభుత్వాలు హక్కులపై ఉక్కుపాదాన్ని మోపి ఆ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ఈ విధంగా అడవుల్లోని ఆదివాసీలు తమ ఆకాంక్షల కోసం ఆందోళన చేయడం ఆ ఆందోళనను ప్రభుత్వం హింసాత్మకంగా మార్చింది. 1981 నుండి నేటికీ ఇంద్రవెల్లిలో హత్యకు గురైన ఆదివాసీ గోండుల పేర్లను ప్రభుత్వాలు బయటపెట్టలేకపోయాయి. గ్రామాల నుండి ఆందోళన కోసం బయలు దేరినవారు ప్రభుత్వ తుపాకి గుండ్లకు బలై తమ రక్తంతో ఇంద్రవెల్లిని ఎరుపెక్కించారు. ఆదివాసీల ఏ శాంతియుత ఆందోళన అయినా దానిపై ప్రభుత్వాల ఆయుధాలు ఎక్కుపెట్టబడతాయి. ప్రభుత్వం ఉపయోగిస్తున్న తుపాకి తూటాలకు లెక్కలేనట్టుగానే పోయిన ఆదివాసీ ప్రాణాలకు లెక్కలుండడం లేదు.

నేడు కశ్మీరు ఉద్యమకారులను చంపి శవాలను జీలం నదిలో విసిరేసినట్టుగా మధ్య భారతంలో ఆదివాసీల శవాలు వారి వారి బంధువులకు చెందకుండా శవాల పంచనామా కూడా లేకుండానే కనుమరుగు చేస్తున్నారు. ఇదే ఇంద్రవెల్లిలో వందల్లో మరణించినట్టుగా హక్కుల సంఘాలు చెపుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం కేవలం 13 మందే మరణించినట్టుగా లెక్కచూపింది. ఈ ఘటనపై పౌరహక్కుల సంఘానికి చెందిన డా. రాజగోపాలన్, కెజి కన్నాబిరాన్‌లు నిజనిర్ధారణ చేసి నిర్మల్ పట్టణంలో పత్రికా సమావేశం ఏర్పాటుచేస్తే దానిపై కూడా పోలీసులు దాడి చేసి వారి కారును ధ్వంసం చేయడం, వారిపై భౌతికదాడికి పాల్పడ్డారు. నిజాలు తెలుసుకునేందుకు వెళ్లిన హక్కుల కార్యకర్తలపై ప్రభుత్వం ఇలా దాడి చేస్తే నిజాలు దాచేయడానికి ప్రభుత్వం ఎందుకు ప్రయత్నం చేసినట్లు? శవాలను లెక్కించడం పైన కూడా ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహించిందో మనం ఊహించవచ్చు. అణగారిన ఆదివాసీల ప్రజలు బతికుండగానే కాదు శవాలుగా మారిన కూడా గుర్తింపు నిరాకరణలో ప్రభుత్వం అప్రజాస్వామికతను మనందరం ప్రశ్నించాల్సి ఉంది. 1947 అధికార మార్పిడి తర్వాత గడిచిన ప్రభుత్వాల హత్యాకాండను గుర్తుచేస్తూ, నిరసిస్తూ సభలు, సమావేశాలు ఊరేగింపులు నిర్వహిస్తే అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడం లేదు. 1981 ఇంద్రవెల్లి హత్యాకాండ, నేటి 100 ఏళ్ల జలియన్ వాలాబాగ్ ఊచకోతతో పోల్చవలసి వస్తుంది. వలస పాలకుల ఘటనలపై మాత్రమే సమావేశాలు నిర్వహించుకోగలుగుతున్నాం. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల ఐక్యతలు చాలా బలంగా పనిచేస్తున్నాయి. వలస పాలకులకు దేశ పాలకులకు మధ్య వ్యత్యాసం లేకుండా పోతున్నది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిస్సా లోని ఆదివాసీ ప్రాంతాలే కాదు ఉత్తర ఈశాన్య రాష్ట్రాలలో కూడా ఆదివాసీలు తమ హక్కుల కోసం బలమైన పోరాటాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ ఉద్యమంలో అమరులైన వారి ప్రాణ త్యాగాలను లెక్కించ డానికి కూడా జాతీయ నేరవిభాగం కూడా సరైన ప్రాతిపదికలు పాటించడం లేదు. హత్య చేసిన పోలీసులపైనే జాతీయ నేర విభాగం ఆధారపడడంతో సరియైన లెక్కలు రికార్డు కావడంలేదు. శవాలను సమాధి చేసి పిడికెడు మట్టిని బాధిత బంధువులకు ఇస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కన్నాయిగూడలో పోలీసులు అరెస్టు చేసిన భర్త కోసం కాళ్లరిగేలా తిరగగా పోలీస్ క్యాంపు పక్కకు తీసుకువెళ్లి అక్కడ మట్టిని అరచేతిలో పెట్టి ఈ మట్టికింద నీ భర్త పాతిపెట్టబడ్డాడని పోలీసులు వారి భార్యాపిల్లలకు చెప్పగలుగుతున్నారంటే పరిపాలన ఎంత దౌర్జన్య పూరితంగా ఉందో చూడవచ్చు. అక్రమ అరెస్టులపై స్పందించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు శవాలను మాయం చేయడంలో భాగస్తులవుతున్నారు. రక్త సంబంధీకులకు శవాలు ఇవ్వడంలో పూర్తి అలసత్వం పాటిస్తున్నాయి. ఇంద్రవెల్లిలో ప్రారంభమైన ఆదివాసీ వేట నేటికీ అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. అధికారులు మారుతు న్నారు. ఆయుధాలు మారుతున్నాయి. నిర్బంధ ఆపరేషన్ల పేర్లు మారుతు న్నాయి కానీ ఆదివాసీ జీవితాల్లో మార్పు రావడం లేదు. వారి జీవన విధానం మరొకటి లేకుండానే వారి ఆందోళనలకు పరిష్కారం దొరకడం లేదు. వందల్లో సాగే ఊరేగింపులు వేలాది మందితో కొనసాగు తున్నాయి. కానీ ఆదివాసీల జీవితాల్లో గుణాత్మకమైన మార్పులు రావడంలేదు.

ఇంద్రవెల్లి సాక్షిగా మొదలైన హత్యాకాండ ప్రారంభంలో అణచివేతగా మొదలై పూర్తి స్థాయి వేటగా మారిపోయింది. నిత్యం ఆదివాసీలను వేటాడుతూనే ఉంది ప్రభుత్వం. భూమిపై పట్టాకోసం, దున్నేవాడికి భూమి

కోసం మొదలైన ఇంద్రవెల్లి ఉద్యమం అడవిపై హక్కుకై చాలా పోరాటాలు చేసింది. ఆ పోరాటాల్లో భాగంగానే 2006లో అటవి హక్కుల చట్టం తర్వాత 1996లో పంచాయితీరాజ్ ఎక్స్‌టెన్షన్ (పెసా) చట్టాలు వచ్చాయి. గ్రామసభ తీర్మాణమే అంతిమ నిర్ణయంగా చట్టాలు వచ్చాయి. కానీ గ్రామసభ తీర్మానాలన్నీ కూడా లెక్కలేకుండా పోతున్నాయి. గడ్చిరోలీ జిల్లాలో 75 గ్రామసభ తీర్మానాలు, లాయిడ్స్ కంపెనీకి వ్యతిరేకంగా వచ్చినా కలెక్టర్ లక్ష్యపెట్టకుండా ఆ కంపెనీ పనులు సాగడానికి అనుమతులు ఇవ్వడం ఆదివాసీ హక్కులను కాలరాయడమే అవుతుంది. అడవి ప్రాంతాల్లో హక్కు ఆదివాసీలకే ఉంటుందని ప్రభుత్వం కూడా ఆదివాసేతరుడేనని 1997లో సమత వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియాలో సుప్రీంకోర్టు తీర్పు స్పష్టంగా చెప్పింది.

కానీ 2009లో ప్రారంభమైన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌తో, సాయుధ బలగాల క్యాంపులతో అడవిని ఆక్రమించుకోసాగింది. చాలా విలువైన ఖనిజం కలిగిన అడవి ప్రాంతం జార్ఖండ్ రాష్ట్రంలోని వెస్టిస్ సిగ్భూమ్ జిల్లాలోని సరండా ప్రాంతం. అతి విలువైన ఆ ఖనిజాలను తరలించాలంటే సుమారు 17 సాయుధ క్యాంపులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ప్రకటించాడు. సరెండా అడవి ప్రాంతంలో సాయుధ మిలిటరీ క్యాంపులు ఏర్పాటుచేస్తూనే ఖనిజాలను తరలించడానికి సామ్రాజ్యవాదులతో మిలాఖతైన భారత ప్రభుత్వం 2011లో ఆపరేషన్ అనకొండ పేరుతో, సరెండ యాక్షన్ ప్లాన్ పేరుతో వేలాది సాయుధ బలగాలను దింపి సరెండా అడవి ప్రాంతాలకు తరలించి అక్కడి గ్రామాల్లో నెలల తరబడి క్యాంపులను ఏర్పాటుచేసి ఆదివాసీల జీవన విధానాన్ని విధ్వంసం చేశాయి. దొరికిన ఆదివాసీలను దొరికినట్టుగానే చెల్‌భసా జైల్లో నిర్బంధించారు. ప్రజలను జైళ్లో నిర్బంధించి మాత్రమే అక్కడ ఇనుప ఖనిజ మైన్స్‌ను ప్రారంభించడం సాధ్యమయింది. ఈ విధంగా ఆదివాసీ గ్రామాల విధ్వంసం నేటికీ కొనసాగుతూనే ఉంది. ఒరిస్సా రాష్ట్రం కాందమాల్ జిల్లా తుమ్ముబందా బ్లాకులోని గుముడుమహ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద పనిచేసి వేతనాలు తీసుకుని జూలై 8, 2016న ఆటోరిక్షాలో గ్రామానికి వస్తున్న 15 మంది గ్రామస్తులపై పోలీసు బలగాలు విచక్షణా రహితంగా కాల్పులు జరిపితే నలుగురు ఆదివాసీలు అక్కడికక్కడే చనిపోయారు. అందులో 2 సంవత్సరాల జహద్‌బిగాల్ కూడా చనిపోయింది.

ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో బలమైన ఆదివాసీ ఉద్యమాన్ని అణచివేయడం కోసం 2005లోనే మహేంద్రఖర్మ ఆధ్వర్యంలో సల్వాజుడుంను ప్రారంభించింది. సల్వాజుడుం దాడులలో సుమారు 614 గ్రామాలు దగ్ధమయ్యాయి. లక్షా 40వేల మంది ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. వందలాదిగా చంపబడ్డారు. పదుల సంఖ్యలో మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. సల్వాజుడుం పేరుతో నియమించిన ఎస్‌పిఓల విధానాన్ని సుప్రీంకోర్టులో ఢిల్లీ ప్రొఫెసర్ నందిని సుందర్ ప్రశ్నించింది. ఎస్‌పిఓ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టి రద్దుచేసింది. కానీ వారి వల్ల గాయపడ్డ ఆదివాసీ జీవితాలకు నష్టపరిహారం లేదు, నష్టం చేసిన ఎస్‌పిఓలకు శిక్షలూ లేవు. ఇది ఛత్తీస్‌గడ్‌లో ఆదివాసీల పరిస్థితి. ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో 2007లో సింగారం, తాడిమెట్ల, మొరపల్లిలో 13 మంది ఆదివాసీలను అతికిరాతకంగా సల్వాజుడుం పోలీసులు కలిసి హత్య చేశారు. 2012లో బీజాపూర్ జిల్లా బాసగూడలో వ్యవసాయ భూమిలో పంటల విషయమై గ్రామంలో చర్చించుకుంటున్న ప్రజలపై ఒక్కసారిగా దాడిచేసిన పోలీసు బలగాలు 17 మంది గ్రామస్థులను కాల్చి చంపారు. అందులో ఐదుగురు స్కూలుకు వెళుతున్న పిల్లలే. ఘటన తరువాత అప్పటి హోంశాఖా మంత్రి చిదంబరం ఆదివాసీలను చంపిన సిఆర్‌పిఎఫ్ బలగాలకు అండగా నిలబడి ప్రశంసలు, పదోన్నతులు ఇచ్చాడు. ఆదివాసీల పట్ల అతికిరాతకం గా వ్యవహరించిన వారికే ప్రభుత్వాలు అవార్డులు ప్రకటిస్తున్నాయి. ఆదివాసీ హక్కుల కార్యకర్త సోనిసోరి విషయంలో క్రూరంగా ప్రవర్తించిన అంకిత్‌గార్గేకు గ్యాలంట్రీ అవార్డు ఇచ్చారు. బాసగూడ మారణకాండ తరువాత వందలాది పోలీస్ క్యాంపులు పెట్టి లక్షలాది పారా మిలిటరీ బలగాలను దింపి ఆదివాసీ మహిళలపై సామూహిక అత్యాచారాలను కొనసాగిస్తున్నారు. ఆంధ్రలో వాకపల్లి, భల్లుగూడ, అత్యాచార ఘటనలు, దండకారణ్య ఆదివాసీ ప్రాంతాలలో పదుల సంఖ్యలో ఇలాంటి ఘటనలు జరిగాయి.

2015 నవంబర్‌లో ఛత్తీస్‌గడ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా పెద్దగెల్లూరులో ఎనిమిది మంది మహిళలపై పోలీసులు సామూహిక అత్యాచారం చేశారు. ఈ ఘటనపై మహిళా హక్కుల సంస్థ డబ్ల్యుఎస్ఎస్, హక్కుల కార్యకర్త భేలా భాటియాలు బీజాపూర్ కలెక్టర్‌తో మాట్లాడి నేరం చేసిన సాయుధ బలగాలపై అత్యాచార కేసులు నమోదు చేశారు. ఇదే స్థితి 2016 జనవరి నెలలో కున్నా గ్రామంలో జరిగింది. సుమారు 15 మంది ఆదివాసీలపై పోలీసులు అత్యాచారం చేశారు. అత్యాచారానికి ముందు గ్రామంలోని మగవాళ్లందరిని తుపాకులతో బెదిరించి వెళ్లగొట్టారు. రెండు రోజులు గ్రామాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకొని తల్లుల ముందే పిల్లలపై సామూహిక అత్యాచారాలకు ఒడిగట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయించడానికి ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థకు, అత్యాచార హింసలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న డబ్ల్యుఎస్ఎస్ సంస్థకు సుమారు వారం రోజులు పట్టింది. పోలీసులపై కేసు నమోదు చేయడం వారి నైతికతకు సంబంధించిన అంశంగా ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది.

భారత ప్రజాస్వామ్యానికి భారత రాజ్యాంగం మూలం. కానీ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడే పోలీసుల నైతికతకు ప్రభుత్వానికి ఎలా ప్రధానమవుతుంది. ఆ రాజ్యాంగమే అమలు చేయని సైనికుడైతేనేమి పోలీసు అయితేనేమి, చివరకు రాష్ట్రపతి అయితేనేమి వారి నైతికత ప్రధానాంశం ఎప్పుడూ కాకూడదు. అధికార ఆయుధాల విశృంఖలత్వం ఎప్పటికైనా రాజ్యాంగానికి హాని చేస్తుంది. హంతకుల మొరాల్టీ ప్రధానమైతే ప్రజలకు ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం సన్నగిల్లుతుంది. ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపై కేసులు వేస్తే వారికి మద్దతుగా ప్రభుత్వాలు నిలబడుతున్నాయి. ఎన్‌కౌంటర్ హత్యలపై ఎవరు కేసులు వేసినా వారికి వ్యతిరేకంగా సాయుధ బలగాలతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేయిస్తున్నారు. ఇలా ప్రశ్నించడం, కేసులు వేయడం న్యాయబద్ధం కాదన్నట్లుగా ప్రచారం చేస్తున్నది. బాధితుల న్యాయమైన ఆందోళన ప్రభుత్వాలకు రాజ్యాంగబద్ధం అనిపించడం లేదు.

నక్సల్బరీ ఉద్యమం 50 వసంతాలు దాటినా, ఇంద్రవెల్లి మారణకాండకు 40 వసంతాలు వచ్చినా ఆదివాసీల నెత్తురు ఆదిలాబాదు జిల్లా గోదావరి నదినే కాదు, మధ్య భారతంలోని అన్ని నదుల్లో ఏరులై పారుతునే ఉన్నది. కారుతున్న రక్తాన్ని నిలువరించడానికి ఎందరి మనోస్థైర్యాలు కోల్పోయిన ఫర్వాలేదనేది ప్రశ్నిస్తున్న మేధావుల ఆలోచన. ఇంద్రవెల్లి మారణకాండలకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. హత్యలకు లెక్కలు చెప్పాల్సి వస్తుంది, సమాధానాలు ఇవ్వాల్సి వస్తుంది. ప్రజల సహనం, ఓపికలు వారి మౌనం కాదు. న్యాయం కోసం జరిగే పోరాటానికి ముందస్తు ఆలోచనలే. ఆదివాసులు... పారిన నెత్తుటికి సమాధానాల కోసం, తమ హక్కుల కోసం నిత్యం వెతుకుతూనే ఆందోళన బాటలో సాగుతున్నారు. అంతిమంగా ప్రజలే విజయం సాధిస్తారు.

(రచయిత పౌరహక్కుల సంఘం, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

పల్నాడు ప్రజల కల - వరికపూడి సెల

పల్నాడు ప్రజల తాగునీరు, సాగునీరు కోసం వరికపూడి సెల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదన ఉన్నా పాలకులు శిలాఫలకాలు వేశారు తప్ప నిర్మాణం చేపట్టలేదనీ, ప్రజలే ఉద్యమించి ప్రాజెక్టు నిర్మించుకోవాలనీ అంటున్నారు **దుడ్డు ప్రభాకర్**

కృష్ణా నదిపై నిర్మించిన ఆనకట్టల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ అతిపెద్దది. ఇది బహుళార్థసాధక ప్రాజెక్ట్. తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా పెదవూర మండలం నందికొండ గ్రామంలో నిర్మించారు. దీనిని నందికొండ ప్రాజెక్ట్ అని పిలిచేవారు. నాగార్జునుడు అనే మహాయాన బౌద్ధ బ్రాహ్మణ తత్వవేత్త పేరుతో నేడది నాగార్జునసాగర్‌గా ప్రసిద్ధి చెందింది. 1952లో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో కృష్ణా నదిపై ఆనకట్ట కట్టాలని నిర్ణయించి స్థల పరిశీలన, నిర్ధారణ కోసం ఖోస్లా నాయకత్వంలో ఒక కమిటీని నియమించింది. 1955లో ఆ కమిటీ తన నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది. ఖోస్లా కమిటీ నివేదికలో ఆనకట్ట సమీప ప్రాంతంలో ప్రస్తుత గుంటూరు జిల్లాలోని వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, ప్రకాశం జిల్లాలోని పుల్లల చెరువు మండలాల్లోని భూములు ఎత్తుపల్లాలుగా ఉన్నందువల్ల ఆ ప్రాంత సాగునీటి కోసం ఒక లిఫ్ట్ ఇరిగేషన్(ఎత్తిపోతలు)ను ఏర్పాటు చెయ్యాలని ప్రతిపాదించింది.

కృష్ణా నది పాయగా ఏర్పడిన చోట నుండి 2 1/2 కిలోమీటర్ల దూరం కొండను తొలచి సొరంగం వేయడం ద్వారా వజ్రాలపాడు వద్ద ఉన్న కొండల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడిన పెద్ద చెరువులో నీటిని నింపి ఆ నీటిని ఎత్తిపోతల ద్వారా నాలుగు మండలాలలోని సుమారు 37 గొలుసు కట్టు చెరువులను నింపవచ్చు. తద్వారా 55 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు అని ప్రతిపాదించింది. 1955 డిసెంబర్‌లో ప్రారంభమైన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం 1967లో పూర్తయింది.

మహారాష్ట్రలోని మహదేవ్ పర్వత శ్రేణుల్లో పుట్టిన కృష్ణా నది అనేక ఉపనదుల్ని కలుపుకుంటూ మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ భూములకు నీరందిస్తూ 1400 కి.మీ. ప్రయాణం చేసి దివిసీమల్లోని హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. కృష్ణానదిపై లక్షల కోట్ల వ్యయంతో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్ట్ (కర్నాటక), జూరాల, నాగార్జునసాగర్ (తెలంగాణ), శ్రీశైలం, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ (ఆంధ్రప్రదేశ్) లాంటి ప్రాజెక్టులతో పాటు అనేక ఎత్తిపోతల పథకాల కింద నీటిని పంట పొలాలకు మళ్లిస్తున్నారు. కానీ కేవలం 2 1/2 కిమీ కొండను తొలచి టన్నెల్ ద్వారా 55 వేల ఎకరాలకు సాగునీరందించే అతితక్కువ ఖర్చుతో కూడిన వరికపూడి సెల ప్రాజెక్ట్ నిర్మించడానికి ఏ ప్రభుత్వమూ శ్రద్ధ చూపడం లేదు. గత ఆరు దశాబ్దాలుగా పల్నాడు ప్రాంత ప్రజలు సాగునీరు, తాగునీటి కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

వరికపూడి సెల ప్రతిపాదిత ప్రాంతానికి కేవలం 10 కి.మీ. దూరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఉంది. వీరి కళ్ల ముందే కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతూ దిగువన ఉన్న డెల్టా ప్రాంతానికి మూడు పంటలకు, చేపల చెరువులకు, పెట్టుబడిదారుల కంపెనీలకు నీరందిస్తుంటే వీళ్లు మాత్రం సాగునీరు కాదు గదా! గొంతు తడుపుకోవడానికి గుక్కెడు తాగునీరు కూడా దక్కని స్థితిలో ఉన్నారు.

పల్నాడు ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోయి తాగునీరు కూడా అందుబాటులో ఉండదు. కిలోమీటర్ల కొద్ది నడిచివెళ్లి సెలిమెల్లో, బావుల్లో నీరు తాగడం ద్వారా అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. పిల్లలు వికలాంగులుగా పుడుతున్నారు. ఫ్లోరిన్ వాటర్ ప్రభావం వల్ల కాళ్లు, చేతులు వంకర్లు పోతున్నాయి. ఈ ప్రాంత యువకులకు బంధువులు కూడా పిల్లనివ్వడానికి వెనుకాడుతున్నారని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో 1990లలో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ వరికపూడి సెల ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మించింది. ఆ నాలుగు మండలాల్లోని ప్రతి గ్రామంలో అన్ని కులాల, వర్గాల ప్రజలతో కమిటీలు వేసింది. 'వరికపూడి సెల జలసాధన సమితి' ఏర్పాటు చేసి మండల కార్యాలయాల ముందు ధర్నాలు, ఆఫీసుల ముట్టడి కార్యక్రమాలు, రాస్తారోకోలు లాంటి ఆందోళన కార్యక్రమాలు చేయించింది. ఆ ఉద్యమ ఫలితంగా 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిరిగిరిపాడు వద్ద శిలాఫలకాన్ని వేసి త్వరలో ప్రాజెక్ట్ నిర్మాణం చేపడతానని వాగ్దానం చేశాడు.

2008లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గంగులకుంట వద్ద శంఖుస్థాపన చేశాడు. టెండర్లు పిలిచి రూ. 197.7 కోట్లు ప్రాజెక్టు నిర్మాణానికి కేటాయించాడు. ఆయన మరణంతో ప్రాజెక్ట్ ఆగిపోయింది. ప్రస్తుతం రెండు శిలాఫలకాలు శిథిలావస్థలో ఉన్నాయి. తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి, మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రులయ్యారు. యర్రగొండపాలెం, మాచర్ల, వినుకొండ ఎంఎల్‌ఏలు మారుతునే ఉన్నారు. కానీ పల్నాడు ప్రజల బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లోనే అభివృద్ధి చెందిన జిల్లాగా గుంటూరు జిల్లాకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. సముద్రతీర ప్రాంతం, విలువైన ఖనిజ సంపద, సిమెంట్ తయారీకి అవసరమైన ముడిసరుకులు, గ్రానైట్, నాపరాయి నిల్వలు అధికంగా ఉన్న జిల్లా. సిమెంట్ ఫ్యాక్టరీలు, సున్నపు బట్టీలు ఉన్నాయి. అంతేకాదు సంవత్సరం పొడవునా ఆహార, వాణిజ్య పంటలు పండే డెల్టా భూములున్న జిల్లా. వర్తకం, వాణిజ్య, ఎగుమతి, దిగుమతి సుంకాలు, ఆదాయ పన్నుల రూపంలో రాష్ట్రం, కేంద్ర ఖజానాకు

ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చే జిల్లా. నేడు రాజధానికి కేంద్రమైన గుంటూరు జిల్లాలో భూముల రేట్లు లక్షల నుంచి కోట్లకు పెరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ఊపందుకుంది.

అయితే ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమే. ఇంతగా అభివృద్ధి చెందిన జిల్లాల ఆకలి, దప్పికతో అల్లాడుతున్న పల్నాడు ప్రాంతం కూడా ఉంది. కొండలు, గుట్టలు, రాళ్లు, చిట్టడవులతో నిత్యం కరువు, కాటకాలతో విలవిల్లాడే ప్రజలు పల్నాడులో జీవిస్తున్నారు. జిల్లాలో మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, రెంటచింతల, గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్ని పల్నాడు ప్రాంతంగా పిలుస్తారు. పల్నాడులో ఎక్కువ ప్రాంతం వర్షాధార పంటలు వేస్తారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు సరిగా పండక, పండిన పంటకు గిట్టుబాటు ధర రాక అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అనేకమంది రైతులు కిడ్నీలు అమ్ముకొని అప్పులు తీర్చి ఒక కిడ్నీతో కాలం వెల్లదీస్తున్న సంఘటనలు దేశంలో సంచలనం సృష్టించాయి. నిత్యం వలసల కారణంగా పల్లెలు నిర్మానుష్యంగా ఉంటాయి.

ఇదీ మొత్తంగా పల్నాడు ముఖచిత్రం. అయితే పల్నాడు ప్రాంతంలోనే మాచర్ల, గురజాల, కారంపూడి, దాచేపల్లి, పిడుగురాళ్ల మండలాల భూముల్లో సున్నపురాయి నిల్వలు, నాపరాయి ఉండడం వల్ల ఇక్కడి ప్రజల జీవనం మిగిలిన పల్నాడు ప్రాంతం కంటే కొంత మెరుగ్గా ఉన్నమాట వాస్తవమే. ఆ ప్రాంతంలోని ఖనిజ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి భారత పాలక వర్గాలు ఈ మండలాలను కలుపుతూ తిరుపతి, మద్రాస్–హైదరాబాద్ జాతీయ రహదారి నిర్మాణం చేయడం ద్వారా అతికొద్ది మంది ప్రజలు కార్మికులుగా, వేతన కూలీలుగా మారారు. అయినప్పటికీ పిడుగురాళ్ల సున్నపుబట్టీలలో పనిచేసే కార్మికులు పూటగడవడం కోసం మందుల తయారీ ఫ్యాక్టరీలలో ప్రయోగాల కోసం ఎలుకలు, కుందేళ్ల స్థానాలలో చేరి బతుకుల్ని బలి తీసుకుంటున్నారు.

'రైతేరాజు' అంటూ బాకాలూదుతున్న పాలక పార్టీలు రైతులు, రైతుకూలీల గురించి ఏనాడూ పట్టించుకోలేదు. రైతును కిడ్నీలు అమ్ముకునే స్థితికి నెట్టేసి వారి నుండి కారుచౌకగా భూములు స్వాధీనం చేసుకొని పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నాయి. ఇప్పటికే వేలాది ఎకరాలలో 7 సిమెంటు ఫ్యాక్టరీలలో సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నారు పాలకులు. మరో నాలుగు (చెట్టినాడ్, శ్రీ సిమెంట్, మైహోమ్, హమామ్ గ్రూప్స్) కంపెనీల నిర్మాణం జరుగుతుంది. సిమెంట్ ఫ్యాక్టరీలకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా తదితర మౌలిక సదుపాయాలు కల్పించడంలో చూపే ఉత్సాహంలో ఒక్కశాతం పల్నాడు ప్రజలపై చూపినట్లయితే వాళ్ల బతుకులు ఇంత దయనీయంగా ఉండేవి కావు.

ఇరవై సంవత్సరాల క్రితం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసమని గురజాల, దాచేపల్లి, కారంపూడి మండలాల్లోని 9 గ్రామాల రైతుల నుండి ఎపిఐఐసి ద్వారా 1600 ఎకరాలు, రైతుల నుండి ప్రత్యక్షంగా 1100 ఎకరాల భూములు సేకరించారు. ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు ఫ్యాక్టరీలో ఉద్యోగవకాశాలు కల్పిస్తామనే ఒప్పందంతో రైతుల నుండి భూములు తీసుకున్నారు. ఇంతవరకు ఫ్యాక్టరీ నిర్మాణం లేదు, భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగాలూ లేవు. సేకరించిన భూములకు ఇనుప కంచె వేశారు. ఆ భూముల్లో చెట్లు పెరిగి ఆ ప్రాంతమంతా అడవిలా మారింది. క్రూరమృగాలకు, విషసర్పాలకు అడ్డాగా ఉంది. నిరుపయోగంగా ఉన్న భూముల్లో రైతులు సాగుచేసుకునే హక్కు కల్పించండని రైతులు అధికారంలో ఉన్న పార్టీలను డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు రైతుపక్షం ఉన్నట్లు నటించి అధికారం దక్కించుకొని ఫ్యాక్టరీ యాజమాన్యానికి కొమ్ముగాస్తున్నాయి. ఇదీ 15 ఏళ్ల నుండి జరుగుతున్న తంతు.

'అపర భగీరథుడ్ని నేనంటే నేను' అని పోటీలు పడిన వై.ఎస్. రాజశేఖరరెడ్డి గాని, చంద్రబాబు నాయుడు గాని లక్షల కోట్లలో టెండర్లు వేసి ప్రతి యేటా వేలకోట్ల రూపాయలు పెంచుతూ కేవలం రెండు వందల కోట్లు (2008లో వైఎస్ ప్రభుత్వం వరికపూడి సెల లిఫ్ట్‌కి వేసిన అంచనా విలువ) ఖర్చు చేసి ప్రాజెక్ట్ నిర్మించకపోవడానికి ముఖ్యమైన నాలుగు కారణాలున్నాయి.

1) గతంలో అది పరిశ్రమలకనుకూలమైన ప్రదేశం కానందువల్ల పెట్టుబడిదారులకు ఊడిగం చేసే అవకాశం లేనందు వల్ల నిర్మాణానికి పూనుకోలేదు. 2) నేడు ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణం ద్వారా భూముల రేట్లు అనేక రెట్లు పెరగబోతున్నవి కాబట్టి రైతులకు భూమిపై భరోసా కల్పిస్తే వారు భూముల్ని వదులుకోరు. కాబట్టి సాగునీటి అవకాశం కల్పించకుండా రైతుల నుండి తక్కువ ధరకు భూములు కొల్లగొట్టాలంటే వరికపూడి సెల నిర్మాణం జరగకూడదు. 3) ప్రాజెక్టులన్నీ అగ్రకుల భూస్వాముల భూములు తడపడానికి, పెట్టుబడిదారుల పరిశ్రమల కోసమే నిర్మాణమౌతాయి. వరికపూడి సెల ప్రాజెక్ట్ నిర్మాణం చేయడం వల్ల ఆ నాలుగు మండలాల్లో మెజారిటీగా జీవిస్తున్న లంబాడాలు, దళితులు, మైనారిటీలు, చిన్నసన్నకారు రైతాంగానికే ప్రయోజనం కలుగుతుంది కాబట్టి పాలక పార్టీలు ప్రాజెక్టుపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. 4) బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణం ద్వారా ప్రభుత్వాల మెడలు వంచి సాధించుకునే స్థితిలో ఉద్యమాలు లేని కారణంగా కూడా వరికపూడి సెల ప్రజల కలగానే మిగిలింది.

ఇటీవల 2019 ఎన్నికల నేపథ్యంలో వరికపూడి జలసాధన సమితి ఆ నాలుగు మండలాలలోని ప్రధాన గ్రామాలలో సభలు, సదస్సులు నిర్వహించింది. స్థానిక సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిల సహకారంతో ఆ సభలు జరిగాయి. కాబట్టి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ముందువరసలో నిలబడి ఓట్ల పబ్బం గడుపుకున్నారు.

స్థానిక కుల సంఘాలు, జర్నలిస్టులు పాదయాత్రలు, ర్యాలీలు చేసి ఎన్నికల ప్రకటన వెలువడక ముందే వరికపూడి సెల ప్రాజెక్ట్ ప్రారంభించాలని లేదా సచివాలయాన్ని దిగ్బంధం చేస్తామని చంద్రబాబు ప్రభుత్వానికి అల్టిమేటమ్ జారీ చేశారు. చంద్రబాబు మరీ అంత అమాయకుడేం కాదు గదా? అందుకే ఏమాత్రం పట్టించుకోలేదు. అత్యంత విషాదకర విషయమేమంటే గతంలో లాగా ఏ రాజకీయ పార్టీ కూడా కనీసం ఓట్ల కోసమైనా వరికపూడి సెల ప్రస్థావనే తేలేదు. పార్లమెంటరీ రాజకీయ పార్టీల కతీతంగా నిజాయితీతో కూడిన నిబద్ధత కలిగిన నాయకత్వంలో బలమైన ప్రజా ఉద్యమం ద్వారా మాత్రమే వరికపూడి సెల ప్రాజెక్టును సాధించుకోగలుగుతాం.

(రచయిత కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్) వీ

ఆదివాసుల అస్తిత్వానికి సుప్రీం సవాల్

బహుళజాతి, కార్పొరేట్ సంస్థల ఆర్థిక ప్రయోజనాల కోసం ఆదివాసులను అడవి నుంచి వెళ్లగొట్టాలనే ప్రభుత్వ కుట్రలో భాగంగా వచ్చిందే సుప్రీంకోర్టు తీర్పు అని అంటున్నారు **ఎం. శ్రీనివాస్**

2019 ఫిబ్రవరి 13న దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదివాసుల సాగులో ఉన్న అటవీ భూముల విషయంలో ఇచ్చిన ఆదేశాలు ఈ దేశ మూలవాసులైన ఆదివాసుల, ఇతర సంప్రదాయ వాసుల అస్తిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. భారత దళారీ పాలకుల ప్రజా ప్రతికూల విధానాలకు మరోసారి సాధికారత కల్పించింది సుప్రీం ఆదేశం. నేడు దేశంలో 'అభివృద్ధి', 'వృద్ధిరేటు పెరుగుదల' పేరిట భూసేకరణ విచ్చల విడిగా జరుగుతున్నది. ఇందుకు పంట పొలాలు, సాగుకు అనుకూలమైన భూములంటూ మినహాయింపు ఏమీ లేదు. 'అభివృద్ధి', 'వృద్ధిరేటు పెరుగుదల' తదితర పేర్లతో సెజ్‌లు, కారిడార్లు, ఇతర రవాణా మార్గాలు, భారీ ప్రాజెక్టులు, వనసంరక్షణ పార్కుల నిర్మాణాలు, రిజర్వ్ ఫారెస్టు, పర్యావరణ పరిరక్షణ, హరిత హారం, అభయారణ్యాలు మొదలైన వాటికి ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా, అందులో భాగంగానే భూ సేకరణ జరుపుతున్నట్లుగా ప్రభుత్వాలు చెబుతూ వస్తున్నాయి. అభివృద్ధి జరగాలంటే ప్రజలు కొంత ఇబ్బందులను ఎదుర్కొనక తప్పదని చెబుతున్నాయి. వాస్తవాచరణలో ఇవన్నీ ప్రజా వ్యతిరేక చర్యలే. ప్రధానంగా ఆదివాసుల జీవన విధ్వంస చర్యలేనన్నది గుర్తించాలి. బడా కార్పొరేట్ పరిశ్రమల కోసం, వాటి ఆర్థిక ప్రయోజనాల కోసం, ముఖ్యంగా ఆదివాసుల జీవిత పునాదుల కింద నిక్షిప్తమై ఉన్న అత్యంత విలువైన అపార ఖనిజ సంపదను, ఇతర వనరులను సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు దోచి పెట్టడానికి నిరుపేద, భూమిలేని ఆదివాసుల సమూహాలను ఖాళీ చేయించి అటవీ భూములను ఆక్రమింప చేయడానికి భారత దళారీ పాలకవర్గం అనేక ప్రయత్నాలు ఇప్పటికే చేస్తూ వస్తోంది. ఈ పూర్వ రంగంలో సర్వోన్నత న్యాయస్థానం 'అక్రమ ఆదివాసులను', 'దురాక్రమణ ఆదివాసులను' అన్న సాకుతో అటవీ భూముల నుండి వారిని తొలగించాలంటూ 2019 ఫిబ్రవరి 13న ఇచ్చిన ఆదేశాలు దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టి, అడవిబిడ్డల జీవితాలను విధ్వంస పరుస్తూ పాలకులు తీసుకుంటున్న చర్యలకూ, అమలు చేస్తున్న విధానాలకూ సాధికారతను కల్పించే తీర్పు ఇది.

చరిత్ర క్రమంలో ...

బ్రిటిష్ వలస పాలనకు పూర్వం భారత సమాజంలోని ఆదివాసుల ప్రాంతాలలో అక్కడ వారికే (ఆదివాసుల, గిరిజన తెగలకు) సర్వ హక్కులు ఉండేవి. వలస పాలకుల తమ ఆర్థిక, రాజకీయ, పాలన ప్రయోజనాల దృష్ట్యా ఆదివాసులు అప్పటి వరకు కలిగి ఉండి అనుభవిస్తూ వచ్చిన సర్వ హక్కులను వలస పాలకులు రద్దు చేశారు. అప్పటి వరకు తమకు తామే రాజులుగా పాలనాధికారం కలిగి స్వేచ్ఛగా ఉండే ఆదివాసుల తెగలను బ్రిటిష్ పాలకులు ప్రభుత్వ పాలన పేరిట చట్టాల పరిధిలోకి తెచ్చారు. చట్టాల చట్రంలో వారిని బందీలను చేయడం ద్వారా బ్రిటిష్ వలస పాలకులు తమ పాలనా వ్యవహారాలను, అడవులపైన, అటవీ ఉత్పత్తులపైన అధికారాలను సులభంగా చలాయించవచ్చునని భావించి, తలపెట్టిన ఆ ప్రక్రియకు ఆనాడు దేశంలోని స్థానిక కులాధారిత భూస్వామ్య వ్యవస్థ ఆధిపత్య శక్తులు, సంస్థానాధీశులు పూర్తిగా సహకారాన్ని అందించారు. వారి సహకారంతో బ్రిటిష్ పాలకులు ఆదివాసుల తెగల జీవిక అవసరాలకు వ్యతిరేకంగా అడవుల రక్షణ పేరుతో పలు రకాల చట్టాలకు రూపకల్పన చేసి, ఆ చట్రం పరిధికే వారిని పరిమితం చేశారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. వ్యవసాయం సమిష్టి పరిధి నుండి వ్యక్తిగత ఆస్తిగా మారడం, భూమికి విలువ ఏర్పడి క్రయ విక్రయాల పరిధిలోకి రావడంతో భూ ప్రాధాన్యత పెరిగింది. అనేక రకాల మినరల్స్ అటవీ ప్రాంత భూముల్లో నిక్షిప్తమై ఉండడమే. 'జల్-జంగల్-జమీన్ హమారా' నినాదంతో కొమురం భీం సారథ్యంలో ఆదిలాబాద్ అడవి ప్రాంతంలో జరిగిన తిరుగుబాటు నిజాం ప్రభుత్వాన్ని కుదిపేసింది. ఈ తిరుగుబాటుకు భూములపై యాజమాన్యపు హక్కు, పట్టీదార్, షావుకార్ల దోపిడీ పీడనలే ఇతివృత్తంగా ఉన్నాయి. ఆ విధంగా ఆరంభమైన ఆదివాసుల సమూహాల ప్రతీకూల చర్యలు, సంబంధిత చట్టాలకు వ్యతిరేకంగా 1947 అధికార మార్పిడికి ముందూ తర్వాత కాలంలో ఈశాన్య రాష్ట్రాలలోనూ, మధ్య భారతంలోనూ బీర్సా ముండా నాయకత్వాన, దక్షిణ భారతంలో కర్ణాటక పరిసరాలు మొదలు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలలో కొమురం భీం, రాంజీగోండు, అల్లూరి సీతారామరాజు తదితరుల నాయకత్వాన ఆదివాసులు చేపట్టిన పోరాటాలు, నిర్వహించిన తిరుగుబాట్ల వల్ల ఆదివాసుల, గిరిజనుల ఆశలు, ఆకాంక్షలను డా. బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పడిన రాజ్యాంగసభ అనివార్యంగా గుర్తించవలసి వచ్చింది. తరువాత వాటిని రాజ్యాంగంలో చేర్చడానికి కృషి చేసింది. డా. బి.ఆర్.అంబేద్కర్ ప్రధానంగా రాజ్యాంగ నిర్మాణ సభ్యుడయిన జైపాల్ సింగ్ ముండా కృషివలన ఆదివాసుల హక్కులు, వాటి రక్షణకు సంబంధించిన నిబంధనలన్నింటిని రాజ్యాంగంలోని 5వ షెడ్యూలులో చేర్చి, కట్టుదిట్టం చేశారు. అయితే రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటికి 1965-66 వరకు భారత పాలకవర్గాలు ఈ విషయాన్ని పట్టించుకోకపోగా, ఆదివాసుల పట్ల బాధ్యతా రాహిత్యాన్ని, నేరస్థ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. తర్వాత కాలంలో ముందుకు వచ్చిన నగ్జల్బరీ, తేబాగ, ఉన్నంవాయిలార్ సాయుధ రైతాంగ పోరాటం, శ్రీకాకుళం, గోదావరి లోయ పరివాహక ప్రాంతాలలో ఆదివాసుల గిరిజన సాయుధ, ప్రతిఘటనా పోరాటాలు కావచ్చు పాలకులు ఆదివాసుల వైపు దృష్టి సారించడానికి, కొన్ని చర్యలు తీసుకోవడానికి దోహదం చేశాయి. ఆదివాసుల హక్కులు, వారి సంక్షేమం,

అభివృద్ధికి సంబంధించిన చట్టాల రూపకల్పన, అమలు వంటి వాటికి అనివార్యతను చేకూర్చాయి. ఐటిడిఎల ఏర్పాటు, ట్రైబల్ సబ్‌ప్లాన్, 1/70, 'పెసా', 2006 అటవీ హక్కుల చట్టం, 2013 భూసేకరణ చట్టం వంటి చట్టాలు ఈ క్రమంలో వచ్చినవే. అయితే ఆ విధంగా రూపొందించబడ్డ చట్టాలు, తీసుకుంటున్న చర్యలు, గత వలసవాదులు రూపొందించిన చట్టాల పునాదుల నుండి మాత్రం మౌలికంగా బయట పడడం లేదు. కానీ రకరకాల పేర్లతో చట్టాలు సవరించబడ్డాయి. ఈ క్రమంలో ఆ సవరణలు ఆదివాసులు జీవించే హక్కును హరించే స్థాయికి అవి చేరుకుంటున్నాయి.

చరిత్రను జాగ్రత్తగా గమనిస్తే బ్రిటిష్ వలస పాలకులు ఆదివాసులను భూ పట్టా ఇచ్చి, ఒక్క భూభాగానికే కట్టివేయాలన్న ప్రయత్నాలను ఆదివాసులు తీవ్రంగా వ్యతిరేకించడమే కాక ప్రతిఘటిస్తూ వచ్చారు. సంప్రదాయ ఆదివాసుల జీవనశైలి బ్రిటిష్ వలస పాలకుల ఆర్థిక, రాజకీయ, పాలనా ప్రయోజనాలకు అడ్డుకట్టగా నిలిచింది. అందువల్ల బ్రిటిష్ వలస పాలకులు తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం అడవి విస్తరించి ఉన్న భూభాగాన్ని రిజర్వు చేశారు. ఈ చర్యలతో ఆనాడే దేశమంతటా ఆందోళన చెలరేగింది. ముఖ్యంగా బస్తర్ ఏరియాలో ఆదివాసులు తీవ్ర స్థాయిలో ఆందోళన జరిపారు. ప్రజల నుండి ప్రధానంగా ఆదివాసుల నుండి ఎదురైన తీవ్ర ప్రతికూల పరిస్థితికి కారణాలను తెలుసుకోవడానికి ఆ ప్రాంతాలకు (ప్రధానంగా బస్తర్ ప్రాంతానికి) ఒక ఉన్నతాధికారిని బ్రిటిష్ ప్రభుత్వం పంపింది. ఆ అధికారి విచారణలో 'తమను (ఆదివాసులు) అడవుల్లోకి రానివ్వడం లేదని, అటవీ ఫలసాయం తెచ్చుకోనివ్వడం లేదని, లంచం అడుగుతున్నారని' ఆదివాసులు ఫిర్యాదు చేశారు. మరొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ప్రతి గూడెంలో ఒక బడి ఏర్పాటు చేయాలని, ఎందుకంటే ఇంటికి ఒకరు చదువుకున్నా చట్టాల గురించి, చట్టాలలోని నియమ నిబంధనల (రూల్స్) గురించి ఆ చదువుకున్న వ్యక్తి గ్రామంలో ఉన్న ప్రజలందరికీ చెబుతాడనీ, వాటిని ఉల్లంఘించి వేధిస్తున్న అధికారుల మీద ఫిర్యాదు చేస్తాడనీ ఆదివాసులు ఆ అధికారిని కోరారు. తగిన హామీ అధికారి నుండి లభించినప్పటికీ విచారకరమైన విషయం ఏమిటంటే ఆ అధికారి ఇచ్చిన విచారణ ఆధారంగా అక్కడక్కడ బడులు పెట్టారు కానీ, రూల్సు మాత్రం చెప్పలేదు. ఇదే విషయాన్ని ఢిల్లీ యూనివర్శిటీకి చెందిన ప్రొ. నందిని సుందర్ వందేళ్లకు పైగా బస్తర్ ఆదివాసుల ప్రాంతంలోని ఉద్యమ చరిత్రను గ్రంథస్తం చేసిన 'సావరిన్–సబాల్టరన్' అనే తన గ్రంథంలో పేర్కొన్నది. నైజాం సంస్థానానికి చెందిన తెలంగాణ ప్రాంతంలో జల్–జంగల్–జమీన్ హమారా నినాదంతో కొమురం భీం సారథ్యంలో జరిగిన పోరాట తీవ్రతను చవిచూసిన నిజాం ప్రభుత్వం ఆ ఆందోళనకు నిర్దిష్ట కారణాలను, పరిష్కారాలను పరిశీలించ డానికి తన ప్రభుత్వానికి గిరిజన వ్యవహారాల ప్రత్యేక సలహాదారుడైన హైమన్‌డార్ఫ్ (సామాజిక శాస్త్రవేత్త) ద్వారా అధ్యయనం చేయించిందన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. ఈ పూర్వ రంగంలో నిజాం ప్రభుత్వానికి గిరిజన వ్యవహారాల ప్రత్యేక సలహాదారుడిగా ఉన్న హైమన్‌డార్ఫ్ నిజాం ప్రభుత్వంతో జరిపిన చర్చల వల్ల ఆదివాసుల గిరిజనులకు భూములతోపాటు భూ యాజమాన్యపు హక్కు లభించింది. డార్ఫ్ ఇచ్చిన సలహాలు చేసిన సూచనల ఆధారంగానే 1959లో 'భూ బదలాయింపు చట్టం – 1959' వచ్చింది. ఇదే తరువాత కాలంలో 1/70 యాక్టుగా వచ్చింది. ఎస్.ఆర్. శంకరన్, బి.డి. శర్మలతో ఏర్పాటైన కమీషన్లు విలువైన సూచనలు, సిఫార్సులను చేయడానికి డార్ఫ్ ఇచ్చిన నివేదికలే ఆధారం. ఆచరణలో పాలకులు వాటిని బుట్టదాఖలు చేశారు.

2006 అటవీ హక్కుల చట్టం నేపథ్యం

ఆదివాసులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్ది అటవీ ప్రాంతంలో మూలవాసులైన ఆదివాసులు అన్ని విధాలుగా జీవించడం కోసం, వారు అక్కడ జీవించడానికి అడవులపై వారికుండే హక్కులను గుర్తించి, పరిరక్షించడానికి 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం – 2006'ను తీసుకు వస్తున్నట్లు నాటి యుపిఎ–1 మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రకటించింది. అటవీ భూమిపైనా, దాని ద్వారా లభించే సంపదపైనా, ఆదివాసులకు ఉండే వ్యక్తిగత, సాముదాయక హక్కులను ఈ చట్టం గుర్తిస్తుందని పేర్కొన్నారు. అడవులపై యాజమాన్యం ఆదివాసులకే అప్పగించడం, నిజమైన ఆదివాసుల గుర్తింపు వారి హక్కులను పరిరక్షించడం వంటి బాధ్యతలను గ్రామ సభలకు ఈ చట్టం అప్పగించింది. కానీ ఆదివాసుల గుర్తింపు బాధ్యత అత్యంత సంక్లిష్టమైనది. ఈ ప్రక్రియ కూడా చాలా కష్టంతో కూడుకున్నది. కనుక ఆచరణలో ఈ ప్రక్రియ కూడా గ్రామ సభలను నిస్సహాయ స్థితికి నెట్టింది. 'రక్షిత అడవులైన రిజర్వుర్డు ఫారెస్టు అయినా, అభయారణ్యాలైనా 2005 డిసెంబర్ 5 కన్నా ముందునుండి 10 ఎకరాలలోపు వ్యవసాయం చేసుకుంటున్న వారికి అక్కడ పూర్తి హక్కులు ఉంటాయి. నివాస హక్కులు, ఉమ్మడి వనరులపై హక్కులు, సాగు చేసుకునే హక్కులు, తదితర 13 రకాల హక్కులు ఆదివాసుల గిరిజనులు కలిగి ఉంటారని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన అటవీ హక్కుల చట్టం పేర్కొంటుంది. నిజానికి ఈ చట్టం అడవులపై ఆదివాసులకు ఉండే సహజమైన హక్కులను గుర్తించడం లేదన్నది బహిరంగ రహస్యమే. కేవలం ఆదివాసులు తమ జీవిక కోసం (జీవించడానికి) అటవీ ప్రాంతంలో లభించే సంపదను వినియోగించు కోవడానికి మాత్రమే అవకాశం కల్పిస్తుంది. అసలు 2006 అటవీ హక్కుల చట్టం రూపకల్పనకు దారితీసిన కారణాలు ఏమిటన్నదే ఇక్కడ కీలకమైన అంశం.

2002లో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్న కేంద్ర ప్రభుత్వం పట్టా హక్కులు లేని ఆదివాసులను సాగు భూముల నుండి తొలగించాలని నిర్ణయించి తొలగించింది. 2002లోనూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడవిలో ఆదివాసుల హక్కులను క్రమబద్ధీకరించకుండా అక్కడ భూములు, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి నివసిస్తున్న ఆదివాసుల ప్రజలను తొలగించాలన్న ఉద్దేశంతో నాటి ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. ఆదివాసుల హక్కుల కోసం అహో రాత్రులు కృషి చేసిన ప్రజాస్వామికవాది, ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్‌గా పని చేసిన బిడి శర్మ 'ఆదివాసులు – అడువులు' అనే అంశంపై కేంద్ర ప్రభుత్వానికి 1990లో ఒక నివేదికను సమర్పించాడు. నాటి కేంద్ర ప్రభుత్వం ఈ నివేదిక ఆధారంగా ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. సర్క్యులర్ నెంబర్. 13–1/90ఎఫ్(1) నుండి ఎఫ్ (6) వరకు నెంబర్లు గల ఆరు నిబంధనలను రూపొందించబడిన సర్క్యులర్ ఇది. 1985 సెప్టెంబర్ 25కు ముందు నుండి అడవులలో భూములు

అనుభవిస్తున్న మూలవాసుల ప్రభుత్వ క్రమబద్ధీకరణ విధానానికి లోబడి రిజర్వ్డ్ ఫారెస్టులో పట్టా పొందే హక్కును కల్పిస్తూ ఆ పరిధిలోకి రానివారందరికీ తగు రూపంలో పునరావాసం కల్పించే లక్ష్యంతో ఈ ఆరు నిబంధనలు రూపొందించబడ్డాయి. అయితే, తర్వాత కాలంలో ఈ ఆరు నిబంధనలలో మొదటి నిబంధన మినహా మిగతా ఐదు నిబంధనలను పక్కన పెట్టింది. ఈ ఐదు నిబంధనలు ఆదివాసుల గిరిజన తెగలకు సానుకూలంగా ఉండటమే ఇందుకు కారణం. మొదటి నిబంధనను అమలు చేసింది.

ఈ నిబంధన ప్రకారం 1985 అక్టోబర్ 25 కంటే ముందు నుండి అడవి భూములను అనుభవిస్తున్నవారికి, అంటే 80 శాతం భూములను అనుభవిస్తున్న (వలస వచ్చిన) వారికి హక్కులు కల్పించే అవకాశాన్ని ముందుకు తెచ్చింది. మిగతా వారందరినీ అంటే మూలవాసులను బలప్రయోగంతో తరిమివేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన అటవిశాఖ అధికారి ఆదేశాలు జారీ చేసింది.

దీనితో సుమారు దశాబ్దకాలం పాటు వివిధ రూపాల్లో ఆదివాసుల గిరిజన తెగలు పలు రూపాల్లో ఉద్యమ, పోరాటాలను చేపట్టాయి. ఆ ఉద్యమాలు తీవ్రతరమైన పూర్వ రంగంలో దిలీప్‌సింగ్ భూరియా ఆధ్వర్యంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నిపుణుల బృందం అటవీ ప్రాంతాలలో మూలవాసుల ఆధారాల మౌలిక స్వరూపం, వాటి ఆధారాలను సూచిస్తూ 1995 జనవరిలో ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా భూరియా కమిటీ సిఫారసులలో ప్రధానమైన ఆదివాసులకు 'స్వయం పాలన' ప్రాంతాలను ఏర్పాటు చేయాలని నొక్కి చెప్పిన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్వపక్షం చేసింది. 1996 డిసెంబర్ 24న షెడ్యూల్డ్ ప్రాంతాల పంచాయితీ చట్టం (పెసా) పేరుతో ఒక చట్టాన్ని ఆమోదించింది. నిజానికి ఇది చట్టం కాకపోయినప్పటికీ ఒక చట్టంగా 73వ రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించవలసిన అధికారమిది. భూరియా కమిటీ సిఫారసుల ద్వారా గ్రామ సభలకు చాలా పరిమితమైన అధికారాన్ని కల్పిస్తూ మూల ఆదివాసుల గిరిజన తెగలకు అనుకూలమైన అంశాలను అమలు చేయకుండా జీవో.నెం.90ను జారీ చేసింది. ఆదివాసులకు లభించవలసిన సంపూర్ణ అధికారపు హక్కులు లభించకుండా పాలకులు ఇక్కడ కూడా చాలా కుట్రపూరితంగా వ్యవహరించారు. ఇక్కడొక కీలక అంశాన్ని గమనంలో తీసుకోవలసి ఉంటుంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు పునాదులు పడి, విస్తరిస్తున్న కాలమది. భారతదేశంలోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నిక్షిప్తమై ఉన్న ఖనిజ సంపదను విదేశీ బహుళజాతి సంస్థలకు దోటిపెట్టే ప్రక్రియ కనుగుణంగా అటవీ విధానానికి రూపకల్పన జరుగుతూ వచ్చింది.

1980 నాటికి ఉన్న అటవీ సంరక్షణ చట్టాన్ని మార్చి 1988లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 'జాతీయ అటవీ విధానా'న్ని ప్రకటించింది. ఇది ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకు జరిగింది. 1996లో వచ్చిన 'పెసా' చట్టం పట్ల తీవ్ర వ్యతిరేకత భావంతో ఉన్న కార్పొరేట్ కంపెనీలు, స్థానిక భూస్వాములు, అటవీ ఉన్నత అధికారులలో ఒక సెక్షన్ ఒత్తిడితో 2002 మే 8న ఆక్రమణ దారులైన మూలవాసులను బలవంతంగా తొలగించడానికి 'టైమ్‌బాండ్ యాక్షన్ ప్లాన్' పేరిట 'ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ శాఖ' రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలతో రెచ్చిపోయిన ఫారెస్టు శాఖ. టైం బాండ్ యాక్షన్ ప్లాన్ అమలుకు పూనుకున్నది. ఈ ప్రక్రియ 2002 నుండి 2004 మార్చి వరకు కొనసాగింది. ఈ బలవంతపు గెంటివేతల వలన దేశవ్యాప్తంగా వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారమే 12,400 ఎక్టార్ల అటవీ భూముల నుండి సుమారు 3 లక్షల మంది ఆదివాసులను బయటకు పంపడం ద్వారా వారు అన్ని విధాలుగా నష్టపోయారు. మరో 50 లక్షల మంది జీవితాలు పాక్షికంగా నష్టపోయాయి.

ఈ సందర్భంగా పోలీసులు పంటల విధ్వంసం, స్త్రీలపై అత్యాచారాలు, హత్యలకు కూడా తెగబడ్డారు. ఈ పరిణామాలపై సమగ్రంగా అధ్యయనం జరిపిన సి.ఆర్. బిజోయ్ తన నివేదికలో ఈ విషయాల్ని పేర్కొన్నాడు. విప్లవ కమ్యూనిస్టు సంస్థల నుండి ఇతర సామాజిక పౌర హక్కుల ఉద్యమాల నుండి దేశంలో ముందుకు వచ్చిన తీవ్ర వ్యతిరేకత, ప్రతిఘటన వల్ల తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ (యుపిఎ –1) ప్రభుత్వం పరిస్థితుల్లో ఉన్న తీవ్రతను గమనించి 2005 డిసెంబర్ నాటికి ఆదివాసుల సాగులో ఉన్న భూములకు సంబంధించి ప్రతి కుటుంబానికి 10 ఎకరాల వరకు క్రమబద్ధీకరించి హక్కులు కల్పిస్తామని చెప్పింది. పాలకులు ఈ విధంగా రూపొందించిన అటవీ హక్కుల గుర్తింపు చట్టం ముసాయిదా తర్వాత కాలంలో అంటే 2006లో 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం – 2006' చట్టంగా రూపొందింది. ఈ క్రమంలో వచ్చిన 2006 అటవీ హక్కుల గుర్తింపు చట్టానికి రెండేళ్ల తర్వాత రూపొందించిన నియమావళి 2008 నుండి అమల్లోకి వచ్చింది. ముందే పేర్కొన్నట్లు ఈ చట్టంలో అనేక లోపాలు ఉన్నప్పటికీ ఇవన్నీ ఆదివాసులకు ప్రతికూల అంశాలే అయినప్పటికీ ఏదో మేరకు ఆదివాసులకు ఉపకరించే కొన్ని అంశాలు ఇందులో ఉన్నాయి. దీనిలో ఆదివాసులకు, ఇతర సంప్రదాయ వాసులకు 10 ఎకరాల సాగుభూమి పైన హక్కు లభించబోతుందన్న ప్రభలమైన ఆశ ఏర్పడింది. అయితే ఆచరణలో మాత్రం ఇది పచ్చి బూటకమని స్పష్టమవుతూ వచ్చింది. తాజా సుప్రీంకోర్టు ఆదేశం కాస్తా అందుకు మరింత బలాన్ని చేకూర్చింది. ఈ చట్టంలో ఉన్న అనేక బలహీనతలు, లోపాలు, ఆదివాసుల గిరిజనులకు నిర్దేశించబడిన ప్రతికూల అంశాలు సవరించి తమ హక్కులను కాపాడాలని నాటి నుంచే వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తున్న ఆదివాసులకు సుప్రీంకోర్టు 2019 ఫిబ్రవరి 13న ఇచ్చిన తాజా తీర్పుతో వారి ఉనికికే తీవ్ర ప్రమాదం ఏర్పడింది.

సుప్రీంకోర్టు ఆదేశం ఏం చెబుతుంది?

2006 చట్టంలో రూపొందించిన 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం' అమలులో భాగంగా 2005కు పూర్వం సుదీర్ఘ కాలం ఆదివాసుల ప్రాంతాలలో వారితో మమేకమై, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేసిన ప్రజా పక్షపాతి, హక్కుల ఉద్యమ కార్యకర్త అయిన శ్రీ ఎస్ఆర్. శంకరన్ (ఐఏఎస్) అధ్యక్షతన ఏర్పాటైన అటవీ హక్కుల గుర్తింపు చట్టం రూపకల్పనలో కీలకాంశమైన రూల్స్ రూపొందించే ప్రక్రియకు సంబంధించిన కమిటీలో ప్రొ. నందిని సుందర్ ఒకరు. ఈ కమిటీ అటవీ హక్కుల చట్టంలో ఆదివాసుల, గిరిజన తెగల మనుగడకు అవసరమైన జీవనాధార వనరుల పరిరక్షణకు, వారు జీవించే హక్కులలో భాగమైన అస్థిత్వపు హక్కుల రక్షణకు అవసరమైన నిర్దిష్ట నిర్మాణాత్మకమైన

చర్యలు, వాటి సాధికారతకు సాపేక్షికంగా ప్రయోజనం చేకూరే విధంగా కొన్ని రూల్స్‌ను రూపొందించారు. అయితే ఈ రూల్స్‌ను పాలకులు షొకేసుల్లోనే భద్రపరిచి క్రమంగా వాటిని బుట్టదాఖలు చేశారు. తర్వాత కాలంలో అటవీ హక్కుల గుర్తింపు చట్టానికి సంబంధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన నియమ నిబంధనలను స్థూలంగా అటవీ ప్రాంత నిర్వహణ ప్రక్రియనే సంక్లిష్టంగా మార్చాయి.

ఈ క్రమంలో ఆదివాసులు తమ ఆధీనంలోని భూములను గుర్తించి, వాటిపై యాజమాన్యపు హక్కులు కల్పించడం కొరకు దరఖాస్తులను కేంద్ర ప్రభుత్వం కోరింది. ఆదివాసుల రైతులు దరఖాస్తులు పెట్టుకున్న కొన్ని అర్జీలు తిరస్కరించబడ్డాయి. తిరస్కారానికి గురైన అర్జీల తాలూకు ఆదివాసులను భూముల నుండి ఖాళీ చేయించాలని సామ్రాజ్యవాదుల కనుసన్నలలో నిర్వహించబడుతున్న వన సంరక్షణకు చెందిన 'వైల్డ్ లైఫ్ ఫస్ట్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో 2008లో ఒక పిటీషన్ వేసింది. 2006 అటవీ హక్కుల చట్టం వలన అడవుల నరికివేతకు, వాటి ఆక్రమనకు వీలు కల్పిస్తుందని అయినప్పుడు ఈ చట్టానికున్న విలువ ఏమిటని ప్రశ్నిస్తూ చట్టానికి సంబంధించిన నిబంధనల ప్రకారం అటవీ భూములపైన హక్కులను నిరాకరిస్తున్నప్పుడు అటువంటి అనర్హులను ఇంతవరకు ఎందుకు ఆ భూముల నుండి ఖాళీ చేయించలేదంటూ వైల్డ్ లైఫ్ సంస్థ తనర పిటీషన్‌లో కోరింది. ఆ పిటీషన్‌ను సుదీర్ఘకాలం విచారించిన సర్వోన్నత న్యాయస్థానం 2019 ఫిబ్రవరి 13న జస్టిస్ అరుణ మిశ్ర, నవీన్ సిన్హా, ఇందిరా బెనర్జీలతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు 1) చివరిగా తిరస్కరణకు గురైన దరఖాస్తు విషయంలో దరఖాస్తుదారులను అటవీ భూముల నుండి తొలగింపులపై తీసుకున్న చర్యలను తెలియజేస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రమాణ పత్రం దాఖలు చేయాలని, 2) ఆ తొలగింపులను 2019 జూలై 24 లోపు పూర్తి చేయాలని, 3) తిరస్కరణకు గురైన దరఖాస్తుల పున:సమీక్ష ప్రక్రియను ఒకవేల ప్రభుత్వం ప్రారంభిస్తే ఆ ప్రక్రియను నాలుగు మాసాల్లో పూర్తి చేయాలని, 4) తొలగింపులకు ముందు, తర్వాత పరిస్థితిపై ఉపగ్రహ సర్వేను భారత అటవీ సర్వే (ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా) సంస్థ చేపట్టాలని పేర్కొంటూ రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది.

ఈ ఆదేశంతో దేశంలోని 21 రాష్ట్రాలలో అడవులే తమ ప్రపంచంగా, జీవనాధారంగా మనుగడ సాగిస్తున్న మూలవాసులైన ఆదివాసుల కుటుంబాలు సుమారు 23.30 లక్షల మంది కుటుంబాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అటవీ హక్కుల చట్టం వచ్చిన తర్వాత దాని అమలు తీరుపై యుపిఎ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటయిన పార్లమెంటరీ స్థాయి సంఘం అటవీ హక్కుల చట్టం అమలు తీరుపై అప్పటి ప్రభుత్వానికి నివేదించిన 3 నివేదికల్లోనూ చట్టం అమలు తీరు క్షేత్రస్థాయిలో ఘోరంగా ఉన్నదని పేర్కొంటూ ఆదివాసుల, గిరిజనుల ఆశలను అడియాశలుగా మిగిల్చిందని వెల్లడించింది. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే సమగ్ర సర్వే లేకుండా, నిర్దిష్ట కారణాలు తెలపకుండా భూ యాజమాన్యపు హక్కుల కోసం ఆదివాసుల, గిరిజనులు పెట్టుకున్న అర్జీలను సుప్రీంకోర్టు తిరస్కరించింది. వాస్తవానికి 2011లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పులో 'చారిత్రకంగా ఈనాటి 8 శాతం మూల ఆదివాసులే భారతదేశపు అసలైన మూలవాసులని, మిగతా 92 శాతం ప్రజలు బయట ప్రాంతాల నుండి వలసవచ్చిన వారేన'ని పేర్కొన్నది. అదే సుప్రీంకోర్టు ఇవ్వాల ఈ దేశ మూల ఆదివాసుల గిరిజన తెగలను ఆక్రమనదారులని, అక్రమదారులుగా మాట్లాడడం విడ్డూరంగా ఉంది. పైగా భారత ప్రభుత్వం, సుప్రీంకోర్టులు ఆదివాసులు గత నాలుగైదు దశాబ్దాలకు పైగా అనుభవిస్తున్న భూములపై హక్కుల ధృవీకరణకు ఈ మూల ఆదివాసులను మీరు అసలో, నకిలో నిరూపించుకోవాలని ఆర్డర్ చేయడం అత్యంత దుర్మార్గమైనది.

ఇక్కడ ఒక విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం (తగిన అర్హత లేదన్న సాకుతో) తిరస్కరణకు గురైన దరఖాస్తు దారులకు ముందుగా ఆ విషయం తెలపాలి. మరోసారి అప్పీలుకు అవకాశం కల్పించాలి. దరఖాస్తు తిరస్కరణకు గల కారణాలను తెలుసుకోవడానికి, అవసరమైన వివరాలను సబ్‌డివిజన్, జిల్లా కమిటీలను గ్రామ సభ కోరవచ్చు. అంతేకాదు, 2005 పూర్వం నుండి ఆ ప్రాంతంలో ఉన్నట్లు తగిన ఆధారాలు ఉంటే తిరిగి క్లెయిమ్స్ చేసుకోవాలి. అటవీ శాఖ తిరిగి సర్వే చేసుకోవాలి. మరొక విషయం అటవీ హక్కుల చట్టం సెక్షన్ 4(5) ప్రకారం హక్కుల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు భూముల నుండి ఆదివాసులను తొలగించరాదు. తిరస్కారానికి గరైన ఆదివాసుల రైతులను భూముల నుండి తొలగించా లన్న విషయాన్ని చట్టంలో ఎక్కడా పేర్కొనలేదు. సర్వే ప్రక్రియ, తిరిగి దరఖాస్తు చేసుకోవడం, రీ సర్వే చేయడం పూర్తయిన తర్వాత, దరఖాస్తు దారుడు 2వ సారి కూడా సరైన ఆధారాలు చూపకపోతే, ఆ నివేదికను తిరస్కరిస్తే అప్పుడు మాత్రమే ఆ భూముల నుండి తొలగించాలి. కానీ ఆచరణలో ఇవేవీ జరుగడం లేదు. ఇవన్నీ కాగితాలకే పరిమిత మయ్యాయి. ప్రజాస్వామిక పద్ధతిలో ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత అన్ని చర్యలు తీసుకోవాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. అయితే ప్రభుత్వం ఈ బాధ్యతను పూర్తిగా విస్మరించడమే గాక, సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశానికి అవసరమైన భూమికను ఏర్పరిచింది ప్రభుత్వమేనన్నది గమనార్హం.

కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం 2018 నవంబర్ 30 నాటికి నిరాకరించబడిన దరఖాస్తుల వివరాల పట్టిక

రాష్ట్రంపేరు	తిరస్కరించిన దరఖాస్తులు
1. తెలంగాణ	83,757
2. ఆంధ్రప్రదేశ్	75,927
3. ఛత్తీస్‌ఘడ్	4,62,403
4. పశ్చిమ బెంగాల్	96,587
5. మహారాష్ట్ర	2,20,116
6. ఉత్తర ప్రదేశ్	74,945
7. కర్నాటక	1,80,956
8. త్రిపుర	68,610
9. గుజరాత్	66,769
10. ఉత్తరాఖండ్	96,587
11. ఒరిస్సా	1,48,525
12. బీహార్	4,215
13. మధ్యప్రదేశ్	3,62,024
14. తమిళనాడు	11,742

15. కేరళ	7,889
16. రాజస్థాన్	36,299
17. గోవా	47
18. ఝార్ఖండ్	29,521

2005 డిసెంబర్ 13 నాటికి అడవులపైన, వాటి ద్వారా లభించే ఉత్పత్తులపైన ఆధారపడి జీవించే ఆదివాసులకు ఈ చట్టం కింద గుర్తింపు, అర్హత లభించాలంటే తగిన ఆధారాలు ఉండాలి. ఇక గిరిజనేతరుల విషయానికి వస్తే వారు కనీసం మూడు తరాలుగా (75 సంవత్సరాలు) అటవీ ప్రాంతంలో జీవిస్తున్నట్లు నిరూపించే సాక్ష్యాలు, పత్రాలు కలిగి ఉండి, వాటిని సమర్పించాల్సి ఉంటుంది. భౌతిక వాస్తవికత ఏమిటంటే ఆదివాసులకు మాతృఒడి అయిన అడవి, దానిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసులకు సర్వోన్నత న్యాయస్థానం చెప్పినట్లుగా తమను తాము ధృవీకరించుకోవడానికి అవసరమైన సాక్ష్యాలు, అందుకు సంబంధించిన పత్రాలు సంపాదించడం ఆచరణలో సాధ్యమయ్యే పని కాదు. ఎందుకంటే తమ పూర్వీకులు అడవిలో ఎప్పటి నుండో నివసిస్తు వచ్చారనీ, అటవీ భూములు సాగు చేశారనీ ఆధారాలు తేవడం ప్రస్తుత జనరేషన్‌కు (ఇప్పటి తరానికి) కష్టమైన పని. ఇవి లేకపోతే అటవీ భూములపై హక్కులు కల్పించడం సాధ్యం కాదని ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికార యంత్రాంగం తెగేసి చెబుతోంది. సహజసిద్ధంగానే అడవిబిడ్డలంటే ఆదివాసులే. వీరే ఈ దేశ మూలవాసులు. వందల వేల సంవత్సరాలుగా అడవితల్లి ఒడిలో జీవనం సాగిస్తున్నవారే. కనుక ఇటువంటి వారిని సాక్ష్యాలు, ఆధారాలు అడగడంలోనే రాజ్య పాలకుల కుట్ర దాగి ఉన్నది. ఆదివాసుల వద్ద ఉండే ఆధారాలు 'మౌఖిక చరిత్రలు', 'ఊరుపెద్దల దృష్టాంతాలు' మాత్రమే ఉంటాయన్నది చరిత్ర బోధించే సత్యం.

సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం తమ సాగులో ఉన్న అటవీ భూములపై యాజమాన్యపు హక్కుకోసం ఆదివాసులు పెట్టుకున్న దరఖాస్తులను అధికారులు తిరస్కరిస్తే అంటే చట్ట ప్రకారం తగిన ఆధారాలు, సాక్ష్యాలు ఇవ్వకపోతే వాటిని అక్రమ / దురాక్రమణ భూములుగా భావించి, ఆ భూములను సాగు చేసుకుంటున్న ఆదివాసులను అక్రమ/దురాక్రమణదారులుగా పరిగణించి, ఆ భూముల నుండి వారిని తొలగించడానికి అధికారులు తక్షణమే చర్యలను చేపట్టాలి. మానవ హక్కుల ఉద్యమ నేత, ప్రగతిశీల మేధావి డాక్టర్ కె. బాలగోపాల్ పేర్కొన్నట్లుగా 'అడవిలో అసలు అక్రమదారుడు, ఆక్రమణదారుడు ఆదివాసులు కాదు, సార్వభౌమిక రాజ్యమే ఆక్రమణ దారుడు. ఇది చారిత్రక సత్యం. రాజ్యాధికారానికి రాజకీయ ప్రతినిధిగా పాలన సాగించే ప్రభుత్వాల విధాన నిర్ణయాల పునాదులమీది నుండి ఎదిగిన లేదా వచ్చిన స్వదేశీ, విదేశీ బడా కార్పొరేటు సంస్థలు, శక్తులే నిజమైన అటవీ ఆక్రమణ దారులన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే గతంలో సమతా వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసుకు సంబంధించిన తీర్పులో 'అటవీ ప్రాంతాలపై ప్రభుత్వాలకు సైతం ఏ రకమైన హక్కు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంటే ఈ ప్రాంతంలోని భూములు, వనరులు వగైరా అమ్మే హక్కుగానీ, ఆదివాసుల జీవన విధానానికి ద్రోహం చేసే హక్కులు గానీ ప్రభుత్వాలకు లేదని ప్రభుత్వాలు కూడా గిరిజనేతర శక్తేనని స్వయాన తీర్పునిచ్చింది.

'వైల్డ్ లైఫ్ ఫస్ట్ సంస్థ' దాఖలు చేసిన పిటీషన్ విచారణ సందర్భంలో గిరిజనేతర శక్తిగా ప్రభుత్వాన్ని నిర్ధారించిన సర్వోన్నత న్యాయస్థానం ఆ ప్రభుత్వ అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమలులో భాగంగా రూపొందించిన నియమ నిబంధనల (నిజానికి ఇవి భూ యాజమాన్య హక్కు కోసం క్షేత్రస్థాయి భౌతిక పరిస్థితుల మీద ఆధారపడి రూపొందించినవి కావు.) వాటిని ఎలా పరిగణలోకి తీసుకుంటుంది? పచ్చి నిజం ఏమిటంటే బడా కార్పొరేటు కంపెనీల అవసరాలను, వాటి వాణిజ్య, వర్తక విషయాలను దృష్టిలో పెట్టుకుని ఈ చట్టానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన నియమ నిబంధనలను మొత్తం ప్రక్రియనే కాదు, అడవి బిడ్డల జీవిత మనుగడనే సంక్లిష్టంగా మార్చాయి. ఇప్పటికే భారీ ప్రాజెక్టుల నిర్మాణాలను, అభివృద్ధి పేరిట పరిశ్రమల ఏర్పాటు వన్య ప్రాణి సంరక్షణ పార్కుల నిర్మాణాలు, రిజర్వు ఫారెస్టు తదితర పేర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యల వల్ల ఆదివాసుల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.

పాలకులెవరైనా నాణేనికి బొమ్మా బొరుసే!

ఆదివాసులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్ది, అటవీ ప్రాంతాల్లో వారు ఉండడానికి అడవులపై వారి హక్కులను గుర్తించి, పరిరక్షించడానికి అటవీ హక్కుల గుర్తింపు చట్టం – 2006 ను తెచ్చామని చెప్పిన నాటి యుపిఎ-1 ప్రభుత్వం గానీ, అటవీ హక్కుల గుర్తింపు చట్టం గానీ, వ్యక్తుల ుగానీ, సమూహాలు గానీ తామే హక్కుదారులమని ముందుకు వచ్చిన వారి విషయాన్ని రెండు మాసాలలో తేలుస్తామని చెప్పిన నేటి మోడీ ప్రభుత్వంగానీ ఆదివాసులకు ఒరగబెట్టింది ఏమీ లేకపోగా ఆదివాసుల మనుగడనే ప్రశ్నార్థకంగా వారి చర్యలు మార్చాయి. ముఖ్యంగా మోడీ ప్రభుత్వం అటవీ ప్రాంతాలకు సంబంధించి ఇటీవల తీసుకుంటున్న చర్యలు, రూపొందిస్తున్న విధానాలు 5, 6 షెడ్యూల్స్‌కు వ్యతిరేకంగానూ, స్థూలంగా రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధంగా ఉన్నాయి. ఆదివాసుల జీవితపు అస్తిత్వాన్ని ప్రమాదంలోకి నెట్టింది. సర్వోన్నత న్యాయస్థానం తాజా ఆదేశంతో పాలకుల అసలు నైజం బయటపడింది. వలసవాదుల వారసత్వాన్ని నరనరాన జీర్ణించుకున్న భారత దళారీ పాలకవర్గం నుండి ఏదైనా ఆశించడమంటే అంతకంటే తప్పిదం మరొకటి ఉండదు. పైగా గత ప్రభుత్వాలే కాదు, ప్రధానంగా నరేంద్రమోడీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ఆదివాసుల గిరిజనుల హక్కులను కాలరాస్తూ అటవీ భూములను, ఆదివాసుల జీవితపు పునాదుల కింద నిక్షిప్తమై ఉన్న అత్యంత విలువ కలిగిన అపారమైన ఖనిజ, ఇతర వనరులను సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు దోచి పెట్టడానికి క్రియాశీలతతో కూడిన నిర్మాణాత్మకమైన కృషిలో నిమగ్నమై ఉన్నది.

దీనిలో భాగమే అటవీ భూములను బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ వచ్చింది. 'ల్యాండ్ కాన్‌ఫ్లిక్ట్ వాచ్ (ఎల్.సి.డబ్ల్యూ)' అనే సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం 2018 జనవరి నాటికి 11 రాష్ట్ర ప్రభుత్వాలు 26 కేసుల్లో గ్రామ సభల అభిప్రాయాలను త్రోసిపుచ్చి, అటవీ భూములను విచ్చలవిడిగా బడా కార్పొరేటు సంస్థలకు కట్టబెట్టింది. ఒక్క ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోనే 12 గ్రామాలలో అక్కడ తరతరాలుగా జీవిస్తున్న ఆదివాసుల హక్కులను అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం గుర్తించడాన్ని నిరాకరించింది. ఎందుకంటే ఆ గ్రామాలలో అపారమైన ఇనుప ఖనిజం ఉన్నందువల్లనే మోడీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది.

వాస్తవానికి ఇప్పటికే ఝార్ఖండ్‌లో గ్రామ సభల అంగీకారం లేకుండానే 5 లక్షల ఎకరాల అటవీ భూమిని కార్పొరేటు సంస్థలకు బేషరతుగా అప్పగించింది. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం అటవీ భూమిని ఇతర అవసరాలకు ఉపయోగించాలంటే గ్రామ సభల అంగీకారం తప్పనిసరిగా ఉండాలి. ఈ విషయాన్ని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ట్రైబల్స్ ఎఫైర్స్ మినిస్ట్రీ కమిటీ కూడా నొక్కి చెప్పింది. అయినా ఈ నిబంధనలను మోడీ ప్రభుత్వం బేఖాతరు చేసింది. అంతేకాదు, కార్పొరేటు సంస్థలకు ప్రస్తుతం అటవీ భూములను కట్టబెట్టాలనుకున్న పాలకులు తామే గతంలో ఇచ్చిన వ్యక్తిగత పట్టాలు, సాముదాయక పట్టాలను ఆదివాసుల నుండి బలవంతంగా తీసుకుంటున్నారని ఎల్‌సిడబ్ల్యూ సంస్థ వెల్లడించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

తెలంగాణ రాష్ట్రం విషయానికి వస్తే హరిత హారం, అభయారణ్యాల పేరుతో టిఆర్ఎస్ ప్రభుత్వం లక్షల ఎకరాల భూమిని సేకరించింది. ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ అటవీ ప్రాంతంలో 2.2 లక్షల ఎకరాలను, ప్రాణహిత ప్రాజెక్టుకు 34 వేల ఎకరాలను, శిర్వారం అభయారణ్యాల పేరుతో 7.500 ఎకరాలు, వరంగల్ జిల్లా ఏటూరు నాగారంలో 2 లక్షల ఎకరాలు, పాఖాల అభయారణ్యం 2.21 లక్షల ఎకరాలు, ఖమ్మం జిల్లా కిన్నెరసాని అటవీ ప్రాంతంలో 1.75 లక్షల ఎకరాలు, మెదక్ జిల్లా మంజీరా వన్య ప్రాణుల కోసం 49 వేల ఎకరాలు, పోచారం అడవుల్లో 34 వేల ఎకరాలు, మహబూబ్‌నగర్ జిల్లాలో రాజీవ్‌గాంధీ వన్యప్రాణుల సంరక్షణ కోసం 5.35 లక్షల ఎకరాల భూమిని సేకరించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు అటవీ శాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన రాజధాని పేరుతోనూ, అటవీ శాఖ అండతో మైదాన ప్రాంత వ్యాపారస్తులు, ధనిక రైతులు అటవీ భూములను ఆక్రమించి పండ్ల తోటలు, వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లోనూ, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లోనూ 1/70 చట్టాన్ని బేఖాతరు చేసి, వేల ఎకరాలు కార్పొరేటు సంస్థలకు కట్టబెడుతున్నారు. ప్రధానంగా విశాఖ ఏజెన్సీలో నిక్షిప్తమై ఉన్న బాక్సైట్ ఖనిజ సంపదను దోచుకోవడానికి వేల ఎకరాలను బహుళజాతి కంపెనీలకు కట్టబెడుతున్నారు.

ముగింపు

దేశంలో 8 కోట్ల 56 లక్షల ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అటవీ ప్రాంత వనరులపై లక్షా 70 వేల గ్రామాల్లో (గూడెంలలో) నివసిస్తున్న 20 కోట్ల మంది ఆదివాసులకు కనీస హక్కులు అనుభవించ లేని పరిస్థితి నెలకొన్నది. రాజ్యాంగంలో పొందుపరిచిన 5, 6 షెడ్యూలులో పొందుపరిచిన అంశాలు గానీ, ఆదివాసులకు హక్కులు కల్పిస్తూ, వాటి రక్షణకు అనేక చట్టాలు వచ్చినా, ఆచరణలో ఫలితం లేకుండా పోయింది. తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని సుదీర్ఘ కాలంగా జరిగిన ఆదివాసుల గిరిజనుల, పోడు భూముల సాగుదారులు చేపట్టిన ఉద్యమాలు, చేసిన పోరాటాల వల్ల 2006లో అటవీ హక్కుల గుర్తింపు చట్టం వచ్చింది. ఈ చట్టాన్ని అమలుపరిచి హక్కు పత్రాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. మరోవైపున సాగు చేసుకుంటున్న పోడు సాగుదారులను బేదఖల్ చేసి, హరిత హారం పేరుతో, రిజర్వు ఫారెస్టు పేరుతో, అభయారణ్యాల పేరుతో ఆదివాసుల – గిరిజనులను పోడు భూముల నుండి గెంటివేసే చర్యలకు పాలకులు పూనుకుంటున్నారు. 2013లో వచ్చిన నూతన భూసేకరణ చట్టాన్ని కూడా ఆదివాసులు పోరాడి సాధించుకున్నారు. ఈ చట్టాన్ని అమలు చేయకపోగా చట్టాన్ని నీరుగార్చే అనేక జీవోలను రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేస్తూ భూముల నుండి ఆదివాసులను తొలగిస్తూ వస్తున్నాయి. పర్యావరణం, అడవి జీవన వైవిధ్యం గురించి మాట్లాడుతున్నవారు ఒరిస్సా రాష్ట్రంలో వేదాంత పోస్కో కంపెనీ, పోలవరం భారీ ప్రాజెక్టు నిర్మాణాల సందర్భంలో ఇవి గుర్తురాకపోవడం దేన్ని సూచిస్తుంది. వాస్తవానికి పర్యావరణం, అడవి జీవవైవిధ్యాలను రక్షించేది ఆదివాసులలే. నేడు దేశంలోని రిజర్వ్‌డ్ అడవులలో 30 లక్షల ఎకరాల భూమి కార్పొరేట్ మైనింగ్ సంస్థల, వలసవాదుల పరమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 50 శాతం అడవి భూములు వలస వచ్చిన ఆదివాసేతర వ్యక్తులకు పట్టా భూములుగా మారాయి. మరో 20 శాతం భూమి మూల ఆదివాసుల పేర్లతో పట్టా ఉన్నప్పటికీ వాటి యాజమాన్యాలు ఆదివాసేతరులే. ఈ భూముల్లో నిజమైన మూల ఆదివాసులు కూలీలుగా, కౌలుదారులుగా మారి పనిచేస్తున్నారు.

నరేంద్రమోదీ ప్రభుత్వం ఇచ్చిన 'అచ్ఛే దిన్', 'సబ్‌కా సాథ్ – సబ్‌కా వికాస్' నినాదాల అసలు సారం ఇదేనన్నది నాడు ఆదివాసులు అర్థం చేసుకోలేకపోయారు. నిజానికి విద్యావంతులైన మైదాన ప్రాంత ప్రజలకు అర్థం కానీ వేద, ఉపనిషత్తుల భావజాలపు పునాదుల మీద నిర్మితమైన ఈ నినాదాల సారం ఆదివాసులకు ఏం అర్థం అవుతుంది? మూల ఆదివాసుల జాతులు / తెగలు అలుపెరగని సమరశీల పోరాటాల ద్వారా కొన్ని హక్కులను సాధించుకున్నారు. వాటికి అనుగుణమైన చట్టాలను రూపొందింప చేసుకున్నారు. ఆదివాసుల జీవనాధారమైన పోడు భూములు, అటవీ ఉత్పత్తులు, తదితర వనరుల రక్షణ, ఆదివాసుల ప్రజలకు వినియోగించడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారు. సహజసిద్ధంగా సంక్రమిస్తూ వచ్చిన హక్కులను తిరస్కరించే నిర్మాణాత్మక చర్యలు బ్రిటిష్ వలస పాలనలోనే మొదలయ్యాయి.

సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన ఆదేశాలు కూడా ఈ వైఖరినే ప్రతిఫలిస్తుంది. సామాజిక దృక్పథం, సామాజికంగానూ, ప్రజా న్యాయ దృక్కోణం లోపించిన ఈ ఆదేశం వెలువరించిన న్యాయకోవిధులు కావచ్చు, స్థూలంగా న్యాయ వ్యవస్థ, ఆదివాసులకి, అడవికీ ఉన్న అవిభాజ్యమైన సహజ సజీవ సంబంధాన్ని చూడ నిరాకరించే వైఖరి తమ వర్గ స్వభావాన్ని చాటుకుంటుంది. రాజ్యాంగ విరుద్ధమైన ఈ ఆదేశం లేదా తీర్పు పట్ల ప్రజల నుండి, ప్రజాస్వామిక ఉద్యమ శక్తుల నుండి హక్కుల ఉద్యమం నుండి ముఖ్యంగా ఆదివాసుల నుండి తీవ్ర నిరసన వ్యక్తమయ్యింది. దీనితో సుప్రీంకోర్టు అరుణ్ మిశ్రా సారథ్యంలోని ద్విసభ్య ధర్మాసనం ఫిబ్రవరి 13న ఇచ్చిన తీర్పుపై ఫిబ్రవరి 28న స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. రాజ్యాంగ విరుద్ధమైన ఈ అప్రజాస్వామికమైన తీర్పును పునఃసమీక్షించి వెనక్కి తీసుకునే వరకు బలమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన తక్షణ ఆవశ్యకత మనముందున్నది.

(రచయిత ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి) వీ

బాల్యానికి భద్రతెక్కడ...?!

***బాలికలపై నిత్యం అత్యాచారాలు జరుగుతున్నాయనీ, అనాథ శరణాలయాల్లో, పునరావాస కేంద్రాల్లో కూడా వారికి భద్రత లేకుండా పోయిందనీ, నేర ప్రవృత్తిని పెంచి పోషిస్తున్న వ్యవస్థపై పోరాడితే తప్ప ఇవి ఆగవనీ అంటున్నారు* అన్నపూర్ణ, రుద్ర**

అన్నార్తులు అనాథలుండని
ఆ నవయుగమదెంతదూరం
పసి పాపల నిదుర కనులలో
ముసిరిన భవితవ్యం ఏదో....

అంటూ పలికిన ఆ కవి ఆవేదన డెబ్బై ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఇంకా ఆవేదనగానే మిగిలిపోయింది. పైగా బాల్యాన్ని చిదిమేసే అనాగరిక చర్యలు రాజ్యమేలుతున్నాయి. పొద్దున లేస్తే ముక్కుపచ్చలారని పసిపిల్లలు, బాలికల కిడ్నాప్‌లు, అమ్మకాలు, అక్రమ రవాణాలు, అత్యాచారాలు జరుగుతున్నాయి. కొందరు క్షణికావేశంలో చేస్తే, మరికొందరు ఆ పసిశరీరాల్నీ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పెట్టుబడిగా వాడుకుంటున్నారు. ఆవేశంలో జరిగినా, ప్రీ ప్లాన్డ్‌గా జరిగినా ఇవన్నీ క్షమించరాని నేరాలే అవుతాయి. అసలు వసివాడని శరీరాలపై వాంఛ తీర్చుకోవాలనే ఆలోచనను ఎలా నిర్వచిద్దాం..? అసలు అదెలా సాధ్యమవుతుంది..? పసి దేహాలను వాడుకుని సొమ్ము చేసుకుంటున్న వైనాన్ని ఎలా చూద్దాం..? ఇంతా జరుగుతున్నా అయ్యో పాపం అని.. మనసుకెక్కించుకోకుండా తప్పించుకుంటున్న మన విజ్ఞతకి ఏ పేరు పెడదాం..?

ఈ దేశంలో దేశాన్ని కాపాడడానికి మిలటరీ ఉంది. కార్పొరేట్ల ఆస్తులను కాపాడడానికి పోలీసు సైన్యం ఉంది. చివరికి ఆవుని రక్షించడానికి కూడా కాషాయ సైన్యం ఉంది. కానీ ఈ దేశంలో ఆడపిల్ల రక్షణకి ఏముంది..? చట్టం పేరుతో ఒక కాగితం ఉంది. కానీ అది ఈ ప్రభుత్వాలు కట్టిస్తున్న నీళ్లు లేని మరుగుదొడ్లలో వాడుకోడానికి తప్ప ఆడపిల్లలకి ఏ రక్షణను ఇవ్వడం లేదు. అది వాళ్ల భవిష్యత్తుని పునర్నిర్మించలేకపోతున్నది. అది ఏ ఆడపిల్ల జీవితాన్ని ఉన్నతీకరించడం లేదన్న వాస్తవాలను రుజువు చేస్తూ ఎన్నో పైశాచిక ఘటనలు నిత్యం ఈ సమాజం ఎదుర్కొంటుంది.

ఇటీవల తెలంగాణ యాదాద్రిలో ఒక అమానవీయమైన ఘటన వెలుగులోకొచ్చింది. పసిపిల్లలను తల్లిదండ్రుల నుంచి వేరుచేసి తీసుకొచ్చి కొట్టి, తిట్టి కాల్చి బలవంతంగా వ్యభిచారంలోకి దింపుతున్న ముఠా బయటపడింది. పసి పిల్లల ఎదుగుదలకి హార్మోన్స్ ఇంజెక్షన్స్ ఇచ్చి పెంచి బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారు. ఇక్కడ ఒక ఏడాది పిల్లలవి సుమారు ఎనిమిది వేల కేసులు రికార్డయ్యాయి. దీనిని బట్టి ఆడపిల్లల అక్రమ రవాణా, అమ్మకాల వ్యాపారం ఎంత పెద్దస్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

అనాథ శరణాలయాల్లో, పునరావాస కేంద్రాల్లో బాలికల పరిస్థితి దీనికి భిన్నంగా లేదు. బీహార్‌లో ముజఫర్‌పూర్, ఉత్తర్‌ప్రదేశ్‌లో దేవరియా శరణాలయాల్లో నిర్వాహకులే చిన్న పిల్లల మీద అత్యాచారాలు చేశారు. సాక్షాత్తు నిర్వాహకులే ఏడెనిమిదేళ్ల పిల్లలకి మత్తుమందులిచ్చి సాయంత్రం అయితే కార్లల్లో విలాసవంతుల దగ్గరకి పంపిస్తున్నారు. తిరిగి పొద్దున ఆశ్రమాల్లో వదిలిపెడుతున్నారు. మరణించిన పిల్లలని ఆ ఆశ్రమాల్లోనే పాతిపెట్టిన చేదు నిజాలనూ చూశాం. ఆ ఘోరకృత్యాలని ఎదుర్కొన్న ఒక బాధితబాలిక వేదన వర్ణించలేనిది. ఇంకా వెలుగులోకి రానివెన్నో. ముజఫర్‌పూర్ శరణాలయంలో సాక్షాత్తు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి భర్తే నిందితుడు. కానీ అరెస్టు జరగలేదు.

ఒక్క బీహార్‌లోనే 110 శరణాలయాలు, పునరావాస కేంద్రాలున్నాయి. ఏపిలో 880 పిల్లల సంరక్షణా కేంద్రాలున్నాయి, వీటిలో సుమారు 25 వేల మంది పిల్లలున్నారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో 455 అనాథ పిల్లల పునరావాస కేంద్రాలున్నాయి. 15 వేల ఐదువందల మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. ఇక దేశ వ్యాప్తంగా 9589 రక్షణ కేంద్రాలున్నాయి. తల్లి తండ్రులు లేనివాళ్లు, తప్పిపోయి ఆచూకి లేని పిల్లలు ఎక్కడ దొరికినా ఈ పునరావాస కేంద్రాల్లో అప్పగిస్తున్నారు. అలా ఆశ్రయం పొందుతున్న 3.5 లక్షల మంది బాలికలు రక్షణలేని, భద్రతలేని పరిస్థితుల్లో బతుకుతున్నారు. ఎందుకంటే ఈ రోజు ప్రభుత్వ సంక్షేమ శరణాలయాల్లోనే భయంకరమైన పరిస్థితులుంటే ఇక ప్రభుత్వ అజమాయిషిలేని ఎన్‌జిఓలు, ఇతరులు నిర్వహిస్తున్న ఆశ్రమాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేం. ఈ రోజు స్వామీజీల ఆశ్రమాలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, అనాథ శరణాలయాలు, విద్యాలయాలు అన్నీ లైంగిక దోపిడీ నిలయాలుగా మారిపోతున్నాయి.

నిజానికి ఆశ్రయం పొందుతున్న పిల్లల్లో ఎవరూలేక కొంతమంది, తల్లితండ్రుల నుండి దూరమై కొంతమంది భద్రతలేని చోటు నుండి అనాథలుగా, అభాగ్యులుగా ఆశ్రమాలకు చేరుకుంటున్నారు. మరి వాళ్ల సంరక్షణ పట్ల ప్రభుత్వాలు, ఈ సమాజం ఎంత భద్రతనివ్వాలి, ఎంత రక్షణగా ఉండాలి కానీ జరుగుతున్నదేమిటి? ఆడపిల్లల మీద దారుణాలు జరుగుతుంటే ప్రభుత్వాలు చట్టాలు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. మీడియా తమకు చేరిన సమాచారాన్ని దృశ్యాల రూపంలో చూపించి చూపించి అలసిపోతున్నాయి. అవి చూసి మెజారిటీ సమాజం మౌనంగా ఉండిపోతుంది. ఇలాంటి విషయాలపై వ్యక్తుల నుంచి కనీస స్పందన కూడా కరువవుతుంది. విషయం తెలుసుకోవడం, అర్థం చేసుకోవడం, చర్చించడం, దానిపై ఏదో ఒక చర్యకు దిగడం సాధారణంగా జరగాల్సిన ప్రక్రియ. కానీ దీనికి వ్యతిరేకచర్యలో మనుషులు వ్యవహరిస్తున్నారు.

వేదాల చిక్కుముడి విప్పిన అంబేడ్కర్

***అంబేడ్కర్ వేదాల మూలాలను హేతువాద దృక్పథంతో పరిశోధించి అవి బ్రాహ్మణ ఆధిపత్యాన్ని నిలిపి ఉంచుతూ, దళితులను ఎలా అణచివేశాయో చూపించారని అంటున్నారు* డా. కత్తి పద్మారావు**

డా. బి.ఆర్.అంబేడ్కర్ గొప్ప తాత్వికుడు, ఆలోచనా పరుడు, సమాజ పునర్నిర్మాత, ఆర్థిక, సామాజిక, విప్లవ మూర్తి. అంబేడ్కర్‌లో అనేక కోణాలు ఉన్నాయి. ఆయన మహోజ్వలమైన వ్యక్తిత్వ నిర్మాణ దక్షుడు. మానవతా సౌగంధ్యాని పరిమళించిన ప్రబోధకుడు. మానవత్వాన్ని భగ్నం చేస్తూ, కులతత్వాన్ని ఆచరణాత్మకంగా విస్తృత పరచిన హిందూమతం మీద ఆయన తిరుగులేని పోరాటం చేశారు. డా.బి.ఆర్. అంబేడ్కర్ ఒక గొప్ప పరిశోధకుడు. సత్యాన్ని ప్రకటించడం కోసం ఆయన లోతైన పరిశీలన చేశారు. ఆయన సామాజిక శాస్త్రవేత్త. సమాజాన్ని పునర్నిర్మించడం కోసం అడ్డువచ్చిన ప్రతి అంశాన్ని నిక్కచ్చిగా, నిర్దిష్టంగా, హేతువాద భావజాలంతో ప్రకటించారు. నీతి, నిజాయితీకి ఆయన పెట్టని కోట. ప్రతి విషయాన్ని ఆచరించి చూపించాడు. ఏది తాను చెప్పదలచుకున్నా అది సత్య ప్రమాణబద్ధంగా చెప్పాడు. మొదటిగా హిందూ మతానికి పునాదిగా చెప్పుకొంటున్న వేదాల్ని ఖండించాడు. వేదాలు అపౌరుషీయము అనే మాట అబద్దమని అవి మానవుల చేత రచించబడినవి అని అనేక ప్రమాణాలతో రుజువు చేశాడు. ముఖ్యంగా వేదాల్ని వివరించే గ్రంథాలను బ్రాహ్మణాలు అంటారు. అవి శతపథ బ్రాహ్మణం, తెత్తిరేయ బ్రాహ్మణం, ఐతరేయ బ్రాహ్మణం, కౌషితకి బ్రాహ్మణం అనేవి ముఖ్యమైనవి.

ఈ బ్రాహ్మణాలు వేదాల గురించి చెప్తూ ఇలా విశ్లేషించారు. "మొదట్లో ఈ విశ్వం అంతటా ప్రజాపతి ఒక్కడే ఏకైక జీవి. అతడు "నేను జీవిస్తాను, నేను వృద్ధి పొందుతాను" అని వాంచించాడు. కఠోర భక్తితో తపస్సు ఆచరించాడు. "అంత శ్రమపడి కఠోర తపస్సు ఆచరించిన మీదట అతని నుంచి మూడు లోకాలు భూమి, గాలి, ఆకాశం సృష్టి అయ్యాయి. ఈ మూడు లోకాలకు తేజస్సును కల్పించాడు. ఆ తర్వాత, వాటి నుంచి మూడు జ్యోతులు ఉద్భవించాయి. అగ్ని (నిప్పు) ఇది పునీతం చేసేది, పవన లేదా వాయువు (గాలి), సూర్యుడు. ఈ మూడు జ్యోతులలోకి వేడి ప్రవేశపెట్టాడు వేడెక్కిన వాటి నుంచి మూడు వేదాలు జనించాయి– అగ్ని నుంచి రుగ్వేదం, వాయువు నుంచి యజుర్వేదం, సూర్యుని నుంచి

ఎవరికి తెలియకుండా ఎవరికి వారు వాళ్లను వాళ్లు కుదించు కుంటున్నారు. దీని వెనుక రాజ్య కుట్ర ఉంది. ఓ వ్యక్తి విచక్షణ మరచి బాలికపై అత్యాచారం చేయడానికి ఎలాంటి సామాజిక, రాజకీయ కారణా లున్నాయో అవే కారణాలు మనుషుల స్పందనలను కట్టడి చేస్తున్నాయి. భయంకరమైన ఆర్థిక విధానాలు, ఆర్థిక పరిస్థితి మనుషుల అవసరాలను, ఆనందాలను, స్పందనలను నిర్ణయిస్తున్నాయి. మన సమీపానికి వస్తే కానీ ఆ కష్టాన్నీ చూడలేకపోతున్నాం. ఏ మరణమైన నీలో దుఃఖాన్నీ కలిగించలేదంటే.. నీవు అప్పటికే మరణించి ఉంటావనే ఓ కవి మాటలను నిజంచేస్తున్నాం. మౌనంతో ఆ హింసకు, నేరాలకు మద్దతు పలుకుతున్నాం. ఈ మాటలు కటువుగా ఉన్నా ఇది ముమ్మాటికి వాస్తవం.

మనిషికి సంకేతంగా ఉండాల్సిన మానవీయ లక్షణాలను వదిలేసి కేవలం దాన ధర్మాలు చేయడమే మానవత్వం అనుకుంటున్నాం. సమాజం, ప్రభుత్వాలు కూడా దానినే ప్రోత్సహిస్తున్నాయి. ఎందుకంటే ప్రజల పట్ల తమ బాధ్యత నుండి తప్పుకోడానికి పాలకవర్గాలకి ఇదొక అవసరంగా మారింది. కుల, మతాల ప్రాతిపదికగా పాలించే పాలకులకు ఆలోచన కలిగిన పౌరులు ప్రమాదకరం. ప్రశ్నించే మనుషులుగా తయారవకుండా దేవుడు, దెయ్యం, సినిమా, సామాజిక కట్టబాట్ల ఉచ్చులోనే ఉంచుతున్నారు.

అందుకే మహిళను ఆస్తిగా చూసే ఫ్యూడల్ సంస్కృతిని, మహిళను వ్యాపార వస్తువుగా మార్చే పెట్టుబడిదారీ సంస్కృతిని పెంచిపోషిస్తుంది. రేప్‌లు, హత్యలు, నేరాలు జరిగే పరిస్థితిని ప్రభుత్వమే కల్పిస్తుంది. ఎప్పుడైనా నిర్భయ, కథువా సంఘటనలు సభ్య సమాజాన్నీ కదిలిస్తే.. అమలు కానీ చట్టాల్నే మార్చి అందరి నోళ్లను మూయిస్తుంది. నేరగాళ్లకు ఎంత కఠినమైన శిక్ష నిర్ణయిస్తే అంత న్యాయం జరుగుతుందని అనుకుంటున్నాం. అసలు శిక్ష ఎవరికి వేయాలి. నేర ప్రవృత్తిని ప్రేరేపిస్తున్న ప్రభుత్వానికి, పాలకులకు కదా. ప్రేరేపించే రాజ్యానికి కాకుండా.. ఆయుధానికి శిక్ష పడితే న్యాయం జరిగినట్టేనా..? ఇవాళ్టి బాల్యాన్నీ, రేపటి భవిష్యత్తునూ నాశనం చేస్తున్న రాజ్యానికి ఏ శిక్ష విధించాలి. అటువంటి రాజ్యానికి ఎలా బుద్ధిచెప్పాలి..? ఇవే మన ముందున్న ప్రశ్నలు.

మహిళలకు చెందిన చట్టబద్ధహక్కును, చట్టాలను క్షేత్రస్థాయిలో అమలు అయ్యేలా పోరాడాల్సింది ప్రజలే. అలా పోరాడనంత కాలం మహిళలపై లైంగిక దోపిడీకి అంతం లేదు. అంతేకాదు మనం మనుషులుగా మారాలంటే ఈ పాలకవర్గాల ఆర్థిక విధానాల మీద, చెక్కుచెదరని అధికారం కోసం పాలకులు సమాజం మీద బలవంతంగా వెదజల్లుతున్న విషసంస్కృతి మీద పోరాడాల్సిందే. పోరాటమే మనల్ని నిజమైన మనుషులుగా నిలబెడుతుంది. అసలు నేరాలు, శిక్షలు లేని సమాజాన్ని కాంక్షిద్దాం. దానికోసం పనిచేద్దాం. ఆడపిల్లలకి ఆటపాటలతో సాగే బాల్యాన్ని, అలాంటి భవిష్యత్తుని అందజేద్దాం.

(రచయితలు మహిళా ఉద్యమ కార్యకర్తలు) వీ

సామవేదం. ఈ మూడు వేదాలకు ప్రకాశాన్ని అందించాడు. అప్పుడు వాటి నుంచి జాజ్వల్యమానమైన సారత్రయం వెలువడింది. రుగ్వేదం నుంచి భూ:, యజుర్వేదం నుంచి భువ:, సామవేదం నుంచి స్వ: ఈ విధంగా రుగ్వేదం నుంచి అధ్వర్యు కార్యం, సామవేదం నుంచి ఉద్గాత్రి విధులూ వచ్చాయి. మూడు శాస్త్రాల (మూడు వేదాల) జాజ్వల్యమానమైన సారం నుంచి బ్రాహ్మణుని కార్యకలాపాలు రూపొందాయి. వేదాలకు మూలం ప్రజాపతి అనే ఈ వివరణకు శతపథ బ్రాహ్మణం వేరే మరొక పాఠభేదాన్ని కూడా ఇస్తున్నది.

వేదాలు బ్రాహ్మణులు సృష్టించినవే

వేదాల మూలాలను అంబేద్కర్ తార్కిక పద్ధతిలో, హేతువాద పద్ధతిలో విశ్లేషించినపుడు, అవి భారతదేశంలో స్థిరపడిన ఆర్యులు, వారిని ఎదిరించిన వారిని అణగ దొక్కడానికి రాయబడినవే అనే విషయాన్ని నిగ్గుతేల్చాడు. ఆర్యరుషులు 'ప్రజాపతి' ఈ విశ్వాన్నంతా నిగ్గు తేల్చుతున్నారని చెబుతున్నారు కదా! మరి ఈ విశ్వమంతా తన సంతానమైనపుడు భిన్న జాతులుగా, భిన్న వర్ణాలుగా వీరిని ఎందుకు సృష్టించాడు అనే ప్రశ్నకు బ్రాహ్మణుల దగ్గర సమాధానం లేదు. మరి ఈ ప్రపంచాన్నంతా సృష్టించిన ప్రజాపతిని ఎవరు సృష్టించారు అనే ప్రశ్నకు సమాధానం లేదు. వేదాల్లో ఉన్న జాతి భేదాన్ని, వర్ణ భేదాన్ని, శత్రుమిత్ర భావాల్ని, కక్ష, కార్పణ్య భావాలని ప్రకటించిన బ్రాహ్మణ వర్గం ఈ దేశాన్ని సృష్టించిన మూలవాసుల మీద కక్షతోనే ఈ పని నిర్వహించాలని అంబేద్కర్ నిగ్గు తేల్చారు. అసలు రుగ్వేదమే సర్వస్వమైనపుడు, అధర్వవేదం, సామవేదం, ఇవన్నీ ఎలా ఆవిష్కరించాయి. అందు నుండి బ్రాహ్మణుడు, బ్రాహ్మణ కార్యకలాపాలు ఎలా ఏర్పడ్డాయి. బ్రాహ్మణుడు భారతదేశంలో మొదటి దోపిడీ శక్తిగా తన్ను తాను సృష్టించుకొన్నాడు. తానే అధికుణ్ణని తనకే అన్ని శాస్త్రాలు వచ్చని, తనను విశ్వపతి ఈ సకల సృష్టిని నడిపే బాధ్యత అప్పజెప్పాడని తన ఆధిపత్యం కోసం వేదాలు, వేదాంగాలు, బ్రాహ్మణాలు ఇలా రాసుకొంటూ పోయాడు. బ్రాహ్మణుడు తప్ప వేరే వాళ్లు చదవకూడదని ఆంక్ష విధించాడు.

అంబేద్కర్ హిందూవాదానికి మూలమైన వేదాలపై తిరుగుబాటు చేసి ఇది ఒక అబద్ధాల అభూత కల్పనల నిర్హేతు ప్రకటనలతో కూడిన గ్రంథాలని సప్రమాణంగా నిరూపించాడు. ఇందుకు మూల గ్రంథాల నుండే ఉదాహరణలు పుంఖాను పుంఖంగా ఇచ్చాడు. బ్రాహ్మణవర్గం పురోహిత వర్గం ఇంతవరకు ఎవ్వరూ అంబేద్కర్ వాదనలను ఖండించలేకపోయారు.

అంబేద్కర్ ఇచ్చిన వివరణ చూద్దాం. "ప్రజాపతి వేదాలను నీటి నుంచి సృజించాడన్నదే ఆ వివరణ, శతపథ బ్రాహ్మణం ఇలా చెబుతున్నది. "పురుషుడైన ఈ ప్రజాపతి 'నేను ద్విగుణీకృతం కావాలి, నేను వృద్ధి పొందాలి' అని వాంఛించాడు. తీవ్ర నిష్ఫాపరుడైనాడు. ఉత్సుకతో కఠోర తపస్సు ఆచరించాడు. అలా చేసిన తరువాత మొదటగా వేదత్రయ పవిత్ర విజ్ఞానాన్ని సృష్టించాడు. ఇది అతనికి ఒక ఆధారం అయింది. అందువల్లనే 'పవిత్ర జ్ఞానమే ఈ విశ్వానికి ఆధారం' అని జనులు అంటుంటారు. వేదాలను చదివిన మానవునికి ఒక స్థిరమైన ఆధారం దొరుకుతుంది; ఎందుకంటే పవిత్ర జ్ఞానం అతని పునాది అవుతుంది గనుక. ఈ ఆధారం మీదనే ప్రజాపతి కఠోర తపస్సు ఆచరించాడు. వచస్సు నుంచి వాటి ప్రపంచంగా జలాలను సృష్టించాడు. వచస్సు అతనిది, అది సృష్టికావించబడింది. అది వ్యాప్తి చెందిన తర్వాత (ఆప్నోతి) ఆ జలాలను ఆప: అని పిలిచారు. మొత్తాన్ని అది ఆవరించిన (ఆప్పనోత్) తర్వాత జలాలను 'వర్' అని అన్నారు. 'ఈ జలాల నుంచి నేను వృద్ధి పొందాలి' అని అతడు వాంఛించాడు. ఈ మూడు వేదాల విజ్ఞానంతోనూ అతడు జలాలలో ప్రవేశించాడు. ఒక అండం ఉద్భవించింది. దానికి ఒక ప్రచోదన కలిగించాడు. 'అది కలుగుగాక; అది కలుగుగాక; మళ్లీ కలుగుగాక' అని అన్నాడు. అపుడు మొదటగా వేదత్రయ విజ్ఞానం ఉద్భవించింది. అందువల్లనే జనులు 'పవిత్ర జ్ఞానం విశ్వంలో మొదట జన్మించినది' అని అంటారు. అంతేకాకుండా, పవిత్ర జ్ఞానం ఆ పురుషుని ముందటి భాగం నుంచి ఉద్భవించింది, అంటే అతనికి నోరు (ముఖం) గా ఏర్పడింది. అందుకే వేద పారంగతుడైన మానవుణ్ణి అతడు అగ్నివంటివాడు' అని అంటారు. ఎందుకంటే పవిత్రజ్ఞానమే అగ్ని నోరు."

బ్రాహ్మణుల ఆధిక్యత కోసమే వేదాలు

బ్రాహ్మణుడు తనకు తాను పవిత్రమైన వాడిగా, బ్రహ్మసృష్టిలో మొదటి వాడిగా, వేదజ్ఞానిగా, ప్రపంచ సృష్టిని అర్థం చేసుకునేవాడిగా, నడిపేవాడిగా ఈ కథనాల ద్వారా ప్రకటించుకొన్నాడు. అందుకే అంబేద్కర్ హిందూ మతం పునాది అంటే బ్రాహ్మణాధిక్యతా నిరూపణ ఏమీ లేదు అని చెప్పాడు. అంబేద్కర్ చెప్పే వరకు కూడా వేదాల్లో ఉన్న వైరుధ్యాలు, వేదాల్లో ఉన్న కాపట్యం, వేదాల్లో ఉన్న వివక్ష, హిందూ మతానికి వేదాలు ఎలా పునాది వేశాయి, హిందూ దేవుళ్లను పుంఖాను పుంఖంగా సృష్టించడానికి వేదాలు ఎలా మూలమయ్యాయి అనే అంశాలు బయటకు రాలేదు. అంబేద్కర్ ఒక్కడే ఈ అంశాల మీద లోతైన చర్చ చేశారు, హేతువాదంతో కూడిన చర్చ చేశారు, శాస్త్ర జ్ఞానంతో కూడిన చర్చ చేశారు. వేదాల్లో ఉన్న అనేక వైరుధ్యాలను బయటకు ఈడ్చి ఇవి బ్రాహ్మణాధిపత్యానికే గానీ సమాజానికి ఎందుకు పనికిరావని తేల్చి చెప్పాడు. ఆయన వేదాలను మొత్తాన్ని చదివిన తరువాత వేదాల మూలం గురించి 11 రకాల భిన్నమైన అభిప్రాయాలు ఎలా ముందుకు వచ్చాయో తన పరిశీలనలో ఇలా నిగ్గుతేల్చాడు.

1) పురుషుని నిగూఢ యజ్ఞం నుంచి ఉద్భవించినవని 2) స్కంభాపై ఆధారపడినవని 3) అతని నుంచి వేరు చేయబడిన వెంట్రుకల నుంచీ, నోటి నుంచీ వచ్చాయని 4) ఇంద్రుని నుంచి ఉద్భవించినవని 5) కాలం నుంచి ఉద్భవించినవని 6) అగ్ని నుంచి ఉద్భవించినవని 7) ప్రజాపతి నుంచి జలాల నుంచి ఉద్భవించినవని 8) బ్రహ్మ ఉచ్ఛ్వాసంగా వచ్చినవని 9) మనో సముద్రం నుంచి దేవతలు తవ్వి తీసినవని 10) ప్రజాపతి గడ్డంలో నుంచి వచ్చినవని 11) వచస్సు సంతతి అని" ఒక చిన్న ప్రశ్నకు దిగ్భ్రాంతి గొలిపే అనేకమైన సమాధానాలు రావడం అనేది ఒక చిక్కుముడి.

ఈ సమాధానాలు అన్నీ ఇవ్వడానికి ముందుకు వచ్చిన రచయిత లందరూ బ్రాహ్మణులే. వేదాల్లో ఉన్న బ్రాహ్మణవాదాన్ని బయటపెట్టిన వాడు డా. బి.ఆర్. అంబేద్కర్. భారతదేశంలో వేదాల మీద ఎందరో

పరిశోధకులు కృషి చేశారు. కానీ డా. బి.ఆర్. అంబేద్కర్ కాకుండా వేదాల మూలాలను బయటపెట్టిన వారు లేరు. నిజానికి డా. బి.ఆర్. అంబేద్కర్ హిందూ మతం పునాదిని తెలుసుకొన్న తరువాత వేద సాహిత్యం మీద హిందూ మతం పునాదుల్ని అర్థం చేసుకొన్నాడు. అందుకే నేను హిందువుగా పుట్టినా హిందువుగా మరణించనని ప్రకటించాడు. వేదాలు భారతదేశ మూలవాసుల మీద కక్ష్యకట్టి వారిని అణచివేయడం కోసం చేసిన కుట్రను ఆయన తెలుసుకొన్నాడు. చివరకు వేదాలను ప్రశ్నించడానికి వీలులేదని ఎందుకు శాసించారో కూడా ఇలా విశ్లేషించాడు.

వేదాలను ఎందుకు ప్రశ్నించకూడదు?

"వేదాలు, హిందువుల మత సాహిత్యంలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమిస్తున్నాయని చెప్పడం, వాటిని గురించి చాలా తక్కువ చెప్పినట్టే అవుతుంది. వేదాలు హిందువుల పవిత్ర సాహిత్యం అని చెప్పినా, సరిపోనిదే అవుతుంది. ఎందుచేతనంటే వేదాలు హిందువుల పవిత్ర సాహిత్యంగా మాత్రమే కాకుండా, ప్రశ్నించడానికి వీలులేని ప్రామాణిక గ్రంథాలుగా కూడా ఉన్నాయి. అవి తప్పు పట్టడానికి వీలులేనివి. వేదాల ఆధారంగా చేసిన వాదం ఏదైనా సరే అంతిమమైనదీ, నిర్ణాయకమైనదీ అవుతుంది. దానికి తిరుగులేదు. వేద బ్రాహ్మణుల సిద్ధాంతం ఇది. దీనిని హిందువులు సర్వత్రా ఆమోదిస్తారు. ఈ సిద్ధాంతం దేనిని ఆధారం చేసుకొని ఏర్పడింది?

వేదాలు 'అపౌరుషేయాలు' అనే అభిప్రాయంపై ఆధారపడి ఏర్పడింది. ఈ సిద్ధాంతం, వేదాలు అపౌరుషేయాలు అని వేద బ్రాహ్మణులు అన్నారంటే, వాళ్ల ఉద్దేశం అవి మానవ కల్పితాలు కావు అని మానవ కల్పితాలు కాకపోవడం వల్ల, సాధారణంగా ప్రతి మానవుడూ చేసే తప్పిదాలకూ, దోషాలకూ, పొరపాట్లకూ అవి అతీతంగా ఉంటాయి. అందుచేతనే అవి అమోఘమైనవి. వేదాలను అధ్యయనం చేసి ఆ విషయాలను బయట పెట్టడం అంత తేలికైన విషయం కాదు. ముఖ్యంగా వేదాల్లోని యజ్ఞాలు "యజ్ఞాలలో బలి ఇవ్వడం కోసమే స్వయం ప్రభువు (తాను) జంతువులను సృష్టించాడు. కాబట్టీ నీ ప్రాణం తీస్తున్న పాపం ఏదీ నాకు అంటకుండా ఆ విధంగానే నిన్ను బలి ఇస్తున్నాను." ఆ తర్వాత బలి ఇస్తున్న వ్యక్తి ఏ దేవతకు బలి ఇస్తున్నాడో పేరు చెప్పాలి. ఎందుకోసం బలి ఇస్తున్నాడో చెప్పాలి. బలి పశువు ముఖం ఉత్తరదిశవైపు లేదా యజ్ఞం చేసే వ్యక్తి ముఖం ఉత్తరం వైపు, బలి పశువు ముఖం తూర్పు దిక్కువైపుకు ఉండగా, పై మాటలు పఠిస్తూ బలి ఇవ్వాలి.

బలిపశువును బలి ఇచ్చిన తర్వాత గ్రంథాలలో నిర్దేశించిన విధంగా రక్తంతోపాటు ఉప్పు మొదలైనవి దానిలో కలపాలి. "రక్తతర్పణ చేయవలసిన పాత్ర బలి ఇచ్చేవాని స్తోమతను బట్టి ఉంటుంది. బంగారం, వెండి, రాగి, ఇత్తడి గిన్నె లేదా ఆకులు కుట్టి చేసిన దొన్నె, లేదా మట్టిపాత్ర లేదా తుత్తునాగం లేదా యజ్ఞంలో ఉపయోగించే కట్టెతో చేసిన ఏ పాత్ర అయినా కావచ్చు." "ఇనుపగిన్నె వాడకూడదు. జంతువు చర్మంతో చేసిన దానితో గాని, చెట్టు బెరడుతో చేసిన దానితో గాని, సత్తుగిన్నెలో గాని, రేకు లేదా సీసంగిన్నెలో గాని ఇవ్వకూడదు. స్రబ్ లేదా స్రుక్ అనే పవిత్ర పాత్రలో రక్తం తర్పణ చెయ్యకూడదు. నేలమీద పోసి ఇవ్వకూడదు. ఘటం (మట్టికుండ, ఇతర మత సంస్కారాలలోనూ దీనినే వాడతారు)లో ఇవ్వకూడదు. నేలమీద పోస్తూ ఇవ్వకూడదు. ఇతర సమయాలలో దేవతకు ఆహారం సమర్పించే గిన్నెలో పోసి ఇవ్వకూడదు; భాగ్యాన్ని కోరుకునే సత్పురుషుడెవరూ ఈ పాత్రలలో రక్తం ఇవ్వకూడదు. మానవరక్తం ఎప్పుడూ కూడా లోహపు గిన్నెలోగాని మట్టి పాత్రలోగాని ఇవ్వాలి. ఆకులతో లేదా అటువంటి వాటితో చేసిన గిన్నెలో ఎప్పుడూ ఇవ్వకూడదు.

'అశ్వమేధ యజ్ఞంలో తప్ప ఇతరత్రా గుర్రాన్ని బలి ఇవ్వటం తప్పు. అదే విధంగా గజ మేధంలో తప్ప మరెక్కడా ఏనుగును బలి ఇవ్వకూడదు. కాబట్టి ప్రజా పాలకుడు ఆయా సందర్భాలలో తప్ప వీటిని బలి ఇవ్వకూడదు. అశ్వమేధం చేయవలసిన అవసరం వచ్చినపుడు గుర్రానికి బదులుగా 'ఖండ్రం' అనే అడవి ఎద్దును ఎట్టి పరిస్థితులలోనూ బలి ఇవ్వకూడదు. బ్రాహ్మణుడు ఎప్పుడైనా గాని దేవికి సింహాన్నిగాని పెద్దపులిని గాని తన రక్తాన్ని గాని, సారాగాని తర్పణ చెయ్యకూడదు. బ్రాహ్మణుడు ఎప్పుడైనా సింహాన్నిగాని, పెద్దపులిని గాని, మనిషిని గాని బలి ఇస్తే నరకానికి వెళ్తాడు. బాధలతో, యాతనలతో ఈ ప్రపంచంలో కొద్ది రోజులు మాత్రమే బతుకుతాడు. డా.బి.ఆర్. అంబేద్కర్ వేదాల్లో ఉన్న గుట్టును రట్టుచేశాడు. రక్త తర్పణాన్ని వేదాలు ఒక బలిదానంగా ప్రచారం చేశాయి. దేవతలు రక్తం కోరుకుంటారని, బలి ఇస్తే దేవతలు తృప్తి పడతారని సింహం లాంటి కొన్ని జంతువులు తప్ప పెక్కు జంతువులు బలికి అర్హం అని దేవతలు రక్తప్రీతి గలవని వేదాల్లో చెప్పిన విషయాల్ని అంబేద్కర్ బయటపెట్టాడు. నిజానికి వేదాల్లో జ్ఞానం లేదు. అజ్ఞాన పూరితమైన ఉన్మాదం నుంచి అవి జన్మించాయని అంబేద్కర్ నిరూపించాడు.

వేదాలు – బలిదానం

చివరకు మానవ రక్తం ఎప్పుడు కూడా లోహపు గిన్నెలో గాని మట్టి పాత్రలో గాని ఇవ్వాలని వేదాలు నిర్దేశించాయి. వేదాల్లోని ఈ సూత్రాలను అనుసరించి ఎంతో మందిని బ్రాహ్మణులు దేవతలకు బలిచ్చారు. యజ్ఞం చేసే వ్యక్తి ఇలా అనాలి. 'హ్రాం, హ్రీం, కాళీ, కాళీ, ఉగ్రదంష్ట్రా! భుజించు, నరుకు, దుష్టులను సంహరించు, ఈ గొడ్డలితో నరుకు, కట్టివెయ్యి, పట్టుకో, రక్తం తాగు, భద్రం, భద్రం, రక్ష, రక్ష, కాళీ నీకు నమస్కారం" ఇలా ముగుస్తుంది. కాళరాత్రీయ మంత్రం. పై విధంగా బలికోసం ఎత్తిన ఆయుధాన్ని (గొడ్డలిని) కాళరాత్రీయ మంత్రంతో పూజించడం వల్ల బలి సమర్పించే వాని శత్రువులను సంహరించడం కోసం ఆయుధాన్ని కాళరాత్రి (చీకటి దేవత) అధిష్టిస్తుంది. బలిచేసే క్రమంలో ఒక విచిత్రమైన భాషను కనిపెట్టారు.

మనిషిని చంపడం రక్తాన్ని తర్పణచేయడం వేదాలు కొత్త భాషను సృష్టించాయి. వేదాలంటే హింస, వేదాలంటే విధ్వంసం, వేదాలంటే మార్మికత, వేదాలంటే దోపిడి, వేదాలంటే దేవుళ్లను, దేవతలను సృష్టిస్తూ పోవడమని అంబేద్కర్ నిరూపించాడు. అంబేద్కర్ వేదాల్లో ఉన్న రహస్యాలను బయటపెట్టేవరకు కూడా వేదాలు గొప్ప జ్ఞానవంతమైనవని, ప్రపంచం మంతా అందులో ఉందని బ్రాహ్మణులు ప్రచారం చేస్తూ వచ్చారు. నిజానికి వేదాలు నరబలిని ప్రోత్సహించాయి. ఈ విషయాన్ని

అంబేద్కర్ సోదాహరణంగా వివరించారు. "హిందూస్థానం అంతటా చాలాకాలం వరకూ నరబలి చాలా సామాన్యంగా జరుగుతూ ఉండేదనేది అందరికీ తెలిసిన విషయమే. ఇప్పటికీ భారతదేశం మారుమూలల్లో దేవి సంతృప్తికోసం మనుషులను చంపుతున్నారని అనుమానించేవారు లేకపోలేదు. వామాచార తెగకు చెందిన పాత కుటుంబాలలో పూర్వం దుర్గా పూజలలోనూ, కాళీ పూజలలోనూ నరబలి ఇస్తుండేవారు. బతికి ఉన్న మనిషికి బదులుగా మనిషి బొమ్మను బలి ఇచ్చే ఆచారం ఇంకా కొన్ని కుటుంబాలలో ఉన్నది. ఈ బొమ్మ ఒక అడుగు పొడవు ఉండి, ఎండబెట్టిన పాల (ఖీర్)తో చేస్తారు. కాళికా పురాణంలో చెప్పిన పద్ధతిలోనే దీనిని బలి ఇస్తారు; అదనంగా చేసేదేమిటంటే బొమ్మకు ప్రాణం పోయటం కోసం కొన్ని ప్రత్యేకమైన మంత్రాలు చదువుతారు. నా స్నేహితుడు ఒకరు బాబూ హేమచంద్రకౌర్ అనే ఆయన ఇరవైనాలుగు పరగణాలలో డిప్యూటీ మెజిస్ట్రేటుగా ఉండేవారు. బెంగాలులో జౌళి పరిశ్రమ గురించి ప్రశస్తమైన పుస్తకం రాశాడాయన.

ఆయన ఒకసారి బెంగాలులో తూర్పు జిల్లాలలో ఈ ఆచారం ఎక్కువగా పాటిస్తారని నాతో చెప్పారు; అయితే ప్రతిమను ఒక్క మనిషే నరికే బదులు కుటుంబంలోని వయోజనులంతా కలిసి వేరు వేరు చాకులతో గాని, అందరూ ఒకే చాకు తీసుకొనిగాని నరుకుతారు. దీనిని "శత్రుబలి" అంటే 'శత్రువును బలి ఇవ్వటం' అని అంటారు. నరబలి, శత్రుబలి ఈ రెండు సందర్భాలలోను బలి ఇవ్వటం రహస్యంగా జరుగుతుంది. సాధారణంగా ఇది అర్ధరాత్రి చేస్తారు. కాళికా పురాణంలో ప్రస్తావించిన నరబలి కాకుండా శత్రుబలి అనేది భిన్నమైన ఆచారం. దీనికి ప్రమాణం "బృహన్నిలతంత్ర"లో కనిపిస్తుంది. అందులో చెప్పిన కొన్ని ఇతర ఆచారాలు జరిపిన మీదట రాజు ఎండుపాలతో చేసిన తన శత్రువు బొమ్మను బలి ఇవ్వాలి" అని దానిని స్వయంగా అతనే నరకాలి. ఆ బొమ్మను తీక్షణంగా చూస్తూ బాగా లోతుగా దిగేలాగ ఒక్క దెబ్బతో రెండు ముక్కలయ్యేటట్టు నరికివేయాలి.

ప్రాణ ప్రతిష్ఠ ప్రక్రియతో దానికి ప్రాణం పోసిన తర్వాత నాశనం చేయవలసిన వ్యక్తి పేరు ఉచ్చరిస్తూ ఆ పని చెయ్యాలి. ఓ మహేశపత్నీ! ఇలా చేస్తే అతడు తన శత్రువులను నిస్సందేహంగా సంహరించ గలుగుతాడు." ఈ సందర్భంగా గుర్తుంచుకోవలసిన విషయం ఏమంటే కాళి శివుని భార్య అని. దీనితో ఉత్పన్నమయ్యే ప్రశ్న ఏమంటే శివుడు జంతుబలిని స్వీకరిస్తాడా? అనేది. ఈ ప్రశ్నకు సమాధానం ఏమంటే శివుడు ఒకప్పుడు జంతుబలి మీదనే జీవించాడని. ఈ వ్యాఖ్యానం ఈనాటి శివభక్తులకు ఆశ్చర్యం కలిగించవచ్చు. కాని ఇది వాస్తవం. దీనికి రుజువు కావాలనుకొనేవారు ఆశ్వలాయన గృహ్యసూత్రాలు పరిశీలిస్తే దొరుకుతుంది. అందులో శివుని సంతృప్తి పరచడానికి చేసిన ఎద్దుబలిని గురించి విపులమైన వర్ణన ఉన్నది". డా.బి.ఆర్. అంబేద్కర్ వేదాల గుట్టు విప్పే వరకు కూడా బ్రాహ్మణులు వేదాలకు విపరీతమైన ప్రచారం ఇవ్వడమే కాక పైన దేవతలు ఉన్నారని నమ్మించడమే గాక ఆ దేవతలకు బలి ఇవ్వడమనేది ఒక సాంప్రదాయంగా ఒక ఆనవాయితీగా ముందుకు తీసుకొచ్చారు. పుంఖాను పుంఖాలుగా బలులు సమర్పిస్తూ గ్రంథాలు రచిస్తూ వెళ్లారు. ఒక్కొక్క దేవుడికి ఒక్కొక్క జంతు బలి ఇష్టముండటం, ఒక్కొక్క దేవతకు ఒక్కొక్క నైవేద్యం ఇష్టముండడం చివరికి కాళికా దేవికి నరబలి ఇష్టముండడం ఎంతో రక్తాన్ని భూమి పొరల్లో ఇంకిపోయేటట్లు చేశారు.

అంబేద్కర్ జ్ఞాన మార్గం

డా.బి.ఆర్. అంబేద్కర్ జన్మించి 128 ఏళ్లు అవుతున్న ఈ సందర్భంగా ఆయన పరిశోధించిన అనేక అంశాలు ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో చర్చ జరుగుతున్న ఈనాడు వేదాల్లో ఉన్న మర్మాల్ని, వేదాల పునాదుల్ని, వేద నిర్మాణాన్ని ఆయన బయటపెట్టిన అంశాలు ఒక చారిత్రక కర్తవ్యంగా ఈనాడు మన ముందుకు వచ్చింది. డా.బి.ఆర్. అంబేద్కర్ భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్లేషణాత్మకంగా పరిశీలించిన తాత్విక చరిత్రకారులు. ఈ రోజు దేశంలో హిందూ మతవాదం పెచ్చరిల్లి పోతుంది. వేదాల పేరుతో శాస్త్రజ్ఞానాన్ని అడ్డుకొంటున్నారు. బ్రాహ్మణులు, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బిజెపి నిర్వహించే అశాస్త్రీయమైన అంశాలన్నీ వేదాల పేరుతో ప్రచారం చేసుకొంటున్నారు. విశ్వవిద్యాలయాల్లో జరిగే శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష పరిశోధన లన్నింటినీ వేదాల పేరుతో అడ్డుకొంటున్నారు. మా వేదాల్లో నిర్మాణాలు ఉన్నాయని, మా వేదాల్లో రాకెట్లు ఉన్నాయని ప్రపంచ శాస్త్ర జ్ఞానమంతా వేదాల్లో ఉందని ప్రచారం చేస్తున్న ఈ సందర్భంలో డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన వేదాల గుట్టు ఒక శాస్త్ర జ్ఞాన అభ్యుదయ, భావ సంచలనాంశమని చెప్పవచ్చు. వేదాలు నిరాకరించినప్పుడు హిందూమతంలోని వర్ణవాదాన్ని నిరాకరించగలం, అస్పృశ్యని నిర్మూలించగలం, కులం పునాదులు తవ్వగలం. ప్రపంచంలోని విశ్వవిద్యాలయాలన్ని అంబేద్కర్ వైపు చూస్తుంటే భారతీయులు మాత్రం తమ విముక్తికి ముక్కోటి దేవతల వైపు చూస్తున్నారు.

ఇది అంబేద్కర్ యుగం. భారతదేశ పునర్నిర్మాణానికి అంబేద్కర్ అందించిన సూత్రాలు, సిద్ధాంతాలు, పరిశోధనలు ఈనాటి చారిత్రక అవసరంగా ముందుకు వచ్చాయి. ప్రతి విద్యార్థి పరిశోధకుడు, సామాజిక కార్యకర్త, ప్రజాస్వామ్య వాది, లౌకిక వాది, అంబేద్కర్ ఆలోచనలు తీసుకొని భారతదేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావలసిన సందర్భం ఇది. అసత్యం ఎంత ప్రచారం పొందినా నిరాకరించాల్సిందే. సత్యం ఎంత కఠినంగా ఉన్నా స్వీకరించాల్సిందే. అందుకే అంబేద్కర్ విప్పిన వేదాల గుట్టును తెలుసుకొని జ్ఞానవంతులు అవ్వాల్సిన సందర్భం ఇది. భారతదేశాన్ని సామాజిక, సాంకేతిక శాస్త్రజ్ఞానం వైపు నడిపించే యోధులుగా ముందుకు నడుస్తూ నిరాకరించవల్సినవి ఏమిటి? స్వీకరించవలసినవి ఏమిటి? తెలుసుకోవడమే జ్ఞానం. ఆ జ్ఞాన మార్గంలో నడుద్దాం...

(రచయిత సామాజికత తత్వవేత్త,
నవ్యాంధ్రపార్టీ, వ్యవస్థాపక అధ్యక్షులు) వీ

సత్యాన్వేషణ మానవ ప్రయత్నాలన్నిటిలోకీ అత్యుత్తమమైనది. ఆ సత్యాన్ని ప్రచురించడం ఒక బాధ్యత.

– ఆనీ లూయీ జెర్మేన్ డి స్టాల్ *(1766–1817)*, ఫ్రెంచ్ విప్లవ కాలపు రచయిత్రి

కులవర్గ పోరాటాల విప్లవకారుడు మారోజు వీరన్న

***సామాజిక విప్లవకారుడు మారోజు వీరన్న విశ్లేషించినట్లుగా ఈ దేశంలో కుల వర్గ నిర్మూలన పోరాటాల ద్వారానే మౌలికమైన మార్పు సాధ్యమవుతుందని అంటున్నారు* వూకె రామకృష్ణ దొర**

ధిక్కారాన్ని ఆధిపత్యం అసలు సహించదు. ప్రశ్నించే గొంతును పాలకులు ప్రతినిత్యం అణచివేస్తూనే ఉంటారు. బిగిసిన పిడికిళ్లను పెత్తందారి వర్గం రక్తపుటేరుల్లో ముంచేస్తుంది. అన్యాయాన్ని ప్రతిఘటించే ప్రతి ఒక్కరినీ నిర్బంధం అణిచివేస్తుంది. అందుకే అగ్రకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన కామ్రేడ్ మారోజు వీరన్నను బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చి చంపారు. వర్గపోరాటంతోపాటు కులవర్గ జమిలి పోరాటం చేయాలని, అగ్రకుల ఆధిపత్యం నశించాలని, అణగారిన ఆదివాసి వర్గాలకు సామాజిక న్యాయం దక్కాలని కామ్రేడ్ మారోజు వీరన్న భావించాడు. నేడు భారత విప్లవోద్యమం విజయవంతం కాకపోవడానికి, నూతన ప్రజాస్వామిక విప్లవం రాకపోవడానికి ప్రధాన కారణం విప్లవ పార్టీలన్నీ అగ్ర కుల భావజాల నాయకత్వంలో పని చేస్తున్నాయని కామ్రేడ్ మారోజు వీరన్న భావించాడు.

నేడు ఎర్రజెండా పార్టీలన్నీ ఎర్ర భూస్వాములుగా అవతరించి అణగారిన ఆదివాసీ అడవి బిడ్డలపై కర్రపెత్తనం చేస్తున్నాయని మారోజు వీరన్న ఆలోచించాడు. ఆదివాసి అడవి బిడ్డలకు అణగారిన వర్గాల రాజ్యాధికార కాంక్ష కోసం ఎన్ని నిర్బంధాలు ఎదురైనా కలబడి నిలబడే తత్వం మారోజు వీరన్నది. అందుకే నేడు అస్తిత్వ ఉద్యమాలకు వేగుచుక్క అయ్యాడు. అణగారిన ఆదివాసి వర్గాలతో వర్గపోరాటం చేయించిన సేనాని వీరన్న. కామ్రేడ్ మారోజు వీరన్న వర్గపోరాటంతో పాటు కుల వర్గ నిర్మూలన జమిలి పోరాటం చేయాలని విప్లవ పార్టీలకు కొత్త పోరుబాట చూపిన దిశానిర్దేశకుడు వీరన్న. వీరన్న జీవితం ఒక సిద్ధాంతం, వీరన్నలా బతకడమే ఒక పోరాటం. ఆ ధిక్కారం, కులవర్గ పోరాట యుద్ధనౌక కామ్రేడ్ మారోజు వీరన్న. ఎరుపుకు మెరుపు అద్దిన కొత్త సూర్యుడు వీరన్న. తెలంగాణ సాయుధ పోరాటంలో గడ్డిపోచలతో గన్నులుపట్టిన యోధులు పుట్టిన నల్గొండ జిల్లా కరివిలాల కొత్తగూడెంలో కళ్లు తెరిచాడు. సూరమ్మ, రామలింగంకు 1962 జనవరి 1న జన్మించాడు. సూరమ్మ, రామలింగంల వివాహం కులాంతర వివాహం. ఆదర్శ, విప్లవ, ప్రగతిశీల భావాలు ఉన్న కుటుంబంలో జన్మించడం వల్ల వీరన్న ఆలోచనలు కొత్త తీరాలకు దరిచేరాయి. బాల్యంలో ఆయనకు జరిగిన సంఘటనలతో కులనిర్మూలన పోరాటాలకు పునాదులు అయినాయి.

వీరన్న 1962-72 కరివిలాల కొత్తగూడెంలో 5వ తరగతి వరకు చదువుకున్నాడు. బాల్యంలో వేసిన చిరుతల రామాయణం నాటకంలో పరాక్రమంతో వాలిని చంపిన రాముడు దేవుడు ఎలా అవుతాడని ప్రశ్నించేవాడు. అమాయకత్వంతో అడుగుతున్నాడని అందరూ అనుకునేవారు. కాని ఆ అనుమానాలే రాబోయే రోజుల్లో సామాజిక ఉద్యమాలకు సారథ్యం వహిస్తాడని ఎవరూ ఊహించలేదు. 1972-77లో ఆరవ తరగతి నుండి పదో తరగతి వరకు పూర్తి చేసుకున్నాడు. ఆ వయస్సులోనే హేతువాద దృక్పథంతో ఆలోచించేవాడు. విప్లవ భావజాలం ఉన్న కుటుంబంలో జన్మించడం వల్ల దోపిడీ, దౌర్జన్యాలను చిన్నతనం నుండే ప్రతిఘటించేవాడు. 14 ఏళ్ల ప్రాయంలోనే "ఊరు తిరగబడింది" అనే నాటిక రాశాడు. అది కల్పిత కథ కాదు, సహజంగానే జరిగింది. ఆ నాటకాన్ని ప్రజలు చాలా ఆదరించారు. 1977లో సూర్యపేటలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రథమశ్రేణిలో పాస్ అయ్యాడు. ఎస్.ఎఫ్.ఐ. విద్యార్థి సంఘంలో చేరాడు. హైద్రాబాద్ చైతన్య కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చేరాడు. అక్కడి నుండి వీరన్న జీవితం సామాజిక ఉద్యమాలవైపు ఉరకలేసింది. అప్పటిదాక కుతకుతలాడుతున్న సామాజిక పోరు కెరటం రాజధానిలో అడుగుపెట్టింది. ఇంటర్ తరువాత ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌లో సీటు రాలేదు. దానితో వీరన్నకు చదువులపై విరక్తి కలిగి సమాజంపై ఆసక్తి కలిగింది.

డిగ్రీలో బి.ఎస్.సి.లో చేరిన వీరన్న సహచరులు అన్న సోయమ్మ స్నేహంతోనే పిడిఎస్‌యు విప్లవ విద్యార్థి సంఘంలో చేరాడు. పిడిఎస్‌యులో అనతికాలంలోనే అగ్రనేతగా ఎదిగాడు. చంద్ర పుల్లారెడ్డి రాజకీయాలను అధ్యయనం చేశాడు. ఆ సైన్స్ కాలేజీలో సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుండేవాడు. పిడిఎస్‌యు ఆధ్వర్యంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలపై చర్చలు, సదస్సులు, సెమినార్లు నిర్వహించేవాడు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై అవగాహన కల్పించేవాడు. దీనితో సైన్స్ విద్యార్థులకు సామాజిక అంశాలపై ఆసక్తి కలిగేది. జార్జిరెడ్డి, జంపాల వారసుడిగా పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన వీరన్న విద్యార్థులు రాజకీయాలకు దూరంగా ఉంటే నష్టమని భావించాడు. పిడిఎస్‌యు ఆధ్వర్యంలో మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా గర్జించాడు. వర్తమాన రాజకీయాలలోకి విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. అన్ని కాలేజీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు తమ బాధ్యతను గుర్తు చేశాడు వీరన్న.

1982లో ఎం.ఎస్.సి. జియో ఫిజిక్స్‌ను మధ్యలో వదిలేసి పూర్తి సమయాన్ని విద్యార్థి రాజకీయాలకే కేటాయించాడు. ఉస్మానియ యూనివర్సిటీ కేంద్రంగా ఎన్నో ఉద్యమాలు చేశాడు. ఎస్.సి, ఎస్.టి హాస్టల్స్ సమస్యలపైన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేశాడు. వేదికపై మాటలతో, పాటలతో మాట్లాడుతుంటే విద్యార్థులు ఆసక్తిగా వినేవాళ్లు. ఒకవైపు విద్యార్థి ఉద్యమాలు చేస్తూనే, మరోవైపు జాతీయ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాలు, సామాజిక, అస్తిత్వ ఉద్యమాలను క్షుణ్ణంగా పరిశీలించాడు. వాటిపై సంపూర్ణ అవగాహన పెంచుకున్నాడు. మరోవైపు తెలంగాణ సాయుధ పోరాటం, శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటం, నక్సల్బరీ పోరాటాలు, ఉద్యమాలు వీరన్నను తీవ్రంగా ప్రభావితం

చేశాయి. ఆ ఉద్యమాల ప్రేరణతో వీరన్న తనదైన పోరుబాటను నిర్మించుకున్నాడు.

కారంచేడు సంఘటనతో వీరన్న అస్తిత్వ ఉద్యమాలకు ఊపిరిపోశాడు, చలించిపోయాడు. దళిత మహాసభ ఉద్యమాల్లో భాగస్వామ్యం అయ్యాడు. పిడిఎస్‌యును కూడా భాగస్వామ్యం చేశాడు. సాటి దళితులపై దౌర్జన్యం రాక్షసత్వం అనీ వీరన్న నినదించాడు. కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు బలపరచాలని పిడిఎస్‌యు నాయకుడిగా గర్జించాడు. అంబేద్కర్ రచనలను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశాడు. ప్రతిభ ఆధారంగానే ఉత్తీర్ణత కావాలనే అగ్రవర్ణాల డిమాండ్‌ను వీరన్న వ్యతిరేకించాడు. 1990లో వీరన్న చైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అరుణోదయ సంస్థకు చెందిన చైతన్య వీరన్న పాడుతుంటే నృత్యం చేసేది. పెళ్లి తరువాత ఉద్యమంలో ఇద్దరూ ఒదిగిపోయారు.

చుండూర్ మాలల మారణకాండతో వీరన్నలో ఉన్న సామాజిక జ్వాలలు ఎగిసిపడ్డాయి. రిజర్వేషన్స్, ఉద్యమాలు, దళితులపై దాడులు వీటిని తెలుసుకునేందుకు మేధావులతో చర్చలు జరిపేవారు. భారతదేశంలో వైరుధ్యాలను, అసమానతలను అర్థం చేసుకున్నాడు. ఒకవైపు సైద్ధాంతిక సిద్ధాంతాలను అన్వేషిస్తూనే విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేశాడు. అన్ని సమస్యలకు అగ్రకుల వ్యవస్థీకరణం అని నమ్మాడు. అందుకే అణగారిన ఆదివాసీ వర్గాలను అణగదొక్కుతున్నారని వీరన్న గ్రహించాడు. అంబేద్కర్, పూలే, మార్క్స్ ఆలోచనా విధానంతో విప్లవ పార్టీలు పోరాడాలనీ వీరన్న ప్రబోధించాడు. అందుకే అణగారిన వర్గాలతో ఆత్మగౌరవ పోరాటాలు చేయించాడు. కుల సంఘాలు ఏర్పాటు చేసి అస్తిత్వ ఉద్యమాలకు ప్రాణం పోశాడు.

1992 బాబ్రీ మసీదు విధ్వంసం జరిగిన తరువాత వీరన్న ఆలోచనలో స్పష్టత వచ్చింది. దళితులపై, అణగారిన వర్గాలపై దాడులు అగ్రవర్ణాల ఆధిపత్య ఫ్యూడల్ సంస్కృతి ఆలోచనా విధానమే అనీ వీరన్న భావించాడు. పీడిత వర్గాలు ఐక్యం కాకుండా నూతన ప్రజాస్వామిక విప్లవం రాకపోవడానికి కారణం కుల సమస్య అనీ వీరన్న నిర్ధారించాడు. అతివాద హిందూత్వ పోకడలపై పోరాటం చేయకుండా, వర్గపోరాటం చేయడం వృథా అనీ అనుకున్నాడు. పిడిఎస్‌యు నుండి బయటికి వచ్చి 1993లో సిపిఐ–ఎంఎల్ జనశక్తిలో చేరాడు. జనశక్తిలో అంబేద్కర్, పూలే సిద్ధాంతాలను అమలు చేయాలనుకున్నాడు. కానీ అగ్రకుల భావజాల నాయకత్వం అందుకు ఒప్పుకోలేదు.

కులవర్గ పోరాటాలపై లోతైన చర్చ జనశక్తిలో జరుగుతుండగానే 1994లో వీరన్న దళిత, ఆదివాసి, ముస్లిం వర్గాలతో కార్యాచరణ వేదిక (దపోదం) స్థాపించాడు. ఈ వేదిక ఏర్పాటు జనశక్తిలో విభేదాలకు దారితీసి 1993లో జనశక్తిలో ఐక్యమైన యు.సి.సి.ఆర్.ఐ. (ఎమ్.ఎల్) 1996లో జనశక్తి నుంచి చీలిపోయింది. ఈ చీలికకు దారితీసిన పరిణామాలపై లోతైన సిద్ధాంత చర్చ జరగాలన్నాడు మారోజు వీరన్న. వీరన్న ప్రతిపాదనను జనశక్తి కూర రాజన్న నాయకత్వం చర్చించకపోగా ప్రారంభంలోనే నిరాశ మిగిల్చింది. ఉక్కు క్రమశిక్షణతో సామాజిక ఉద్యమాల ప్రేరణతో 1996 నుండి 1998 డిసెంబర్ 25 వరకు సిద్ధాంత పోరాటం జరిపాడు. "కులేతర ఒంటరి వర్గ పోరాటం ఒంటిచేతి చప్పట్లేననీ, కులవర్గ జంట పోరాటాలు జంటచేతి చప్పట్లనీ" కుల నిర్మూలన కుల పోరాటం ఫలకపై సాగే కులవర్గ పోరాట బాటే ఇండియా విప్లవ బాటగా చేపట్టాలని మారోజు వీరన్న నిర్ధారణకు వచ్చాడు. కుల–వర్గ వ్యవస్థలు ఉన్న భారతదేశంలో వర్గపోరాటంతోబాటు కుల పోరాటాలను చేపట్టాలనే డిమాండ్‌ను ముందుకు తెచ్చాడు.

అందుకే కుల జనాభా దమాషా ప్రాతిపదికన దున్నే ఆడ, మగలకు సమానంగా భూమి పంచాలనీ బ్రాహ్మణీయ, భూస్వామ్య, పురుషాధిపత్య వ్యతిరేక ఉద్యమాల నిర్మాణానికి వీరన్న పూనుకున్నాడు. ఈ సిద్ధాంత ఉద్యమాలకు సారధ్యం వహించేందుకు, ఇండియా తరహా కమ్యూనిస్ట్ పార్టీ పుట్టలేదనే మాట పుట్టకముందే నూతన తరహాలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా – దళిత్ బహుజన శ్రామిక విముక్తి, ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్ట్ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి పార్టీని డా. బి.ఆర్. అంబేద్కర్ మనుశాస్త్రాన్ని దహనం చేసిన రోజున 1998 డిసెంబర్ 25న స్థాపించాడు. రష్యాలో (1901–05) ఆనాటి చారిత్రక దశలో విప్లవోద్యమాన్ని నిర్మించడానికి మార్క్సిస్టులు ఏం చేయాలి అనే ప్రశ్నను లేవనెత్తి సమాధానం చెప్పిన లెనిన్ రచనలు చదివి ఇండియా విప్లవానికి మార్క్సిస్టులు, కమ్యూనిస్టులు ఏం చేయాలి? అనే ప్రశ్నను 1936లో డా. బి.ఆర్. అంబేద్కర్ లేవనెత్తిన విషయం మాత్రం మర్క్సిస్టులకు గాని, అంబేద్కరిస్టులకు గాని తెలియదు.

రష్యాలో లెనిన్, ఇండియాలో డా. బి.ఆర్. అంబేద్కర్ లేవనెత్తిన ప్రశ్నను వీరన్న ఇండియాలో ఏం చేయాలి? అని మళ్లీ ప్రశ్నించారు. ఈ ప్రశ్న ద్వారా సిద్ధాంత చర్చలకు తెరలేపిన డా. అంబేద్కర్‌ను ఇండియన్ అగ్రకుల కమ్యూనిస్ట్ విప్లవకారులు పాలక వర్గాల సామ్రాజ్యవాదుల ఏజెంట్‌గా చిత్రీకరించి కుల వ్యవస్థ నిర్మూలన కార్యక్రమాలను విప్లవోద్యమంలో ఏజెండాలోకి తీసుకురాకుండా, 80, 90 సంవత్సరాలుగా తప్పించుకుంటూ అడ్డుకుంటున్నారు. ప్రపంచంలో మరెక్కడా లేని కుల వ్యవస్థ మన దేశంలో ఉంది. ఆ కుల వ్యవస్థ విలక్షణమైనది. ఈ దేశ పీడిత ప్రజల్ని ఐక్యం కాకుండా విభజించి పాలిస్తుంది.

అంతేకాకుండా ఆ కుల వ్యవస్థ బ్రాహ్మణిజం విప్లవ నిరోధక శక్తిగా మారింది. బ్రాహ్మణిజాన్ని తుదముట్టించే బ్రాహ్మణేతర కుల–వర్గ విప్లవ సిద్ధాంతాన్ని స్వీకరించడం అవసరం అని వీరన్న భావించాడు.

ఇండియాలో ఏకజాతి గాని, భారతజాతి గానీ లేవని బహుజాతులు, బహుళ శ్రామిక కులాలు బహుముఖంగా ఉన్నాయని, అది తమ సామాజిక వాస్తవికతల్నీ, తమ తమ అస్తిత్వం కోసం ఉద్యమిస్తున్నాయని ఈ దేశ సామాజిక, రాజకీయ పరిస్థితిని వీరన్న సృజనాత్మకంగా విశ్లేషించాడు. మార్క్సిజం, లెనినిజం, మావోయిజం ఈ దేశ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా పూలే, అంబేద్కర్ కుల నిర్మూలన అంశాలను విమర్శనాత్మకంగా స్వీకరించి, పరిపుష్టం చేసి అన్వయించాలని ప్రకటించాడు వీరన్న.

నిజానికి కుల, వర్గ వ్యవస్థలు అస్పృశ్యతకి మూలం కుల వ్యవస్థ. కుల వ్యవస్థకు మూలం మతం (వర్ణాశ్రమ) సనాతన ధర్మం. వర్ణాశ్రమ ధర్మానికి మూలం బ్రాహ్మణీయ హిందూ మతం. బ్రాహ్మణీయ హిందూ మతానికి మూలం రాజ్యాధికారం. ఈ బ్రహ్మ రహస్య వ్యూహానికి బ్రాహ్మణిజం దోపిడి వర్గ రాజ్యాధికారాన్ని పరిరక్షించేదిగా ఉంది కనుక బ్రాహ్మణీయ పద్మవ్యూహమైన విడగొట్టి పాలించేదానికి ప్రతి వ్యూహమైన వాటిని కూడగట్టి పాలించే దళిత బహుజన "ఐక్యత" విధానంతో, ఆదివాసి గిరిజనులు ఐక్య సంఘటన కట్టాలి. ఈ 'ఐక్య సంఘన'ను వేల సంవత్సరాలుగా విద్యా, ఉద్యోగం, వైద్యం రాజ్యాధికారానికి నోచుకోని

ఈ అణగారిన వర్గాలు స్వయం పాలన కోసం సామాజిక న్యాయం ప్రాతిపదికన రాజ్యాధికారాన్ని కైవసం చేసుకొని కులవర్గ వ్యవస్థల నిర్మూలన పోరాటంగా మలచవచ్చు. వీరన్న ఈ ప్రయోగమే చేశాడు. కులవర్గ జమిలి పోరాట సిద్ధాంతకర్త మారోజు వీరన్నను అగ్రకుల చంద్రబాబు ప్రభుత్వం హత్యచేసి నేటికి 18 ఏళ్లు. వీరన్న భౌతికంగా మన ముందు లేకపోయినా ఆయన చూపిన సామాజిక రాజకీయ విప్లవోద్యమం మన అందరికి మార్గం చూపుతుంది.

ఈ దేశంలో వివిధ అస్థిత్వాల్లాగానే కులం కూడా ఒక అస్తిత్వమని, ఆ కులవ్యవస్థను నిర్మూలించేందుకు ఆ కులాన్ని సాధనం చేసుకోవాల్సిన అవసరం ఉందని వీరన్న అన్నాడు. దీనికోసం ప్రత్యామ్నాయ దృక్పథంతో ప్రత్యేక కుల పోరాటాన్ని నిర్మించాలన్నాడు. ఈ ప్రత్యామ్నాయ కుల వర్గ జమిలి పోరాటాలకు సాయుధ విప్లవ పోరాటంలో ఆదివాసి అణగారిన వర్గాలు నాయకత్వం వహించాలని అన్నాడు. సామాజిక న్యాయం కోసం ప్రత్యేక పోరాటాలు అవసరంలేదని దోపిడీ పాలకవర్గాలు బి.సి., ఎస్.సి.లను ముఖ్యమంత్రి అని ప్రకటించడం సరికొత్త అగ్రకుల హైటెక్ ఆధిపత్యాన్ని తెరమీదికి తెస్తున్నాయి. ఇవి వారి దోపిడీని మరింత కొనసాగించుకోవడానికి వేసిన ఎత్తుగడే తప్ప మరొకటి కాదు. ప్రత్యామ్నాయ దృక్పథంతో కుల వర్గ పోరాటాలతోనే నిజమైన న్యాయం దక్కుతుంది. నేడు ఏజెన్సీ ప్రాంతంలో విచ్చలవిడిగా గిరిజనేతరుల వలసలు పెరిగి ఆదివాసులపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. ఆదివాసుల చట్టాలను కాలరాస్తున్నారు.

ఏజెన్సీలో ఉండే అన్ని రాజకీయ పార్టీల నాయకత్వంలో అగ్రకులాలు ఉంటున్నాయి. క్యాడర్లో అణగారిన ఆదివాసులు ఉంటున్నారు. ఏజెన్సీలో ప్రతి విప్లవ, కమ్యూనిస్ట్, బూర్జువా పార్టీలు గిరిజనేతరుల దోపిడీ గురించి కాని, ఆదివాసుల చట్టాల అమలు గురించి కాని మాట్లాడకపోవడం, ఆదివాసుల రిజర్వేషన్స్ గురించి మాట్లాడక పోవడమనేది కేవలం అగ్రవర్ణాల భావజాలంతో కూడిన గిరిజనేతర అగ్రకుల ఫ్యూడల్ న్యాయకత్వమే ఏజెన్సీలో భయంకరమైన బానిస వ్యవస్థను నడిపిస్తోంది. ఓట్లు ఆదివాసులవి, సీట్లు ఆదివాసులవి పెత్తనం గిరిజనేతరులది.

గిరిజనేతర రాజకీయ యంత్రాంగంలో ఆదివాసి అడవి బిడ్డల ప్రజా ప్రతినిధులు కేవలం తోలు బొమ్మలుగా, కీలు బొమ్మలుగా మాత్రమే ఉంటున్నారు. ఆదివాసి తెగలలో చెల్లప్ప కమిషన్ ద్వారా ఇతర అగ్రకులా లను చేరుస్తూ భయంకరమైన ఆధిపత్యాన్ని చెలాయిస్తూ, ఆదివాసులను నిర్వీర్యం చేస్తున్నారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటే కాకుండా జల్ జంగిల్ జమీన్ ఆదివాసులదేనని ఆదివాసి గిరిజన ఉద్యమాన్ని మొట్టమొదటగా విప్లవ శిభిరంలో వీరన్నే నిర్మించాడు. కులవర్గ పోరాటానికి ఉరుసుగా సాయుధ పోరాటాన్ని అనుసంధానం చేసి వర్గపోరాటం చేస్తేనే తప్ప కులం అంతం అవదని, విప్లవం రాదని భావించాడు.

కామ్రేడ్ మారోజు వీరన్న అసమానతలు దోపిడీ, పీడన వివక్ష లేని సమాజాన్ని స్వప్నించాడు. బుద్ధుడు, పూలే, అంబేద్కర్లను అధ్యయనం చేసి, మార్క్సిజాన్ని ఇండియా సమాజానికి అన్వయించి ప్రత్యామ్నాయ బహుజన ప్రజాస్వామ్య వ్యవస్థని నిర్మించాలని కలలు కన్నాడు. ఇండియా సమాజాన్ని మార్చాలంటే అంబేద్కర్, మార్క్సిస్టుల ఐక్యత ఆవశ్యకతను బలంగా కోరుకున్నాడు. నేడు కమ్యూనిస్ట్ పార్టీ అంటే కమ్మ+కోడిండ = కమ్యూనిస్ట్ పార్టీగా మారిందని, మార్క్సిజాన్ని మంటల్లో కలిపి, కమ్యూనిజాన్ని కాట్లో కలుపుతున్నారని ఆవేదన చెందాడు. ఇండియా సమాజంలో నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ మూలంగా ఆదివాసి, దళిత, బహుజనులకు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో జరుగుతున్న వివక్ష, ప్రాంతాల మధ్య వనరుల పంపిణీలో జరుగుతున్న అసమానతలు రూపుమాపి ప్రత్యామ్నాయ వ్యవస్థని ప్రతిష్టించాలని భావించాడు. తను కలలుకన్న సామాజిక వ్యవస్థ నిర్మాణం కోసం కింది కులాల నాయకత్వంలో ప్రత్యామ్నాయ నిర్మాణాలు చేస్తూ, విశాల ఆదివాసి, దళిత, బహుజన వేదికను ఏర్పాటు చేస్తున్న క్రమంలో తనదైన రాజకీయ దృక్పథంతో విద్యార్థి యువజన, ప్రజాస్వామిక శక్తులను సమీకరించి సంఘటితపరుస్తున్న వీరన్నను, వీరన్న చేస్తున్న ప్రయత్నాన్ని ప్రమాదకరంగా గుర్తించి పాలకులు 1999 మే 16న బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చి చంపారు.

వీరన్న ప్రతిపాదించిన కుల వర్గ నిర్మూలన పోరాట రాజకీయ దృక్పథంపై విభిన్నమైన భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు కాని, ఎవరికెన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామిక ఉద్యమ నిర్మాణంలో కుల నిర్దిష్టత విస్మరించరానిది ఇండియా నిర్దిష్ట పరిస్థితుల్లో, నిర్దిష్ట విశ్లేషణలో, విప్లవాత్మకమైన మార్పు కుల దృక్పథంతో కూడిన సామాజిక న్యాయంతో ముడిపడి ఉంటుందని వీరన్న సూచించాడు. అస్తమించిన సూర్యుడు ఉదయించకమానడు. మరణించిన వీరుడు ఏదో ఒక రూపంలో తన ఉషోదయ వెలుగు రేఖలను ప్రసరింపజేస్తూనే ఉంటాడు. సామాజిక విప్లవకారుడు వీరన్న నిత్యం ఉషోదయ సూర్యుడే వర్తమాన కాలంలో జరుగుతున్న ప్రతి సామాజిక సమరంలో, ఆందోళనలో, ఆశయాలలో వీరన్న ప్రతిపాదనలు ఉదయభానుడి కిరాణాల వేడిని పుట్టిస్తూనే ఉంటాయి. వీరన్న భౌతికంగా లేకున్నా ఆయన సిద్ధాంతం సజీవంగా ఉంది. ఆయన చూపిన మార్గం ఉంది. కులవర్గ విప్లవ సాయుధ పోరాటాలను ఎత్తిపట్టి, వీరన్న సిద్ధాంతాన్ని ఆచరించి, ఆయన మార్గంలో నడవడమే వీరన్నకు ఘన నివాళి. ఇకనైనా విప్లవ, కమ్యూనిస్ట్ పార్టీలు వీరన్న సిద్ధాంతాన్ని ఆచరించకుంటే ఆదివాసి, దళిత, అణగారిన వర్గాలకు శత్రువులుగా మారడం ఖాయం.

(రచయిత ఆదివాసీ రచయితల సంఘం, రాష్ట్ర అధ్యక్షులు – తెలంగాణ) వీ

తగినంత పెద్ద అబద్ధాన్ని చెప్పి, దాన్ని పదే పదే చెపుతూ పోతే, ప్రజలు చిట్టచివరికి దాన్ని నమ్మేస్తారు. ఆ అబద్ధపు రాజకీయ, ఆర్థిక, సైనిక పర్యవసానాలు ప్రజలు గుర్తించకుండా అడ్డుకోగలిగినంత కాలమే ఆ అబద్ధాన్ని కాపాడడం వీలవుతుంది. అందువల్ల చాల ముఖ్యమైన విషయమేమంటే రాజ్యం తన అధికారమంతటినీ వాడి అసమ్మతిని అణచివేయవలసి ఉంటుంది. ఎందుకంటే సత్యమే అబద్ధానికి బద్ధ శత్రువు. అంటే ఇంకా వివరించి చెప్పాలంటే సత్యమే రాజ్యానికి అతి పెద్ద శత్రువు

– **జోసెఫ్ గోబెల్స్,** *(1897–1954) జర్మన్ శాస్త్రవేత్త, హిట్లర్ పాలనాకాలంలో 1933 నుంచి 1945 వరకు ప్రచార శాఖ మంత్రి*

రాచరికాలు పోయినా రాజద్రోహ చట్టాలు

పాలన పట్ల నిరసన తెలపడం, పాలకులను ప్రశ్నించడం పౌరుల రాజ్యాంగ హక్కు అని తెలిసినా బ్రిటీష్ కాలంలో ఉన్న రాచరిక చట్టాలనే కొనసాగిస్తూ ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా ముద్రవేయడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని అంటున్నారు **ఆర్. లక్ష్మి**

ఏమిటి ఈ రాజద్రోహ చట్టం?

లార్డ్ టి.బి. మెకాలే 1870లో ఈ చట్టాన్ని రూపొందించారు. దేశపు నేర శిక్షా స్మృతిలో చేర్చబడిన ఈ చట్టం - 124-ఎ ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా వినిపించే గొంతులను అణచివేయడానికి ఉద్దేశించబడింది. తిలక్, మహాత్ముడు వంటివారు ఈ చట్టానికి గురిచేయబడ్డారు. బ్రిటిష్‌వారి పరిపాలనను వ్యతిరేకించే వారిని రాజద్రోహులుగా పరిగణించి వారిని నిర్బంధించి శిక్షకు గురిచేయడం జరిగేది. అర్థవంతమైన ఆధునిక ప్రజాస్వామ్యంలో వాక్ స్వాతంత్ర్యానికి ఉన్న విశిష్టమైన పాత్రను గుర్తించిన యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె) ప్రభుత్వం మాట్లాడే హక్కుకు భంగం కలిగించే కాలం చెల్లిన చట్టంగా పేర్కొంటూ 10 సంవత్సరాల కిందటే దీనిని రద్దు చేసింది.

అయితే ఇక్కడ ఒక విషయాన్ని నిశితంగా పరిశీలించాలి. ఈ చట్టంలో రెండు ముఖ్యమైన వివరణలు కూడా స్పష్టంగా పొందుపరచబడి ఉన్నాయి. ప్రభుత్వం గాని, ప్రభుత్వ యంత్రాంగం గాని పనితీరు, చర్యల పట్ల అసంతృప్తి కారణంగా మార్పును కోరుతూ చట్ట విరుద్ధం కాని పద్ధతుల్లో నిరసన ప్రకటించినంతవరకు అది రాజద్రోహం కానేకాదు. ప్రభుత్వం పట్ల ధిక్కారాన్ని గాని, విద్వేషాన్ని గాని ప్రేరేపించనంతవరకు ఎంతటి శక్తివంతమైన పదజాలాన్ని ప్రయోగించినా నేరం కాదు. చట్టంలో అంత స్పష్టత ఉన్నప్పటికీ దేశ సమైక్యతను, సార్వభౌమత్వాన్ని విచ్ఛిన్నకర శక్తుల నుండి కాపాడే చట్టంగా కాక చాలా సందర్భాలలో నిరసన గళాలను అణచడానికి, వ్యక్తిగత కక్ష సాధింపులో భాగంగా ఈ చట్టం వినియోగించబడుతోంది.

చారిత్రాత్మక తీర్పు

ప్రభుత్వం పనితీరును వ్యతిరేకిస్తూ అసమ్మతిని గాని, విమర్శను గాని, నిరసనను గాని తెలియచేసే సందర్భంగా ఎంత శక్తివంతమైన పదజాలాన్ని ప్రయోగించినప్పటికీ దానిని రాజద్రోహం నేరంగా పరిగణించడానికి వీలులేదని - అసమ్మతిని తెలియజేసే హక్కును గురించి ప్రస్తావిస్తూ కేధారనాథ్ సింగ్ వర్సెస్ బీహార్ ప్రభుత్వం కేసులో 1962లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

హింసను ప్రేరేపించడం, ప్రజలలో అల్లర్లు సృష్టించడం, శాంతి భద్రతలకు భంగం కలిగించడం వంటివి జరిగిన సందర్భాలలో మాత్రమే 124ఎ వర్తిస్తుందని ఈ కేసులో (కేధారనాథ్ సింగ్ వర్సెస్ బీహార్) అపెక్స్ కోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ విధానాల పట్ల, చర్యల పట్ల అసంతృప్తిని ప్రకటించడానికి, ప్రభుత్వం పట్ల , దేశం పట్ల అవిధేయత ప్రకటించడానికి తేడా ఉందంటూ స్పష్టమైన విభజన రేఖనూ గీసింది.

ఈ తీర్పు విసిష్టత, నిష్పాక్షికతల కారణంగా మరెన్నో సందర్భాలలో ఆదర్శ ప్రాయమైంది కూడా. 2016 నాటి ప్రజా ప్రయోజనాలు వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో 'కేధారనాథ్ సింగ్' కేసులోని మార్గదర్శక సూత్రాలకు కట్టుబడి ఉండాలని సుప్రీంకోర్టు పోలీసులను ఆదేశించింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 20 భావ ప్రకటనా స్వేచ్ఛ, సంఘాలు, సమావేశాలు ఏర్పాటు చేసుకొనే స్వేచ్ఛ, జీవించే స్వేచ్ఛలను ప్రసాదిస్తున్నాయి. ఆర్టికల్ 19లోని భావ వ్యక్తీకరణ స్వేచ్ఛతో కూడిన ఈ మాట్లాడే హక్కు / వాక్ స్వాతంత్ర్యం - భారతదేశపు ప్రజాస్వామ్య విలువలను కాపాడగల ఉదాత్తమైన సాధనంగా శ్రేయాసింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో మన సుప్రీంకోర్టు అభివర్ణించడం జరిగింది.

వివిధ దేశాలలో

గతంలో తన ఏలుబడిలో ఉన్న దేశాలు రాజకీయ అసమ్మతిని, తద్వారా వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేయడానికి ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని యుకె అభిప్రాయ పడుతుంది.

యుఎస్ఎలో ఈ చట్టంలో మొదటి సారిగా తేబడిన సంస్కరణ - మాట్లాడే హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛలను కాపాడే పటిష్టమైన సాధనంగా మన్ననలందుకుంటోంది. 'రాజద్రోహ అభియోగం' దానికి ఉన్న చట్టబద్ధతపై సుదీర్ఘ విచారణలు, న్యాయ ప్రక్రియలు, తీర్పులు అనంతరం ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వాదించినప్పటికీ నిషిద్ధం కాదని ఆ వాదనలు చట్ట విరుద్ధమైన చర్యలుగా పరిణమించనంతవరకు నిషేధించవలసిన పనిలేదని 'బ్రాడెన్‌బర్గ్ వర్సెస్ ఓహియో' కేసు సందర్భంగా అమెరికా సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

ఆస్ట్రేలియా ఈ చట్టాన్ని 2010లోనే రద్దు చేసింది. మనదేశంలోనూ పార్లమెంటు సభ్యులు పలువురు ఈ చట్టంలో సవరణలు తెచ్చే విధంగా గాని లేక పూర్తిగా రద్దు చేసే విధంగా గాని ప్రతిపాదిస్తూ పలు బిల్లులను ప్రవేశపెట్టడం జరిగింది.

నేర నమోదు ప్రాధికార సంస్థ గణాంకాల ప్రకారం రాజద్రోహ నేరం కింద అభియోగాలు, శిక్షలు బాగా తగ్గాయి. అయినప్పటికీ ప్రత్యేకించి వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని మోపబడుతున్న అభియోగాలు ఎక్కువయ్యాయి.

ఒకసారి దేశద్రోహ నేరం ఆరోపించబడ్డాక నిందితుడి పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకోబడుతుంది. ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడానికి అనర్హులు. పదేపదే కోర్టుల చుట్టూ తిరగవలసి ఉంటుంది. తన

ఆధునిక అప్పుల ఉద్యోగులు

***మధ్యతరగతి ప్రజలు వినియోగ సంస్కృతికి అలవాటు పడి పొదుపు బాట నుంచి తప్పిపోయి అప్పుల్లో కూరుకు పోతున్నారనీ, ఇది పెరుగుతున్న కొద్దీ పరిస్థితి మరింత విషమిస్తుందనీ హెచ్చరిస్తున్నారు* వి.వెంకట్రావు**

'కిరాణా కొట్టుకి వెళ్ళి, ఇంటి సామాన్లు పట్టుకు రండి' అని, ఏయే సామాన్లు కావాలో లిస్టు చేతికి ఇచ్చింది భార్య. ఇచ్చిన సామాన్ల లిస్టు జేబులో పెట్టుకొని, నాలుగు వందల రూపాయలు కూడా పట్టుకొని బజారుకి వెళ్లాడు చిన్నారావు. సామాన్ల లిస్టు ఇచ్చాడు షాపతనికి. సామాన్లు కడుతుండగా సందేహం వచ్చింది తను తీసుకెళ్లిన డబ్బులు సరిపోతాయో, లేదోనని. వెంటనే 'ఒకసారి డబ్బులు ఎంతవుతాయో చూడండి' అన్నాడు. అతను లెక్కవేసి, 'నాలుగు వందల పన్నెండ'న్నాడు. 'పప్పుల్లో పావు కేజీ చొప్పున కొంచెం తగ్గించండి' అన్నాడు. అలాగే తగ్గించి కట్టించాడు షాపతను. ఇప్పుడు లెక్కవేస్తే మూడు వందల ఎనభై ఆరు అయ్యింది. 'హమ్మయ్య! రిక్షాకి పది రూపాయలు పోతే ఇంకా నాలుగు మిగులుతాయి' అనుకొని, తెచ్చిన సంచులలో సామాన్లు నింపుకొని, డబ్బులు ఇచ్చేసి, ఇంటి ముఖం పట్టాడు. కావలిసిన సామాన్లు తెచ్చేసుకున్నాడు. ఆ క్షణంతో షాపతనికీ, చిన్నరావుకి ఎటువంటి లింకూ లేదు. బజారుకి వెళ్లి రావడానికి గంట, మహా అయితే గంటన్నర. ఇది 30,40 ఏళ్ల క్రితం దృశ్యం కాదు. చిన్న చిన్న నగరాల్లో ఇప్పటి దృశ్యం కూడా. కానీ, పెద్ద నగరాల్లో ఇదే ద్రుశ్యం వేరుగా ఉంటుంది.

ఇప్పుడు కూడా కిరాణా కొట్టుకి బయలుదేరాడు ఒక భర్త. లేదా భార్యా భర్తా ఇద్దరూను. కాకపోతే లిస్టు కాగితం మీద కాదు సెల్‌లో ఫీడ్ చేసుకొని. కారు మీద లేదా టూ వీలర్ మీద. వెంట సామాన్లు తీసుకు రావడానికి సంచులు లేవు. అయితే ఆ కిరణా కొట్టు పేరు ఏదో పెద్ద షాపింగు మాల్ లో ఒక భాగం. కిరణా కొట్టు అని మనం అనేస్తాం గానీ, దానికేదో అందమైన ఇంగ్లీషు పేరు ఉంటుంది. భూమి లోపలా బయటా కలిపి ఎనిమిది, తొమ్మిది అంతస్తులు ఉంటాయి. ముందు, తీసుకెళ్లిన వాహనం పార్క్ చెయ్యాలి. భూమి లోపలి కనీసం మూడు అంతస్తులు లోనికి వెళ్లి పార్క్ చేసారు. ఆ పార్కింగ్ స్థలం అంతా అక్కడక్కడ కొన్ని ట్యూబ్ లైట్లు వెలుతురు బలహీనంగా.

అక్కడ నుండి మాల్ అనబడే కిరణాకొట్టుకి రావడానికి మూడు అంతస్తులు మెట్లు ఎక్కి ప్రయాస పడనక్కరలేదు. లిఫ్ట్ ఉంది. అందులో నుండి కిరాణా కొట్టు ఉండే దగ్గరకు నేరుగా వచ్చేయవచ్చు. వచ్చేసారు కూడా. షాపు బయటే చక్రాల బండి ఉంది. సామాన్లు వేసుకోవడానికి. సూర్యుడు నడినెత్తిన ఉన్నా, అంతా వెలుగు ఉండదేమో. అన్ని లైట్లు. వరసగా చిన్న సందుల గుండా చక్రాల బండి తోసుకుంటూ, వెళుతున్నారు దంపతులు. కొత్తగా పెళ్లయిన ఆ భార్యకు అంతా కొత్తగా ఉంది. కావలిసిన సామాన్లన్నీ వరసగా చాలా అందంగా పేర్చి ఉన్నాయి. అన్నీ రంగు రంగులుగా ఉన్నాయి. కొందరమ్మాయిలు యునిఫారాలు వేసుకొని ఎప్పటి కప్పుడు నేలను శుభ్రం చేస్తున్నారు. కావలిసిన సామాన్లన్నీ ఒక్కొక్కటి చక్రాల బండిలో వేసుకొంటున్నారు. అన్నీ అవసరం ఉన్నట్టుగానే కనిపిస్తున్నాయి.

ఆ రంగురంగుల సామాన్లు చూసి ఒళ్లు మరచిపోయింది భార్య. ఆమె 'తన పుట్టింట్లో, సామాన్లన్నీ పాత కాగితాల్లోనే పొట్లాలు కట్టి ఇచ్చేవారు. కానీ, ఇక్కడ అలా కాదు. తన వూర్లో కొన్న ఆవాలూ, మిరియలే. కానీ, భలే పేకింగ్. అసలు ఆ పెకింగ్ కే ఇవ్వవచ్చు డబ్బులన్నీ' అనుకుంది మనసులో. ఒక్కొక్క సామాను వేసుకొని, బండి తోసుకొని ముందుకు వెళుతున్నారు. కావలసిన సామాన్లు అన్నీ తీసుకొని బిల్లు చెల్లించే కౌంటర్ దగ్గరకు వచ్చారు.

ఇంటి దగ్గర బయలుదేరే ముందు పన్నెండు లేదా పదమూడు వందలు అవుతుందని అనుకొన్నారు. కానీ, బిల్లు రెండు వేలు పైబడింది. 'అమ్మో!' అని ఒకసారి అనుకున్నాడు గానీ, ఇన్ని సామాన్లు ఎందుకు? అని, కొన్ని సామాన్లు తీసేయ్యలేదు. తెచ్చిన డబ్బులు సరిపోయాయో, లేదోనని అనుకుంది భార్య. కానీ, భర్త మాత్రం ఏమీ పట్టనట్టు ధీమాగానే ఉన్నాడు. జేబులో నుండి బిల్లు చెల్లించడానికి డబ్బులు తీయలేదు. చిన్న అట్ట ముక్క తీసాడు. దాన్నే మిషనులో పెట్టి తీసేసి మళ్లీ ఇచ్చేసారు. ఆశ్చర్యపడి, అడిగింది భార్య. 'డబ్బులు ప్రస్తుతానికి మన దగ్గర లేకపోయినా పర్వాలేదు. క్రెడిట్ కార్డ్ ఉందిగా' అన్నాడు.

ఇలాంటి సంఘటనలు పెద్ద పెద్ద నగరాల్లో చాలా కనిపిస్తుంటాయి. చాలా కాదు. దాదాపుగా అన్నీ అలాంటివే. మొదటి ఉదాహరణలో

నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి అయ్యే డిఫెన్స్ ఖర్చులనూ భరించాల్సి ఉంటుంది. సంఘంలో వ్యక్తిగతంగా అప్పటివరకూ ఉన్న పేరు ప్రతిష్టలు దెబ్బతినడం వంటి పరిణామాలు ఎలాగూ ఉండనే ఉంటాయి.

సందేహ లాభం – బెనిఫిట్ ఆఫ్‌డేట్‌తో పలు సందర్భాలలో నేరస్థులను సైతం విడిచిపెట్టబడుతూ ఉండడాన్ని చూస్తుంటాం. అటువంటప్పుడు కేవలం అసత్యారోపణలు లేదా ప్రమాదకర పరిణామాలు సంభవించగల వన్న 'అనుమాన భయం'తో – విషయ పరిజ్ఞానంతో విశ్లేషించి సాధికారంగా ప్రశ్నించగల మేధావి వర్గంలోని పౌరులను సైతం దేశద్రోహం/రాజద్రోహం అన్న నేరారోపణలతో నిర్బంధించి ఇక్కట్లకు గురిచేయడం ఒక సువిశాల ప్రజాస్వామ్య దేశానికి ఏ రకంగానూ శ్రేయస్కారం కాదు.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

వీ

కిరణా కొట్టువాడితో సంబంధం ఆ రోజుతో సరి. కానీ, రెండవ ఉదాహరణలో షాపు వాడితో సంబంధం ఆ రోజుతో మొదలు. ఇది అరువు బంధం కాదు. అప్పు బంధం.

మొదటి ఉదాహరణలో ఒక వేళ తీసుకువెళ్లిన డబ్బులు చాలకపోయినా వందా, ఏబై తక్కువ వచ్చినా తరువాత జీతాలు వచ్చిన వెంటనే ఇచ్చేస్తే సరిపోతుంది. అది అరువు కాబట్టి, అరువు, అసలును మాత్రమే కోరుతుంది. అప్పు సంగతి అలా కాదు. అది అసలుతో పాటు వడ్డీ కూడా కోరుతుంది. ఈ విషయం తెలుసుకోవడానికి పెద్ద పెద్ద డిగ్రీలు చదవనక్కరలేదు. ఐదో తరగతి కుర్రవాడిని అప్పు దేనిని కోరును? అని అడిగితే 'వడ్డీ కోరును' అని చెబుతాడు. మళ్లీ మనమే 'వడ్డీ దేనిని కోరును?' అని అడిగితే, 'చక్ర వడ్డీ కోరును' అని చెబుతాడు. 'చక్ర వడ్డీ దేనిని కోరును?' అని అడిగితే, అంతకంటే వాడికి తెలియదు కాబట్టి, తెల్ల మొహం వేస్తాడు. ఎందుకంటే వాడు చదివింది ఐదో తరగతే కదా! కానీ, జీవితాన్ని చదువుకున్న ఎవడిని అడిగినా చక్రవడ్డీ 'ఇల్లూ, వాకిలీ కోరును' అని చెబుతాడు. ఇంకా దాని బుద్ధి బాగుంటే, జీవితాల్నే కోరుకుంటుంది. అప్పుల భాదలు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఎన్ని పేపర్లలో చదవడం లేదు. ఇందులో తప్పు ఎవరిది? అప్పు తీసుకునే వాడిదా? అప్పు ఇచ్చేవాడిదా? నిస్సందేహంగా అప్పు తీసుకునేవాడిదే.

దీనికి కారణం ఏమిటి? అని ఆలోచించాలి. ఇల్లు గడవక అప్పులు చేయడం వేరు. 'అప్పు చేయడం మంచిది కాదు' అని తెలిసినా. తప్పని సరి పరిస్థితులు అలాంటి స్థితికి నెట్టుతాయి. ఇవి అలా కాదు. ఆడంబరాల కోసం, అలంకరణల కోసం అప్పు చేయడం.

పాత రకం అప్పుల సంగతి వేరు. అప్పుకోసం ప్రత్యేకించి వేరొకరి వద్దకు వెళ్లాలి. వాళ్లను బ్రతిమిలాడాలి. వాళ్లు ఇవ్వడానికి బెట్టు చేస్తారు. ఇచ్చినా వడ్డీ రేటు చెబుతాడు. వడ్డీ కట్టగలమా, లేదా అని తర్జన బర్జన పడాలి. ఇచ్చినంత వరకూ ఆందోళనపడాలి. ఇన్ని తిప్పలు పడాలి. కానీ, ఈ ఆధునిక అప్పులు అలా కాదు. అప్పు ఇచ్చేవాడు ఉద్యోగస్తుల జేబులోనే ఉంటాడు.

కిరాణా కొట్టుకి వెళ్లినా, రెస్టారెంట్‌కి వెళ్లినా, వెంటే ఉంటాడు. 'తిను. ఇంకా తిను. చికెన్ ఫ్రై తెప్పించుకో, మటన్ బిరియానీ ఆర్డర్ చెయ్యి నీకెందుకు అప్పు ఇచ్చేవాడిని నేను ఉన్నాను కదా!' అంటూ అశరీరవాణి ద్వారా తన గొంతు వినిపిస్తునే ఉంటాడు. బట్టల షాపుకి వెళ్లినా సరే, అక్కడా అంతే. అటుపక్క బట్టలు ఆకర్షణీయంగా కనిపిస్తు ఉంటాయి. ఇటు వైపు అప్పు ఇచ్చేవాడు 'నీకెందుకు తీసుకో' అని భరోసా ఇస్తుంటాడు. ఇంకేముంది కావలసిన బట్టలు కొనుక్కొని, కడుపు నిండా తిని, టేంక్ నిండా పెట్రోల్ నింపుకొని ఇంటికి తిరుగుముఖం పడుతుంది ఒక మధ్యతరగతి జంట. ఎందుకంటే, అన్నిటికీ అరువు అట్ట ఉందిగా. అదేనండి! క్రెడిట్ కార్డ్ కి తెలుగు అనువాదం.

అప్పు ఇవ్వడానికి బెట్టు చేసే రోజుల నుండి, వెంటబడి అప్పులిచ్చే రోజులని చూస్తే, మనకి చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. వెనకటి తరం మనుషులకి చెప్తే వాళ్లు మహా ఆశ్చర్యపోతారు. 'ఏమిటి? వెంటపడి మరీ అప్పులిస్తారా?' అంటారు. 'మరేటనుకున్నావు తాతయ్యా! మీరోజులనుకున్నవా? అప్పుల కోసం ఇంటింటికీ తిరిగే రోజులు పోయాయి' అని మనవడు గర్వంగా చెబుతాడు. గానీ, అసలూ, వడ్డీల స్వభావం మారలేదనీ, ముక్కుపిండి వడ్డీ వసూలు చేస్తారనే విషయం కొన్నాళ్లకి గానీ తెలియదు. తెలిసినా ఆకర్షణీయమైన వస్తు ప్రపంచం తన వైపు లాక్కుంటుంది.

అయితే, ఇక్కడ ఒక తమాషా ఉంటుంది. మనం క్రెడిట్ కార్డ్ వాడిన దగ్గర నుండి 40 రోజుల వరకూ మన దగ్గర ఒక్క పైసా కూడా వడ్డీ తీసుకోరు. వడ్డీ లేని అప్పు అని మనం తెగ సంబరపడిపోతాం. నిజంగా అలా 40 రోజులలో డబ్బులు కట్టేస్తే మంచిదే. అలా జరుగుతుందా? ఏ తేదిన చెనగపప్పు కొన్నమో, ఏ తేదిన బండికి పెట్రోల్ పోయించామో లెక్కలు వేసుకొని ఆ తేది రాక ముందే డబ్బులు కట్టేయడం ఆచరణలో జరుగుతుందా?

నూటికి 90 మంది విషయంలో అలా జరగదు. దాదాపుగా అందరూ వడ్డీతోనే కడతారు.'అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?' అని నన్ను ఎవరైనా ప్రశ్నిస్తే... 'దీని కోసం సర్వేలు నిర్వహించనవసరం లేదు. బేంక్‌లు ఆ స్కీములు నడుపుతున్నాయంటే అర్థం వడ్డీలతో సహా కడుతున్నారనే' అని చెబుతాను. బ్యాంకులు కూడా వ్యాపారసంస్థలే. అవి కూడా లాభల కోసమే పనిచేస్తాయి. చిన్నపాటి రుణానికే 33 హామీలు కావాలనే బేంకులు, ఉద్యోగుల వెంటపడి మరీ అప్పులిస్తున్నారంటే లాభసాటిగా ఉండబట్టే.

ఉదాహరణ కోసం ఒకవేళ అందరూ 100కి 100 మంది చాలా గడుసుదనంగా 40 రోజుల లోపే డబ్బులు కట్టేస్తున్నారనుకుందాం. ఏం జరుగుతుంది? బేంకు వాడు అంతకంటే గడుసుదనంగా 'ఆ నలుగురూ' సినిమాలో కోట శ్రీనివాసరావు అన్నట్లు 'ఎత్తిపోతల పథకం కింద ఈ స్కీముని ఎత్తేస్తారు' ఎందుకంటే? బేంకులు కూడా వ్యాపార సంస్థలే. నష్టాల కోసం, వూరికి ఉపకారం కోసం వ్యాపారాలు చెయ్యరు. ఇక్కడ ఒక విషయం. బేంక్ ఒక్క రోజుకి కూడా లెక్కవేసి వడ్డీ తీసుకుంటుంది కదా! అలాంటిది 40 రోజుల వరకూ ఎందుకు వడ్డీ తీసుకోదు? మన దగ్గర తీసుకోక పోవచ్చు గానీ, మనం కొన్న సరుకుల వాడి దగ్గర తీసుకోవచ్చు.

ఏదో జరుగుతుంది. ఏ వ్యాపార సంస్థ నష్టపోదు. మొత్తానికి జనాలచేత ఎక్కువ సరుకులు కొనిపించాలి. పనికి వచ్చేవి ఉంటాయి. పనికిరానివీ ఉంటాయి. ఆడంబరలకోసమూ ఉంటాయి. అవసరం కోసమూ ఉంటాయి. సరుకుల ప్రపంచంలో అవసరం లేకపోయినా జనాల చేత కొనిపించడమే వినియోగ సంస్కృతి.

వినియోగ సంస్కృతి

ఏమిటీ వినియోగ సంస్కృతి? ఎక్కడ నుండి దిగుమతి అయ్యింది. అదీ ఆలోచించాలి. ఇది పెట్టుబడిదారీ సమాజం. పెట్టుబడిదారీ సమాజాలలో కావలిసింది సరుకుల అమ్మకాలు. ఎప్పటి సరుకులు అప్పుడు అమ్ముడవుతుంటేనే, అమ్మిన సరుకు మీద లాభాలు వస్తుంటాయి. వచ్చిన లాభాలు, మళ్లీ పెట్టుబడికి కలిసి, కొత్త సరుకు తయారవుతుంటుంది. దాని మీద మళ్లీ లాభాలు. ఇది ఇలా చక్రంలాగా తిరుగుతూ ఉండాలి. లాభాలు వచ్చిపడిపోతూ ఉండాలి. అలా జరగాలంటే, కావలసింది సరుకుల అమ్మకాలు.

మొదట తయారయిన సరుకులు అమ్ముడైతేనే రెండోసారి తయారు

చేస్తారు. రెండోసారి తయారయైన సరుకులు అమ్ముడైతేనే మూడోసారి చేస్తుంటారు. అందుకే, సరుకుల అమ్మకాల కోసం ఎన్ని రకాల ఎత్తులు వేయాలో అన్ని రకాల ఎత్తులూ వేస్తుంటారు. రెండు కొంటే, ఒకటి ఉచితం. ఒకటి కొంటే, ఒకటి ఉచితం. అలాగే తగ్గింపులు. రెండవసారి మా రెస్టారెంట్‌కి వస్తే, తరువాత బిల్లులో కొంత డిస్కౌంట్ ఇస్తామని ఇలా రకరకాలు. ఎక్స్చేంజ్ ఆఫర్లు. గతంలో ఏ వస్తువు అయినా పాడయితే, బాగుచేయించుకునే వాళ్లం.

ఇప్పుడు కూడా బాగు చేయించుకోవడం ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో పాత వస్తువుకి నామ మాత్రపు ధరతో షాపు వాడికి ఇచ్చేస్తే, కొత్త వస్తువు ఇస్తాడు. కొత్త వస్తువు ఇంటికి వచ్చిందని సంబరపడతాం. 'జనాలు ఎప్పుడూ పాత వస్తువులనే బాగు చేయించుకుంటూ వాడుతుంటే, కొత్త వస్తువులు ఎప్పుడు కొంటారు? అలా కొనకపోతే మా లాభాల సంగతి ఏమిటి?' ఇలా ఆలోచిస్తారు పెట్టుబడిదారులు.

అలాంటిదే యూజ్ అండ్ త్రో (ఉపయోగించు...పారవెయ్యి) పద్ధతి. గతంలో బజారుకి వెళ్లినపుడు వెంట తప్పనిసరిగా సంచి తీసుకువెళ్లేవాళ్లం. ఇప్పుడు అలా కాదు. ప్లాస్టిక్ సంచులు సరుకుతో పాటు ఇస్తారు. 'ప్లాస్టిక్ భూమిలో కలవదనీ, వాటి వాడకం పర్యావరణానికి మంచిది కాదని' ప్రచారం చేస్తారు. వాటిని వాడితే జరిమానా అని కూడా అంటుంటారు. కొంత మందికి వేస్తారు కూడా. అసలు ఆ సంచులు తయారైన కంపెనీలోనే బయటకు రాకుండా తగు చర్యలు తీసుకుంటే, అక్కడే ఆపెయ్యవచ్చు కదా! అదేమీ ఉండదు.

ఒక పక్క 'పర్యావరణాన్ని రక్షించండి' అని ప్రకటనలు. అవి మాత్రం మార్కెట్ లో దర్శనమిస్తూనే ఉంటాయి. పెట్టుబడిదారీ సమాజాల్లో కొత్త కొత్త సరుకుల్ని తయారు చేసి, వాటిని పరిచయం చేసి, ప్రజలచేత కొనుగోలు చేయిస్తుంటారు. 'డే' ల సంస్కృతి అలా వచ్చిందే. ఈ 'డే' రోజు వాటికి సంబంధించి ఏవేవో కొత్త సరుకులు మార్కెట్ లో కనిపిస్తూనే ఉంటాయి.

ఇదంతా సరుకులు అమ్మడాల్లో భాగాలే. అప్పులు ఇవ్వడం కూడా అందులో భాగమే. జేబులో డబ్బులు ఉన్నప్పుడు మన కొనుగోలుకు పరిమితి ఉంటుంది. కానీ, ఇక్కడ పరిస్థితి అలా కాదు. ప్రస్తుతం డబ్బులు ఇవ్వనక్కర లేదనే ధీమా ఉంటుంది. దానికి తోడు బయట వస్తు ప్రపంచం ఆకర్షనీయం కనిపిస్తుఉంటుంది. అవసరం కోసం తక్కువ ఖర్చు. విలాసాల కోసం ఎక్కువ ఖర్చు.

అవసరాలకి అప్పు చేయడం వేరు. ఆడంబరాలకీ, విలాసాలకీ అప్పు చేయడం వేరు. ఉండడానికి ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నారు. బేంక్ లోను పెట్టి ఇల్లుకొంటారు. ఆఫీసుకి వెళ్లడానికి వాహనం లేదు. లోను పెట్టి వాహనం కొంటారు. ఇంటి అద్దెనీ, నెలవారి ఇఎంఐని లెక్కవేసుకొని, కొంత ఎక్కువైనా కాస్త ఇబ్బంది పడి కొంటారు. అది అప్పయినా అవసరం. కానీ, కొన్ని ఖర్చులు అలాంటివి కావు. బట్టలూ, నగలూ, జోళ్లు. బట్టలు అవసరమే కదా అనుకోవచ్చు. కానీ, కొంత వరకైతే అవసరమే. కానీ, ఆడంబరాల కోసం బట్టల మీద పెట్టే డబ్బులు చూస్తే మతిపోతుంది.

వెయ్యి రూపాయల తోనూ చీర కొనుక్కోవచ్చు. లక్ష రూపాయల తోనూ చీర కొనుక్కోవచ్చు. మరీ లక్ష కాకపోయినా, ఖరీదైన చీరవైపే మొగ్గుతారు. ఫంక్షన్లకి వెళ్లేటప్పుడు మామూలు చీరలు పనికి రావు. ఏదైనా ఫంక్షన్ కి వెళ్లినపుడు అక్కడకి ఎవరో కట్టుకున్న చీరని చూస్తారు. 'ఆవిడ కట్టుకున్న చీర చూసావా? నలభై అయిదు వేలట' అంటుంది ఒకామె. 'అబ్బా' అంటుంది మరొకమె. 'నిజంగా అంత ఉంటుం దంటావా?' 'అయ్యో! నేను అడిగాను. నిజమేనట. బట్టకి ఉన్న టేగ్ చూపించింది' అంటుంది. (ఎవరైనా చీర ఖరీదు చెబితే నమ్మరేమో నని టేగ్ కూడా ఉంచిందన్న మాట) 'మరీ అంతంత ఖరీదు ఎందుకులే తలకి తగ్గ పాగా చుట్టాలి' అంటుంది.

కానీ వీలయితే అంతకు మించిన పాగా చుట్టడానికి ఈమె కూడా రడియే. పెళ్లిళ్లలో ఇలాంటి సంభాషణలు జరుగుతూనే ఉంటాయి. ఇతరులు కూడా ఇలాగే అనుకొంటారు. మిగతా వారి కన్నా మనం తీసిపోలేదు. అనే భావం. ఎక్కడ మనల్ని తక్కువ వారిగా చూస్తారోననే భయం. అవును దాని పేరు 'భయమే'. ఆ భయం తోనే ఇతరుల కన్నా మనం తీసిపోలేదని అలంకరణల ద్వారా చెప్పాలని చూస్తారు. అలాంటి అసహజపు కోరికలే మధ్యతరగతి వాళ్లను అప్పుల వైపు ముఖం తిప్పేలా చేస్తాయి.

ఈ మధ్య చదివాను. ఒక పెళ్లికి 700 కోట్లు ఖర్చు అయిందట. అలాంటి వార్తలు పేపర్లలో చదువుతారు. 'కళ్యాణ మండపానికి చాలా అయిందట. అంతా సినిమాల్లో సెట్ లాగేనట. పెళ్లికి వెళ్లిన వాళ్లందరికీ పట్టుబట్టలు, భోజనాల్లో పదిరకాల కూరలూ, పది రకాల స్వీట్లు పెట్టారట' ఇలా చెప్పుకుంటారు. అలాంటి పెద్ద పెళ్లిళ్లకి ఆహ్వానం దొరకకపోయినా, అంత కంటే తక్కువ స్థాయిలో పెళ్లిళ్లకయినా ఎప్పుడో ఒకసారి దొరుకుతుంది. కనీసం అలాంటి పెళ్లికి మనల్ని పిలవడమే మన అదృష్టం అనుకుంటారు. 'ఫలానా గొప్పవాళ్లు మమ్మల్ని పెళ్లికి పిలిచారు' అని కాస్త పరిచయస్తుల కందరికీ పెళ్లి కార్డు చూపిస్తారు.

అంతే కాదు కార్డుతో పాటు ఇచ్చిన గిఫ్ట్ కూడా చూపిస్తారు.'అబ్బా! కార్డే ఇంత ఖరీదు పెట్టి వేయించారంటే, పెళ్లి ఇంకెంత ఘనంగా చేస్తారో' అని కార్డ్ చూసినవాళ్లు ఆశ్చర్యపోతారు.

అలాంటి పెళ్లికి వెళ్లి వస్తారు ఒక జంట. 'మన అమ్మాయికీ అలాగే చేద్దామండీ' అంటుంది భార్య. 'అమ్మ బాబోయ్! కోట్లు మనం ఎక్కడ నుండి తేగలం' అంటాడు భర్త. 'ఆ సంగతి నాకు తెలీదా ఏమిటి? కానీ, మనకి ఉన్నంతలో బాగా చేద్దామండి. ఒకవేళ మనం ఎంత సింపుల్‌గా చేద్దామనుకున్నా అవతల అబ్బాయి వాళ్లు ఊరుకుంటారా? వాళ్ల హోదాకి తగ్గట్టుగా మనం చెయ్యకపోతే ఏం బాగుంటుంది.' అంటుంది. ఆమె మాటల్లో నిజం లేకపోలేదు. అవతలి వాళ్లు కూడా ఆడంబరాల కోసం ప్రాకులాడేవాళ్లే. అన్నీ ఒక చెట్టు కొమ్మలే. ఆమె అన్నట్టు ఉన్నంతలో బాగా చేస్తే, బాగానే ఉంటుంది గానీ, నిజంగా ఆమె ఉద్దేశ్యం ఉన్నంతలో కాదు. 'అప్పు దొరికినంతలో' అని. ఇక అప్పుకి బయలుదేరతారు.

ఇదంతా పెళ్లికెదిగిన పిల్లలు ఉన్నవాళ్ల సంగతి. వయసులో ఉన్నవాళ్లు కూడా అంతే. ఆడంబరాలూ, విలాసాలు. బట్టల కోసం ఒకప్పుడు బీరువాలు ఉండేవి. ఇప్పుడు గదులు ఉండాలి. ఇంటి లోపల కప్ బోర్డుల నిండా కిక్కిరిసినట్టు బట్టలు. ఇంటి బయట చెప్పుల షాపు.

పెళ్లి ఒక సాంఘిక ప్రకటన. ఒక ఆడా, మగా 'ఈ రోజునుండీ

భార్యా భర్తలుగా కలసి జీవిస్తున్నారు' అని నలుగురు ముందూ ప్రకటించడమే పెళ్లి. పెళ్లికి అంతకన్నా ప్రాముఖ్యత ఇవ్వనవసరం లేదు. ఈ మధ్య బసంత్ కుమార్ అనే ఐఎఎస్ ఆఫీసర్ తన కుమారుడి పెళ్లికి కేవలం 18 వేలతో జరిపించారు. అలాని కేవలం రిజిస్టర్ పెళ్లి కాదు. మామూలు పెళ్లే. చాలా నిరాడంబరంగా జరిపించారు. అచ్చంగా అలాగే చేసుకోమని కాదు. పులిని చూసి నక్కవాతలు పెట్టుకున్నట్లు కోట్లకు అధిపతులను చూసి మనమూ అలాగే అనుకరించాలని ప్రయత్నిస్తే.. అప్పులపాలై పోతారని చెప్పడమే.

ఈనాడు చాలా ఉద్యోగాలు ప్రైవేట్ ఉద్యోగాలే. వాటిల్లో భద్రత తక్కువ. పెద్ద కంపెనీల్లో వ్యాపారాలు బాగుంటే ఉంచుతారు. లేకపోతే ఫైరింగ్ పేరుతో తీసేస్తారు. వాళ్లకి లాభాలు ముఖ్యం గానీ, ఉద్యోగుల బతుకుతెరువు ముఖ్యం కాదు. అదీకాక సాంకేతికత రోజురోజుకీ మారిపోతుంటుంది. దానికి తగ్గట్టు అందుకోకపోతే, వుద్యోగం పోతుంది. 'అప్‌డేట్ అవకుంటే అవుట్' అనే శీర్షికతో వచ్చిన ఈ వార్త చుడండి.

'క్షణక్షణానికి అప్ డేట్ అయ్యే టెక్నాలజీతో పాటుగా అప్ డేట్ అవ్వాలి. ఎంత సీనియర్లయినా..బుద్ధిగా జూనియర్లలా కొత్త పరిజ్ఞానాలను అంది పుచ్చుకోవాలి. అప్పుడే ఉద్యోగ భద్రత. లేకుంటే ఉద్వాసనే. ఇదీ ప్రస్తుతం ఐటీ పరిశ్రమలో నడుస్తున్న ట్రెండ్'. (ఆంధ్రజ్యోతి, 16-12-2018) మనిషి మెదడు ఆలోచించడం అనేది 20 ఏళ్లకీ, 40, 50 ఏళ్లకీ తేడా ఉంటుంది. వయసులో ఉన్నంత పదునుగా వయసు మళ్లిన తరువాత ఉండదు. అది ప్రక్రుతి సహజం. అవన్నీ కంపెనీలకు అనవసరం. పని చెయ్యడమే కావాలి. అలాంటి పరిస్థితే కాదు, కంపెనీలకు కొత్త ప్రాజెక్టులు లేకపోయినా ఉద్యోగస్తులను ఇంటికి పంపించివేస్తాయి. అలాంటి పరిస్థితి ఒక మోస్తరు ఉద్యోగస్తులకే కాదు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకూ వస్తుంటుంది. సమ్మెలు, లాకవుట్లు వస్తూనే ఉంటాయి.

దీన్ని బట్టి ఏం తెలుస్తుంది. ఎంతో కొంత పొదుపు చేసుకోకపోతే, అప్పుల పాలైపోతారు. బేంకులు మన దగ్గర ఒక్క రూపాయి బాకి ఉన్నా వదలరు. 'మీరు రూపాయి బాకి ఉన్నారని' నోటీసు పంపిస్తారు. ఈ బేంక్ వాళ్లు మనల్ని వదిలేటట్లు లేరు' అని మనం ఒక నిర్ణయానికి వచ్చి, రూపాయి కట్టేసి ఇక బేంక్ బెడద వదిలించుకుందామని వెళితే అక్కడ మన అకౌంట్లో ఆరు రూపాయిలు ఉంటుంది. అదేమని అడిగితే 'మీకు నోటీసు పంపడానికి స్టాంప్ ఖర్చు అయిదు రూపాయల సంగతి ఏమిటి?' అని, బేలన్స్ రూపాయి, తరవాత స్టాంపు ఖరీదు అయిదు రూపాయలూ మొత్తం ఆరు రూపాయలూ వసూలు చేస్తారు. ఈ బేంక్ వ్యవహారం చూసి అందరి దగ్గరా ఇలాగే వసూలు చేస్తారు అనుకుంటే అది చాలా పొరపాటు. వాళ్ల ప్రతాపం అంతా పేద, మధ్యతరగతి వాళ్ల మీదే. కోట్ల మీద అప్పులు తీసుకుంటే మాత్రం. ఏమీ అనరు. కాకపోతే, నోటీసులూ, వారెంటులూ, కోర్టులూ, వాయిదాలూ అంతే. కాకపోతే దేశంలో ఉంటే అరెస్టులు అంతే అంత కన్నా ఏమీ ఉండదు. కోట్లు అప్పు తీసుకున్నవాళ్లంటే బేంకులకు మహా ముద్దు. ముద్దుగా ముద్దుగా మందలించి వదిలేస్తుంటారు. కాకపోతే కోర్టులలో కేసులు నడుస్తుంటాయి. బేంకులకేనా లాయర్లు ఉన్నది. ఎగ్గొట్టిన వాళ్లకు లేరూ. వాళ్లూ లాయర్ ని పెట్టుకుంటారు. కేసులు నడుస్తుంటాయి. ఎన్ని సంవత్సరాలైనా. ఈ మధ్య కాలంలో బేంక్‌లు మొండి బకాయలు (ఎన్‌పిఎ) వలన ఆర్థికసంక్షోభంలో చిక్కుకున్నట్లు వార్తలు చదువుతున్నాం.

బ్యాంకింగ్ రంగానికి కొత్త ఒరవడిదిద్దిన వారే మోసాలు, కుంభకోణాల నడుమ పదవుల నుంచి వైదొలగడం, బ్యాంకుల నెత్తిన కుచ్చుటోపీ పెట్టిన ఘరానా మోసగాళ్లు దేశం వదిలి పారిపోవడం ఈ ఏడాది బ్యాంకింగ్‌లో చోటుచేసుకున్న కీలక పరిణామాలు. తమ బ్యాంకుల్లో జరిగిన కుంభకోణాలకు భాధ్యత వహించి వైదొలగిన ప్రముఖుల్లో చందా కొచ్చర్ (ఐసిఐసి బ్యాంకు), శిఖాశర్మ (యాక్సిస్ బ్యాంకు), రాణాకపూర్, అశోక్ చావ్లా (ఎస్ బ్యాంకు)ఉన్నారు. దేశంలో అతి పెద్ద కుంభకోణం ఊబిలో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంకు చిక్కుకొని పీకల్లోతు ఇబ్బందిల్లో పడింది. మరోపక్క ప్రధాన బ్యాంకులన్నింటి ఎన్ పి ఏ లు కొండలా పేరుకుపోయి వాటి భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారింది.

'బ్యాంకింగ్ రంగంలో ముఖ్యంగా ప్రభుత్వ బ్యాంకుల్లో మొండి బకాయిలు తగ్గుముఖం పట్టాయన్నారు. బ్యాంకింగ్ రంగంలో పాలనా పరమైన సంస్కరణలపై సంబంధిత వర్గాలతో సంప్రదింపులు మొదలు పెట్టామని అన్నారు. 2018 మార్చి చివరినాటికి రూ.9.62లక్షల కోట్లకు చేరిన ఎన్‌పిఏలు సెప్టెంబర్ నాటికి రూ.23 వేల కోట్లకు పైగా తగ్గాయి.

అబ్బా! భలే వసూలు చేసారు. 9.62 లక్షల కోట్లు బాకీ ఉంటే, చాలా చాకచక్యంగా సంప్రదింపులు జరిపి, 23 వేలకోట్లు వసూలు చేసారు. మరి మిగతా 9.39 లక్షల కోట్ల సంగతీ ఏమిటి? ' తగ్గుముఖం పట్టాయి' అనే పదం రాసుకోవడానికి 23 వేల కోట్ల వసూలు వరకూ అక్కరలేదు. 23 లక్షలు వసూలు చేసినా చాలు.

లక్ష రూపాయలు అప్పుకావాలంటే 33 హామీలు తీసుకుంటాయి కదా బేంక్‌లు. అలాంటిది కోట్ల రూపాయలు ఎలా ఇస్తాయి? అనే సందేహం వస్తుంది. 'కాకుల్నికొట్టి గద్దలకు వెయ్యడం' అంటే ఇదే. నిజానికి బ్యాంకింగ్ వ్యవస్థ ప్రారంభం అయిన తొలినాళ్లలో అది కూడా వ్యాపార సంస్థే అయినప్పటికీ జనాలకి మంచే జరిగింది. బయట ప్రైవేటు వ్యక్తుల దగ్గర నూటికి అయిదూ, పదీ లాంటి వడ్డీల నుండీ సామాన్య జనాల్ని రక్షించింది. అప్పుడే కాదు ఇప్పుడు కూడా అవసరంకోసం మాత్రమే లోను తీసుకొని, జాగ్రత్తగా లెక్కవేసుకుని నెలవారీ కట్టేస్తుంటే మంచిదే. ఆ హద్దు దాటిపోతేనే ఇబ్బంది. ఈ వ్యాసంలో చర్చినదంతా అనుకొన్నదంతా ఇదంతా మధ్యతరగతి వాళ్ల గురించే. మరీ పేదవాళ్లు, అంతంతమాత్రమే రాబడి వచ్చేవాళ్లకు అప్పులు చేయకండి అని చెప్పడం హాస్యాస్పదం.

(రచయిత టైలర్) వీ

పాఠకులు ఫిర్యాదులు, సమాచారం కోసం వీక్షణం కార్యాలయానికి పనిదినాల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 6.00 గంటలలోగా స్వయంగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు. మిగతా సమయాల్లో ఫోన్ చేస్తే అది ఫ్యాక్స్‌లోకి వెళ్లి మీకు జవాబు రాదు. అప్పుడు మీరు ఫోన్ ఎత్తికూడా మాట్లడడంలేదని అనుకునే అవకాశం ఉంది. ఇది గమనించగలరు. - సం.

న్యూజిలాండ్‌లో ఉన్మాద నరమేధం

***పెట్టుబడిదారీ దేశాలు తమ ఆర్థిక సంక్షోభాల నుండి బయటపడడానికి యుద్ధాలను సృష్టిస్తూ, ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ, జాతి విద్వేషాలు పెంచి ఉన్మాదానికి కారణమవుతున్నాయని అంటున్నారు* ఎ. నర్సింహారెడ్డి**

ప్రపంచంలో ఒక మూలకు విసరేసినట్టుగా, ఇతర ప్రాంతాలతో సంబంధం లేనట్టుగా, పసిఫిక్ మహా సముద్రంలో ఒంటరిగా కనబడే న్యూజిలాండ్ రెండు వేర్వేరు దీవుల సముదాయం. ప్రపంచంలో ఐస్‌లాండ్ తర్వాత అది అత్యంత శాంతియుతమైన దేశంగా రెండో స్థానంలో ఉంది. అటువంటి చోట ఆస్ట్రేలియాకు చెందిన ఒక శ్వేతజాతి ఉన్మాది బ్రెంటన్ హారిస్ టారెంట్ 2019 జనవరి 15న క్రైస్ట్‌చర్చ్ నగరంలోని రెండు మసీదుల్లోకి చొరబడి ప్రార్థనల్లో నిమగ్నమైన వారిని ఆటోమెటిక్ ఆయుధాలతో విచక్షణారహితంగా కాలుస్తూ దాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఫేస్‌బుక్‌లో అందరూ వీక్షించేలా వీడియో తీసాడు. ఈ కాల్పుల్లో 49 మంది మరణించారు.

ఈ ఉన్మాదకాండ ప్రపంచంలో రోజురోజుకూ విస్తరిస్తున్న విద్వేషాగ్నికి నిదర్శనం. వలస వచ్చిన ముస్లింలను లక్ష్యంగా చేసుకుని శ్వేతజాతి దురహంకారులు సృష్టించిన ఈ నరమేధం మితవాద, మతవాద, ఫాసిస్టు శక్తుల నుంచి ప్రపంచ ప్రజలకు పెరుగుతున్న ప్రమాదానికి ప్రతీక. ప్రపంచం కుగ్రామంగా మారిందని వాదించిన వారే వలసలపట్ల తీవ్ర వ్యతిరేకతను రెచ్చగొడుతున్న తీరుకు ఈ ఘటన నిదర్శనం. భిన్నవర్గాల ప్రజల మధ్య పెరిగిపోతున్న శత్రుత్వ భావనకు సాక్ష్యం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రేపిన శ్వేతజాత్యహంకార ఉన్మాదానికి పరాకాష్ఠ. అసహనాన్ని నూరిపోయడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడంవల్ల ఏర్పడే పర్యవసానాలెలా ఉంటాయో న్యూజిలాండ్ ఉదంతం చూస్తే అర్థమవుతుంది.

టారెంట్ అల్‌నూర్ ప్రాంత డీన్స్ ఎవెన్యూ, లిన్‌వుడ్ మసీదుల్లో జరిగిన కిరాతకానికి బలైనవారిలో మూడేళ్ల చిన్నారితో సహ మహిళలు కూడా ఉన్నారు. ఈ ఘటనలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదం, విచారకరం. ఈ ఉన్మాదపు ఆలోచన కేవలం తుపాకి హింసకు, ఒక దేశానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ప్రపంచాన్నంతా కమ్మేస్తున్న తిరోగమన, ఛాందస, మత ఉన్మాద భావజాల పర్యవసాన ఫలితమిది. తీవ్రవాదం సమస్త మానవాళికి శత్రువు అన్న భావనతో కాకుండా మితవాద శక్తులు అధికారంలో ఉన్న దేశాల్లో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయి. దీనివల్లే టారెంట్ లాంటి శ్వేత జాత్యహంకారులు ఇంత ఉన్మాద హత్యలకు పాల్పడుతున్నారు. అత్యంత అధునాతన ఆయుధాలను అవలీలగా సమకూర్చుకోగలుగుతున్నారు.

టారెంట్ భావజాలం-ఫాసిస్టులతో సంబంధాలు

క్రైస్ట్‌చర్చ్‌లో ఊచకోతకు తెగబడడానికి ముందు టారెంట్ 74 పేజీల మ్యానిఫెస్టోను న్యూజిలాండ్ ప్రధానికి, రాజకీయ నాయకులకు, మీడియా సంస్థలకు ఫేస్‌బుక్ ద్వారా పంపాడు. అతడు ప్రకటించిన ప్రణాళికలో తనకు ఫాసిస్టులతోనూ, శ్వేతజాత్యహంకారులతోనూ గల సంబంధాలను వెల్లడించాడు. అనేక సంవత్సరాలుగా ఫాసిస్టులతో కలిసి పనిచేసినట్లు తెలిపాడు. నార్వేలో 77 మందిని ఊచకోత కోసిన శ్వేతజాతి దురహంకారి అండెర్స్ బ్రైవిక్, బోస్నియన్ యుద్ధ నేరస్తుడు రాడోవన్ కారాడ్జిక్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు ఆదర్శమని అందులో పేర్కొన్నాడు. ఐరోపాయేతర 'చొరబాటుదారులను' తరిమేసి యూరప్‌ను తిరిగి ఆధీనంలోకి తేవడమే లక్ష్యమని ప్రకటించాడు. ఆ ప్రణాళికను ఈ కాలానికి అన్వయించిన 'హిట్లర్- మైన్‌కాంఫ్' పుస్తకంతో ప్రపంచ సోషలిస్టు వెబ్‌సైట్ పేర్కొనడం గమనార్హం.

టారెంట్ తన ప్రణాళిక ద్వారా పద్ధతి ప్రకారం మారణహోమాలతో జాతుల నిర్మూలనకు, అంతర్యుద్ధాలకు పిలుపునిచ్చాడు. ముస్లింలను, యూదులను, ఆసియా, ఆఫ్రికా, రోమా నేపథ్యం నుంచి వచ్చిన ప్రజలను యూరప్, అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాను ఆక్రమించిన వారిగా వర్ణించాడు. 1920-30 ప్రాంతంలో నాజీ పార్టీ జర్మనీలో ప్రచారం చేసిన 'మనరక్తం-మన మట్టి' వలే టారెంట్ రాశాడు. ఫాసిస్టు భావాలు, ఆచరణలు కలిగియున్న టారెంట్ తను అనేక జాతీయవాద సంస్థలకు, గ్రూపులకు విరాళాల రూపంలో ఆర్థిక సహాయాన్ని అందించానని తెలిపాడు. బల్గేరియా, హంగరీయా, సెర్బియా, క్రోషియా, బోస్నియా, ఫ్రాన్స్, యు.కె., స్పెయిన్, టర్కీ, పాకిస్తాన్, ఉత్తరకొరియా వంటి అనేక దేశాలు సందర్శించి ఫాసిస్టు ఉద్యమ వ్యాప్తికి, ఫాసిస్టు భావాల పొందికకు కృషి చేశానన్నాడు. ఆస్ట్రేలియాకు తిరుగు ప్రయాణం చేస్తూ మధ్యలో న్యూజిలాండ్‌లో ఆగి ఫ్రీ రైఫిల్స్ క్లబ్‌లో సభ్యత్వం తీసుకొని తుపాకీని కొని క్రైస్ట్ చర్చ్ నగరంలో ఈ దుర్మార్గపు ఘటనకు పాల్పడినట్లు తెలిపాడు.

ఫ్రాన్స్‌లో 2017 మేలో జరిగిన ఎన్నికల్లో మితవాద-ఫాసిస్టు పార్టీ పరాజయం పాలవడంతో తీవ్రవాదంలోకి అడుగుపెట్టానని తన ప్రణాళికలో టారెంట్ పేర్కొన్నాడు. నార్వేలోని ఫాసిస్టు హంతకుడు అండెర్స్ బ్రైవిక్‌ను కలుసుకొని క్రైస్ట్‌చర్చ్ దాడికి తన ఆశీస్సులను తీసుకొన్నట్లుగా వివరించాడు. ప్రపంచ మితవాద ఫాసిస్టు సోషల్ మీడియాతోనూ, బ్లాగ్స్‌తోనూ అనేక సంబంధాలు కలిగి ఉన్నట్లు తెలిపాడు. 'న్యూజిలాండ్‌లో ప్రస్తుతం శ్వేతజాతి కాని వారంతా సుఖంగా, క్షేమంగా బతుకుతున్నారు గనుకనే నేను ఈ దేశాన్ని లక్ష్యంగా చేసుకొన్నాన'ని తెలియజేశాడు.

టారెంట్ అంచనాల ప్రకారం వేలాది మంది యూరోపియన్ సైనికులు, పోలీసులు జాతీయవాదాన్ని ప్రేరేపించే సంస్థలతో సబంధాలు కలిగి ఉన్నారు. కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యుఎస్ కాంగ్రెస్‌లో,

జర్మన్ పార్లమెంటులోని కొందరు రాజకీయ ప్రతినిధులు కూడా పరోక్షంగా మితవాద ఫాసిజంకు మద్దతునిస్తూ ఫాసిస్టు భావాలను వ్యక్తం చేస్తున్నారు.

టారెంట్ ఏదో ఆవేశం, ఉద్రేకంతో కాకుండా పక్కా ప్రణాళికతో ఈ దారుణానికి పాల్పడ్డాడు. 2019 మే చివరలో జరుగనున్న యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో రైటిస్టు పార్టీల విజయానికి వీలుగా శ్వేతజాత్యహంకారం రెచ్చగొట్టేందుకు ఈ ఘాతుకా నికి పాల్పడ్డాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియో నాజీ చిహ్నాలతో కూడిన అధునాతన తుపాకుల ఫోటోలను ఆన్‌లైన్‌లో పెట్టాడు. ఇదంతా ఆ ఒక్కడే చేశాడంటే నమ్మశక్యంగా లేదు. దీని వెనుక పెద్ద నెట్‌వర్కే ఉందని అనిపిస్తోంది. 2012 నుంచి టారెంట్ బల్గేరియా, హంగరీ, సెర్బియా, క్రొయేషియా, బోస్నియా, ఫ్రాన్స్, బ్రిటన్, స్పెయిన్ తదితర దేశాలను చుట్టివచ్చాడు. అక్కడి శ్వేత జాత్యహంకార, ముస్లిం వ్యతిరేక శక్తులతో నెట్‌వర్క్ ఏర్పరచుకున్నాడు. అధునాతన ఆయుధాలను సమకూర్చు కున్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య తరచూ రాకపోకలు సాగిస్తున్నాడు. అయినా అతని కదలికలపై ఏ దేశమూ నిఘా పెట్టలేదు. ఏ భద్రతా సంస్థ రాడార్ కూడా పసిగట్టలేక పోయాయి.

గతంలో ఇదే పేరుతో ఓ డాక్యుమెంట్ కూడా విడుదలైంది. వలసదారులు స్థానిక యూరోపియన్ జనాభాను మించిపోతున్నారనీ, వారిని వెళ్లగొట్టి యూరప్‌ను తిరిగి మన అధీనంలోకి తెచ్చుకోవాలని సందేశాన్ని ఇచ్చాడు. ముస్లిం సామ్రాజ్యాలపై దండెత్తి విజయం సాధించిన యూరోపియన్ చక్రవర్తుల నుంచి సైనికాధికారుల వరకూ అనేకులను తనకు స్ఫూర్తిదాతలుగా పేర్కొన్నాడు. ట్రంప్‌ను శ్వేతజాతి గుర్తింపునకు ఓ చిహ్నంగా అభివర్ణించాడు. అతనే తన ఆదర్శంగా చెప్పుకొన్నాడు. వలసదారులంతా దుర్మార్గులనీ, దేశాన్ని కొల్లగొడుతున్నారనీ, సంస్కృతిని భ్రష్టుపట్టిస్తున్నారనీ ట్రంప్ తన రాజకీయ అవసరాల కోసం చేసిన ప్రచారం ఎంతటి ప్రమాదకరమైందో, యువతను ఎంతగా తప్పు పట్టిస్తున్నదో ఈ యువకుడు ఒక నిలువెత్తు సాక్ష్యం. అసహనం, విద్వేషం ఎంత సులువుగా యువత హృదయాలను కలుషితం చేస్తాయో ఈ సంఘటన తెలియజేస్తున్నది.

సామ్రాజ్యవాదమే తీవ్రవాదానికి ప్రేరణ, ప్రోత్సాహం

నిజానికి తీవ్రవాద మూలాలు పశ్చిమ దేశాల్లో ఉన్నాయి. గత రెండు దశాబ్దాలుగా అమెరికా, యూరప్ దేశాల్లో ఇటువంటి దాడులు బాగా పెరిగిపోయాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చాక అమెరికాలో శ్వేతజాతి దురహంకారం వ్యవస్థాగత రూపం దాల్చుతున్నది. ఆరు దేశాల నుంచి ముస్లింలను అమెరికాలో అడుగు పెట్టడానికి వీల్లేదంటూ నిషేధం విధించడం, వలసవాదులకు వ్యతిరేకంగా చట్టాలను కఠినతరం చేయడం, మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి పూనుకోవడం, శ్వేతజాతి దురహంకార దాడులకు మద్దతుగా మాట్లాడడం, వలసవాదులను, శరణార్థులను తీవ్రవాదులు గానూ, అసాంఘిక శక్తులు గాను ముద్రవేసి హింసించడం వంటి ట్రంప్ చర్యలకు పశ్చిమ దేశాల్లో మితవాద ప్రభుత్వాలు, వ్యక్తులు, శక్తులు నిర్లజ్జగా వంత పాడుతున్నాయి. మనదేశంలో హిందూత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగమైన బిజెపి అధికారంలోకి వచ్చాక ముస్లిం వ్యతిరేక, శరణార్థి వ్యతిరేకతను రెచ్చగొట్టే శక్తులు పేట్రేగిపోతున్నాయి. ఈ మితవాద, నియోనాజీ ధోరణులను ఉపేక్షిస్తే ఎంత ప్రమాదమో న్యూజిలాండ్ ఘటన మనకు ఒక హెచ్చరికలా నిలుస్తుంది.

ప్రపంచాన్నంతా కమ్మేస్తున్న తిరోగమన, ఛాందస, మత ఉన్మాద భావజాల ఫలితమే తీవ్రవాదం. పెట్టుబడిదారీ సంక్షోభం. దాన్ని కాపాడుకునేందుకు, కార్పొరేటు శక్తులకు లాభాలు పోగుచేసేందుకు వివిధ దేశాల్లో పాలకులు సంక్షేమ, అభివృద్ధి చర్యలకు కోతపెట్టి పేదరికాన్ని, నిరుద్యోగాన్ని మరింతగా పెంచుతున్న విధానాలే ఈ ఉన్మాదానికి ఊతంగా మారుతున్న వాస్తవాన్ని గుర్తించాలి. ప్రజాస్వామ్యం, సామ్యవాదం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం, శాంతి సౌహార్దతల పునాదులను పెల్లగించేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగా తీవ్రవాదాన్ని గుర్తించాలి. అందువల్ల ఈ ఉన్మాదపు ఆలోచన కేవలం తుపాకీ హింసకు సంబంధించినది మాత్రమే కాదు.

1920-40 మధ్యకాలంలో ఫాసిజం, నాజీజం వంటి ఉన్మాద భావజాలం కారణంగా ప్రపంచం ఎంతో మారణహోమాన్ని, విధ్వంసాన్ని చవిచూసింది. ఇవాళ సామ్రాజ్యవాద ప్రపంచీకరణతో ద్రవ్య వ్యవస్థల సంక్షోభం వల్ల మళ్లీ మత జాత్యహంకార శక్తులు, సంస్థలు, పార్టీలు ప్రపంచానికి ప్రమాదకరంగా మారాయి.

యూరప్‌లోని పలు దేశాల్లో కరుడుగట్టిన శ్వేత దురహంకార నాయకులు పుట్టుకొచ్చారు. డెన్మార్క్ నెదర్లాండ్స్, ఆస్ట్రియాలలోనూ మితవాద, ప్రతీఘాత పార్టీలు ప్రాబల్యం పొందుతున్నాయి. జర్మనీలో తిరిగి నాజీజం ఫార్-రైట్ ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ పార్టీ పేరుతో ఇటీవలి ఎన్నికల్లో పట్టు పెంచుకుంది. గ్రీస్‌కు అందించే సహాయం నిలిపి వేయాలని, వలస వచ్చేవారిని, కాందిశీకులను దేశంలోకి అనుమతించ రాదని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. అది ఇస్లామ్‌కు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. ఇస్లాం భావాలను, ముస్లింలను, వలసలను వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ప్రచారం నిర్వహిస్తోంది. 'పశ్చిమ దేశాల ఇస్లామీకరణకు వ్యతిరేకంగా, దేశభక్తియుత యూరోపియన్లు' అనే సంస్థ నాయకులు, 'ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ పార్టీ' నాయకులు ఉపయోగించే భాషకు, భావాలకు అతి దగ్గరగా ఉంది. ఇస్లాం మతానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన వీరు, ముస్లింలకు వ్యతిరేకంగా ద్వేషాన్ని, అసహనాన్ని పెంచుతున్నారు.

యూరప్‌లోని మతవాద, శ్వేత దురహంకార పార్టీలను ఏకతాటిపైకి తేవడానికి చర్చలు సాగుతున్నాయి. హంగేరియన్ ప్రధాని, ఫిడెస్జ్ పార్టీ నేత విక్టార్ అర్బన్ ఇప్పుడు యూరప్‌లోని జాత్యహంకారులకు హీరోగా మారాడు. అమెరికా అధ్యక్ష భవనంలో ప్రధాన వ్యూహకర్తగా కొంతకాలం పనిచేసి రాజీనామా చేసిన స్టీఫెన్ బానన్ ప్రపంచవ్యాప్తంగా మతవాద జాత్యహంకార పార్టీలు అధికారంలోకి వచ్చేందుకు అనుకూలమైన పరిస్థితులు సృష్టించే ప్రయత్నంలో ఉన్నాడు. ట్రంప్ అనుసరిస్తున్న శ్వేత దురహంకార, వలసల వ్యతిరేక విధానాలన్నీ బానన్ రూపుదిద్దినవే. ఫ్రాన్స్‌లో నేషనల్ ఫ్రంట్, హంగరీలో ఫిడెస్జ్, ఇటలీలోని మూడు పార్టీలు (లీగ్, ఫైవ్‌స్టార్ మూవ్‌మెంట్, బ్రదర్స్ ఆఫ్ ఇటలీ)తో పాటు ఆల్టర్నేటివ్ జర్మనీ, పోలీస్ లా అండ్ జస్టిస్ పార్టీ, స్వీడెన్ డెమోక్రాట్స్, డచ్ పార్టీ ఫర్ ఫ్రీడమ్, ఫ్రీడమ్ పార్టీ ఆఫ్ ఆస్ట్రియా, స్విస్ పీపుల్స్

పార్టీ, బెల్జియం పీపుల్స్ పార్టీ, స్పెయిన్ వాక్స్, ఫిన్స్ పార్టీ, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా తదితర ఆసియా దేశాల పార్టీలతో బానన్ చర్చలు జరిపాడు.

భారత్‌లోనూ ఒక పెద్ద పార్టీ (బిజెపి)కి ఆయన మద్దతు ఉందని సమాచారం. హిందూ మతోన్మాద శక్తులు సమాజం మొత్తంలో వ్యాపించి మత మైనారిటీలు, దళితులు, అణచబడిన సెక్షన్ల ప్రజానీకపు మనుగడను కంటకావృతం చేస్తూ పాలన సాగిస్తున్నాయి. సాంస్కృతిక పోలీసులుగా వ్యవహరిస్తున్నాయి. గోరక్షక్‌ల ముసుగులో అరాచక గుంపుల దాడులు విస్తారంగా జరుగుతున్నాయి. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా జాతీయ దురహంకారం అధికారయుతంగానే ఎగదోయబడుతున్నది. 'ఉగ్రవాదంపై పోరాటం' ముసుగులో ఇస్లాంపై వ్యతిరేకత రెచ్చగొట్టబడుతున్నది. ప్రజాస్వామికంగా ఆలోచన చేసే వారిపై, కార్యకర్తలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులు చేస్తున్నారు. ఆయా దేశాల్లో రైటిస్టు పార్టీలు అధికారానికి వస్తే, అమెరికా ఎజెండానే అమలవుతుందనేది స్టీఫెన్ బానన్ వ్యూహం.

పెట్టుబడిదారీ విధానంలో అత్యంత సహజంగా, అనూచానంగా కొనసాగే దోపిడీ ఆర్థిక విధానాలతో పాటు, మూడు దశాబ్దాలుగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలు సాగుతున్నది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ ప్రపంచీకరణ విధానాలు ప్రతీఘాత శక్తులను పునరుద్ధరించడంతో పాటు, అత్యంత మితవాద రాజకీయ పార్టీల ఎదుగుదలకు, తిరస్కరణకు గురైన, భయం గొలిపే ఫాసిస్టు శక్తుల పెరుగుదలకు కారణమయ్యాయి. ప్రపంచవ్యాపితంగా తలెత్తుతున్న ప్రతీఘాత శక్తులు, అంతర్జాతీయ మానవత్వ ఆదర్శాలకు అత్యంత హానికరంగా పరిణమించాయి.

2008లో ఏర్పడిన ప్రపంచ ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో పలు దేశాలలో జరుగుతున్న ఘటనలు పరిశీలిస్తే, ప్రతీఘాతుకత్వం ప్రపంచవ్యాపితంగా విస్తరిస్తోందని పరిణామాలు సూచిస్తున్నాయి. ప్రపంచ ద్రవ్య పెట్టుబడిదారీ విధానం చేపట్టిన అమానవీయ, క్రూర ఆర్థిక విధానాలు ప్రపంచంలోని సహజ, మానవ వనరులను దోపిడీ చేసుకుంటూ ప్రపంచవ్యాపిత కార్మికవర్గాన్ని దుర్భరక్లేశంలో ముంచెత్తుతున్నాయి. యావత్ ప్రపంచ మానవుల మధ్యన పూడ్చలేని అఖాతాల అసమానత్వాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. దురాక్రమణ యుద్ధాలు, అంతర్యుద్ధాలను ప్రేరేపిస్తున్నాయి. నీటి కొరతలను సృష్టించడం, విస్తృతంగా ఖనిజాలను తవ్వి తీయడం ద్వారా భూ మండల తాపాన్ని పెంచుతున్నాయి. ప్రపంచవ్యాప్త వ్యాధులను, ఇతర ఆరోగ్య వినాశకారకాల్ని వ్యాప్తి చేస్తున్నాయి. ప్రపంచ ప్రతీఘాత శక్తులను పెంచుతున్నాయి. నాల్గవ విప్లవం పేరిట కొనసాగుతున్న విధ్వంసక సాంకేతిక పరిజ్ఞానం (రోబో), ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఉనికిలో ఉన్న అసమానతలు, నిరుద్యోగులను అసాధారణంగా పెంచుతూ, ప్రపంచ ప్రతీఘాత ఫాసిస్టు శక్తుల పెరుగుదలకు, ఆ శక్తులు గెలుపొంది అధికారం సాధించేందుకు సారవంతమైన భూమికను ఏర్పరచింది.

ఈనాడు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గత సంక్షోభంలో ఉంది. ప్రధానంగా నిరుద్యోగం పెరుగుతుండడంతో, ఈ నిరుద్యోగ సమస్యకు మూలం శరణార్థులు అని యూరప్ దేశాల్లోనూ, అమెరికాలోనూ ప్రచారం చేస్తున్నారు. ఆర్థిక అసమానతలు పెరగడంతో స్వదేశాల్లో కొనుగోలు శక్తి పడిపోతున్నది. విదేశాల్లో (అభివృద్ధి చెందుతున్న దేశాలు) కూడా అసమానతలతో పాటుగా సామ్రాజ్యవాదం సృష్టిస్తున్న యుద్ధాల ఫలితంగా కనీసావసర వస్తువులు కూడా కొనుగోలు చేసుకోలేని పరిస్థితి కొన్ని మధ్యప్రాచ్య దేశాల్లో కనబడుతున్నది. ఒకప్పుడు ధనిక దేశాలైన ఇరాక్, ఇరాన్, లిబియా, సిరియా, జోర్డాన్, టర్కీ, ఈజిప్టు వంటి దేశాలు కూడా తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయి. తప్పని పరిస్థితుల్లో యుద్ధ ప్రభావంతో దేశాలను వదిలి వలసలకు వెళ్లిపోతున్నారు. సామ్రాజ్యవాదం యుద్ధాలను ఆపగలిగితే గల్ఫ్ అరబ్ దేశాలు ప్రపంచ ప్రజలకు లక్షలాదిగా ఉద్యోగాలను ఇచ్చి ఉండేవి. కానీ అమెరికా మిత్రదేశాలు ముడిచమురు దోచుకోవడానికి వ్యూహాత్మక యుద్ధాలు చేస్తుండడంతో వలసలు పెరుగుతున్నాయి. దీనితో పాటుగా అమెరికా ప్రోత్సాహంతో పుట్టి పెరిగిన తీవ్రవాదం పెరిగిపోతూ యూరప్ ఉనికిని ప్రశ్నిస్తోంది.

టారెంట్ లాంటి ఉన్మాదులు భావిస్తున్నట్లుగా యూరప్, అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాల్ని దోచుకోవడానికి ముస్లింలు, యూదులు, ఆఫ్రికా, ఆసియా దేశస్తులు పోవడం లేదు. పైగా వీరందరిని 15వ శతాబ్దం నుండి 20వ శతాబ్దం మధ్య వరకు డచ్, ఫ్రెంచ్, స్పానిష్, బ్రిటిష్, పోర్చుగీస్, అమెరికా, ఇటలీ వలసవాద సామ్రాజ్యవాద దేశాలే. బ్రిటిష్ ప్రభుత్వం తొలుత ఈస్ట్ ఇండియా పేరిట తర్వాత బ్రిటిష్ ఇండియా పేరిట ఒక్క భారతదేశాన్ని 200 సంవత్సరాల పాటు దోచుకున్న దోపిడీ సంపద మొత్తం నలభై ఐదు లక్షల కోట్ల డాలర్లని తాజా సర్వేలు తెలిపాయి. ప్రస్తుత మనదేశ సంవత్సర జిడిపిలతో పోలిస్తే 20 రెట్లు అధికం. ఇవాల్టికి రుణాల పేరుతో, అసమాన వాణిజ్యంతో, ఆయుధ వ్యాపారంతో సామ్రాజ్యవాద దేశాలు దోచుకుంటున్నాయి. యుద్ధాల వల్ల వలసలు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా ఎవరు ఎవర్ని దోచుకున్నారో ప్రపంచం అర్థం చేసుకోవడం ఆహ్వానించదగిన పరిణామం.

మతం పేరిట సాగుతున్న జిహాదీ తీవ్రవాదం ఒకపక్క భయపెడుతుంటే, దాన్ని సాకుగా తీసుకొని శ్వేతజాతి విద్వేషాన్ని నూరిపోయడం మరింత భయం కలిగించే పరిణామాలు. వలస దారులంతా దుర్మార్గులనీ, దేశాన్ని కొల్లగొడుతున్నారనీ, సంస్కృతిని భ్రష్టుపట్టిస్తున్నారనీ ట్రంప్ తన రాజకీయావసరాల కోసం చేసిన ప్రచారం ఎంతటి ప్రమాదకరమైందో, యువతను ఎంతగా తప్పుదోవ పట్టిస్తున్నదో టారెంట్ ఒక నిలువెత్తు సాక్ష్యం. ఇస్లాంపై పెరుగుతున్న విద్వేషానికి, శ్వేత జాత్యహంకార దాడులకు సామ్రాజ్యవాద ద్రవ్యపెట్టుబడిదారీ విధానపు అనివార్య, సహజ పరిణామాలైన 2008 నుంచి కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభ దుష్ఫలితాలే ప్రధాన కారణం. మరోమాటలో చెప్పాలంటే, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వైఫల్య ఫలితాలే ఈ తిరోగమన పరిణామాలు.

పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ రూపంలో ఉన్నా అది ప్రజల జీవితాలలో అభివృద్ధిని, సౌభాగ్యాన్ని తీసుకురాలేదని రుజువైన వాస్తవం. అదే సమయంలో ద్రవ్య పెట్టుబడిదారీ విధానపు సంక్షోభం సహజంగానే తిరోగమన, ప్రతీఘాతుక, ఫాసిస్టు విధానాలకు దారితీస్తుందనేది అంతే వాస్తవం. మితవాద, మతవాద ఛాందసులైన పార్లమెంటరీ రాజకీయ పార్టీలు, పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొనే సోషల్ డెమోక్రాట్స్

భావజాల గతితర్కం - సామాజిక చైతన్య దృగ్విషయం

మేధో చరిత్రలో అత్యంత కీలకమైన భావజాల భావనను సరిగా అర్థం చేసుకోకపోవడం వల్ల జరిగిన పొరపాట్లను చూపుతూ, ఆ భావనను వివరిస్తున్నారు **వెన్నెలకంటి రామారావు**

సిద్ధాంతం (థియరీ), భావజాలం (ఐడియాలజీ) అనే భావనలు తరచూ మేధావులను సైతం గందరగోళ పరుస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఐడియాలజీ (భావజాలం) అనే ఆంగ్ల పదాన్ని సిద్ధాంతం అని అనువదిస్తుండడం కద్దు. ఐడియాలజీ అనే పదాన్ని ఫ్రాన్స్ విప్లవంలో 'భావాల శాస్త్రం' అనే జ్ఞాన సిద్ధాంత భావనగా ఎఎల్‌సి డిస్టట్ ది ట్రాసీ అనే తత్వవేత్త మొట్టమొదటిసారి వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రజలకున్న భ్రమలను పోగొట్టి, హేతువు సార్వభౌమత్వాన్ని వారు ఆమోదించేట్లు చేసే లక్ష్యంతో 'భావాల శాస్త్రం' అనే భావనను, ఉద్యమాన్ని ట్రాసీ, అతని అనుయాయులు ముందుకు తెచ్చారు. దాంతో వారు ఐడియలాగ్స్ (భావజాలకర్తలు)గా ప్రసిద్ధి చెందారు.

నెపోలియన్ బోనపార్టీ ప్రభుత్వం ఐడియలాగ్స్ రూపొందించిన విద్యా వ్యవస్థను జాతీయ విధానంగా ఆమోదించింది. 1795–99 మధ్యకాలంలో అధికార పత్రం–డైరెక్టరీగా కూడా ఐడియలాగ్స్ కార్యక్రమం ఫ్రాన్స్‌లో అమలులోకి వచ్చింది. అయితే 19వ శతాబ్దం తొలినాళ్లలో ఫ్రాన్స్ సైనిక ఓటములు చవిచూడడంతో, దీనికంతటికీ కారణం ఐడియలాగ్స్ సిద్ధాంతాన్ని అనుసరించడమేనని నెపోలియన్ మండిపడ్డాడు. 1812 నుంచి ఐడియాలజీ అనే పదం మార్మికత (తప్పుడు భావజాలానికి)కు పర్యాయపదంగా, ఒక తిట్టు పదంగా వాడటం నెపోలియన్ బోనపార్టీతో ప్రారంభమైంది. అయితే 'భావాల శాస్త్రం', 'మార్మిక భావజాలం' (నిందార్థకం) అనే రెండు పరస్పర విరుద్ధ అర్థాలతో 19వ శతాబ్దపు మేధావులు ఐడియాలజీ భావనను విరివిగా వాడడం వల్ల ఆ శతాబ్దాన్ని 'భావజాల యుగం'గా అభివర్ణించారు. చరిత్ర అర్థాన్ని మరుగునపరచి, అర్థంకాని, కనపడని శక్తి ప్రజలను వివిధ పాత్రధారులుగా మలచి, చరిత్ర చేతిలో పనిముట్లుగా వారిని మలచేందుకు ఉపకరించే తప్పుడు చైతన్యాన్ని హెగెల్ భావజాలంగా పరిగణించారు.

ఐడియాలజీ అంటే మార్మిక లేదా తప్పుడు భావజాలం అనే హెగెలియన్ అర్థంలోనే మార్క్స్ కూడా తన తొలిరచనల్లో ఆ భావనను విరివిగా వినియోగించారు. ఈ అవగాహన నేపథ్యంలో మార్క్స్ రాసిన 'జర్మన్ ఐడియాలజీ' పుస్తకం పేరును 'జర్మన్ భావజాలం' అని కాకుండా 'జర్మన్ తప్పుడు భావజాలం' లేదా 'జర్మన్ మార్మికత' అని అనువదించవలసి ఉంటుంది. అయితే అందుకు భిన్నంగా చాలామంది మేధావులు జర్మన్ భావజాలం అని తప్పుగా అర్థం చేసుకుంటుండడం దురదృష్టకరం. 'ఐడియాలజీ' అంటే ప్రజలు తమను తాము ఆత్మవంచన చేసుకునే ఒక విశ్వాసాల వ్యవస్థగా, తప్పుడు చైతన్యంగా మార్క్స్ పరిగణించారు. అలా తప్పుదారి పట్టకుండా 'సిద్ధాంతం' అనేది ప్రజలను రక్షిస్తుందని ఆయన భావించారు. అయితే ఐడియాలజీ అనే భావనను నెపోలియన్ వలే నిందార్థకంగానూ, హెగెల్ వలె శుద్ధ మార్మికతగానూ మాత్రమే పరిగణించలేదు. సామాజిక చైతన్య దృగ్విషయంగాను, సాపేక్ష సత్యంగాను, వాస్తవికతకు సంబంధించిన భ్రమాత్మక ప్రతిఫలనంగాను (అవాస్తవమే కానీ అసత్యం కాదు) మార్క్స్ భావించారు. సమాజాభివృద్ధి క్రమంలో ఒక అనివార్యమైన, అత్యావశ్యకమైన సామాజిక చైతన్య ప్రక్రియగా భావజాలాన్ని ఆయన గుర్తించారు.

సామాజిక పదార్థం–సామాజిక చైతన్యం

తమ అవసరాలు తీర్చుకునే క్రమంలో 'పదార్థం'తో మానవ కార్యకలాపం సాగుతున్న పర్యవసానంగా (ప్రతిఫలనంగా) చైతన్యం ఆవిర్భవిస్తుందని భౌతికవాద భావన. అయితే ఈ చైతన్యం ఒక ముద్దగా కాక, 1) వాస్తవికత రమారమి ప్రతిఫలనం (approximate reflection of reality); 2) వాస్తవికత– కాల్పనిక ప్రతిఫలనం (fantastic reflection of reality); 3) వాస్తవికత – ముందస్తు ప్రతిఫలనం (anticipatory reflection of reality) అనే రూపాల్లో ఉనికిలోకి వస్తుంది.

తమ భౌతిక అవసరాలు తీర్చుకునే లక్ష్యంతో సాగే మానవ సమిష్టి కార్యాచరణలో అంటే – 'ఉనికిని (ప్రపంచం+ప్రకృతి=సమాజం) మానవీకరించడం' అనే క్రమంలో ప్రత్యక్ష, పరోక్ష అనుభవాల పునాదిగా;

పెట్టుబడిదారీ విధానం సృష్టిస్తున్న విధ్వంసానికి, విలయానికి ప్రత్యామ్నాయం చూపలేవు. ప్రపంచానికంతటికీ సమానత్వాన్ని అత్యున్నత సార్వత్రిక సంక్షేమాన్ని అందజేయగలిగేది సామ్యవాద ఆర్థిక వ్యవస్థ మాత్రమే. దీన్ని శాస్త్రీయ వర్గ దృక్పథం కలిగిన శ్రామికవర్గం విప్లవ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నిర్వహించే వర్గ పోరాటం మాత్రమే అభివృద్ధికి, ప్రజా శ్రేయస్సుకు ఆటంకంగా నిలిచిన ఈ ప్రతిఘాతుక, ఫాసిస్టు, మతవాద శక్తులను ఓడించగలదు.

ఈ చారిత్రక సందర్భంలో ప్రజాస్వామిక వాదులు, బుద్ధిజీవులు, ప్రగతిశీలురు జాతి విద్వేషాన్నీ, శ్వేతజాతి దురహంకారాన్నీ సంఘటితంగా ప్రతిఘటించాలి. ఇవాళ అంతర్జాతీయ సమాజం సామ్రాజ్యవాదుల కుట్రల పట్ల అప్రమత్తం కావాల్సిన అవసరం తలెత్తింది. ఈ ఉన్మాదాన్ని, జాత్యహంకారాన్ని తుదముట్టించాలంటే ప్రపంచ సమాజంలో సమానత్వ భావన వేళ్లూనుకొనేలా కృషి చేయాలి. అమెరికా ఏకపక్ష నిరంకుశ వైఖరి అంతం కావాలి. అమెరికా విధానాలే ప్రపంచంలో జాతి విద్వేషాలు, మత వైషమ్యాలు పెచ్చరిల్లడానికి దారి తీశాయన్న వాస్తవాన్ని గుర్తించాలి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

ప్రపంచం గురించిన అనుభూతి జ్ఞానం నుంచి హేతుబద్ధ జ్ఞానంగా మానవులు క్రోడీకరిస్తారు. అంటే, ప్రకృతి, సామాజిక (పాదార్థిక+అస్తిత్వ) సంబంధాలతో ముడిపడి (social conditioning of social consciousness) సామాజిక చైతన్యం రూపుదిద్దుకుంటుంది. అయితే అది సామాజిక అస్తిత్వ పరిస్థితుల పరిధిలో సాపేక్ష సత్యమైన ప్రజ్ఞానం (సిద్ధాంతం), వాస్తవికతకు చెందిన భ్రమాత్మక ప్రతిఫలనమైన భావజాలం అనే అంశీభూతాలను కలిగి ఉంటుంది.

ప్రపంచంలోని ప్రకృతికి చెందిన నిర్జీవ, జీవ పదార్థాలను మాత్రమే 'పదార్థమని' సాధారణంగా పరిగణిస్తుంటారు. నిర్జీవ, జీవ పదార్థాలతో పాటు 'సామాజిక పదార్థం' కూడా ఉనికిలో ఉంటుందనే సత్యాన్ని గ్రహించకపోవడం వల్ల సామాజిక చరిత్రను భౌతికవాద గతితర్కం రీత్యా అర్థం చేసుకోవడంలో మార్క్సిస్టులుగా చెప్పుకునే వారు కూడా తరచూ బోల్తా పడుతున్నారు. పదార్థం అనే భావనను ప్రకృతికి మాత్రమే పరిమితం చేసి అర్థంచేసుకోవడం వల్ల ఈ వైఫల్యం తలెత్తింది. 'పదార్థం' అనే భావన ప్రకృతికి సంబంధించినది మాత్రమే కాదు. అది అంతకంటే లోతైన, విస్తృతమైన అర్థాన్ని కలిగి ఉంది. 'పదార్థం ఒక తాత్విక తత్వం. అది మానవునికి తన ఇంద్రియానుభూతుల ద్వారా లభించిన భౌతిక వాస్తవికతను సూచిస్తుంది. ఈ భౌతిక వాస్తవికత మానవుని ఇంద్రియానుభూతులతో నిమిత్తం లేకుండా స్వతంత్ర అస్తిత్వాన్ని కలిగి ఉంటూనే వాటి ద్వారా కాపీ చేయబడి, ఫొటో తీయబడి, ప్రతిబింబించబడుతుంది' అని 'మెటీరియలిజం అండ్ ఎంపిరియో క్రిటిసిజం' గ్రంథంలో పదార్థం గురించి శాస్త్రీయంగానూ, కూలంకషంగానూ లెనిన్ నిర్వచించాడు. కాపీ చేయబడి, ఫోటో తీయబడి, ప్రతిబింబించడంతో పాటుగా శాస్త్రీయ ప్రమాణాలు, ప్రయోగాలతో పాటు, వివిధ వినియోగ రూపాలలో ప్రత్యక్ష ఇంద్రియ గోచర పదార్థాల పరిధికి ఆవలనున్న వస్తుగత ఉనికిని అనుభూతం చేసుకోవడం ద్వారానూ 'పదార్థం' స్వతంత్ర అస్తిత్వాన్ని నిర్ధారించగలమనే అంశాన్ని లెనిన్ నిర్వచనానికి జోడించడం వల్ల అది మరింత సమగ్రత సంతరించుకుంటుందని నా భావన.

ప్రకృతిలోని నిర్జీవ, జీవ పదార్థాలు, వాటి పరిధికి ఆవలనున్న అనంత విస్తరణలోని అణ్వాంతర సూక్ష్మ ప్రపంచాన్ని, విశ్వాంతరాళ స్థూల ప్రపంచాన్ని కొన్ని ప్రత్యక్ష, పరోక్ష ప్రమాణాల ద్వారా తెలుసుకోగలమన్నది అందరికీ తెలిసిన విషయమే. అది పాదార్థిక ప్రపంచం (ప్రకృతి+సమాజం) గురించిన పాక్షిక సత్యమే అవుతుంది. ప్రపంచానికి చెందిన ప్రకృతి పదార్థాన్ని మాత్రమే తెలుసుకొని, సామాజిక పదార్థం గురించి తెలుసుకోకపోవడమే అవుతుంది. పదార్థమనే తాత్విక తత్వం ప్రకృతికీ, సమాజానికి వర్తిస్తుంది. భిన్న నిర్జీవ, జీవ పదార్థాలను, మనిషి చైతన్యానికి, సంకల్పానికి ఆవల స్వతంత్ర అస్తిత్వంలో వైవిధ్యభరితమైన పద్ధతులలో గుర్తించినట్లే సామాజిక పదార్థాన్ని సామాజిక చలన నియమాలకు అనుగుణమైన పద్ధతుల ద్వారా గుర్తిస్తారు. పదార్థతత్వం నిర్జీవ, జీవ పదార్థ రూపాలలోనే కాకుండా సామాజిక రూపంలో కూడా ఉనికిలో ఉంటుందనే విషయాన్ని మార్క్సిస్టులతో సహా వివిధ సామాజికవేత్తలు గుర్తించలేదు లేదా విస్మరించారు. నిర్జీవ పదార్థ చలన నియమాలు, దాని నుంచి ఆవిర్భవించిన జీవ పదార్థ చలనాలలోనూ అంతర్భాగంగా కొనసాగుతుండడమే కాకుండా, వాటికి అదనంగా తమదైన విశిష్ట ధర్మాలు, చలన నియమాలను జీవ పదార్థాలు కలిగి ఉంటాయి. అలాగే నిర్జీవ, జీవ పదార్థ ధర్మాలు, నియమాలను కలిగి ఉండటమే కాకుండా అదనంగా తనదైన రంగానికి చెందిన విశిష్ట ధర్మాలు, నియమాలను సామాజిక పదార్థం కలిగి ఉంటుందని భౌతికవాద గతితర్కం చెబుతుంది.

ఈ అవగాహన నేపథ్యంలోనే ప్రకృతి చరిత్ర కొనసాగింపే సామాజిక చరిత్ర అని అంటారు. మానవుల చైతన్యానికి, సంకల్పానికి భిన్నంగా, స్వతంత్రంగా ఉత్పత్తి క్రమంలో మనుషుల మధ్య ఏర్పడే ఉత్పత్తి సంబంధాలు, స్త్రీ పురుషుల మధ్య ఏర్పడే ప్రాథమిక రూపంలోని కుటుంబ సంబంధాలు; మనుషుల మధ్య నిర్దిష్ట పర్యావరణ అనుబంధిత శబ్ద సంకేతాల వ్యవస్థగా ఏర్పడిన భాషా సంబంధాలు తదితర వస్తుగత, పాదార్థిక సంబంధాలన్నీ వెరసి సామాజిక పదార్థంగా పరిగణించాలి. పదార్థమంటే నిర్జీవ, జీవ ప్రకృతి మాత్రమేనని భావించే వారు సామాజిక పదార్థమనే తాత్విక తత్వం జీర్ణం చేసుకోలేకపోయారు. దాంతో సమాజం గురించిన అవగాహనలో ఫ్యూయర్‌బాకు వలె భావవాద దృక్పథానికి నైతిక దృక్పథానికే వారు పరిమితమయ్యారు. కొందరైతే ప్రకృతిలో వస్తుగత చలన నియమాలుంటాయి గానీ, సామాజిక చలనమంతా ఆత్మికమైనదని, అందువల్ల దానికి పాదార్థిక చలన నియమాలు ఉండవని, కొన్ని భావాల సంఘర్షణ పర్యవసానంగానే చరిత్ర నిర్మాణం జరుగుతుందనే సంకుచిత భావవాద దృక్పథాన్ని కలిగి ఉన్నారు.

సామాజిక సంబంధాలు=పాదార్థిక సంబంధాలు+భావజాల సంబంధాలు

ప్రకృతిలో మానవ చైతన్యానికి, సంకల్పానికి స్వతంత్రంగా ఎలాగైతే నిర్జీవ, జీవ రూపాల్లోని పాదార్థిక అంశాలున్నాయో, సమాజంలోనూ అలాంటి పాదార్థిక అంశాలున్నాయి. మానవ అవసరాలరీత్యా ప్రకృతిలోని పాదార్థిక అంశాలు మానవీకరణకు గురై వివిధ రూపాల్లో సరకులుగా మానవ వినియోగంలోకి వెళతాయి. ప్రకృతి పదార్థమైన చెక్క మానవీకరణకు గురై కుర్చీ వంటి వినియోగ వస్తువుల రూపం సంతరించు కుంటుంది. ఇనుము ప్రకృతి పదార్థం మానవీకరణకు గురై వివిధ వస్తువుల రూపంలో వినియోగం జరిగినట్లే, సామాజిక పదార్థం కూడా సమకాలీన ప్రజల సామాజిక చైతన్యస్థాయికి అనుగుణంగా మానవీకరణ కు గురవుతుంది. ప్రకృతి పదార్థమైన చెక్క మానవీకరణకు గురై కుర్చీ తదితర మానవీయ పదార్థాలుగా మారినట్లే, సామాజిక పదార్థమైన ఉత్పత్తి సంబంధాలు, భాషా సంబంధాలు, ప్రాథమిక రూపంలోని కుటుంబ సంబంధాలు వగైరాలు సమకాలీన పరిమితులు, పరిధుల్లో మానవీకరణకు గురికావడంతో రాజకీయాలు, తత్వశాస్త్రం, కళలు, మతం, కులం, జాతి, తెగ తదితర సంబంధాలు, రాజ్యాంగ వ్యవస్థలు, సంస్థల రూపంలో భావజాల సంబంధాలు సమాజంలో ఆవిర్భవిస్తాయి.

ప్రకృతి పదార్థమైన చెక్క ధర్మాలు, నియమాలు అర్థం చేసుకున్న స్థాయికి అనుగుణంగా వివిధ మానవీకరించిన చెక్క వస్తువులు వినియోగంలోకి వచ్చినట్లే, సామాజిక పదార్థం గురించి చారిత్రకంగా ఆనాటి మానవ అవసరాలు, అవగాహన స్థాయికి అనుగుణమైన భావజాల సంబంధాలు, వ్యవస్థలు, సంస్థలు ఉనికిలోకి వస్తాయి. ప్రకృతి పదార్థమైన చెక్క, దాని మానవీకరణ రూపమైన కుర్చీ రెండూ భౌతికమైనవే. అలాగే పాదార్థిక సంబంధాలుగానీ, వాటి ప్రతిఫలనంగా ఉనికిలోకి వచ్చిన భావజాల సంబంధాలు లేదా అస్తిత్వ సంబంధాలు గానీ రెండూ భౌతికమైనవే. వర్గసంబంధాలు పాదార్థికమైనవి, వాటి

ప్రతిఫలనంగా రూపొందిన కులసంబంధాలు 'మానవీకరించిన ఉనికి' లాగా భౌతికమైనవే.

కులాన్ని భావజాల సంబంధంగా పరిగణించినంత మాత్రాన దాని సామాజిక పాత్రను తక్కువ చేసినట్లుగా అనుకోవడం పొరపాటు. ఈ విషయాన్ని పాలకవర్గ భావజాలకర్తలు కావాలని గందరగోళ పరుస్తున్నారు. కార్మిక వర్గం పాదార్థిక ఆర్థిక సంబంధమైనప్పటికీ, వారిని ఒక ట్రేడ్ యూనియన్‌గా సంఘటితం చేస్తే ఆ సంఘాన్ని భావజాల సంస్థ అని, సంఘంలోని సభ్యుల (కార్మికుల) మధ్య సంబంధాలను భావజాల సంబంధాలుగా పరిగణిస్తారు. సమాజంలోని వర్గ సంఘాలను, అస్తిత్వ సంఘాలను రెండింటినీ భావజాల సంస్థలుగానే పిలుస్తారు. అంతమాత్రాన అవి శుద్ధ భావజాల సంస్థలుగా, అభూతమైన శక్తిహీన సంస్థలుగా, సంబంధాలుగా పరిగణించడం పొరపాటు. సామాజిక చైతన్యంలో భావజాలం పాత్రగురించి కమ్యూనిస్టులు సహా మేధావు లందరిలో కొనసాగుతున్న దురవగాహనే ఇందుకు కారణం.

కులాన్ని భావజాల సంబంధంగా పరిగణించడమంటే, కుల సమస్యను తక్కువ చేయడం అనుకోవడం అర్థరాహిత్యం తప్ప వేరుకాదు. పునాది సంబంధాలు ఏమైనప్పటికీ, వాటి పరిష్కారం ఆ పునాది వర్గాలకు సంబంధించిన భావజాల సంస్థలు, భావజాల సంబంధాలను నిర్మించడం ద్వారా తప్ప వేరే మార్గం లేదు. వామపక్ష రాజకీయ పార్టీ గానీ, దాని ప్రజా సంఘాలు ఏవైనా గానీ భావజాల సంస్థలే. కులాన్ని పునాది అంశంగా పరిగణించి కుల నిర్మూలన కృషి కోసం ఏర్పాటు చేసే ప్రజాసంఘం కూడా భావజాల సంఘమే అవుతుంది. 'భావజాలం' గురించి సరైన అధ్యయనం చేయని మేధావులు, ఉద్వేగాలకు గురైన అస్తిత్వవాదులు, భౌతికవాద గతితర్కం జీర్ణంగాని బాలగోపాల్ వంటి తెలుగు మేధావులు, కమ్యూనిస్టు పార్టీలు పునాది-ఉపరితలం వంటి కీలకమైన భావనను వక్రీకరించిన కారణంగా ఉద్యమకారుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది.

'సామాజిక సంబంధాలు పాదార్థిక సంబంధాలు, భావజాల సంబంధాలు అని రెండు రకాలు. మానవుడు తన మనుగడ సాగించేందుకు చేసే కార్యకలాపాల రూపంగా (ఫలితంగా), మానవుని చైతన్యంతోనూ, సంకల్పంతోనూ సంబంధం లేకుండా స్వతంత్రంగా రూపొందే సంబంధాలపై ఏర్పడిన సామాజిక ఉపరినిర్మాణమే (సమాజం లోని రాజకీయాలు, మతం, తత్వశాస్త్రం, కళలు, వైజ్ఞానిక శాస్త్రాలు వగైరా రంగాలకు చెందిన వివిధ రాజ్యాంగ రాజ్యాంగేతర వ్యవస్థలు) భావజాల సంబంధాలు.' (లెనిన్ కలెక్టెడ్ వర్క్స్ వాల్యూం 1, పేజీ 151) పాదార్థిక సంబంధాల ప్రభావం మానవ మనస్సుల ద్వారా నడచిన తర్వాత మాత్రమే వాటికి అనుమేయంగా, ద్వితీయంగా భావజాల సంబంధాలు ఉనికిలోకి వస్తాయి.

సామాజిక పునాది - ఉపరితలం మధ్య గతితర్కం

పదార్థం నుంచి చైతన్యం మానవ ప్రమేయం లేకుండా దానంతట అదే ఏర్పడదు. నిమిత్త కారణమైన మానవ ప్రమేయం స్థాయిని బట్టి పదార్థం నుంచి చైతన్యం ఆవిర్భవిస్తుంది. అదే తీరులో సామాజిక పదార్థం నుంచి సామాజిక చైతన్యం ఏర్పడుతుంది. వాన పడిదంటే కచ్చితంగా మబ్బులుండాలి, అయితే మబ్బులున్నంత మాత్రాన కచ్చితంగా వానపడే అవకాశముండదుకదా? ఇలాంటి ప్రక్రియను అనుమేయ ప్రమాణం అంటారు. అలాగే ఉనికి నుంచి చైతన్యం అనుమేయంగా ఉనికిలోకి వస్తుంది. ప్రకృతి పదార్థ ధర్మాలు, చలన నియమాలు మానవ కార్యకలాపాల ద్వారా ప్రతిఫలనం జరిగిన పర్యవసానంగా చైతన్యం ఆవిర్భవించినట్లుగా సమాజ పాదార్థిక సంబంధాల ప్రతిఫలనంగా సామాజిక భావజాల సంబంధాలు ఆవిర్భవిస్తాయి. సమాజంలో తామున్న పాదార్థిక సంబంధం (తమ సామాజిక ఉనికిని, ఇతర సామాజిక సమూహాలతో తమకున్న పరస్పర చర్యా ప్రతి చర్యలు) గురించి, ఆనాటి సామాజిక చైతన్య పరిమితుల (స్థల-కాలాల పరిధుల్లో) ఆధారంగా తమను తాము నిర్వచించుకొని, దాని కనుగుణంగా కార్యకలాపాలను సాగించే నిర్దిష్ట సామాజిక సమూహాన్ని 'అస్తిత్వం'గా పరిగణిస్తారు. మార్క్స్ ప్రతిపాదించిన భావజాల సంబంధాలను (ఉపరితల అంశాలు) 'అస్తిత్వ సంబంధాలు'గా పరిగణించవచ్చు.

కుల, మత, ప్రాంత, జాతి, తదితర భావజాల సంబంధాలు, రాజ్యం తదితర వ్యవస్థలు, సంస్థలుగా, రాజకీయ సంస్థలు, కళా సంస్థలు వగైరా ఉనికిలో ఉన్న సామాజిక సమూహాలన్నీ అస్తిత్వాలుగానే పరిగణించవచ్చు. మార్క్సిజంలో సామాజిక పునాది, ఉపరితలం అనే భావన అపార్థానికి గురైనట్లుగా మరే భావన గురికాలేదన్నది అతిశయోక్తికాదు. సమాజంలోని ఉత్పత్తి సంబంధాలను పునాదిగాను, దానికి అనుమేయంగా (ఊహింపదగిన) మతం, అందులో భాగమైన కులం, సాహిత్యం, తత్వశాస్త్రం, చట్టం, న్యాయం, రాజకీయాలు తదితర భావజాలాలు, వాటి పునాదిగా రూపొందే భావజాల సంబంధాలు, భావజాల సంస్థలు వెరసి సామాజిక ఉపరితలంగా మార్క్సిజం పరిగణిస్తుంది. పునాదికి అనుమేయంగా ఉపరితలం (భావజాలం, భావజాల సంస్థలు, భావజాల వ్యవస్థలు) ఉనికిలోకి వచ్చినప్పటికీ, వ్యవస్థ మార్పు కోసం పునాది, ఉపరితల రంగాలకు చెందిన ప్రజా సమూహాలతో ఏర్పాటు చేసిన ప్రజాసంఘాల (భావజాల సంస్థలు, సంబంధాలు) నిర్మాణంతోనే ఉద్యమించాలి.

భిన్న చారిత్రక దశల్లో మనుషులు తమ కార్యకలాపాల నుంచి ప్రకృతి ధర్మాలు అవగతం చేసుకున్న స్థాయికి అనుగుణంగా వినియోగ వస్తువుల తయారీ నైపుణ్యం కలిగినట్లుగానే.... సామాజిక పదార్థం నుంచి భావజాల సంబంధాలు, వ్యవస్థలు, సంస్థలు నిర్మాణం (ఉపరితల నిర్మాణం) కొనసాగుతుంటుంది. మనుషులు తాము బతుకుతున్న పాదార్థిక సంబంధాలు ఏమైనప్పటికీ, వాటిని అర్థం చేసుకున్న తీరులోనే, అస్తిత్వ స్పృహతో పరస్పర ప్రతిచర్య జరుపుతారు.

ప్రకృతి పదార్థం మానవీకరణ ద్వారా ఏర్పడిన వినియోగ వస్తువులు, సామాజిక పదార్థం మానవీకరణ ద్వారా భావజాల సంబంధాలు, సంస్థలు, వ్యవస్థలు వెరసి మానవ సంస్కృతి అంటే రెండవ ప్రకృతి (సెకండ్ నేచర్)ని సృష్టిస్తారు. రిజర్వు బ్యాంకు బంగారు నిల్వలకు ప్రతినిధి అయిన కరెన్సీ వినియోగంలో బంగారం గురించి మనుషులు గుర్తు చేసుకోనట్లే, మార్కెట్లో సరుకుల మారకం చేస్తున్న సమయంలో ఆయా సరకులు సగటు సామాజిక ఉత్పత్తి శ్రమ కాలమైన విలువను గుర్తు చేసుకోకుండా డబ్బు రూపంలోని ధరను మాత్రమే పరిగణిస్తున్నట్లే సామాజిక కార్యకలాపాల సమయంలో పాదార్థిక సంబంధాల ఎరుకతో కాకుండా చారిత్రకంగా వాటిని వారు అర్థంచేసుకుని నిర్మించుకున్న

భావజాల సంబంధాల ప్రాతిపదికన మనుషులు పరస్పరం వ్యవహరిస్తుంటారు. నేడు స్వతస్సిద్ధ అంశాల కంటే మానవీకరించిన పాదార్థిక అంశాలు ఉనికి (ప్రపంచం = ప్రకృతి+సమాజం)లో కీలక భూమికను పోషిస్తున్నాయి.

మానవీకరించిన అంశాల పాత్రతో కూడిన ఈ భూగోళాన్ని 'నూస్ఫియర్' (బౌద్ధిక ఆవరణం) అని శాస్త్రవేత్తలు పిలుస్తున్నారు. వర్గ సమాజాభివృద్ధి పరాకాష్టకు అంటే పెట్టుబడిదారీ విధాన అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాద దశకు చేరి అధిక వ్యర్థాలతో కూడిన ఉత్పత్తి క్రమాలు (వర్గ సమాజ+ప్రకృతి పదార్థాల మానవీకరణ క్రమం) కొనసాగు తుండడం వల్ల అంతర్జాతీయ సమాజం సామాజికార్థిక-పర్యావరణ సంక్షోభంలో కూరుకుపోయింది. వర్గ సమాజ మానవీకరణ క్రమం వల్ల ప్రకృతి-సమాజం ఆదాన ప్రదాన క్రమానికి; శ్రమ విభజన-సంపద పంపిణీల ఆదాన ప్రధాన క్రమాలకు మధ్య అగాధం ఏర్పడుతుంది. వ్యర్థాలను అధికంగా విడుదల చేసే ఉత్పత్తి క్రమం కాలుష్యానికి, వాతావరణ మార్పుకు, పర్యావరణ సంక్షోభానికి ఎలా దోహదం చేస్తుందో, సరిగ్గా అదే తీరులో గత కాలపు భావజాల చారిత్రక అర్థ రాహిత్యంతో కూడిన శుద్ధ అస్తిత్వవాద భావజాలం, భావజాల వ్యవస్థలు, సంస్థలు సామాజిక కాలుష్యంగా వ్యవహరిస్తాయి. పర్యవసానంగా ప్రకృతి-సమాజం; శ్రమ విభజన-సంపద పంపిణీ ఆదాన ప్రదాన క్రమాలకు మధ్య అగాధమేర్పడి యుగసంక్షోభానికి (ఎపోకల్ క్రైసిస్) దారితీస్తుంది.

సిద్ధాంతం-భావజాలం పరస్పర పూరకాలు

మనుషులు ఈ ప్రపంచం మీద లక్ష్యవంతమైన ప్రభావం నెరుపుతూ తమ అవసరాలకు వస్తువులను, వస్తువులకు అవసరాలను సృష్టించడానికి వారికి వస్తుగత జ్ఞానం అవసరమవుతుంది. అది ప్రకృతి, సమాజాల చలన నియమాలకు చెందిన సిద్ధాంతాలుగా రూపు దిద్దుకుంటుంది. ఉనికిని మానవీకరించే క్రమంలో వస్తుగత జ్ఞానంతో పాటు ఆ వాస్తవికత పట్ల స్వీయాత్మక వైఖరి కూడా ఉత్పన్నం అవుతుంది. అయితే వస్తుగత జ్ఞానం గానీ, స్వీయాత్మక వైఖరిగానీ నిర్దిష్ట సామాజిక బృందాలు లేదా వివిధ అస్తిత్వాల పునాదిగా సమకాలీన చారిత్రక చోదక శక్తి సారథ్యంలో ఆవిర్భవించే సామాజిక వర్గాల ఉమ్మడి చైతన్యంగా ఉనికిలోకి వస్తుంది. అది పలువురు చారిత్రక వ్యక్తుల వైయక్తిక చైతన్యంగా వ్యక్తమవుతుంది. ప్రపంచంలోని వివిధ చలననియమాలతో వ్యవహరించే శారీరక శ్రమజీవులు సాధించే అనుభూతి జ్ఞానాన్ని మేధా శ్రమజీవులు క్రోడీకరించడం ద్వారా వివిధ ప్రకృతి+సామాజిక శాస్త్రాల రూపంలో మానవ ప్రజ్ఞానం (వివిధ సిద్ధాంతాలు) ఆవిర్భవించాయి. అదే సమయంలో సమాజంలోని సగటు ప్రజానీకం దైనందిన జీవిత కార్యకలాపాల్లో ఈ ప్రపంచం గురించి తమకు అనుభవంలోకి వచ్చిన, తాము అర్థం చేసుకున్న పరిధుల్లోని చైతన్యంతోనే నిత్యం వ్యవహరిస్తుంటారు. ఇలా వ్యవహారంలో ఉన్న భావాలకు కొనసాగింపుగా భావజాల కర్తలు ప్రపంచంలోని పాదార్థిక గతిశీల నియమాలతో సంబంధం లేకుండా స్వీయాత్మక వ్యక్తీకరణలుగా కొత్త కొత్త ఆలోచనలను ప్రతిపాదిస్తారు. ఇలా ప్రజల మధ్య మెలుగుతున్న, భావజాలకర్తలు రూపొందించిన ప్రకృతి+సమాజాల (ప్రపంచం) గురించిన భావాల వ్యవస్థను భావజాలంగా పరిగణిస్తారు. పరిశోధన, అన్వేషణ, అనుభూతి జ్ఞాన క్రోడీకరణల నుంచి ఏర్పడుతున్న సిద్ధాంతాల రూపంలోని ప్రజ్ఞానం; ఆ ప్రజ్ఞానం నుంచి, దైనందిన జీవిత అనుభవం నుంచి ఒకానొక సమాజం అర్థం చేసుకుని, రూపొందించుకున్న మతం-కులం, రాజకీయాలు, రాజ్యాంగం, కళలు, సాహిత్యం తదితర భావాలు, వైఖరుల ఆధ్యాత్మిక వ్యవస్థను భావజాలం అంటారు. వాటి ఆధారంగా భావజాల సంబంధాలు, వ్యవస్థలు, సంస్థలు రూపొందుతాయి. మానవుని కంటిలోని రెటీనా తెరపై బాహ్య ప్రపంచం ప్రతిబింబం తల్లకిందులుగా పడుతుంది. అలా రెటీనాపై తల్లకిందులుగా పడిన ప్రతిబింబాన్ని నాడీ మండలం ద్వారా గ్రహించిన మెదడు ఆ సమాచారాన్ని తల్లకిందులు చేసి సరైన రీతిలో ప్రపంచాన్ని అర్థం చేయిస్తుంది. అదే తీరులో సమకాలీన చైతన్య స్థాయి పరిధిలో మానవుల దైనందిన కార్యకలాపంలో ఆవిర్భవిస్తున్న అనుభూతి ప్రధాన జ్ఞానం లేదా భావాలు (భావజాలం) సమాజంలోని మేధా శ్రామికుల కృషి ఫలితంగా సాపేక్ష సత్యం రూపంలోని ప్రజ్ఞానంగా (సిద్ధాంతం) రూపుదిద్దుకుంటుంది. ఈ ప్రజ్ఞానం తిరిగి ప్రజల దైనందిన వ్యవహార జ్ఞానమైన భావజాలంగా రూపాంతరం చెంది, ప్రతిసారి (ప్రతి వ్యవస్థలోనూ) పునర్నిర్మితం (పునరుత్పత్తి) అవుతుంది.

ఈ నేపథ్యంలో వస్తుగత జ్ఞానమైన ప్రజ్ఞానానికీ (వివిధ సిద్ధాంతాలు), ప్రపంచ ఉనికి పట్ల స్వీయాత్మక వైఖరిని వ్యక్తంచేసే భావజాల రూపాలకూ (మతం, అందులో అంతర్భాగమైన కులం, రాజకీయ వ్యవస్థ, న్యాయం, రాజ్యాంగం, కళలు, సాహిత్యం, తత్వశాస్త్రం తదితరాలు) మధ్య వివిధ, సంకీర్ణ సంబంధాలు ఉద్భవిస్తాయి. సామాజిక చైతన్యపు అభివృద్ధిలో అవి రెండూ పరస్పర సంబంధం గల, పరస్పర పూరక ధోరణులుగా ఉత్పన్నమౌతాయి- ఒకటి, ప్రజ్ఞానపు ధోరణి. సామాజిక మానవుని వాస్తవ ప్రపంచ జీవిత కార్యాచరణ ప్రయోజనాలు ప్రజ్ఞానాన్ని నిర్ణయిస్తాయి. ఈ ధోరణి వల్ల ప్రపంచం (ప్రకృతి+సమాజం) గురించిన వస్తుగత జ్ఞానం (వివిధ ప్రకృతి, సామాజిక సిద్ధాంతాలు) పోగవుతుంది. రెండు, భావజాల ధోరణి, నిర్దిష్ట సామాజిక సంబంధాలను కొనసాగించే లక్ష్యంగానీ, మార్చే లక్ష్యంగా గల సామాజిక ప్రయోజనాల ద్వారా ఇది రూపొందుతుంది. అందుకు ప్రకృతి, సమాజం గురించిన రెండు రకాల భావజాలాలు ప్రజల్లో ప్రచలితమవుతాయి. వాస్తవ జీవితంలో ప్రజ్ఞాన (సిద్ధాంతం)-భావజాల ధోరణులూ గాఢంగా పెనవేసుకొని, తరచుగా ఒకదానితో ఒకటి సమవసిస్తాయి. సిద్ధాంత పరిశీలన ద్వారా, అభౌతికీకరణ ద్వారా మాత్రమే వాటిని గుర్తించగలం.

భావజాల క్రమంలో సిద్ధాంత పార్శ్వం ఉంది, అలాగే జ్ఞానాభివృద్ధిలో (సిద్ధాంతంలో) భావజాల పార్శ్వం ఉంది. టాలెమీ (చర్చి) భూ కేంద్రక సిద్ధాంతానికి భిన్నంగా సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ కోపర్నికస్ ఒక పుస్తకం రాశారు. వందల పేజీలున్న ఆ పుస్తకం చదివినప్పటికీ, ఆనాడు కోపర్నికస్ ప్రతిపాదించిన సిద్ధాంతంపై అనుమానాలు ఉండేవి. అయితే నేడు నిరక్షరాస్యులు సైతం కోపర్నికస్ సిద్ధాంతంతో పరిచయం లేనప్పటికీ, భూమి సూర్యుని చుట్టూ తిరుగు తోందనే సత్యాన్ని తమ దైనందిన జీవిత కార్యకలాపాల్లో అన్వయిస్తుండడం సర్వసాధారణమైంది. కోపర్నికస్ సిద్ధాంతం ఒక సర్వసాధారణ భావజాలంగా అవతరించింది. అదే విధంగా పెట్టుబడిదారీ దోపిడీ విధానంపై 'పెట్టుబడి' గ్రంథంలో మార్క్స్ శాస్త్రీయంగా రుజువు చేశారు. అయితే కార్మికులు ఆ గ్రంథాన్ని అధ్యయనం చేయకుండానే తమ దైనందిన జీవితాల్లో తాము దోపిడీకి గురవుతున్నామనే సత్యాన్ని గ్రహిస్తున్నారు. ఒకప్పుడు తమ ఖర్మ, తలరాతగా ఇబ్బందులను సహించిన

కార్మికవర్గం నేడు తమ కష్టాలకు, కన్నీళ్లకు పెట్టుబడిదారీ విధానమే కారణమన్న మార్క్స్ అదనపు విలువ దోపిడీ సిద్ధాంత అవగాహనను తమదైన జీవితానుభవం నుంచి ఆకళింపు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సిద్ధాంతంలో భావజాల పార్శ్వం ఉంటుంది, భావజాలంలో సైద్ధాంతిక పార్శ్వం ఉంటుంది. నిర్దిష్ట సందర్భాల్లో ఒకదాన్నుంచి మరొకటి ఆవిర్భవిస్తుంటుంది. దాంతో అనేక సందర్భాల్లో ఈ రెండు ధోరణలనూ ఒకటిగా పొరబడుతుండడం కద్దు.

అయితే అందుకు భిన్నంగా జ్ఞానాభివృద్ధి, భావజాలాభివృద్ధి భిన్న భిన్న నియమాలతో నడుస్తాయి. సామాజిక చైతన్యంలోని ఈ నిర్మాణ అంశాలు భిన్న భిన్న పాత్రలను నిర్వహిస్తాయి. ప్రకృతితో మానవుని పాదార్థిక సంబంధాలు ఎప్పుడూ నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాల ద్వారా వ్యక్తమవుతున్నట్లే, ప్రపంచ ఉనికితో మానవుని ప్రజ్ఞాన (సైద్ధాంతిక) సంబంధాలు సైతం ఆ సామాజిక పరిస్థితులు ఉత్పత్తి చేసిన నిర్దిష్ట భావజాల రూపాలలో వ్యక్తమవుతుంటాయి. సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో సమకాలీన సామాజిక సమూహాల చైతన్యపూరిత కార్యకలాపానికి ఉపకరించే ప్రజల భావాలుగా ఉనికిలో ఉంటూ, ఆ సామాజిక సంబంధాలను, మార్చడానికి గానీ, స్థిరపరచడానికి గానీ తోడ్పడుతూ, ఆనాటి సామాజిక చైతన్యంలో అంతర్భాగమైన భావవ్యవస్థగా భావజాలం చారిత్రక పాత్ర నిర్వహిస్తుంది. వర్గ సమాజంలో భావజలమనేది సామాజికాభివృద్ధిలో వస్తుగత నియమాల వాస్తవీకరణకు అవసరమైన స్వీయాత్మక పరిస్థితిగా పనిచేస్తుంది.

కాల్పనిక విశ్వజనీనతే భావజాలం

భావజాలం అనేది 'సమాజ భౌతిక జీవితక్రమం' నుంచి అనివార్యంగా ఉద్భవిస్తుంది. ఉత్పత్తి సంబంధాలు ఒకానొక నిర్దిష్ట చారిత్రక దశలో వర్గ సంబంధాలుగా, జాతి, మత, కుల, ప్రాంత, జెండర్ తదితర అస్తిత్వ సంబంధాలుగా పరిణామం చెంది, భిన్న సామాజిక భావజాలాలుగా సంబంధిత అస్తిత్వాల స్వీయ ప్రయోజనాలు, ఆశలు, ఆకాంక్షలుగా వ్యక్తమవుతాయి. ప్రతి సామాజిక అస్తిత్వం తమదైన భావజాలాన్ని రూపొందించుకుంటుంది. సమాజంలోని వివిధ వర్గాలు, అస్తిత్వాలు నిర్దిష్ట భావజాలాన్ని రూపొందించడంలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నప్పటికీ, సమకాలీన సమాజంపై పెత్తనం చేస్తున్న పాలక వర్గాల ప్రయోజనాలు నెరవేర్చే భావజాలమే సమాజ బౌద్ధిక జీవితంపై ఆధిపత్యం వహించే పాలక భావజాలంగా ఉంటుంది. ప్రతి నిర్దిష్ట అస్తిత్వపు భావజాలం విశ్వజనీన పాలక భావజాలంలో అంతర్భాగంగా మారుతుంది. ప్రతి పాలక భావజాలం సామాజిక వ్యవస్థ ప్రారంభ దశలో మొత్తం సమాజంలోని అన్ని వర్గాల, అస్తిత్వాల ప్రయోజనాలను ప్రతిబింబించే విధంగా ఉంటుంది. అయితే కాలక్రమం లో సమకాలీన పాలకవర్గాలు సమాజంలోని మిగిలిన ప్రజా సమూహాల నుంచి పరాయీకరణకు గురై ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా తయారై నిరంకుశంగా మారుతాయి. ఈ తరుణంలో అభివృద్ధి నిరోధక పాలకవర్గాల దాష్టీకానికి వ్యతిరేకంగా వివిధ సెక్షన్ల ప్రజలు పోరాడవలసిన అనివార్యత తలెత్తుతుంది. అయితే వీరందర్నీ సంఘటితం చేసి విప్లవాత్మక మార్పు వైపు నడిపించేందుకు సమకాలీన పాలకవర్గం స్థానంలోకి చారిత్రకంగా అధికారంలోకి రాబోయే భవిష్యత్ పాలకవర్గం సమాజంలోని అణచివేతకు గురవుతున్న వివిధ సెక్షన్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, తన వర్గ ప్రయోజనాల మాటున ఒక ఉమ్మడి భావజాలాన్ని ముందుకు తీసుకురాగలిగితేనే అందరికీ నాయకత్వం వహించి విప్లవాత్మక సామాజిక మార్పుకు నాంది పలకగలదు.

ఈ నేపథ్యంలో భవిష్యత్ పాలకవర్గం అణచివేతకు గురవుతున్న అందరి ప్రయోజనాలను ప్రతిబింబిస్తూ ఒక ఉమ్మడి భావజాలాన్ని సృష్టిస్తుంది. ఫ్యూడల్ నిరంకుశ పాలన వ్యతిరేక పోరాటంలో మధ్యతరగతి, రైతాంగం, కార్మిక వర్గం తదితర సెక్షన్ల ప్రజలను సంఘటితం చేసేందుకు 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' వంటి నినాదాలతో బూర్జువా వర్గం నాయకత్వం వహించింది. ఫ్యూడల్ నిరంకుశ పాలనను అంతమొందించేందుకు సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొచ్చేందుకు అనువుగా ఉమ్మడి ప్రయోజనాలను ప్రతిఫలించే డిమాండ్లను, రాజకీయ ప్రజాస్వామిక భావాలను బూర్జువా వర్గం ముందుకు తెచ్చింది. ఫ్యూడల్ పాలకవర్గాల స్థానంలో బూర్జువా వర్గం ఆధిపత్యంలోకి వచ్చేందుకు తన ప్రయోజనాన్ని మరుగున పరచి సమాజంలోని మిగిలిన ప్రజా సమూహాలన్నిటిని కలుపుకొచ్చేందుకు అనువుగా ఉమ్మడి ఆకాంక్షలను ప్రతిబింబించే సామాజిక సిద్ధాంతాలను రూపొందిస్తుంది. అంటే బూర్జువా వర్గం 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే తన వ్యాపార ప్రయోజనాన్ని సమాజంలోని మొత్తం అణగారిన ప్రజానీకానికి వర్తించే విశ్వజనీన ప్రజాస్వామిక ఆకాంక్షగా మార్చి వేసింది. చారిత్రకంగా భవిష్యత్ పాలక వర్గంగా మారే సామాజిక సమూహపు ఆకాంక్షలు నిర్దిష్ట స్థాయి నుంచి విశ్వజనీనత సంతరించుకునే ప్రకియను 'విశ్వజనీనత్వ భ్రాంతి' లేదా 'భ్రమాత్మక విశ్వజనీనత'గా (ఇల్యూషన్ ఆఫ్ యూనివర్సాలిటీ) పరిగణిస్తారు. అలాంటి భ్రమాత్మక విశ్వజనీనత సాధనంగా ఉనికిలో ఉన్న పాలక వర్గానికి, పాలకవర్గ భావజాలానికి వ్యతిరేకంగా వివిధ ప్రజా సంఘాలుగా సంఘటితమైన ప్రజలు విప్లవాన్ని విజయవంతం చేస్తారు.

ఫ్యూడల్ ప్రభువర్గాలకు వ్యతిరేక పోరాట ఫలితంగా బూర్జువా ప్రజాస్వామిక/రిపబ్లిక్ రాజ్యాలు అవతరించాయి. అయితే అధికారంలోకి వచ్చిన పాలకవర్గం (బూర్జువా వర్గం) పాలన మొదలయ్యాక 'ప్రజాస్వామిక మాయ' (ఇల్యూషన్ ఆఫ్ యూనివర్సాలిటీ) క్రమంగా వీడింది. అప్పటిదాకా విముక్తి భావజాలంగా ఉన్న బూర్జువా భావజాలం పాలకవర్గ ఆధిపత్య భావజాలంగా మారింది. బూర్జువా వర్గ స్థానాన్ని ఆక్రమించేందుకు కార్మికవర్గం చారిత్రక రంగం మీదకు వచ్చింది. ఇప్పుడు మళ్లీ కార్మిక ఆశలు, ఆకాంక్షలు, ప్రయోజనాలతో కూడిన భౌతికవాద గతితర్క దృక్పథం మరోసారి భావజాలంగా సమాజంలోని ఇతర అణగారినవర్గాల, అస్తిత్వాల ఆశలు, ఆకాంక్షలను కలుపుకుని ఒక ఉమ్మడి అజెండాతో బూర్జువా పాలక వర్గ భావజాలంతో తలపడేందుకు ముందుకొచ్చింది. సామాజిక వ్యవస్థలో అట్టడుగు పొరల్లోని కార్మికవర్గ విముక్తి క్రమంలో సమాజంలోని మిగిలిన అణగారినవర్గాలు, అస్తిత్వాలపై సాగుతున్న అణచివేతకు చరమగీతం పాడేందుకు అవకాశం లభిస్తుంది.

గడచిన సామాజిక విప్లవాల్లో సామాజిక విప్లవానికి నాయకత్వం వహించే భవిష్యత్ పాలకవర్గ ప్రయోజనాలతో కూడుకున్న భావజాలం 'భ్రమాత్మక విశ్వజనీనత'గా ఉంటూ సమాజంలోని మిగిలిన వర్గాలను వంచనకు గురిచేసింది. ఈ నేపథ్యంలో బూర్జువా విప్లవం వరకు చారిత్రకంగా భిన్న చారిత్రక పరిస్థితుల్లో ముందుకొచ్చిన విప్లవ భావజాలాలు భవిష్యత్ అల్ప సంఖ్యాక పాలక వర్గాల ప్రయోజనాలను

విశ్వజనీనం చేసి, సమాజంలోని మిగిలిన అణగారిన వర్గాల ప్రజలను భ్రమింపచేశాయి. కాబట్టి వాటన్నిటినీ మార్మిక భావజాలాలుగా పరిగణించాలి. దోపిడీ పాలకవర్గాలు ఎప్పుడూ తమ విశిష్ట ప్రయోజనాన్ని సార్వజనీనమైనదిగా ప్రదర్శిస్తాయి. అంటే తమ సొంత భావజాలానికి వర్గాతీతమైన సార్వజనిక ప్రాముఖ్యం ఆపాదింపజూస్తాయి. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, అహింస, ప్రపంచ శాంతి, లౌకికవాదం, మత సామరస్యం, మానవ ప్రవృత్తి, ఉగ్రవాద నిర్మూలన వంటి నినాదాలు అలాంటివే.

అయితే చివరిగా చారిత్రక రంగంలో నాయకత్వ పాత్ర వహిస్తూ ముందుకొచ్చిన కార్మిక వర్గ భావజాలం వాస్తవిక విశ్వజనీనతను సంతరించుకుంటుంది. కాబట్టి కార్మిక వర్గ భావజాల ఆయుధమైన భౌతికవాద గతితర్క దృక్పథం మిగిలిన అన్ని వర్గాల ప్రజల విముక్తికి దోహదం చేస్తుంది. కార్మిక వర్గ భావజాలం ఆ రకంగా శాస్త్రీయమైనదిగా చారిత్రక పాత్ర నిర్వహిస్తుంది. భావజాలం తప్పుడుదైనా, శాస్త్రీయమైనదైనా రెండిటికీ మూల సూత్రమొక్కటే. సామాజిక పరిణామంలో ఒకానొక నాయకత్వ వర్గపు ఆశలు, ఆకాంక్షలు, ప్రయోజనాలను అజ్ఞాత అజెండాగా చేసి, దాని కేంద్రంగా సమాజంలోని ఇతర వర్గాలను, అస్తిత్వాలను సంఘటితం చేసేందుకు ఉమ్మడి ఎజెండాతో ప్రతిపాదించిన నినాదాలు, లక్ష్యాలు, సిద్ధాంతాలను భావజాలంగా పిలుస్తారు. కార్మిక వర్గ భావజాలం మానవజాతి విముక్తికి నాయకత్వం వహించే ఆత్మిక సాధనంగా చారిత్రక రంగంపైకి రానంతవరకూ కొనసాగిన భావజాలమంతటినీ మార్మిక భావజాలంగా పరిగణించాలి. ఈ నేపథ్యంలో మార్క్స్ రాసిన 'జర్మన్ ఐడియాలజీ'ని 'జర్మన్ మార్మికత'గా అనువదించాలి.

ఉపరితల (భావజాల) అంశాల సాపేక్ష స్వతంత్రత

శారీరక శ్రమ నుంచి మానసిక శ్రమ వేరుపడినందువలన, శ్రమ విభజన మూలంగా మానసిక శ్రమకు సంబంధించిన వాళ్లు ఆలోచనను మనస్సు స్వతంత్ర కార్యకలాపంగా భావిస్తారు. దాంతో అనేక భావాలు వ్యక్తి అంతర్గతంగానో లేక తమ ముందుతరం వారి నుంచి మాత్రమే ఉద్భవిస్తున్నట్లు భావిస్తారు. ప్రపంచ అభివృద్ధి క్రమానికి చెందిన నిజమైన చోదక శక్తులు గురించి ఏ మాత్రం ఎరుక లేని ఆలోచనాపరుడు తప్పుడు చైతన్యాన్ని నిజమైన చైతన్యంగా స్వీకరించే క్రమమే భావజాలం. ఆలోచనల నుంచి ఆలోచనలు ఉద్భవిస్తాయనే ధ్యాసలో అతను ఉంటాడు. శుద్ధ ఆలోచనా అంశాల మీద ఆధారపడి అతను సత్యాన్వేషణ చేస్తాడు. భావాల నుంచే కార్యాచరణంతా నడుస్తుందనే భ్రమలో సమాజ పరిణామాన్ని అంచనా వేసేందుకు ప్రయత్నిస్తాడు. వీరిని భావజాలకర్తలుగా పిలుస్తారు. వారు సామాజిక చరిత్ర గమనాన్ని భావాల పరిణామంగా పరిగణిస్తారు. చైతన్యానికీ, ప్రపంచ భౌతిక వాస్తవికతకూ మధ్య గల సంబంధాన్ని అర్థం చేసుకోవలసిన అగత్యం వారికి కనపడదు. సామాజిక చైతన్యం అభివృద్ధి ఇకెంతమాత్రమూ భౌతికంగా నిర్ణీతమైన అనుమేయ అంశంగా, మొత్తం సామాజిక చారిత్రక క్రమంలో ఒక సాపేక్ష సత్యంగా వారికి కనిపించదు. చరిత్ర గతిని నడిపించే పరమ స్వతంత్ర క్రమంగా భావజాల రంగాలు కనిపిస్తాయి. దాంతో ఉపరితల అంశాలైన రాజకీయ, న్యాయ, తాత్విక, మత, చట్టాలు వగైరా ఉపరితల అంశాలకు స్వతంత్ర చలనం, కొనసాగింపు (అనుస్యూతి) ఉన్నట్లు చారిత్రక భావజాల కర్తలు భావిస్తారు. ఈ క్రమంలో ఉపరితల అంశాల సాపేక్ష స్వాతంత్ర్యత పరమమైన అంశంగా ఆ భావజాలకర్తలకు కనిపిస్తుంది.

అదే కోవలో తెలుగు గడ్డపై మార్క్సిస్టు మేధావిగా నీరాజనాలందుకున్న బాలగోపాల్ సాహిత్యం, పౌరహక్కులు తదితర ఉపరితల అంశాలైన భావజాల రంగాలకు సాపేక్ష స్వాతంత్ర్యత ఉందని నొక్కి చెప్పే క్రమంలో పరమ స్వాతంత్ర్యం ఉందనే భావనలోకి లోతుగా కూరుకపోయి, ఆ క్రమంలో భావవాద చారిత్రకుడిగా, చారిత్రక భావజాలకర్తగా తాను మిగలడమే కాక, మార్క్సిస్టు క్లాసిక్స్ ఏనాడూ చదవడానికి సిద్ధపడకుండా, కేవలం సభలు, సమావేశాలు, క్లాసుల్లో నుంచి మాత్రమే ప్రధానంగా మార్క్సిజాన్ని నేర్చుకునేందుకు ఇష్టపడే తెలుగు విద్యావంతులను ఆయన తీవ్ర గందరగోళానికి గురిచేశాడు.

ప్రకృతిలోని సహజ సిద్ధ పదార్థాలకు స్వతంత్ర పరిణామం ఉంటుంది గానీ, వాటిని మానవీకరించడం ద్వారా తయారైన వస్తువులకు సొంత పరిణామం ఉండదు. అలాగే సమాజ పాదార్థిక సంబంధాల్లో జరుగుతున్న వాస్తవ పరిణామం ప్రేరణతోనే దాని ప్రతిఫలనమైన భావజాల క్రమం పరిణామం చెందుతుంది. ఇనుము నుంచి తయారు చేసిన తుపాకీ నియమాలు, ధర్మాలు వేర్వేరు కావచ్చు. తుపాకీ నియమాలు, ధర్మాలు అంతిమంగా ఇనుము ధర్మాలకు లోబడే ఉంటాయి గానీ అతీతంగా ఉండవు గదా! అయితే ఇనుము ధర్మాలు, తుపాకీ ధర్మాలు వేర్వేరు అయినప్పటికీ, వాటి మధ్యగల సాపేక్ష స్వాతంత్ర్యత పరమమైనది కాదు. అలాగే సమాజ పాదార్థిక సంబంధాలకు అనుమేయంగా (ఊహింపదగినది... కచ్చితంగా దానికదే ఏర్పడుతుందని కాదు) ఉపరితల అంశాలు, భావజాల రంగాలు ఆవిర్భవించినంత మాత్రాన అవి అస్వతంత్ర రంగాలుగా కొనసాగవు. ఇనుము-తుపాకీల మధ్య గల సంబంధం వలె... పునాది-ఉపరితల అంశాల మధ్య గత తార్కిక సాపేక్ష స్వాతంత్రత ఉనికిలో ఉంటుంది.

అదే సమయంలో భావజాలం కొనసాగింపు ముందు తరాల ఆధ్యాత్మిక వారసత్వంగా కాక, పాదార్థిక సామాజిక సంబంధాల ప్రతిఫలనంగా కొనసాగుతుంది. 'అవిచ్ఛిన్న ప్రవాహం'లా కొనసాగే ప్రపంచ పరిణామంతో ముడిపడిన భావజాల కొనసాగింపు క్రమం ఒక విచ్ఛిన్న ప్రవాహం'లా సాగుతుంది. "విచ్ఛిన్న ప్రవాహం'లా ఉన్న భావజాల కొనసాగింపును అదే మార్మిక పరిమితుల్లో 'భవజాల' (విశ్వ) కొనసాగింపుగా బుద్ధుడు అర్థం చేసుకొని సిద్ధాంతీకరించారు. మానవ కార్యాచరణ అవసరాలపై ఆధారపడి జ్ఞానాభివృద్ధి క్రమం సాగుతుంది. శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ఆచరణ అవసరాలను తీర్చడంలో లభ్యమైన వస్తుగత జ్ఞానాన్ని తోసిపుచ్చడం ద్వారా కాక, దాని మీద ఆధార పడడం ద్వారా, దానిని ఆచరణలో పుటం పెట్టి అభివృద్ధి చేయడం ద్వారా, ప్రగాఢ పరచడం ద్వారా పురోగమిస్తుంది. వస్తుగత జ్ఞానానంతటినీ ఆచరణ కొలిమిలో పుటం పెట్టి అభివృద్ధి చేస్తున్న ప్రజ్ఞాన క్రమానికి (సిద్ధాంత కృషి) భిన్నంగా... భావాల సంపదను నిలుపుకోవడమూ, అందులో ఏది సమకాలీన పాలకవర్గానికి ఉపయుక్తంగా ఉంటుందో, యుగ పరిస్థితులకు అనుకూలమో దాన్ని మాత్రమే తమకు అనుకూలంగా ఉపయోగించుకోవడమనేది భావజాల కొనసాగింపు క్రమంగా ఉంటుంది.

(ఇంకా ఉంది)

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

డేవిడ్ హార్వే : పెట్టుబడి - ప్రాథమిక వైరుధ్యాలు - 2

పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని పదిహేడు అంతర్ వైరుధ్యాల వల్ల పతనం దిశగా పయనిస్తుందని డేవిడ్ హార్వే చేసిన విశ్లేషణలోని ఏడు ప్రాథమిక వైరుధ్యాలను వివరిస్తున్నారు **రమేష్ పట్నాయక్**

వైరుధ్యం 2

భాగం 1

విలువకు కొలమానం : బంగారపు నాణాలు ఒక సార్వత్రిక మారకపు విలువగానే కాక మరి రెండు ప్రధానమైన ఆర్థిక లావాదేవీలకు పనికి వచ్చాయి. వీటిని వరుసగా చెప్పుకుందాం. బంగారు నాణాలు వచ్చినతరువాత, సరుకుల విలువలకు యూనిట్లు ఏర్పడినాయి. అదెలా అంటే, భారాలను గ్రాములలో లేదా కిలో గ్రాములలో కొలుస్తాము. పొడవును మీటర్లలో లేదా కిలో మీటర్లలో కొలుస్తాము. కాలాన్ని సెకెనులలో లేదా గంటలలో కొలుస్తాము. మరి సరుకుల విలువలను ఎందులో కొలవాలి? బంగారపు నాణాలు లేని కాలంలో ఒక సరుకు విలువను వేరొక సరుకు తూకంలో లేదా కొలతలో చూడవలసి వచ్చేది. ఇంతకు ముందు మనం చెప్పుకున్న ఉదాహరణలో 5 బుట్టల విలువ 3 కుండలు. బంగారం నాణాలు వచ్చిన తరువాత అన్ని సరుకుల విలువలు బంగారు నాణాలు, బంగారు తూకాలలో చెప్పవచ్చు. బంగారు నాణాలు లేకముందు అన్ని సరుకుల విలువలను ఒకే ఒక్క సరుకులో చూపించడం సాధ్యం అయ్యేది కాదు. ఇప్పుడు విలువకు బంగారు నాణం ఒక యూనిట్‌గా మారింది. ఇప్పుడు 5 బుట్టల విలువ తులంలో వందవ భాగమని అలాగే 3 కుండల విలువ తులంలో వందవ భాగమని, అంటే ఏదో కొంత బంగారపు కొలతగా చెప్పవచ్చు. మరొక విషయం: మారకం చేయనప్పుడు కూడా విలువలను కొలవడం అవసరం కావచ్చు. ఇక్కడ ఒక ఉదాహరణ చూద్దాం. బంగారం మారకపు సరుకుగా ఉన్న రోజులలో ఒక వ్యాపారి బ్యాంకరు వద్దకు అప్పుకు వెళతాడు. బ్యాంకరు హామీ చూపించమంటాడు. వ్యాపారి తనకు ఉన్న భవంతిని హామీగా చూపిస్తాడు. ఆ భవంతి విలువలో 80 శాతం అప్పుగా ఇవ్వడానికి బ్యాంకరు సిద్ధపడి ఉన్నాడు. అయితే భవంతి విలువ తెలియకుండా అది సాధ్యంకాదు. భవంతి విలువ ముందుగా అంచనా వేయవలసి ఉంటుంది. ఆ భవంతి విలువ 10 తులాల బంగారం అని అంచనాకు వస్తే 8 తులాల బంగారం అప్పుగా ఇస్తాడు. నిజానికి ఇక్కడ భవంతి కొనుగోలు లేక అమ్మకాలు జరగడం లేదు. మారకం జరగడం లేదు. అయినా భవంతి విలువ బంగారం యూనిట్లలో తెలుసుకోవలసి వచ్చింది. అందుకే బంగారపు నాణాలు సార్వత్రిక మారకపు విలువగా, విలువల కొలత యూనిట్లుగా, కొలతభావం విస్తరణలో విలువల అంచనాగా ఉపయోగపడతాయి. 'విలువ నిలువ' దాని మూడవ ఉపయోగం.

విలువ నిలువ : బంగారు నాణాలు విలువ యొక్క నిలువ (స్టోర్ ఆఫ్ వాల్యూ)గా, అంటే విలువను నిలువ ఉంచుకోవడానికి కూడా పనిచేస్తాయి. మనం కాగితపు నోట్లులేని కాలాన్ని పరిశీలిస్తున్నాం అన్న విషయం మరచిపోకూడదు. ఒక భూస్వామి కౌలు వసూలు ద్వారా లేదా వెట్టిద్వారా తాను ఉత్పత్తి చేసిన వస్తు సముదాయాన్ని సంవత్సరాల తరబడి ఎత్తిపెట్టలేడు. అంటే వాటి విలువలను యథాతథంగా నిలువ ఉంచలేడు. ఒక సంవత్సరంలో తనకు వచ్చిన రాబడి (వస్తు సముదాయం)లో అన్ని ఖర్చులు చెల్లింపులు, రాజుగారికి పన్నులు పోయిన తరువాత ఇంకా తనవద్ద మిగిలిన వస్తు రాసులను వ్యాపారికి అమ్మి బంగారు నాణాలు పొందుతాడు. ఈ బంగారు నాణాలు తన చరాస్తిగా ఉంటాయి. ఈ నాణాలను ఇచ్చి భవిష్యత్‌లో ఎప్పుడైనా తనకు కావలసిన సరుకులను కొనుగోలు చేయవచ్చు. తనవద్ద మిగిలిన సరుకుల స్థానంలో బంగారు నాణాలు వచ్చాయి. మిగిలిన సరుకులను అమ్మకుండా యథాతథంగా వచ్చే సంవత్సరం వరకు ఉంచాలంటే చాలావరకు పాడైపోతాయి. వాటిని అమ్మి బంగారు నాణాలు తీసుకుంటే, బంగారు నాణాలు ఎన్ని సంవత్సరాలైనా పాడుకావు. వాటి విలువ తగ్గదు. ఎన్నాళ్ల తరువాతనైనా ఏ సరుకులు కావాలంటే ఆ సరుకులను కొనుగోలు చేయవచ్చు. తీర్థయాత్రలకు లేదా వినోద యాత్రలకు పోయినా వాటిని తీసుకుపోవచ్చు. మరో పట్టణంలో అక్కడ ఉపయోగం కొరకు సరుకులు కొనుగోలు చేయవచ్చు. అంటే బంగారు నాణాలను మరొక కాలంలో మరొక స్థలంలో మారకపు విలువగా ఉపయోగించవచ్చు. అంటే, బంగారు నాణాలు 'విలువల నిలువలుగా' ఉపయోగపడుతున్నాయి. ఇదే మూడవ ఉపయోగం. విలువలను నిలువచేయగల సదుపాయం ఏర్పడడం వలన వ్యవస్థలో పెద్ద సంక్షోభం పుట్టుకువస్తుందని అంటాడు డేవిడ్ హార్వే. విలువల నిలువలను అసాధ్యం చేయడమే పరిష్కారం అంటాడు. ఈ విషయాన్ని తరువాత చర్చిద్దాం.

మారకపు మాధ్యమంగా కాగితపు నోట్లు : ఇప్పుడు క్లుప్తంగా కాగితపు నోట్లు మారకపు మాధ్యమంగా మారిన క్రమాన్ని గమనిద్దాం. ఐరోపాలో జరిగిన క్రమాన్ని ఇక్కడ మనం పరిశీలిస్తున్నాం. ఒక వ్యక్తి తన వద్ద ఉన్న తులం బంగారాన్ని ఒక బంగారపు షరాబుకు ఇస్తాడు. ఆ వ్యక్తి తనవద్ద తులం బంగారం డిపాజిట్ చేసాడని ఒక కాగితంపై రాసి సంతకంచేసి ఆ వ్యక్తికి షరాబు ఇస్తాడు. ఆ వ్యక్తిగాని మరొక వ్యక్తిగాని ఆ షరాబుకు తిరిగి ఆ కాగితం ముక్క ఇచ్చినప్పుడు షరాబు ఆ వ్యక్తికి తులం బంగారం ఇవ్వవలసి ఉంటుంది. సంతకం పెట్టిన సదరు కాగితం ముక్క ఒక హామీ పత్రంగా ఉంటుంది. ఈ హామీ పత్రం ఎలా ఉపయోగపడుతుందో చూద్దాం. ఒక పట్టణంలో ఒక వ్యాపారి తులం బంగారం షరాబుకిచ్చి హామీ పత్రం తీసుకుంటాడు. ఆ హామీ పత్రంతో రెండవ పట్టణానికి వెళ్లి రెండవ వ్యాపారికి దాన్ని ఇచ్చి ఆ పట్టణంలో తక్కువ ధరకు లభ్యమయ్యే సరుకులు కొనుక్కుంటాడు. ఆ హామీ పత్రాన్ని

తీసుకున్న రెండవ పట్టణంలో ఉన్న రెండవ వ్యాపారి దానిని తీసుకుని మూడవ పట్టణానికి వెళ్లి అక్కడ ఉన్న మూడవ వ్యాపారికి దాన్ని ఇచ్చి ఆ పట్టణంలో తక్కువ ధరకు లభ్యమయ్యే సరుకులు కొంటాడు. మూడవ పట్టణంలో ఉన్న మూడవ వ్యాపారి మొదటి పట్టణానికి సరకులు కొనడానికి వస్తాడు. అక్కడ షరాబుకు సదరు హామీ పత్రాన్ని ఇచ్చి బంగారం తీసుకుంటాడు, మొదటి పట్టణంలో తక్కువ ధరకు లభ్యమయ్యే సరుకులు కొనుగోలుచేసి వెళతాడు. ఈ ముగ్గురు వ్యాపారులు ఈ హామీ పత్రంవలన ఎంతో ప్రయోజనం పొందారు. బంగారం పట్టుకొని తిరగడం కంటే హామీ పత్రం పట్టుకుని తిరగడం సులభం, భద్రం కదా! అయితే షరాబు ఈ వ్యవహారంలో ఎందుకు పాల్గొన్నాడు అనే ప్రశ్న రావచ్చు. హామీ పత్రం విడుదల చేసినందుకు షరాబుకు ఏదేని కమీషన్ ముట్టి ఉండవచ్చు. అది ఇక్కడ అప్రస్తుతం. ఇక్కడ ప్రధానమైన విషయమేమంటే సదరు హామీ పత్రాన్ని మూడు పట్టణాలలో ఉన్న వ్యాపారులు గుర్తించడం కనిపిస్తుంది. హామీ పత్రాన్ని ఏ వ్యాపారి తిరిగి ఇచ్చినా షరాబు బంగారాన్ని తిరిగి ఇస్తాడు. ఇది షరాబుపైన ఆయన ఇచ్చిన హామీ పత్రంపైన ఉన్న నమ్మకం మాత్రమే కాదు. షరాబు మోసంచేస్తే వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేస్తాడు. పోలీసులు షరాబుచేత బంగారాన్ని కక్కిస్తారు. అంటే కాగితం ముక్కకు షరాబు సంతకంతో విలువ వచ్చింది. అంతిమంగా చెప్పాలంటే ప్రభుత్వ శాసన బలంతో విలువ వచ్చింది. కొంతకాలం గడచిన తరువాత ప్రభుత్వమే తన వద్ద ఉన్న బంగారం నిల్వలకు సమానమైన విలువగల కరెన్సీ నోట్లు ముద్రించి చెలామణిలో పెట్టడం ప్రారంభించింది. ఇంకా ముందుకు పోయి తన వద్ద ఉన్న బంగారం నిల్వలకు సంబంధం లేకుండా ప్రభుత్వాలు నోట్లు ముద్రించడం జరిగింది. ముద్రించిన నోట్లు విలువకు ప్రభుత్వం హామీగా ఉంటుంది కాబట్టి ఆయాదేశాలలో ప్రభుత్వం ముద్రించిన కాగితం నోట్లకు మారకపు విలువ ఉంటుంది. మరొక దేశానికి పోతే ఆ నోట్లు చెల్లవు. ఆ రెండు దేశాల మధ్య ఉన్న సంబంధాల ప్రకారం నోట్లు మార్పిడి చేసుకుని వాడుకోవలసి వస్తుంది.

ఫియట్ మని : బంగారం మారకపు విలువగా ఉన్నప్పుడు నాణెంపై ఎంతవిలువ ఉందో, అందులో బంగారం విలువ కూడా అంతే ఉండేది. అంటే ముఖవిలువ వస్తువు విలువకు సమానం అన్న మాట. అయితే కొన్నాళ్ల తరువాత, ప్రభుత్వాలు ముఖవిలువ కంటే తక్కువ విలువ బంగారం తూకం కల నాణాలను ముద్రించడం ప్రారంభించాయి. కాగితపు నోట్ల ముద్రణతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వ శాసనహామీ ఫలితంగా దానికి విలువ ఉంటుంది గాని లేకపోతే అది ఒక కాగితం ముక్క మాత్రమే. రెండు కిలోల బియ్యం ఒక వంద రూపాయిలు అనుకుందాం. రెండు కిలోల బియ్యం తీసుకుని వంద రూపాయిలు ఇస్తాం. రెండు కిలోల బియ్యంలో వంద రూపాయిల సామాజిక శ్రమ ఉంటుంది. కాని 100 రూపాయిల నోటులో 10 పైసల సామాజిక శ్రమకూడా ఉండదు. మరల వంద రూపాయిలు తీసుకున్న వ్యక్తి దానినిచ్చి 1 కె.జి. కందిబేడలు కొనవచ్చు. అంటే రెండు కె.జి.ల బియ్యం స్థానంలో ఒక కె.జి కంది బేడలు వచ్చాయి. రెండు కె.జి.ల బియ్యంలో ఎంత సామాజిక శ్రమ ఉందో ఒక కె.జి కందిబేడలలో అంతే సామాజిక శ్రమ ఉంది. ఈ అర్థంలో సమాన సామాజిక విలువల మధ్యనే మారకం జరిగింది. సమాన సామాజిక శ్రమ కలిగిన రెండు సరకుల మధ్య సుమారు సామాజిక శ్రమ ఏమీలేని కాగితపు నోట్లు మారకపు మాధ్యమంగా రావడం ఒక వైరుధ్యమవుతుంది. డేవిడ్ హార్వే 'వైరుధ్యం 2'కు పెట్టిన శీర్షిక 'శ్రమ సామాజిక విలువ, డబ్బుచే దాని వ్యక్తీకరణల మధ్య వైరుధ్యం' అన్న విషయాన్ని ఇప్పుడు చర్చిద్దాం. డబ్బు బంగారం రూపంలో ఉన్నా లేదా కాగితం రూపంలో ఉన్నా సార్వత్రిక మారకపు విలువగా మాత్రమే పనిచేయలేదు, అంటే డబ్బు ఇంకా మరికొన్ని విధులు నిర్వహిస్తుంది. ప్రధానంగా ఈ డబ్బు 'విలువ నిలువ'గా కూడా పనిచేయడం వలన అనేక వైరుధ్యాలు పుట్టుకువస్తున్నాయి. ప్రభుత్వం తన వద్ద ఉన్న బంగారు నిలువలకు సంబంధం లేకుండా ఊరకే ఆదేశానుసారం నోట్లను ముద్రించే విధానం, ఫియట్ మని విధానం రావడంతో సమస్య మరింత జటిలం అయింది.

భాగం 2

శ్రమ సామాజిక విలువ, డబ్బుచే దాని వ్యక్తీకరణల మధ్య వైరుధ్యం : శ్రమ సామాజిక విలువ, డబ్బుచే దాని వ్యక్తీకరణల మధ్య వైరుధ్యం అనే రెండవ ప్రాథమిక వైరుధ్యం గురించిన పరిచయాన్ని మనం గత సంచికలో భాగం 1గా ప్రారంభించాం. అందులో మిగిలిన భాగంతో పాటు ఈ సంచికలో భాగం 2గా దానిని పూర్తిచేద్దాం. తరువాత సంచికలలో వైరుధ్యం 3 గురించిన పరిచయం ఉంటుంది. అదే ఒరవడి కొనసాగుతుంది.

అదనపు నోట్ల ముద్రణ : ఉదాహరణకు ఒకానొక ఆర్థిక సంవత్సరంలో మన కేంద్ర ప్రభుత్వ అంచనా ఆదాయం 15 లక్షల కోట్ల రూపాయిలు, అంచనా వ్యయం 18 లక్షల కోట్లు రూపాయిలు అనుకుందాం. అంటే మూడు లక్షల కోట్ల రూపాయలు లోటు బడ్జెట్ అన్న మాట. రెండు లక్షల కోట్ల రూపాయిలు కొత్తగా అప్పుచేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ప్రైవేటు సంస్థల నుంచి కావచ్చు లేదా పోస్టల్, ఎల్.ఐ.సి వంటి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి కావచ్చు. రెండు లక్షల కోట్లు అప్పుచేసినా ఇంకా ఒక లక్ష కోట్ల రూపాయిలు లోటు ఉంటుంది. ఈ పరిస్థితులలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అదేమంటే ప్రభుత్వం ఒక లక్ష కోట్ల రూపాయిలను అదనంగా ముద్రించడం. అదనంగా ముద్రించడం అంటే ఏమిటి? ప్రతి దేశంలో ప్రతి సంవత్సరంలో వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తి, సేవారంగాలు అభివృద్ధిచెందుతూ ఉంటాయి. ఆయా పరిస్థితులను బట్టి అభివృద్ధి రేటు ఎక్కువగానూ లేదా తక్కువగానూ ఉంటుంది. సంక్షోభ సమయాలలో వృద్ధిరేటు ఋణాత్మకంగానూ ఉండవచ్చు. ప్రతి సంవత్సరం ఉత్పత్తులు, సేవలు పెరిగినప్పుడు వాటి మారకం కొరకు అదనంగా డబ్బు చలామణిలోనికి రావలసి ఉంటుంది. ఆర్థికాభివృద్ధి రేటును దృష్టిలో ఉంచుకుని ఆ సంవత్సరం అదనంగా జరిగిన వస్తుసేవల మొత్తం విలువను బట్టి సాపేక్షంగా (సమానంగా కాదు) నోట్లను ముద్రిస్తారు. అవి పాత నోట్లతో కలసి చలామణిలో ఉంటాయి. పాత నోట్లలో చినిగిపోయిన లేదా పాడయిపోయిన నోట్ల స్థానంలో కొత్త నోట్లు ప్రింటు చేస్తారు. ఈ రెండు కారణాల వలననే గాక రిజర్వుగా కూడా కొన్ని నోట్లను ముద్రిస్తారు. ఈ మొత్తం నోట్లను రిజర్వుబ్యాంకు తన బ్రాంచీల ద్వారా చలామణిలోనికి తీసుకువస్తుంది. అప్పుడు దేశంలో చలామణిలో ఉన్న వస్తుసేవల విలువ మొత్తం నోట్ల ముఖ విలువకు ఒకానొక నిష్పత్తిలో

(నోట్లు చేతులు మారే వేగానికి విలోమంగా) ఉంటాయి. నోట్ల చలామణి నిర్దిష్ట సాపేక్షతలో ఉన్నప్పుడు సరుకుల ధర స్థిరంగా ఉంటుంది. నోట్ల చలామణి పెంచితే ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. నోట్ల చలామణి తగ్గితే ప్రతి ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది.

అదనపు నోట్ల ముద్రణ, ద్రవ్యోల్బణం వంటి విషయాలను దృష్టిలో పెట్టుకుని ఈ రెండవ అధ్యాయంలో మనం చర్చిస్తున్న విషయం 'సామాజిక శ్రమ విలువ, డబ్బుచే దాని వ్యక్తీకరణల మధ్య వైరుధ్యం' అన్న విషయంపై దృష్టి కేంద్రీకరిద్దాం. వస్తు మార్పిడి పద్ధతి అమలులో ఉన్నప్పుడు వ్యక్తుల మధ్య సామాజిక శ్రమ విలువలు ఆయా వ్యక్తులు తయారుచేసిన సరుకుల రూపంలో ఉదాహరణకు కుండగా లేదా మేదర బుట్టగా వ్యక్తీకరణ పొంది మార్పిడి పొందేవి. అది సామాజిక శ్రమ విలువల ప్రత్యక్ష పరస్పర మార్పిడిగా ఉండేది. బంగారం, వెండి మారకపు సరుకుగా వచ్చినప్పుడు వస్తువులో నిబిడీకృతమైన సామాజిక శ్రమ బంగారంలో నిబిడీకృతమైన సామాజిక శ్రమతో మారకం జరగడం గమనిస్తాం. అయితే ఈ సందర్భంలో ఉత్పత్తిదారుల మధ్య మారకం జరగడం ఉండదు. ఉత్పత్తి దారుడికి, వినియోగ దారుడికి మధ్యలో బంగారం విషయంలో అయితే గని యజమాని, వ్యాపారుల గొలుసు ఉంటుంది. అలాగే ప్రతి సరుకు విషయంలో కూడా. ఫలితంగా సరుకులు శ్రమ రూపాలుగా కాక మాయా రూపాలుగా కనిపిస్తాయి. పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధి క్రమంలో డబ్బుగా బంగారం చలామణి స్థానంలో కాగితపు నోట్లు చలామణిలోనికి వచ్చాయి. నిజానికి కాగితపు నోట్లు తయారుచేయడానికి అవసరమైన సామాజిక శ్రమ చాలా స్వల్పమైనది. శ్రమ రూపాలైన సరుకులు ఒకవైపు, శ్రమ సుమారు అవసరం లేని కాగితపు నోట్లు మరొకవైపు మారకంలో పాల్గొంటాయి. దీనితో వస్తువులు మరింత మాయా వస్తువులుగా మారిపోయాయి. శ్రమలేని డబ్బు పెట్టి కొన్నప్పుడు, సరుకులో శ్రమను గుర్తించడం మరింత కష్టసాధ్యమయిపోయింది. శ్రమ రూపాలైన సరుకులు నామమాత్రపు శ్రమ మాత్రమే కలిగిన కాగితపు నోట్లతో మారకం పొందడం ఒక పెద్ద వైరుధ్యానికి దారి తీసింది.

మనం గత కొన్ని పేరాలలో కాగితం నోట్లు ఉనికిలోనికి రావడం, ప్రభుత్వ ఆదేశానుసారం ముద్రించబడడం వంటి విషయాలను పరిశీలించాం. ఇదంతా పెట్టుబడిదారీ వ్యవస్థలోనే జరుగుతుంది కదా. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుడు పెట్టుబడిదారునికి తమ శ్రమతో తయారయిన వస్తువులను అమ్మడు. ఎనిమిది గంటలు పనిచేయడానికి లేదా 10, 12 గంటలు పనిచేయడానికి తన శ్రమ శక్తిని అమ్ముతాడు. పెట్టుబడిదారుడు శ్రామికునిచే పనిచేయించుకుని రోజువారీ, వారంవారీ లేదా నెలవారీ వేతనం చెల్లిస్తాడు. తయారైన వస్తువు శ్రామికుని అంటే ఉత్పత్తిదారుని స్వంతం కాదు. అది పెట్టుబడిదారుని స్వంతం అవుతుంది. పెట్టుబడిదారుడు దానిని వ్యాపారికి అమ్ముతాడు. వ్యాపారి దానిని వినియోగదారులకు అమ్ముతాడు. వినియోగదారుడు డబ్బు ఇచ్చి సరుకు కొనుగోలు చేస్తున్నాడు. ఈ వినియోగదారుడు వస్తువులో శ్రమ ఉంది అనుకోడు. వస్తువు శ్రమ ఫలితంగా తయారయ్యింది అనుకోడు. సరుకులో ఉన్న ఉపయోగపు విలువ దాని స్వయంభూతమైన విలువగా భావిస్తాడు. తన ధనానికి సరుకును పొందే మహత్తు ఉందని భావిస్తాడు. ఈ వినియోగదారుడు శ్రామికుడు అయితే వస్తువులో శ్రమను కొంతమేరకైనా గుర్తించగలుగుతాడు. కాని మధ్యతరగతి, పాలక వర్గాలకు చెందినవారు వస్తువులో శ్రమను గుర్తించే అవకాశం ఇంకా తక్కువ. సరుకులో శ్రమ కనిపించడం మానివేస్తుంది. సరుకులు వాటికవే మహత్తరమైనవిగా స్వతః సిద్ధమైన విలువలు గలవిగా భాసిస్తాయి. సమాజంలో సంబంధాలు శ్రమల మధ్య సంబంధాలుగా కనిపించవు. సమాజంలో సంబంధాలు సరుకుల మధ్య సంబంధాలుగా కనిపిస్తాయి. సమాజంలో సంబంధాలు సరుకుల, డబ్బుల, కాగితపునోట్ల సంబంధాలుగా కనిపిస్తాయి. దీనినే సరుకుల మాయా ప్రపంచం అన్నాడు కార్ల్‌మార్క్స్.

సరుకులలో శ్రమ ఉంది అన్న భావన కాగితపు నోట్లు ఇచ్చి కొనుగోలుచేసిన వినియోగదారునికే కాదు పెట్టుబడిదారునికి కూడా ఉండదు. కార్మికునికి వేతనం చెల్లించిన తరువాత వస్తువుకి, శ్రమకు ఉన్న బంధాన్ని ఆయన ఎంతమాత్రమూ గుర్తించడు. వస్తువులో శ్రమ ఉన్న విషయాన్ని పెట్టుబడిదారుడు గుర్తించకపోవడం ఏదో తన వాదన నెగ్గించుకోవడానికి మాత్రమే కాదు. తన అంతరాత్మలో కూడా వస్తువులో శ్రమ ఉందని గుర్తించడు. అంతెందుకు, కార్మికులు కూడా ఈ సమాజంలో ఆర్థిక సంబంధాలన్నీ తమ శ్రమల మధ్య సంబంధాలని గుర్తించరు. వ్యక్తులు వస్తువులను తయారుచేసి మార్పిడిచేసుకునే సరళ సరుకు ఉత్పత్తి విధానం పోయి వ్యక్తులు తమ శ్రమశక్తిని పెట్టుబడిదారునికి అమ్ముకోవడం, పెట్టుబడిదారుడు ఉత్పత్తి నిర్వహించడం, వస్తువుల మధ్య కాగితపు డబ్బు ప్రవేశించడం, మొత్తంగా ఉత్పత్తిదారుల మధ్య సంబంధాల స్థానంలో సరుకుల మధ్య సంబంధం ఏర్పడడం కనిపిస్తున్నది. సరుకులు డబ్బుతో, నోట్ల కట్టలతో వస్తాయి కాబట్టి సామాజిక సంబంధాలు డబ్బుచుట్టూ తిరగడం ప్రారంభించాయి. సరుకుల గురించి, డబ్బుగురించి కొంత పరిచయం చేసుకున్నాం గనుక శ్రమ సామాజిక విలువ (సరుకు), డబ్బుచే దాని వ్యక్తీకరణల మధ్య వైరుధ్యాన్ని అందుకు డేవిడ్ హార్వే ఇచ్చిన వివరణలను ఈ కింది పేరాలలో పరిశీలిద్దాం. డేవిడ్ హార్వే కొటేషన్లను యథాతథంగా అనువదించలేదు. సారభూతమైన అనువాదం చేయడం జరిగింది. అందుకే కొటేషన్లు ఇచ్చినవద్ద " " గుర్తులుకాక ' ' గుర్తులు ఉపయోగించడం జరిగింది. అలాగే స్క్వేర్ బ్రాకెట్ల [ ] లో ఉన్న విషయాలు నేను సందర్భానుసారంగా పాఠకుడి సౌకర్యం కొరకు చేర్చినవి.

డబ్బు ఎ) మారకపు మాధ్యమంగా, బి) అన్ని విలువలను కొలిచే ఒక కొలతగా, సి) విలువను నిలువగా ఉంచడానికి స్థలాంతరంలో, కాలాంతరంలో వాడడానికి ఉపయోగపడుతుందని మనకు తెలుసు. డబ్బు ఆర్థిక, సామాజిక ప్రపంచాన్ని నడిపిస్తున్నట్లు కనిపించే వ్యక్తీకరణ ఏమిటి? అది ఏవిధంగా సామాజిక, రాజకీయ వ్యవహారాలలోనికి, భావాలలోనికి విస్తరిస్తుంది? అని డేవిడ్ హార్వే ప్రశ్నించాడు. తానే సమాధానం చెప్పాడు. 'డబ్బులు ఉంటే సామాజిక శ్రమ రూపమైన ఏ విలువనైనా (వస్తువునైనా) నేను పొందగలను. సామాజిక శ్రమపై డబ్బు ఉన్నవాడికి ఏర్పడే ఆ క్లెయిమ్ డబ్బుయొక్క ఒక ప్రధాన లక్షణం. కుండలు తయారుచేసే శ్రమ కుండగానూ అలాగే బట్టలు తయారుచేసే శ్రమ బట్టగానూ రూపాన్ని పొందుతుంది. కాని అన్ని రకాల సామాజిక శ్రమకు ఒక సాధారణ రూపం అంటూ ఏమీ ఉండదు. 'రూపరహితమైన సామాజిక శ్రమకు' ఒక గుర్తించదగ్గ చిహ్నాన్ని డబ్బు ఇస్తుంది. ఇది

భౌగోళిక ప్రాంతాన్ని మ్యాప్‌లో చూడడం లాంటిది. మ్యాప్ కొంతవరకు మనకు ఉపయోగపడుతుంది. కాని మ్యాప్ నిజమైన ప్రపంచానికి వ్యక్తీకరణ కాదుకదా. అన్ని సింబల్స్ విషయం లాగుననే డబ్బు కూడా అది దేనినైతే వ్యక్తీకరించదలచుకుంటుందో ఆ సామాజిక విలువకు దానికి మధ్య చాలా అంతరం ఉంటుంది. సింబల్‌నే అసలు విషయంగా, డబ్బునే సామాజిక విలువగా, సులభంగా పొరపడవచ్చు. ఏ సరుకులోనూ సామాజిక శ్రమను మనం ప్రత్యక్షంగా చూడలేము. ఆ కారణంగానే సామాజిక శ్రమ లక్షణం గురించి మనకు దృష్టి లోపం ఏర్పడుతుంది. దాని వ్యక్తీకరణ అయిన డబ్బునే సామాజిక శ్రమగా పొరపడతాము.' .....'విలువ [సరుకు రూపం పొందిన శ్రమ] డబ్బుతో వ్యక్తీకరించ బడినప్పుడు ఆ విలువకు డబ్బుకు ఉన్న అంతరం పెట్టుబడి ఒక ప్రధాన వైరుధ్యంగా పొదుకుంటుంది.'

డబ్బు శ్రమ రూపమైన బంగారంగా ఉన్నప్పుడు ఒక విషయం, అయితే అది ఫియట్ మని అయినప్పుడు (బంగారం డిపాజిట్స్‌తో సంబంధంలేకుండా) అందులో ఎటువంటి శ్రమ అంటే ఎటువంటి సామాజిక విలువ ఉండదు కాబట్టి వైరుధ్యం మరింత బలవత్తరం (పొటెన్షియల్) గా ఏర్పడుతుంది. సామాజిక విలువను కొలవడానికి ఉపయోగించే డబ్బు తనకు తానే ఒక సరుకుగా పెట్టుబడి డబ్బుగా అవతారం ఎత్తడం గమనిస్తాం. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో 'డబ్బును మీరు పెట్టుబడిగా పెడితే లాభం వస్తుంది. అప్పిస్తే వడ్డీ వస్తుంది. అంటే ఒక చిహ్నం విలువను సృష్టిస్తున్నట్లు కనిపిస్తుంది.' .... 'ప్రధానంగా 1970లలో అమెరికా ఫెడరల్ రిజర్వ్‌లో బంగారం విలువతో సంబంధం లేకుండా డాలర్లను ముద్రించడం ప్రారంభించిన తరువాత ఎంత డబ్బును అయినా ముద్రించడానికి అవకాశం కలిగింది. ప్రస్తుత కాలంలో ఎన్ని నోట్లనైనా ఎటువంటి సాంకేతిక ఇబ్బంది లేకుండా ముద్రించవచ్చు. ఎందుకంటే చేయవలసిందంతా కంప్యూటర్లలో నెంబర్లు మార్చడం ద్వారా ఖాతా డబ్బును సృష్టించడమే కదా. క్వాంటిటేటివ్ ఈజింగ్ పేరుతో 2008 సంక్షోభంలో అమెరికా లక్షల కోట్ల డాలర్లు ముద్రించి బ్యాంకులను నింపడం మనం గమనించాం. ఇటువంటి చర్య 1920లో జర్మనీలో విపరీతమైన ద్రవ్యోల్బణానికి దారితీసింది.' ఇంతవరకు చెప్పుకున్నట్లు అమెరికా ప్రభుత్వం 2008లో తక్షణ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి లక్ష కోట్ల డాలర్లు ముద్రించడంతో సంక్షోభం పరిష్కారం కాలేదు. అది తక్కువ తీవ్రత కలిగిన దీర్ఘకాల, విస్తృత సంక్షోభంగా మారింది. అమెరికా ప్రభుత్వం లక్ష కోట్లు అదనంగా ముద్రించిన ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలవద్ద, వ్యక్తుల వద్ద ఉన్న డాలర్ నిల్వల విలువలు తగ్గిపోయాయి. డబ్బు బంగారం రూపంలో ఉన్నప్పుడు దాని విలువ ప్రభుత్వం తగ్గించజాలదు. బంగారంలో శ్రమ ఉంది. బంగారానికి స్వతంత్రంగా విలువ ఉంది. ప్రభుత్వం దాని విలువను పెంచలేదు, తగ్గించలేదు. కాగితపు డబ్బుకు స్వంత విలువ ఉండదు. అదనంగా నోట్లు ముద్రిస్తే నోటు విలువ తగ్గి ధరలు పెరుగుతాయి. బంగారం శ్రమతో తయారయినది అయినందున నిజమైన విలువగల డబ్బు. నోట్ల ముద్రణకు పెద్దగా శ్రమ అవసరం ఉండదు. అందుకే నోట్లకు నిజమైన విలువ ఉండదు. నోట్లకు ముఖ విలువ మాత్రమే ఉంటుంది. అందుకే అదనంగా నోట్లు చెలామణిలోనికి వచ్చినప్పుడు నోట్ల విలువ తగ్గి ధరలు పెరుగుతాయి. ఇక్కడ మనం గమనించవలసిన ప్రధాన విషయం ఏమంటే డబ్బు బంగారం రూపంలో ఉన్నప్పుడు దానిని నిలువ ఉంచుకుంటే దాని విలువ తగ్గదు. కాని డబ్బు నోట్ల రూపంలో ఉన్నప్పుడు నిలువ ఉంచుకుంటే ఎప్పుడైనా దానివిలువ పడిపోవచ్చు. నిజానికి డబ్బు అనేది విలువను నిలువ ఉంచడానికి (స్టోర్ ఆఫ్ వాల్యూగా) పనికిరావాలి. కాని నోట్ల రూపంలో ఉన్న డబ్బు విలువ ప్రభుత్వం నిర్ణయంపై ఆధారపడుతుంది. మీరు నిలువ ఉంచుకున్న డబ్బు విలువ తగ్గిపోతే డబ్బుకు విలువ నిలువగా ఉండే లక్షణం భగ్నమైనట్లేకదా. మరి అది ఒక పెద్ద వైరుధ్యమే కదా!

వస్తువుల ధరలు పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయి. అయినా ఒక నిర్దిష్ట మార్కెట్‌లో ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక వస్తువుకు ఒక సరాసరి ధర ఉంటుంది. వస్తువు నిజ ధర ఆ సరాసరి ధరకు రెండువైపులా చలిస్తుంది. సాధారణంగా వస్తువులో ఘనీభవించిన సామాజిక శ్రమ వస్తువు సరాసరి ధరకు సరిపోవాలి. కాని మోనోపలి సంస్థలు తమ బ్రాండుపేరుకు ఉన్న లేదా ప్రచారం ద్వారా కల్పించుకున్న ప్రాచుర్యాన్ని ఉపయోగించుకుని ఇతర ఉత్పత్తుల పోటీని తప్పించుకుని మోనోపలి ధరలకు అంటే అధిక ధరలకు వస్తువులు అమ్ముతాయి. ఈ సందర్భంగా డేవిడ్ హార్వే నైక్ అనే కార్పొరేట్ సంస్థ ఏవిధంగా ప్రచార బలంతో తన సరుకులను అధిక ధరలకు అమ్ముతుందో వివరిస్తాడు. ఈ మోనోపలి సంస్థలు నిరంతరం తమ ఉత్పత్తులలో ఏదో ఒక కొత్త అంశాన్ని ప్రవేశపెట్టి తమ ఉత్పత్తులు సాటిలేనివని చాటుకుంటూ అధిక ధరలకు అమ్ముకుంటాయి. ఈ అదనపు అంశం సరుకుకు ఎంత విలువను చేకూరుస్తుందో అంత అదనపు ధరకు కాదు వారు అమ్మేది. ఇంకా ఎక్కువ అదనపు ధరను వారు వసూలు చేస్తారు. ఇది ఎందుకు సాధ్యమంటే ఇతర కంపెనీలు ఆ అదనపు అంశాన్ని చేర్చి పోటీకి రావడానికి కొంత కాలం పడుతుంది కదా. పోటీ లేనప్పుడు వస్తువు ధర అందులో ఉన్న విలువ కంటే ఎక్కువ ఉండగలుగుతుంది. పోటీ పూర్తిస్థాయిలో ఉన్నప్పుడే సరుకుల విలువలు వాటి నిజమైన విలువకు దరిదాపులలో ఉంటాయన్న విషయం తెలిసిందే. మోనోపలి సంస్థల వారు నిరంతరాయంగా సరుకులకు కొత్త అంశాలు అవసరమైనవి, అవసరం లేనివి కలుపుకుంటూ అధిక ధరలకు తమ సరుకులను అమ్ముకుంటారు. అంటే మోనోపలి సంస్థలు ఉత్పత్తి ప్రక్రియలో కార్మికుడిని దోపిడీ చేయడమేగాక ధరల పోటీని తప్పించివేసి విలువ కంటే అధిక ధరలతో కొనుగోలుదారున్ని కూడా దోపిడీ చేస్తున్నాయి. వస్తువు విలువకు, ధరకు ఉన్న వ్యత్యాసం పెట్టుబడిదారులకు కూడా వ్యవస్థాపరమైన సమస్య కలిగిస్తుందని డేవిడ్ హార్వే చెప్తాడు.

మరికొన్ని ఉదాహరణలలో విలువ సృష్టికి, డబ్బు సంపాదనకు సంబంధం లేకపోవడాన్ని డేవిడ్ హార్వే మనకు చూపిస్తాడు. ఒక వ్యక్తి దొంగచాటుగా ఆయుధాలు అమ్మడం ద్వారా, మత్తు మందులు అమ్మడం ద్వారా, స్త్రీలను మోసగించి, దారి మళ్లించి అమ్మడం ద్వారా డబ్బును సంపాదించవచ్చు. ఇక్కడ ఎటువంటి విలువ సృష్టించబడలేదు. యుద్ధాలలో సామాజిక విలువలను అంటే సరుకులను సృష్టించడం కాదుకదా పెద్ద ఎత్తున ఉత్పాదిత వస్తువుల విధ్వంసం జరుగుతుంది. అయినా యుద్ధ ఖర్చులకు అప్పు ఇచ్చినవారికి ప్రభుత్వాలు ఎక్కువ వడ్డీలు చెల్లిస్తాయి. అంటే విలువను విధ్వంసం చేసికూడా డబ్బును సంపాదించవచ్చు. డేవిడ్ హార్వే ఇంకా ఇలా కొనసాగిస్తాడు. 'డబ్బు

ఉనికి సామాజిక అధికారాన్ని స్వాయత్తం చేసుకోవడానికి, ఉపయోగించు కోవడానికి ప్రైవేటు వ్యక్తులకు అవకాశం కల్పిస్తున్న పరిస్థితి అనేక రూపాలలో విషపూరితమైన డబ్బును సమాజానికి కేంద్ర బిందువుగా చేసింది.' .... 'పెట్టుబడిదారీ వ్యవస్థ రాజకీయ సంస్థలలో ధనం కొరకు అత్యాశ, కాంక్ష ప్రధాన లక్షణాలు కావడం మనం గమనిస్తాము' .... 'డబ్బు ఉనికిలోనికి రావడం దీనిని ప్రైవేటు వ్యక్తులు స్వాయత్తం చేసుకునే పరిస్థితి ఉండడం ఎటువంటి అమానవీయ ప్రవర్తనలకు దారితీస్తుందంటే అవి ఏమైనా కావచ్చుకాని విలువైనవి ఉన్నతమైనవి మాత్రం కావు'.

డబ్బుకు ఉండే మూడు లక్షణాలు ఎ) మారకపు మాధ్యమంగా, బి) అన్ని విలువలను కొలిచే ఒక కొలబద్దగా, సి) విలువను నిలువ ఉంచడానికి స్థలాంతరంలో, కాలాంతరంలో వాడడానికి అని చెప్పుకున్నాం. అయితే మోనోపలి ధరల వలన సరుకులను అధిక ధరలకు కొనవలసి వచ్చినప్పుడు విలువల కొలతగా దాని లక్షణం సంక్షోభంలో పడిపోతుంది. ప్రభుత్వాలు అదనంగా డబ్బును ముద్రించినప్పుడు, ప్రధానంగా అదనంగా ముద్రించిన డబ్బు ఉత్పాదకతను పెంచడానికి ఉపయోగ పడనప్పుడు డబ్బువిలువ సార్వత్రికంగా పడిపోయి విలువ నిలువ సంక్షోభంలో పడిపోతుంది. మరొక్క విషయం: వస్తువిలువల ఉత్పత్తితో సంబంధం లేకుండా తద్విరుద్ధంగా వస్తువిలువల విధ్వంసంతో కూడా పెరుగుతున్న డబ్బును ఎలా ఎదుర్కోవాలి అన్న విషయం ఈ అధ్యాయం చివరలో డేవిడ్ హార్వే చర్చించాడు. హార్వే ప్రతిపాదనలు ఆచరణ సాధ్యంగా కనిపించడం లేదు. అయినా వాటిని సారభూతంగా ఇక్కడ ఉటంకిద్దాం.

'ఒక ఊహాజనిత వ్యవస్థ ['కమ్యూనిస్టు వ్యవస్థ] ఎక్కడైతే మారకపు విలువ ఉండదో అక్కడ మారకపు విలువ మాధ్యమం అయిన డబ్బుకూడా ఉండదు ..... అయితే అటువంటి వ్యవస్థ వచ్చేవరకు ఆగడానికి బదులు డబ్బు స్థానంలో ఒక పాక్షికమైన డబ్బు – ఏదైతే మారకపు మాధ్యమంగా పనిచేస్తుందో కాని విలువల నిలువకు, ఆ విధంగా సామాజిక సంపదను, అధికారాన్ని వ్యక్తిగతంగా సంపాదించుకోవడానికి సాధ్యంకాదో అటువంటి పాక్షిక డబ్బును మధ్యంతరంగా రూపొందించాలి.'

డేవిడ్ హార్వే చెప్పింది విన్నారు కదా. డేవిడ్ హార్వే పైనచేసిన ప్రతిపాదనను మరొక్కసారి చదవండి. ఇందుకు పెట్టుబడిదారులు అంగీకరిస్తారా? పెట్టుబడిదారులు అంగీకరించకుండా ప్రభుత్వం చేయగలుగుతుందా? ఇక కార్మిక రాజ్యం వస్తే ఇంతకన్నా మెరుగైన పరిష్కారాలే ఉంటాయి. మన ప్రశ్నలను ప్రక్కన పెట్టి కీన్స్, సిల్వియో జీసెల్‌ల నుండి డేవిడ్ హార్వే ఉటంకిస్తున్న విషయాలను పరిశీలిద్దాం. '....జె.ఎం.కీన్స్ తన అత్యధిక ప్రభావం కలిగించిన డబ్బు, వడ్డీ, ఉద్యోగితల సార్వత్రిక సిద్ధాంతం అనే పుస్తకంలో అత్యంతగా నిరాదరణకు గురయిన ప్రవక్త సిల్వియో జీసెల్‌ను ఉటంకిస్తాడు. ఉపయోగించకుండా ఉంటే ఆక్సీకరణ చెందే డబ్బు అంటే పాక్షికమైన డబ్బు గురించి సిల్వియో జీసెల్ చేసిన ప్రతిపాదనను కీన్స్ ఉటంకిస్తాడు.....' కీన్స్, జీసెల్‌లను ఉటంకిస్తూ డేవిడ్ హార్వే చేసిన ఆక్సీకరణచెందే డబ్బు గురించిన ప్రతిపాదన పాలక వర్గాలకు అమోదయోగ్యంకానేరదు. ఆ విషయం పక్కన పెడితే ఇప్పుడు అటువంటి డబ్బును సృష్టించడం గతంకంటే సులభంగా సాధించవచ్చు. 'ఎలక్ట్రానిక్ డబ్బులో ఒక ప్రోగ్రాం రాస్తే సరిపోతుంది' అంటాడు డేవిడ్ హార్వే. నిజమే పెట్టుబడిదారులు తలచుకుంటే ఉపయోగించకుండా ఉంటే ఆక్సీకరణచెందే డబ్బును గతం కంటే ఇప్పుడు సులభంగా, ఎలక్రానికల్‌గా సాధించవచ్చు. అప్పుడు డబ్బు పోగుపడే అవకాశం పోతుంది. అయితే పెట్టుబడిదారులు ఎందుకు ఈ పనిచేయడం లేదో మాత్రం హార్వే వివరించలేదు. డేవిడ్ హార్వే దగ్గర నుంచి మార్క్స్ దగ్గరకు వెళదాం. మనకు హార్వే ఊహాజనిత పరిష్కారాలనుండి ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంటుంది. డేవిడ్ హార్వే తన మాటలలో మార్క్స్ అభిప్రాయాలను ఈ కింది ఉటంకింపులో చెప్తున్నాడు. "డబ్బుల వ్యవస్థలో సంస్కరణలు వాటికవే పెట్టుబడి శక్తిని నీరుగార్చలేవు. విప్లవాత్మక మార్పుకు డబ్బు విధానంలో మార్పులు ప్రధానమయినవని నమ్మడం ఒక భ్రమ మాత్రమే". ఈ విధంగా మార్క్స్ భావాలను ఒకవైపు స్పష్టంగా రాస్తూనే డేవిడ్ హార్వే తన ఆలోచనలను తిరిగి చెప్తాడు. 'డబ్బులేని వ్యవస్థను ఊహించడం అంటే ఒక రకంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయాన్ని ఊహించడమే. ఎలక్ట్రానిక్ మనీ నుండి బిట్ కాయిన్ వంటి సైబర్ కరెన్సీవైపు పెట్టుబడి అడుగులు వేస్తోన్న పరిస్థితి. ఈ పరిస్థితిలో వామపక్ష శక్తులు ప్రత్యామ్నాయాలు ఆలోచించడం, దీర్ఘకాలిక లక్ష్యాలవైపు రాజకీయ ఆకాంక్షలను రూపొందించుకోవడం తెలివైన పనికావచ్చు' అంటాడు. బిట్ కాయిన్స్ ఇప్పటికే సంక్షోభంలో పడిన విషయం పాఠకులు గమనించి ఉంటారు. ఇంతకన్నా చెప్పేదేముంది?

ఈ అధ్యాయం చివరలో డేవిడ్ హార్వే ఇలా అంటాడు – 'బంగారం డిపాజిట్ల మేరకే డబ్బును ముద్రించిన కాలంలో డబ్బు ముద్రణకు ఒక పరిమితి ఉండేది. అయితే 1970లలో ఎప్పుడైతే డబ్బు ముద్రణకు బంగారం డిపాజిట్‌లకు లంకె తొలగింపబడిందో, అప్పటినుండి ప్రభుత్వాలు తమ ఇష్టం వచ్చినట్లు [నిజానికి పాలక వర్గ తక్షణ అవసరాలకు] డబ్బు ముద్రించడం ప్రారంభించాయి. ఫలితంగా ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది. 1970 ల చివరికంతా ద్రవ్యోల్బణం బాగా పెరిగినప్పుడు, ప్రధానంగా అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడమే ప్రధాన కర్తవ్యంగా నిర్దేశించుకున్నారు. ఫలితంగా నిరుద్యోగం పెరిగింది. ఈ విధంగా సృష్టించబడిన విలువలకు ముద్రించిన డబ్బుకు సంబంధం లేకుండా పోయిన పరిస్థితి సంక్షోభాలకు దారితీయడం ఫలితంగా 2001–2008 తో పరిస్థితి ద్రవ్య సంక్షోభంగా రూపు దాల్చడం ఆశ్చర్యకరం కాదంటాడు హార్వే. నిజానికి డబ్బులు 'ఇష్టానుసారంగా ముద్రించినప్పుడు' లాభపడింది పెట్టుబడిదారులు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలే. కాగా ద్రవ్యోల్బణం నియంత్రించినప్పుడు నష్టపోయింది కార్మికులు అన్న విషయం కూడా మనం గమనించాలి. ఈ అధ్యాయంపై చర్చను ముగించేముందు హార్వే మాటను తిరిగి మరొక్కసారి ఉటంకించుకుందాం. '[వస్తు] విలువగా రూపం పొందిన శ్రమ డబ్బుతో వ్యక్తీకరించబడినప్పుడు, ఆ విలువకు, [దాని ధర అయిన] డబ్బుకు ఉన్న అంతరం పెట్టుబడి యొక్క రెండవ ప్రధాన వైరుధ్యంగా పాదుకుంటుంది.' డేవిడ్ హార్వే ఇతర అభిప్రాయాలతో మనకు బేధాభిప్రాయం ఉన్నా విలువకు, డబ్బుకు మధ్య వైరుధ్యం ఒక ప్రధాన వైరుధ్యంగా ఉంటుందన్న విషయం, ఆ వైరుధ్య వ్యక్తీకరణలు కాదనలేనివి. అదే సందర్భంలో ఈ ప్రతిపాదన కొత్తదికూడా కాదు. మార్క్స్ రచనలలో కూడా ఈ వైరుధ్యం కనిపిస్తుంది.

(ఇంకా ఉంది, తరువాయి భాగం మూడవ ప్రాథమిక వైరుధ్యం)

(రచయిత విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు) వీ

బంగ్లాదేశ్ ఎన్నికల్లో విదేశీ జోక్యం సూచన ప్రమాదకరం

- కృష్ణ ఆదిత్య

'ఎన్నికల ప్రక్రియను పరిహసించిన హసీనా' శీర్షికతో వీక్షణం ఫిబ్రవరి 2019 సంచికలో సంపాదకీయ వ్యాఖ్యను ప్రచురించారు. ఇందులో మొదటి అంశం- ఎన్నికల ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు, యథేచ్ఛగా రిగ్గింగ్ జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇది నిర్వివాదాంశం. బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ ఆయా దేశాల్లోని దోపిడీ పాలకవర్గాల పాలనను సుస్థిరం చేయడానికున్న ప్రక్రియేనన్నదొక మౌలిక సత్యం. భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి అర్ధవలస దేశాల్లో లాంఛనప్రాయమైన బూర్జువా ప్రజాస్వామ్యం కూడా లేదు, ఉండదు. దోపిడీ నిరంకుశ పాలనలు మరింత బాహాటంగా ఉన్నాయి, ఉంటాయి. వాటికి ఎన్నికలు కేవలం చాలా పలుచని, పలుచనైపోయిన ముసుగే. పాలకవర్గాల్లో సంక్షోభం ముదిరినా ఎన్నికల ప్రహసనం మరింత బాహాటంగా, నిస్సిగ్గుగా సాగుతూ బట్టబయలవుతున్నది. బంగ్లాదేశ్‌లో జరిగిందదే. అయితే ఇది బంగ్లాదేశ్‌కి మాత్రమే ప్రత్యేకించినది కాదని, దాదాపు ఇదొక సార్వజనీన అంశంగా తయారవుతున్నదని గమనించాలి. ఈ సంపాదకీ యంలో లోపించింది. అంతేకాక, విదేశాల ప్రమేయాన్ని సూచించింది.

రెండో అంశం, బంగ్లాదేశ్‌లో ఆర్థిక ప్రగతిరీత్యా ఉన్న అనుకూల అంశాలు. ఇందులో మౌలికంగా తప్పు పట్టాల్సిందేమీ లేదు. మూడో అంశం బంగ్లాదేశ్ చరిత్ర గురించి. భారత్ సహాయంతో ప్రత్యేక దేశంగా 1971లో అవతరించిన బంగ్లాదేశ్ అని రాశారు. 1970 నాటికి దక్షిణాసియాలో అమెరికా-రష్యా అగ్రరాజ్యాల వైరుధ్యాలు తీవ్రరూపం దాల్చి ఉన్నాయి. సోషల్ సామ్రాజ్యవాదంగా నాటి సోవియట్ యూనియన్ జోక్యందారీ విధానాలు అనుసరిస్తూ, అమెరికా అగ్రరాజ్యంతో పోటీలో భాగంగా పాకిస్తాన్‌ని రెండు ముక్కలు చేయటానికి పథకం వేసింది. బ్రెజ్నెవ్ నేతృత్వంలోని నాటి సోవియట్ యూనియన్‌కి జూనియర్ భాగస్వామిగా, తన విస్తరణవాద విధానంలో భాగంగా ఇందిరాగాంధీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం రెండు వారాల యుద్ధం ద్వారా దాన్ని అమలు చేసింది. భారత ప్రభుత్వం నుంచి (రా-ఆర్ఎడబ్ల్యు) నుంచి శిక్షణ పొందిన వారిని ముక్తి వాహినీ పేరిట తూర్పు పాకిస్తాన్‌లోకి చొప్పించి, ఇండియా దురాక్రమణకు పాల్పడింది. కాగా నిక్సన్ నేతృత్వంలోని అమెరికా అగ్రరాజ్యం పాకిస్తాన్‌కి అండగా నిల్చి, పశ్చిమ పాకిస్తాన్ వైపు యుద్ధం దురాక్రమణగా విస్తరించకుండా చూసింది. ఈ యుద్ధ ఫలితంగా పాకిస్తాన్ రెండు ముక్కలైంది. విదేశీ సైనిక జోక్యం సహాయం తో తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్‌గా రూపుదాల్చింది.

భారత్‌కి అండగా, అమెరికా నుంచి రక్షణ ఇస్తామని చెప్పి, రష్యా ఇండియాతో ఒక ఒడంబడిక 1971 ఆగస్టు 9న చేసుకుంది (ఇండో-సోవియట్ ఒడంబడిక). ఆ ఒడంబడికలోని మిలటరీ సహకార క్లాజుల ధైర్యంతో, అండతో 1971 డిసెంబర్ 3 నుంచి 16 వరకు భారత్-పాకిస్తాన్‌ల మధ్య రెండు వారాలపాటు యుద్ధం జరిగింది. 5 లక్షల మంది భారత సైనికుల దాడిలో ఓటమిపాలైన పాకిస్తాన్ సైన్యాలు డిసెంబరు 16 నాడు భారత సైన్యానికి లొంగిపోయినాయి.

1972 జనవరిలో షేక్ ముజిబుర్ రహమాన్ అధ్యక్షుడైనాడు. అలా విదేశీ మిలటరీ జోక్యంతో బంగ్లా అవతరణ జరిగింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాతకాలంలో జరిగిన నయా వలసయుగపు యుద్ధాలలో ఒక ముఖ్య ఘట్టం బంగ్లాయుద్ధం. చాలా ఏళ్ళపాటు అనేకదేశాలు బంగ్లాదేశ్‌ని గుర్తించలేదు. మావో నేతత్వంలోని చైనా కూడా 1975దాకా గుర్తించలేదు. ఈ సైనిక జోక్యాన్ని నాటి చైనా ఖండించింది. ఈ యుద్ధంలో లక్షలాది మంది బంగ్లా పౌరులు చనిపోయారు. పదుల లక్షల మంది శరణార్థులైనారు. ఈ యుద్ధ ఫలితంగా దక్షిణాసియాలో పెద్దన్నాగా భారత్ రూపుదాల్చింది. ఈ పరిణామాల దుష్ఫలితాలు నేటికీ దక్షిణాసియాను వెన్నాడుతున్నాయి. ఈ జోక్యందారీ విధానాలు-యుద్ధం గురించి ఏమీ చెప్పకుండా, భారత్ సహాయంతో అవతరించిన బంగ్లాదేశ్ అనడం సరికాదు. ఇది వాస్తవాలను మరుగుపరిచేదిగా ఉంది.

బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాట అగ్రనాయకుణ్ణి హతమార్చారు అని రాశారు. అలా హత్యకు గురైంది షేక్ ముజిబుర్ రహ్మాన్. పాకిస్తాన్ నుంచి విముక్తి పేరిట మరో అగ్రరాజ్యానికి, భారత విస్తరణవాదానికి దళారీగా, తొత్తుగా, అంతే కాక ఏకపార్టీ పరిపాలన ప్రకటించిన నిరంకుశుడిగా తయారై నాడని బంగ్లాదేశ్‌లోని కొన్ని రాజకీయశక్తులు భావించి కొత్తగా ఏర్పడిన బంగ్లా అధ్యక్షుడి హత్యకు పాల్పడినారు. హత్యచేసింది పాకిస్తాన్ అనుకూలురు కాదుబీ వారు కూడా ఆనాటి 'స్వాతంత్ర్య పోరాటం'లో ముఖ్య భాగస్వాములే నని గమనించాలి. విదేశీ జోక్యం బంగ్లాదేశ్‌లో రగిలించిన రావణకాష్టం నేటికీ కొనసాగుతున్నది. ఆనాటి నుంచి నేటివరకూ భారత్ బంగ్లాదేశ్ రాజకీయాలలో జోక్యం చేసుకుంటూ, ఎన్నికల్లో తనకు అనుకూలమైన షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌ని బలపరుస్తూ వచ్చింది. (ఆమె ముజిబుర్ రహ్మాన్ కూతురు). హసీనా ఎన్నికల్లో అనేక అక్రమాలకు పాల్పడి, నిరంకుశ వ్యవస్థను పటిష్టం చేసుకున్నది. దానికి భారత విస్తరణవాదుల పూర్తి అండదండలు ఉన్నాయి.

ఎన్నికలు జరిగిన తీరుతో ప్రపంచదేశాలు బంగ్లాదేశ్‌పట్ల అసంతృప్తితో ఉన్నాయి. ఒక్క భారత్, చైనా దేశాలు తప్ప ప్రపంచదేశాలేవీ హసీనా ప్రభుత్వాన్ని ఆదరించే పరిస్థితి లేదు అని రాశారు. వాస్తవ పరిస్థితిని కప్పిపుచ్చే రీతిలో ఉందీ వ్యాఖ్య. అసంతప్తితో ఉన్న ప్రపంచ దేశాలు ఏవి? అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్‌లోని పాశ్చాత్య పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలు. కాగా భారత్, చైనాలే కావు. రష్యా, ఇరాన్, భూటాన్, సౌదీ అరేబియా, ఖతర్, యుఎఇ మొదలైన గల్ఫ్‌దేశాలు, చివరికి పాకిస్తాన్ కూడా హసీనాకు అభినందన సందేశాలు పంపినాయి. ఇస్లామిక్ దేశాల కూటమి (ఒఐసి) లోని 34 దేశాలు కూడా హసీనాకు అనుకూలంగా ఉన్నాయి. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్నది నిర్వివాదాంశం. అయితే ఇది ఎన్నికల ప్రజాస్వామ్యంలో సామాన్యమై పోయింది. పై దేశాల కూర్పు చూస్తే, నేటి ప్రపంచంలో పెత్తనంచేస్తున్న పాశ్చాత్య సామ్రాజ్యవాద కూటమి అసంతృప్తితో ఉన్నదని. కాగా ఇతరదేశాలు, ముఖ్యంగా అమెరికాతో వైరుధ్యాలుగల దేశాలు బంగ్లా ఆంతరిక విషయాల్లోకి వెళ్ళకుండా, హసీనా ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్నాయని స్పష్టమౌతుంది. ఈ పరిస్థితుల్లో పాశ్చాత్య కూటమి కూడా కొంత మెత్తబడి, ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులను బంగ్లాదేశ్ రాజకీయంగా పరిష్కరించాలని సూచనలు చేసింది.

ప్రపంచ సభ్యదేశాలు కలుగజేసుకుంటే తప్ప బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగే అవకాశాలు కనిపించడంలేదు అని సంపాదకీయాన్ని ముగించారు. ఇది మౌలికంగా తప్పు. ప్రజాస్వామ్యం పేరిట అమెరికా నేతృత్వం లోని పాశ్చాత్య సామ్రాజ్యవాద జోక్యాన్ని ఆహ్వానించడమే ఇది. ఇది ప్రమాదకర మైన సూచన. ఇప్పటికే ఇలాంటి జోక్యం గల్ఫ్ ప్రాంతంలో అశాంతికి, సుదీర్ఘ యుద్ధాలకు దారితీసివుంది. ఇటీవలే వెనిజులా ఎన్నికల తర్వాత ఇలాగే అమెరికా, తదితర పాశ్చాత్య దేశాలు జోక్యం చేసుకొని, పోటీ ప్రభుత్వాన్ని బలపరుస్తున్నాయి. దక్షిణాసియాలో కూడా ప్రత్యక్ష జోక్యాన్ని ఆహ్వానిస్తున్నారా? ఆయాదేశాల్లో ప్రజాస్వామ్య రక్షణపేరిట అంతర్జాతీయ స్థాయిలో దేశాలమధ్య - ప్రజాస్వామ్యాన్ని కాలరాయడానికి ఆహ్వానం పలకటమే ఇది. బంగ్లాదేశ్‌లో కానీ, భారత్‌లో కానీ, మరో దేశంలో కానీ ప్రజాస్వామ్య విలువల నాశనానికి వ్యతిరేకంగా ఆయా దేశాల ప్రజలే పోరాడాల్సి ఉంటుంది. అది తప్ప మరో మార్గంలేదు. ప్రజాస్వామ్యం సాకుతోకానీ, మరే సాకుతోనైనా పాశ్చాత్య సామ్రాజ్యవాద జోక్యాన్ని ఆహ్వానించడం తప్పు, ప్రమాదకరం. ఇది పిల్లికి రొయ్యల మొలతాడూ కట్టినట్టవుతుంది. ఈ వైఖరిని వీక్షణం సంపాదకవర్గం సవరించుకోవడం అవసరం. అరపేజీ సంపాదకీయంలో అన్నీ రాయలేకపోవచ్చును, నిజమే. కానీ అందులో అవాస్తవాలు, తప్పు మార్గం ఉన్నాయని గుర్తించాలని విజ్ఞప్తి. వీ

ప్రజాస్వామిక హక్కుల కోసం పార్టీలకు లేఖ

ప్రజాస్వామిక హక్కులను కాపాడడంలో రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని కవులు, కళాకారులు, మేధావులతో పాటు ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జి.ఎన్. సాయిబాబా, వరవరరావులతో పాటు దేశ వ్యాప్తంగా నిర్బంధించిన మేదావుల విడుదల, పౌరహక్కుల పరిరక్షణకు రాజకీయపక్షాల నుంచి హామీ కోరుతూ ఏప్రిల్ 7న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ వేదిక నుంచే ఎన్నికల్లో పోటీచేస్తున్న పార్టీలకు పౌర, ప్రజాస్వామిక హక్కుల పై తమ వైఖరిని ప్రకటించాలని బహిరంగ లేఖ విడుదల చేశారు. మానవ హక్కుల గురించి మాట్లాడితే 'దేశద్రోహం' ముద్ర వేస్తున్నారన్నారు.

10 మంది ఉపాధి కార్మికులు మృతి

నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలం తీలేరు గ్రామానికి చెందిన పదిమంది ఉపాధి కార్మికులు మృతిచెందారు. మృతులంతా మహిళా కార్మికులే. ఏప్రిల్ 10న ఉపాధి పనుల్లో భాగంగా ఎద్మార్ తిప్పగుట్ట వద్దకు చేరారు. 11 గంటల ప్రాంతంలో ఎండ పెరగడంతో విశ్రాంతి కోసం పక్కనే ఉన్న గుట్టవద్ద కూర్చున్నారు. అదే సమయంలో మట్టిదిబ్బలు జారీ కూలీలపై పడడంతో అందరూ చూస్తుండగానే పదిమంది మహిళా కార్మికులు చనిపోయారు.

ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు

ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ స్థానాలకు, 25 పార్లమెంట్ స్థానాలకు ఏప్రిల్ 11న ఎన్నికలు జరిగాయి. 79.64 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మే 23న ఫలితాలు వెలువడవుతాయని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఈ ఎన్నికల్లో పలు ప్రాంతాల్లో దౌర్జన్యాలు, దాడులు జరిగి ముగ్గురు చనిపోగా పదుల సంఖ్యలో గాయపడ్డారు.

వాసుదేవ దీక్షితులు మృతి

ఆంధ్రప్రభ మాజీ సంపాదకులు వాసుదేవ దీక్షితులు(76) సికింద్రాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఏప్రిల్ 12న మరణించారు. దీక్షితులు 1942 ఫిబ్రవరి 11న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో జన్మించారు. 1966లో పుణెలోని డిఫెన్స్ లాబరెటరీలో ఉద్యోగం చేసి 1967లో పత్రికా రంగంలోకి వచ్చారు. ఆంధ్రప్రభలో సబ్ ఎడిటర్‌గా మొదలై ఎడిటర్‌గా ఎదిగారు. రాష్ట్ర విభజన తరువాత 2015లో ఎపి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా చేశారు. 1998లో 'ఖడ్గధార' అనే పుస్తకాన్ని రాశారు. జర్నలిజంలో ఆయన సేవలకు గుర్తింపుగా మద్రాసు తెలుగు అకాడమీ ఖాసా సుబ్బారావు పురస్కారంతో ఆయన్ను సత్కరించింది.

కొండపల్లి సీతారామయ్య 17వ వర్ధంతి సభ

కొండపల్లి సీతారామయ్య మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో కొండపల్లి సీతారామయ్య వర్ధంతి సభను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏప్రిల్ 12న నిర్వహించారు. కొండపల్లి సీతారామయ్య సంస్మరణ వ్యాసాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. వక్తలు ప్రజలను చైతన్యం చేయడానికి, విప్లవానికి కె.ఎస్. ఒక మార్గం చూపాడన్నారు. సాయుధ పోరాటాన్ని, ప్రజా సంఘాలను ఒకటిచేసి పోరాడితే విప్లవం విజయవంతం అవుతుందని ఆయన ఆ దిశలో ఎంతో కృషిచేశారన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే మేధావులను అక్రమంగా జైళ్లలో నిర్బంధించడాన్ని ఖండిస్తూ వారిని బేషరతుగా విడుదల చేయాలని కె.ఎస్. పదిహేడవ వర్ధంతి సభ తీర్మానించింది.

హిందూ ఫాసిస్ట్ పాలనను వ్యతిరేకిస్తూ బహిరంగ సభ

జలియన్‌వాలాబాగ్ మారణకాండకు వందేళ్లు పూర్తయిన సందర్భంగా 'ఆధునిక దయ్యర్‌ల పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం' అనే నినాదంతో హిందుత్వ పాసిస్టు వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సభ నిర్వహించారు. జలియన్‌వాలాబాగ్ మారణకాండను స్మరించుకుంటూ కులం, మతం, జాతి, ప్రాంతం భేదాలను మరిచి ఒకే జాతి, ఒకే దేశంగా ఉండడం కోసం ప్రజలందరూ సంఘటితంగా ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రొ. డా. హర్జిందర్ సింగ్ జలియన్‌వాలాబాగ్ ఘటనలో వేలమంది మరణించినా బ్రిటన్ పాలకులు క్షమాపణలతో సరిపుచ్చడానికి చూశారన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రశ్నించేవారిని అరెస్ట్ చేసి జైలుకు పంపుతుందన్నారు.

నిరసన సభ భగ్నం

దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక వాదుల అరెస్టును నిరసిస్తూ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) ఏప్రిల్ 13న హైదరాబాద్‌లోని టిఎన్‌జిఓ భవన్‌లో సభ నిర్వహించ తలపెట్టింది. ఈ సభకు వచ్చిన టీచర్లను, ప్రజాస్వామిక వాదులను సభకు అనుమతి లేదంటూ పోలీసులు ప్రొ. హరగోపాల్‌తో పాటు 100 మందిని అరెస్ట్ చేశారు. ప్రొ. పి.ఎల్. విశ్వేశ్వర్‌రావు, ప్రొ. కాత్యాయని విద్మహే, డిటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగాదర్ ఈ అరెస్టులను ఖండించారు. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిటిఎఫ్ అనేది ప్రభుత్వం ఆమోదించిన సంఘమని, అది ఎప్పుడైనా ఎక్కడైనా సమావేశాలు పెట్టుకోవచ్చునని అన్నారు. ఒక రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘం ఒక గదిలో సమావేశం పెట్టుకున్నా అనుమతి తీసుకోవాలా అని ప్రశ్నించారు. భీమా కోరేగాం కేసులో అరెస్టుచేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొ. జి. లక్ష్మణ్ కూడా అరెస్టులను ఖండించారు.

మందకృష్ణ మాదిగ గృహ నిర్బంధం

పంజాగుట్టలోని అంబేద్కర్ విగ్రహానికి అనుమతి లేదంటూ ధ్వంసం చేసి చెత్త కుప్పలో పడేసినా సి.ఎం. కెసిఆర్ స్పందించకపోవడం, అంబేద్కర్ జయంతిలో పాల్గొనకపోవడం ఆయన అగ్రకుల స్వభావాన్ని వెల్లడిస్తుందని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ విషయాన్ని దేశ ప్రజల దృష్టికి తీసుకువెళ్లడానికి ఏప్రిల్ 27న ఇందిరాపార్క్ వద్ద అంబేద్కర్ వాదులు గర్జన నిర్వహిస్తారన్నారు. దీంతో ముందుగానే ఏప్రిల్ 16 నుంచి మందకృష్ణ మాదిగను పోలీసులు హైదరాబాద్‌లోని డిడి కాలనీలో గృహ నిర్బంధంలో ఉంచారు. తెలంగాణలో ప్రశ్నించడమే నేరమైందని, నిరసన తెలిపితే నిర్బంధిస్తారా అంటూ మంద కృష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తంచేశారు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మార్కెట్‌లో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా ధాన్యం కొనుగొలు తగినంత జరగడంలేదని, మార్కెట్ అధికారులు పంటను కొనకపోవడంతో రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని రైతులు ఏప్రిల్ 18న నేలకొండపల్లి పిఎస్ఆర్ సెంటర్లో రాస్తారోకో చేశారు. దీంతో వారిని అరెస్టు చేసి పోలీసులు కేసు నమోదు చేశారు. సమస్యను పరిష్కరించాల్సిందిపోయి కేసులు పెట్టడం ఏంటని రైతులు ప్రశ్నించారు. కేసులు ఉపసంహరించుకొని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

యుఏపిఏ చట్టం రద్దు కోరుతూ సదస్సు

ప్రజల ప్రాథమిక హక్కులను హరిస్తున్న యుఏపిఏ (ఉపా) చట్టాన్ని రద్దుచేయాలని కోరుతూ ఉపా చట్టం రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 21న విశాఖపట్నంలోని పౌరగ్రంథాలయంలో సదస్సు నిర్వహించారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిట్టిబాబు రాజ్యాంగంలో ఉన్న చట్టాలకు భిన్నంగా ఉపా నిర్బంధ చట్టాన్ని పాలక పక్షాలపై మాట్లాడే హక్కును నిషేధించే ఆయుధంగా ఉపయోగిస్తున్నారన్నారు. ఉపా చట్టం కింద పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం, ఎచ్ఆర్ఎఫ్, కెవెన్‌పిఎస్, సిఆర్‌పిపి, సిఎంఎస్, ఇఫ్టూ, ఎంఎన్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. వీ

మార్పు కోసం మహిళా మార్చ్

దేశానికి ప్రమాదకరంగా మారిన కుల, మతతత్వ శక్తులను ఓడించడానికి మహిళలందరూ ఏకమవ్వాలని మహిళా ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. హింస, విద్వేశాలకు వ్యతిరేకంగా, రాజ్యాంగ హక్కులను తిరిగి సాధించు కునేందుకు ఉద్యమించాలని కోరుతూ 'మార్పు కోసం మహిళా మార్చ్' పేరిట ఏప్రిల్ 4న ఇరవై రాష్ట్రాల్లోని 150 నగరాల్లో, పట్టణాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశంలో పెరుగుతున్న హింస, విద్వేషపూరిత ధోరణులను తిరస్కరించాలని కోరుతూ ఊరేగింపులు, హాల్ మీటింగ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రాథమిక స్వేచ్ఛ అయిన మాట్లాడే హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం నిలబడినందుకు సుధా భరద్వాజ్, షోమాసేన్ జైళ్లలో మగ్గుతుండగా గౌరీలంకేశ్ ప్రాణాలను పోగొట్టుకుందని అన్నారు.

ఎన్నికల సందర్భంలో ఎన్‌కౌంటర్‌లు

ఛత్తీస్‌గఢ్‌లోని కంకేర్ జిల్లా మహ్లా గ్రామ సమీపంలోని అడవుల్లో ఏప్రిల్ 4న పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు బిఎస్‌ఎఫ్ జవాన్లు మృతి చెందడంతో పాటు ఇద్దరు గాయపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మావోయిస్టులకోసం బిఎస్‌ఎఫ్ 114వ బెటాలియన్ గాలింపు నిర్వహిస్తున్న క్రమంలో ఈ ఘటన జరిగిందన్నారు. దంతేవాడ జిల్లా బచేలిలో లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ముగించుకొని కువ్వకొండకు వెళుతున్న బి.జె.పి., ఎం.ఎల్.ఏ. మండావి భీమా కాన్వాయ్‌ని ఏప్రిల్ 9న మావోయిస్టులు పేల్చివేశారు. ఈ ఘటనలో భీమాతో పాటు నలుగురు భద్రతా సిబ్బంది మృతిచెందారు. జార్ఖండ్‌లోని గిరిది జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఏప్రిల్ 15న పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోగా ఒక సిఆర్‌పిఎఫ్ జవాన్ మృతిచెందారు.

నేషనల్ శాంపిల్ సర్వే నివేదిక

2017-18 ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఉపాధి, ఉద్యోగితల స్థితిగతులను నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్‌ఎస్‌ఎస్‌ఓ) నివేదిక ఏప్రిల్ 12న వెల్లడించింది. మోడీ తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసిందని ఈ నివేదిక వెల్లడించింది. అక్రమ ధనాన్ని నిరోధించడం, నకిలీ నోట్లను ఏరిపారేయడం వంటి నిర్ణయాలు నెరవేరకపోగా, ఈ నిర్ణయంతో లక్షలాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా అయ్యాయని సర్వే నిర్ధారించింది. గత దశాబ్దంతో పోలిస్తే 2018లో నిరుద్యోగిత రెట్టింపైందనీ, గత ఏడాది ఫిబ్రవరిలో 5.9 శాతంగా ఉన్న నిరుద్యోగం ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 7.2 శాతం పెరిగిందని తెలిపింది.

67 శాతం మంది విచారణ ఖైదీలే

దేశంలోని 1400 జైళ్లలో 2016 డిసెంబర్ నాటికి మొత్తం 4,33,003 మంది ఖైదీలు ఉన్నట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తెలిపింది. ఇందులో దోషులు 1,35,683. విచారణ ఎదుర్కొంటున్న ఖైదీలు 2,93,058 మంది. 3083 మంది డిటిన్యూలు ఉన్నట్లు తాజాగా విడుదల చేసిన రిపోర్టులో వెల్లడించింది. 2014-16 మధ్య విచారణ ఖైదీలు 3.6 శాతం మంది పెరిగినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా మహిళా ఖైదీల సంఖ్య 1,649 మంది. ఇందులో 1,192 మంది మహిళా ఖైదీలు ఇంకా విచారణ ఎదుర్కొంటున్నారు.

సిజెఐ రంజన్ గొగోయ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్‌పై సుప్రీంకోర్టు మాజీ మహిళా ఉద్యోగి లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. జస్టిస్ గొగోయ్ నివాసంలోని కార్యాలయంలో పనిచేసినప్పుడు సిజెఐ తనతో అసభ్యంగా ప్రవర్తించారని, ప్రతిఘటించడంతో తనపై కక్ష కట్టారని ఏప్రిల్ 19న 22 మంది న్యాయమూర్తులకు అఫిడవిట్‌తో పాటు సంక్షిప్త లేఖను పంపారు. కాగా, ఆమె ఆరోపణలపై స్పందిస్తూ వాటి వెనుక పెద్ద శక్తి ఉందని సిజెఐ రంగన్ గొగోయ్ అన్నారు. సున్నిత కేసుల విచారణ ఉండడం వల్లే ఈ ఆరోపణలు తెరమీదకు వచ్చాయి అని తెలిపారు. ఏప్రిల్ 20న రంజన్ గొగోయ్ నేతృత్వంలో త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు.

చరిత్ర పాఠాల తొలగింపు

ఎన్‌సిఆర్‌టి తొమ్మిదో తరగతి పొలిటికల్ సైన్స్ పుస్తకం నుంచి ప్రజాస్వామ్యం గురించి వివరించే పాఠాన్ని, సమకాలీన ప్రపంచ రాజకీయాలు అనే చాప్టర్‌ను తొలగిస్తూ ఎన్‌సిఆర్‌టి (నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసర్చ్) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చాప్టర్‌లో చిలీని 17 ఏళ్ల నియంత పాలన సాగించిన అగస్టో పినోచెట్‌పై మిచెల్లి బ్యాచ్లెట్ అనే మహిళ ఆధ్వర్యంలో సాగిన పోరాటం, అనంతరం 1990లో పోలాండ్‌లో లెనిన్ షిప్‌యార్డ్‌లో స్వతంత్ర కార్మిక సంఘాలు ఒక యూనియన్‌గా ఏర్పడి తమ హక్కులను సాధించుకునేందుకు చేసిన పోరాటం, యూనియన్ల ఐక్యత గురించి వివరించే పాఠాలు ఉన్నాయి. సిబిఎస్ఇ కూడా ఇదే మార్గాన్ని ఎంచుకొంది. పదో తరగతి సాంఘిక శాస్త్రంలో నుంచి మూడు పాఠాలను సిబిఎస్ఇ తొలగించింది. 'డెమోక్రటిక్ పొలిటిక్స్' చాప్టర్ నుంచి 'ప్రజాస్వామ్యం, వైవిధ్యం', 'పాపులర్ స్ట్రగుల్స్ అండ్ మూవ్‌మెంట్స్', 'ప్రజాస్వామ్యానికి సవాళ్లు' అనే పాఠాలను సిబిఎస్ఇ తొలగించింది.

రైతులను కోర్టుకీడ్చిన 'పెప్సికో'

గుజరాత్‌లోని అహ్మదాబాద్ సిటి సివిల్ కోర్టులో రైతులకు వ్యతిరేకంగా అమెరికాకు చెందిన పెప్సికో కంపెనీ ఒక లా సూట్ దాఖలు చేసింది. రైతులు తాము రిజిస్టర్ చేసుకున్న ఎఫ్‌ఎల్-2027 (లేస్ చిప్స్ కోసం ఈ రకం ఆలును ఉపయోగిస్తున్నట్లు తెలిపింది) రకం బంగాళ దుంపలను సాగుచేస్తున్నారని అందులో పేర్కొంది. ఇది పిపివిఎస్‌ఆర్ఏ చట్టం ప్రకారం విరుద్ధమని రైతులపై ఆరోపణలు చేసింది. ఏప్రిల్ 26న జరిగిన విచారణలో పెప్సికో కంపెనీ రైతుల ముందు రెండు ప్రతిపాదనలు తీసుకొచ్చింది. తాము అమలు చేస్తున్న ఫార్మింగ్ ప్రోగ్రాంలో చేరి తాము అందించిన విత్తనాలను సాగుచేసి తనకి పంట అమ్మేందుకు అంగీకరించాలని, లేదంటే రైతుల వద్ద ఉన్న ఎఫ్‌ఎల్-2027 రకానికి సంబంధించిన బంగాళదుంపల విత్తనాలను కంపెనీకి అందజేయాలని, ఈ రకం విత్తనాలు వారివద్ద ఉండరాదని, సాగు చేయవద్దని ప్రతిపాదించింది. అలాగే కేసును కోర్టు బయట సెటిల్‌మెంట్ చేసుకునేందుకు ప్రతిపాదించింది. దీనిపై రైతులు జూన్ 12న జరిగే విచారణలో తమ అభిప్రాయాలను తెలపాల్సి ఉంది. కాగా, రైతులపై పెప్సికో కంపెనీ బెదిరింపులకు పాల్పడడంపై సామాజిక కార్యకర్తలు, రైతు సంఘాల నేతలతో పాటు పూలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బిజెపి పాలనలో కార్పొరేట్ రుణాలు రద్దు

బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న మొండి బకాయిలను వసూలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బ్యాంకుల నుండి వేల కోట్ల రూపాయల రుణాలను తీసుకుని ఎగవేసిన వారిని పట్టుకోవడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోంది. ఎగవేతదారులు దేశం విడిచి పారిపోవడానికి అవకాశం కల్పిస్తోంది. బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టిన తరువాత ఈ ఐదేళ్లలో 80 శాతం అంటే దాదాపు 5.5 లక్షల కోట్ల రూపాయల మొండి బాకీలను రద్దు చేసింది. ఇందులో అత్యధికంగా బాకీ ఉన్నది బడా వ్యాపారవేత్తలే. ఈ రద్దుతో ప్రభుత్వరంగ బ్యాంకులు దివాలా తీస్తున్నాయి. సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.

కొనసాగుతున్న పార్లమెంట్ ఎన్నికలు

పార్లమెంట్ తొలిదశ ఎన్నికల్లో 91 స్థానాలకు పోలింగ్ జరిగింది. త్రిపుర, బీహార్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జమ్ముకశ్మీర్, సిక్కిం, మిజోరాం, మణిపూర్, అసోం, నాగాలాండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, అండమాన్ నికోబార్, లక్షద్వీప్, ఛత్తీస్‌ఘడ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో ఏప్రిల్ 11న పోలింగ్ జరిగింది. రెండవ దశ ఏప్రిల్ 18న పదకొండు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోని 95 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 67.84 శాతం పోలింగ్ నమోదైంది. మూడవ దశ ఏప్రిల్ 23న పద్నాలుగు రాష్ట్రాల్లోని 116 పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 66 శాతం పోలింగ్ నమోదైంది. వీ

న్యూజిలాండ్-చైనా దౌత్య సంబంధాలు

న్యూజిలాండ్ ప్రధాని జెసిండా ఆర్డెన్ చైనాలో పర్యటించారు. ఏప్రిల్ 4న బీజింగ్‌లో ఆమె చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృషి చేస్తామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తెలిపారు. న్యూజిలాండ్ ప్రధాని జెసిండా ఆర్డెన్ చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య నాలుగున్నర దశాబ్దాల నుంచి ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగుతున్నాయని, జెసిండా హయాంలో దీన్ని మరింతగా విస్తరిస్తామని అన్నారు.

బ్రెగ్జిట్ గడువు పొడిగింపు

యూరోపియన్ యూనియన్ (ఇయు) నుంచి బ్రిటన్ నిష్క్రమణ (బ్రెగ్జిట్) గడువును ఆరు నెలల పాటు పొడిగించేందుకు కూటమి నాయకత్వం అంగీకరించింది. ఏప్రిల్ 30న బ్రిటన్ ఇయు నుంచి బయటికి రావాలి. కాని ఏప్రిల్ 11న జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతకు ముందు బ్రెగ్జిట్ గడువును జూన్ 30 వరకు పొడిగించాలని బ్రిటన్ ప్రధాని థెరిసా మే అభ్యర్థించారు. బ్రెగ్జిట్ విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలకు సమయం కావాలని అన్నారు. బ్రెగ్జిట్‌ను ఏడాది పాటు పొడిగించాలని బ్రిటన్‌కు మద్దతుగా ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, జర్మని ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ చేసిన ప్రతిపాదనపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. చర్చల అనంతరం అక్టోబర్ 2019 వరకు బ్రెగ్జిట్ గడువును పొగిడించేందుకు ఇయు అంగీకరించింది.

అల్జీరియాలో నిరసనలు

అల్జీరియా అధ్యక్షుడు అబ్దెల్ అజీజ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన మరింత తీవ్రమవుతోంది. అధ్యక్షుడు అజీజ్ వెంటనే పదవి నుంచి దిగిపోవాలని, మరోసారి పోటీ చేయకూడదని డిమాండ్ చేశారు. అల్జీరియా ఆర్మీ చీఫ్ అహ్మద్ గైద్ సలాహ్ నేతృత్వంలో నిరసనకారులు దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. 82 ఏండ్ల అజీజ్ ఇరవై ఏళ్ల నుంచి అల్జీరియా అధ్యక్ష పదవిని అంటిపెట్టుకున్నారనీ, ఆయన పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదనీ, పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు పెరిగిపోయాయనీ నిరసన తెలిపారు.

అసాంజె అరెస్ట్

వికీలీక్స్ సహ వ్యవస్థాపకుడు జూలియస్ అసాంజెను లండన్‌లోని ఈక్వెడార్ కార్యాలయంలో ఏప్రిల్ 11న అరెస్టు చేశారు. 2012లో స్వీడన్‌లో అసాంజెపై లైంగిక వేధింపుల కేసు నమోదై ఉంది. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు ఆయన ఈక్వెడార్‌ను ఆశ్రయించారు. ఈక్వెడార్ దౌత్య కార్యాలయాన్ని గూఢాచర్య కార్యకలాపాల కోసం వాడుకున్నారని ఈక్వెడార్ అధ్యక్షుడు లెనిన్ మోరెనో ఆరోపించారు.

సుడాన్‌లో అనిశ్చితి

సుడాన్ అధ్యక్షుడు ఒమర్ అల్-బషీర్‌ను సైన్యం పదవి నుంచి తొలగించింది. ఏప్రిల్ 11న ఒమర్ ప్రభుత్వాన్ని రద్దు చేసింది. గత మూడు దశాబ్దాలుగా ఆయన సుడాన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయనపై నియంతృత్వ విధానాలు అనుసరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. 1989, జూన్ 30న సైనిక తిరుగుబాటు చెలరేగింది. అప్పటి నుంచి ఒమర్ సుడాన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఒమర్ పాలనలో ధరలు విపరీతంగా పెరిగిపోయాయనీ, పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ నిరసన ప్రదర్శనలు చేశారు. దీంతో సైన్యం రంగంలోకి దిగి ఒమర్‌ను అధ్యక్ష పదవి నుంచి తప్పించింది.

ఉధృతమవుతున్న యెల్లో వెస్ట్ ఉద్యమం

ఫ్రాన్స్‌లో కొనసాగుతున్న యెల్లో వెస్ట్ (పసుపు కోటు) ఉద్యమం మరింత ఉధృతమవుతోంది. అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా నిరసన ఆపేది లేదంటూ ఉద్యమకారులు తేల్చి చెప్పారు. కార్మికులు, పెన్షనర్లపై పన్నుల భారం తగ్గించాలంటూ డిమాండ్ చేశారు. ఏప్రిల్ 20న రాజధాని పారిస్‌తో పాటు పలు నగరాల్లో యెల్లో వెస్ట్ ఉద్యమం సాగింది. ముప్పై వేల మందికి పైగా పారిస్‌లోని ప్రెసిడెంట్ ప్యాలెస్ దగ్గర నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు.

పారిస్‌లో పురాతన చర్చి దగ్ధం

ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో పురాతన నోటర్‌డేమ్ క్యాథడ్రల్ చర్చి అగ్నికి ఆహుతైంది. ఏప్రిల్ 16న చర్చిలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చర్చి గోపురం, పైకప్పు కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఫ్రాన్స్‌లో అత్యంత ప్రముఖమైన కట్టడాల్లో నోటర్‌డేమ్ క్యాథడ్రల్ చర్చి ఒకటి. దీన్ని 850 ఏండ్ల కిందటి గోథిక్ శైలిలో క్రీ.శ. 1200లో నిర్మించారు. ఈ చర్చికి పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్ కన్నా కూడా ఎక్కువ ప్రాచుర్యం ఉంది.

ఇండోనేషియాలో ఎన్నికలు

ఇండోనేషియాలో అధ్యక్ష పదవికి ఏప్రిల్ 17న ఎన్నికలు జరిగాయి. ఈ భారీ ఎన్నికలకు ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల్లో ఒకటిగా గుర్తింపు ఉంది. అధ్యక్ష పీఠం నుంచి ప్రారంభించి స్థానిక సంస్థల వరకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. దేశ అధ్యక్ష పదవి, పార్లమెంట్, స్థానిక సంస్థలన్నింటికీ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. ఈ ఎన్నికల్లో దాదాపు 19 కోట్ల మంది తమ ఓటును వినియోగించుకుంటారు. ఎన్నికలను నిర్వహించడానికి ఎనిమిది లక్షల పోలింగ్ కేంద్రాలను, ఇరవై లక్షల మంది మిలిటరీ, పోలీసులను ఎన్నికల సంఘం వినియోగిస్తోంది. ఈ ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు జోకో ఉడోకు, మాజీ ఆర్మీ జనరల్ ప్రబోవో సుబియాంటోకు మధ్య తీవ్రమైన పోటీ ఉంది. తుది ఫలితాలు మే నెలలో వెల్లడవుతాయి.

శ్రీలంకలో నరమేధం

శ్రీలంక రాజధాని కొలంబో ఏప్రిల్ 20న వరుస బాంబు పేలుళ్లతో దద్దరిల్లిపోయింది. మూడు చర్చిలు, నాలుగు హోటళ్లు, పలు ప్రాంతాల్లో బాంబు పేలుళ్లు, ఆత్మాహుతి దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 350 మందికి పైగా మరణించగా, ఐదు వందల మందికి పైగా గాయపడ్డారు. ఈస్టర్ సండే సందర్భంగా చర్చిల్లో అధిక సంఖ్యలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు లక్ష్యంగా బాంబు దాడులు జరిగాయి. అలాగే విదేశీ పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో బసచేసే ఫైవ్‌స్టార్ హోటళ్లలో రెస్టారెంట్‌లలో పేలుళ్లు జరిగాయి. ఈ పేలుళ్లలో చిన్నపిల్లలు అధికంగా ఉన్నారు. ఈ దాడులకు పాల్పడింది శ్రీలంకలోని ఐసిస్ అనుబంధ నేషనల్ తోహిద్ జమాత్ (ఎన్‌టిజె) సంస్థగా అనుమానిస్తున్నారు.

కొలంబియాలో సమ్మె

కొలంబియాలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె మొదలైంది. ఏప్రిల్ 28 నుంచి మే 3 వరకు ఈ సమ్మె కొనసాగనున్నది. ఈ సమ్మెలో దాదాపు 180కి పైగా సామాజికోద్యమ సంస్థలు, రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ఇతర సామాజిక సంస్థలు పాల్గొననున్నాయి. మితవాద జాతీయ ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాలను నిరసిస్తు ఈ సమ్మె జరిగింది. వివిధ సామాజికోద్యమ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను యథాతథంగా అమలు చేయాలని, ఇవాన్ దుక్యూ సర్కార్ జాతీయాభివృద్ధి ప్రణాళిక (పిఎన్‌డి)ని విరమించాలని డిమాండ్ చేశారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(మార్చ్ 1 నుండి మార్చ్ 31, 2019 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (930), ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాలలో (852) అసహజ మరణాల పాలైన వారి మొత్తం సంఖ్య 1782)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	3	–	19	20	10	12	5	2	3	1	1	1	2	37	32	–	–	–	4	8
హైదరాబాద్	–	–	–	12	9	4	7	4	3	5	7	11	5	6	23	17	–	–	–	–	–
కరీంనగర్	–	2	–	8	9	4	5	2	2	3	2	3	5	4	18	13	–	–	–	–	4
ఖమ్మం	–	3	–	8	14	1	13	–	–	2	–	2	1	3	27	21	–	–	–	–	3
మహబూబ్‌నగర్	–	–	1	2	2	4	2	1	2	2	2	1	1	3	40	1	–	–	–	–	–
మెదక్	1	10	2	3	4	3	4	2	1	2	3	4	5	17	19	24	–	–	–	2	2
నల్గొండ	–	2	–	4	7	3	4	2	2	4	2	3	3	2	27	9	–	–	–	–	5
నిజామాబాద్	–	3	–	6	4	4	5	2	2	3	2	4	2	3	14	12	–	–	–	–	5
వరంగల్	–	6	–	6	4	3	5	1	2	1	3	4	1	2	19	22	–	–	–	1	1
వికారాబాద్	–	3	–	4	3	2	4	2	1	3	3	6	4	3	17	12	–	–	–	–	4
తెలంగాణ	**2**	**32**	**3**	**72**	**76**	**38**	**61**	**21**	**17**	**28**	**25**	**39**	**28**	**45**	**241**	**163**	**-**	**-**	**-**	**7**	**32**
అనంతపురం	–	1	–	14	21	2	1	–	1	9	–	3	16	6	53	–	–	–	–	–	9
చిత్తూరు	–	2	–	5	4	4	4	–	1	2	2	4	5	–	18	2	–	–	–	–	10
కడప	–	3	–	4	8	–	–	–	1	3	2	2	–	6	7	11	–	–	–	–	–
గుంటూరు	–	2	–	4	6	3	5	2	2	4	2	3	–	4	18	14	–	–	–	–	4
కృష్ణా	–	1	–	6	5	4	6	3	2	4	3	4	2	6	16	13	–	–	–	–	3
కర్నూలు	–	2	–	4	6	2	4	2	2	4	2	5	2	6	21	17	–	–	–	–	2
తూర్పు గోదావరి	–	–	–	2	6	–	5	–	1	10	–	3	2	3	43	19	–	–	–	1	1
ప్రకాశం	–	–	–	2	4	1	3	1	1	3	1	2	3	4	19	16	–	–	–	–	2
శ్రీకాకుళం													వివరాలు అందలేదు								
పశ్చిమ గోదావరి	–	–	–	2	3	1	1	2	1	2	1	2	–	4	13	9	–	–	–	–	2
నెల్లూరు	–	–	–	5	6	2	3	1	2	4	2	3	–	3	17	12	–	–	–	–	1
విజయనగరం	–	–	–	2	4	2	1	1	1	2	1	3	–	2	12	9	–	–	–	–	2
విశాఖపట్నం	–	–	–	2	6	–	–	–	1	2	2	4	4	2	18	22	–	–	–	7	–
ఆంధ్రప్రదేశ్	**-**	**11**	**-**	**52**	**79**	**21**	**33**	**12**	**16**	**49**	**18**	**38**	**34**	**46**	**255**	**144**	**-**	**-**	**-**	**8**	**36**

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్	కాచిగూడ, హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్ హైదరాబాద్	9705055738
వెంకటేశ్వర బుక్‌స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్ హైదరాబాద్	040-66131071
ఫస్ట్ లక్కీ పాన్‌షాప్	విద్యానగర్ సిగ్నల్స్ హైదరాబాద్	9848672831
సుధాకర్ బుక్‌స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక హైదరాబాద్	9949337605
వెంకటేశ్వర బుక్‌స్టాల్	రామ్‌నగర్ గుండు హైదరాబాద్	9502964995
భవాని బుక్‌స్టాల్	శివం రోడ్ హైదరాబాద్	9849836996
శ్రీభవాని బుక్‌స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర) హైదరాబాద్	9640712555
ఓరియన్ బుక్‌స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర) హైదరాబాద్	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా) హైదరాబాద్	8977995537
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలయబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీ లక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
మల్లిఖార్జున బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజారెడ్డి బుక్‌స్టాల్	చందానగర్ బిఎచ్‌ఇఎల్	93466 07648
నవ తెలంగాణ బుక్ హౌస్	చిక్కడపల్లి, హైదరాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	బాగ్‌లింగంపల్లి-సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	నామ్‌దేవ్‌వాడ, నిజామాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	సుందరయ్య భవన్, నల్గొండ	...
నవ తెలంగాణ బుక్ హౌస్	జగ్‌జీవన్‌నగర్, న్యూ బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	బాప్టిస్ట్ చర్చ్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, హనుమకొండ	...
నవ తెలంగాణ బుక్ హౌస్	పాత సిపిఐ (ఎం) ఆఫీస్, బాలాజీనగర్, ఖమ్మం	...
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
అక్షర బుక్ వరల్డ్, ఎటిసి మార్కెటింగ్	న్యూ టౌన్, మహబూబ్‌నగర్	90102 10464
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్‌స్టాల్, కూల్‌డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్‌స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	79890 81728
రాజన్న బుక్ స్టాల్	హనుమకొండ చౌరస్తా	93955 07773
ఎ.ఎచ్. వీలర్ బుక్‌స్టాల్	వరంగల్ రైల్వే స్టేషన్	70757 59274
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్‌స్టాల్	శివాలయం వీధి, ప్రొద్దటూరు	81210 02112
క్రిసెంట్ న్యూస్ ఏజెన్సీ	కడప	98852 35846
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్‌సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీదేవి సాయి కూల్‌డ్రింక్స్, కమ్యూనికేషన్స్	దేవి చౌక్, రాజమండ్రి	98489 84394

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 214 - May 2019 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/4/2019 ● Postal Regn. No. HD/1100/2017-19

Date of Posting : 29th, 30th

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao